వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
VEEKSHANAM, TELUGU MONTHLY
సంపుటి : 17 సంచిక : 9 హైదరాబాద్ 218 సెప్టెంబర్ 2019 పేజీలు : 68 రు. 25

- కశ్మీరీల స్వేచ్ఛాకాంక్షలపై గొడ్డలి వేటు - మూడు నివేదికలు, మూడు విశ్లేషణలు
- యురేనియం వ్యతిరేక ప్రజాందోళన
- సమాచార హక్కు చట్టానికి తూట్లు
- తలాక్ - పౌర పరిష్కారమా? నేరమా?
- ఉన్నావ్‌లో నిజాన్ని చంపగలరా?
- బ్రిటన్ ప్రధానికి బ్రెగ్జిట్ సంకటం

వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

ఆర్థిక వ్యవస్థ – సామ్రాజ్యవాదం

ఒక దళారీ పశ్చాత్తాపం	జాన్ పెర్కిన్స్	రు. 120
కుట్రాజకీయం	స్టీఫెన్ కింజర్	40
అభివృద్ధిని ఇలా చూద్దాం	ముదునూరి భారతి	80
కొత్తచూపు	ఆర్.ఎస్. రావు	120
ఊరి దారి	ఎన్. వేణుగోపాల్	60
రాబందు వాలిన నేల	ఎన్. వేణుగోపాల్	180
వ్యవసాయం – ప్రపంచీకరణ	కె.ఆర్. చౌదరి	100
రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే	రైతు సేవా సమితి	100
భారతదేశంలో ఉత్పత్తి విధానం– ఉత్పత్తి సంబంధాలు	విరసం	20
ప్రపంచీకరణ ప్రాభవంలో...	విద్యాభూషణ్	120
మార్క్స్ రాసిన పెట్టుబడి	డేవిడ్ స్మిత్, ఫిల్ ఇవాన్స్	200

తెలంగాణ

తెలంగాణార్థం	ఎన్. వేణుగోపాల్	150
లేచినిలిచిన తెలంగాణ	ఎన్. వేణుగోపాల్	120
కొత్త వంతెన	కె. శ్రీనివాస్	120
సమగ్ర తెలంగాణ	వీక్షణం ప్రచురణ	295
ఎవరికోసం మల్లన్నసాగర్?	తెలంగాణ ఆత్మగౌరవ వేదిక	20
మానని గాయాలు	తెలంగాణ విద్యావంతుల వేదిక	100

శాస్త్రవిజ్ఞానం

విశ్వాంతరాళం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మానవ పరిణామం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
ప్రకృతీ – పర్యావరణం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవశాస్త్ర విజ్ఞానం – సమాజం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మనుషులు చేసిన దేవుళ్లు	కొడవటిగంటి రోహిణీప్రసాద్	120
అణువుల శక్తి	కొడవటిగంటి రోహిణీప్రసాద్	150
విజ్ఞాన శాస్త్రం మనిషి విస్తరణ	జెడి బెర్నాల్	80

కులం–మతం

భారతదేశంలో కుల సమస్య	అనురాధ గాంధీ	120
పంచతంత్రం	బొజ్జా తారకం	200
కులం వర్గం	బొజ్జా తారకం	60
చరిత్ర మార్చిన మనిషి	బొజ్జా తారకం	150
శూద్రవర్ణం ఎలా పుట్టింది	ఆర్.ఎస్. శర్మ	150
గులాంగిరి	జోతిబా ఫూలే	60
కుల నిర్మూలన	అంబేద్కర్	60
శూద్రులు – ఆర్యులు	అంబేద్కర్	20
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	30
వెలివాడల వెతలు	కుల నిర్మూలన ప్రచురణ	100

తత్వశాస్త్రం

మార్క్సిస్ట్ తత్వశాస్త్రం	న్యూవిస్టా పబ్లికేషన్స్	80
మార్క్సిజం-లెనినిజం-మావోయిజం	విరసం ప్రచురణ	125
మార్క్స్ పెట్టుబడి రచనా క్రమం	విరసం ప్రచురణ	50
మార్క్సిస్టు నిఘంటువు–1	లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్	350
మార్క్సిస్టు పదకోశం	లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్	50

చరిత్ర–జీవిత చరిత్ర

భారత చరిత్ర అధ్యయనానికి ఒక పరిచయం	డి.డి. కోసంబి	250
భారత చరిత్ర పరిచయ వ్యాసాలు	డి.డి. కొశాంబి	70
భగవద్గీత చారిత్రక పరిణామం	డి.డి. కొశాంబి	20
ప్రాచీన భారత దేశ చరిత్ర	కె. బాలగోపాల్	100
తరతరాల భారతదేశ చరిత్ర	రొమిల్లా థాపర్	100
ఇండియాలో దాగిన హిందుస్థాన్	పెరి ఆండర్సన్	150
బాబాసాహెబ్ అంబేద్కర్	బి. విజయభారతి	120
చేగువేరా	కాత్యాయని	120
మహాత్మా జ్యోతిరావ్ పూలే	ధనుంజయ్ కీర్	100
ఛత్రపతి సాహూ మహారాజ్	కాత్యాయని	40
తలపుల తోవ	షౌకత్ కైఫీ	100
ఏడవకు బిడ్డా...	గుగి వా థియాంగో	150
కశ్మీర్‌లో నిషిద్ధ రాత్రి	బషారత్ పీర్	170

సాహిత్య విమర్శ – వ్యాసాలు

కవిత్వంతో ములాఖాత్	ఎన్. వేణుగోపాల్	120
సాహిత్య వ్యాసాలు	చలసాని ప్రసాద్	100
చలసాని ప్రసాద్ రచనలు	చలసాని ప్రసాద్	100
చలసాని ప్రసాద్ సాహిత్య సర్వస్వం–1	విరసం ప్రచురణ	270
మహోదయం	కె.వి.ఆర్.	200
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు–2	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు–3	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సామాజిక వ్యాసాలు	కె.వి.ఆర్.	300
కెవిఆర్ డిటెన్యూ డైరీ	కె.వి.ఆర్. శారదాంబ కమిటీ	170
కెవిఆర్ కవిత్వం	కె.వి.ఆర్. శారదాంబ కమిటీ	200
అల్లంరాజయ్య కథలు పరిశీలన	ఎస్. నీలాదేవి	75
కొలిమి రవ్వలు	గౌరి లంకేశ్ రచనలు	150
సహచరులు	వరవరరావు	100

విప్లవోద్యమం

మంద్రస్థాయి యుద్ధం	విరసం ప్రచురణ	100
జగిత్యాల జంగల్‌మహల్–1	విరసం ప్రచురణ	75
జగిత్యాల జంగల్‌మహల్–2	విరసం ప్రచురణ	100
నేటి రాయలసీమ	విరసం ప్రచురణ	100
దండకారణ్యంలో గ్రీన్‌హంట్	విరసం ప్రచురణ	60
మావో రచనలు – 1	విరసం ప్రచురణ	170
మావో రచనలు – 2	విరసం ప్రచురణ	220
జనతన రాజ్యం	పాణి	300
30 ఇయర్స్ దండకారణ్య కల్చరల్ మూవ్‌మెంట్	ఎన్.ఎం. చేతనా	250
సంకెళ్ల సవ్వడి	అరుణ్ ఫరేరా	150
మలుపు తిప్పిన మహా ఉద్యమం	విరసం ప్రచురణ	60
బోల్షివిక్ పార్టీ చరిత్ర	విరసం ప్రచురణ	250
ఆవాజ్	విరసం ప్రచురణ	65
మెరిసే అక్షరాల వెనుక	సృజన ప్రచురణ	30
నక్సల్బరీ ఒక ఊరు మాత్రమే కాదు	విరసం ప్రచురణ	80
పికెఎం ప్రభాకర్ రచనలు	విరసం ప్రచురణ	70
కార్మికవర్గ విప్లవం-విప్లవ ద్రోహి కౌట్స్కీ	విరసం ప్రచురణ	60
భీమా కోరేగాం 12 – వివి	స్వేచ్ఛా సాహితీ ప్రచురణ	50

కథ – నవల

దండకారణ్య కథలు (2005–2012)	విరసం ప్రచురణ	100
వసంతగీతం	అల్లం రాజయ్య	250
ఏడుతరాలు	అలెక్స్ హేలీ	150
వనవాసి	బిభూతిభూషణ్ బంధోపాధ్యాయ	120
నేల నాగలి – మూడెద్దులు	బొజ్జా తారకం	25
దళితులు – రాజ్యం	బొజ్జాతారకం	25
స్పార్టకస్	హోవార్డ్ ఫాస్ట్	120
బీజభూమి	వరవరరావు	100
మరల సేద్యానికి	శివరామ కారంత్	150
హింసపాదు	బమ్మిడి జగదీశ్వరరావు	180
అభాగ్యజీవులు	ఫ్రాంజ్ ఫనాన్	170
నిషిధ	నల్లూరి రుక్మిణి	180
మాటిగరి	గుగి వా థియాంగో	120
మట్టికాళ్ల మహారాక్షసి	గుగి వా థియాంగో	200
బంది	గుగి వా థియాంగో	200
నేను చావును నిరాకరిస్తున్నాను	జి.ఎన్. సాయిబాబా	125

డివిడి

వీక్షణం (2003 – 2018)	400
సృజన (1966–1992)	240
అరుణతార (1970–2013)	125
'ఓయు'ద్యకాండ	100

వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

218 ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సెప్టెంబర్ 2019
సంపుటి : 17
సంచిక : 9

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై '**VEEKSHANAM**' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థిక సహాయం అందించిన వి. వెంకట్రావు, విజయనగరం - రు. 1,000; కె. లక్ష్మీనారాయణ, హైదరాబాద్ - రు. 5,000; ముదునూరి భారతి, హైదరాబాద్ - రు. 10,000; పి. అనుపమ, హైదరాబాద్ - రు. 25,000; కొల్లా రాజమోహన్, చిలకలూరిపేట - రు. 5,000, ఎన్.వి. వెంకటేష్, అడ్వకేట్, మహబూబ్‌నగర్ - రు. 3,000; శ్రేయోభిలాషి, హోసూరు, తమిళనాడు - రు. 1000. మిత్రులకు కృతజ్ఞతలు - సం.

వీక్షణం ఆగస్ట్ సంచికలో కాళేశ్వరంపై వచ్చిన వ్యాసం బాగుంది. రచయిత కాళేశ్వరం ప్రాజెక్టు గురించి చాలా వివరంగా చర్చించారు. ప్రతిపాదన మొదలు డిజైన్, రీ డిజైన్, ఖర్చు, వివాదాలు, గణాంకాలతో వ్యాసం బాగుంది. కాళేశ్వరంపై తెలంగాణ ప్రజలకు ఎన్నో ఆశలు ఉన్నాయి. కాని పాలకుల అవినీతి, కాంట్రాక్టర్ల స్వార్థం, అధికారుల నిర్లక్ష్యం మధ్య ఈ భారీ కట్టడం నిలుస్తుందా, లేదా అనేది ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది.

– ఎ. సమ్మయ్య
మంచిర్యాల

వీక్షణం ఆగస్టు సంచికలో వచ్చిన అన్ని వ్యాసాలు చదవదగినవిగా ఉన్నాయి. కేంద్ర బడ్జెట్, ఎపి బడ్జెట్‌పై వచ్చిన వ్యాసాలు విశ్లేషణాత్మకంగా ఉన్నాయి. మహేష్ రాసిన 'మూక హత్యలు' వ్యాసంలో దేశంలో దళిత, ముస్లిం, మైనారిటీలపై జరుగుతున్న మూకదాడుల గురించి, అవి ఆపాల్సిన రాజకీయ నాయకులు వాటికి మద్దతు తెలపడం, దాడులు చేసిన వారిని సన్మానించడం వంటి విషయాలు చదువుతుంటే దేశం ఎటుపోతుందోనని ఆందోళన కలుగుతుంది.

– కృష్ణహరి
మహబూబ్‌నగర్

వీక్షణం ఆగస్టు సంచికలోని వ్యాసాలన్ని బాగున్నాయి. బి.ఎస్. రాజు 'ఆంధ్ర రాజకీయాలు' వ్యాసంలో ఎన్నికల్లో చంద్రబాబు ఓటమి గురించి, వై.ఎస్. జగన్ కొత్త పథకాల వాగ్దానాలతో జనాలను నమ్మించి ఎలా గెలుపొందాడో చక్కగా వివరించారు. అలాగే ఎపిలో జరుగుతున్న రాజకీయ పరిణామాల గురించి క్లుప్తంగా రాశారు. అలాగే రత్నమాల వ్యాసంలో మోడీ, ఆయన మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి కార్పొరేట్, ప్రైవేట్ పారిశ్రామిక వేత్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారంటే వారికి మోడీ ప్రభుత్వ అవసరం ఎంతగా ఉందో వివరంగా రాశారు.

– సి.ఎచ్. మహేందర్
నల్లగొండ

వీక్షణం గత నెల సంచికలో 'పదునెక్కుతున్న హిట్లర్ పాలన కోరలు' సంపాదకీయంలో నేడు బిజెపి పాలన హిట్లర్ పాలనను తలదన్నే విధంగా ఉందన్న విషయాన్ని చాలా సూటిగా చెప్పారు. ఈ దేశంలో భిన్న కులాలకు, మతాలకు ఆలోచనలను వ్యక్తీకరించే స్వేచ్ఛను రాజ్యాంగం కల్పించింది. కాని నేడు అది బిజెపి పాలనలో ఒకే జాతి, ఒకే మతం, ఒకే ఎన్నికలు, ఒకే ఆహారపు అలవాట్లు, ఒకే ఆలోచనకు కుదించబడింది. చట్ట సవరణలను నిర్బంధంగా అమలు చేసి తమ భావజాలాన్ని బలవంతంగా సమాజం మీద ఎలా రుద్దుతున్నారో తెలిపారు. అవినీతికి సంబంధించిన సమాచారాన్ని వెల్లడించే సమాచార హక్కు చట్టం గొంతునొక్కేశారు. పాలకుల, అధికారుల అవినీతికి ద్వారాలు తెరిచారని తెలిపారు. ప్రజల ప్రమేయం లేకుండా పాలకులు అమలు చేస్తున్న విధానాల పట్ల ప్రజలను ముందుగానే మేల్కొల్పే విధంగా వీక్షణం సంపాదకీయాలు ఉంటున్నాయి. ఇప్పుడు సమాజంలో నెలకొన్న పరిస్థితులకు తగిన విధంగా సంపాదకీయాలు, విశ్లేషణాత్మక వ్యాసాలు ప్రచురిస్తున్న పత్రికకు కృతజ్ఞతలు.

– కె. నారాయణ
తోటపల్లి

వీక్షణం జూలై సంచికలో బొరెడ్డి మధుసూదన్ రెడ్డి 'ముంచుకొస్తున్న పర్యావరణ ముప్పు' వ్యాసం ప్రస్తుత పరిస్థితులను తెలియజేస్తోంది. పర్యావరణ విధ్వంసం పట్ల సమాజం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేసిన రచయితకు కృతజ్ఞతలు. ప్రకృతిలో వస్తున్న మార్పుల వల్ల కొన్ని వందల సంవత్సరాల తర్వాత ఈ భూమ్మీద ప్రాణి జీవించే అవకాశం లేకుండా పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పాతాలంలో బొగ్గుపులుసు వాయువు పరిమాణం పెరిగేకొద్ది ప్రాణ వాయువు తగ్గిపోతోంది. దీనివల్ల జీవులలో శ్వాసక్రియకు అవసరమైన ప్రాణ వాయువు – ఆక్సిజన్ గాలిలోకి సక్రమంగా సరఫరా జరగదు. ఆక్సిజన్ శాతం తగ్గి జీవజాతులు మొత్తం తక్కువ కాలంలోనే నశించే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నాయి. ఒకవైపు హరితహారం అంటూ కోట్లాది ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ మరోపక్క అభివృద్ధి పేరుతో అడవులను ధ్వంసం చేస్తున్నాయి. ప్రకృతి వనరులను కాపాడుతున్న ఆదివాసులను జైళ్లలో నిర్బంధిస్తున్నాయి. వారి హక్కుల కోసం మాట్లాడుతున్న మేధావులను జైళ్లల్లో నిర్బంధిస్తున్నాయి. పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాల్సిన అవగాహనను అందించే మరిన్ని వ్యాసాలను వీక్షణంలో క్రమం తప్పకుండా ప్రచురించగలరని మనవి.

– జి. యాదగిరి
కరీంనగర్

వీక్షణంలో వచ్చే సంపాదకీయాలు, సంపాదకీయ వ్యాఖ్యలు చాలా బాగున్నయి. ముఖ్యంగా తెలంగాణ యాసతో, కెసిఆర్ విధానాలపై వ్యంగ్యాస్త్రంగా అనిపిస్తున్నయి. సంపాదకీయ వ్యాఖ్యల పరిధి పరిమితంగా ఉంటుంది కాబట్టి ఎక్కువ ఆశించలేం. తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై వ్యాసాలు, విశ్లేషణలు మంచిగనే వస్తున్నయ్. అయితే ఎందుకో వీక్షణంలో ఈ మధ్య ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన వ్యాసాలు వస్తలేవు. దినపత్రికలు ఎలాగూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అని విడిపోయాయి. వీక్షణంలో ఆ కొరత తీరుతుందని ఆశిస్తున్నాను.

– సి. బాలరాజు
వికారాబాద్

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

(ఈ సంచికలోని హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్నవారు ఎస్. వెంకటేశ్)

వీక్షణం

ఎంత తీవ్ర ఖండనైనా సరిపోదనిపించే దుర్మార్గం

కశ్మీర్ విషయంలో భారత ప్రభుత్వం సాగించిన దుర్మార్గాన్ని, దురాక్రమణ చర్యను ఎంత తీవ్రంగా ఖండించినా తక్కువే అనిపిస్తుంది. ఇది కేవలం ఒక ప్రాంతం మీద బలప్రయోగం, ఒక ప్రాంత ప్రజల ప్రాథమిక హక్కుల మీద ఉక్కుపాదం మాత్రమే కాదు, ఇది ఎన్నెన్నో కోణాలలో ఎంతమాత్రమూ ఆమోదించడానికి వీలు లేని, అత్యంత తీవ్రంగా అభిశంసించవలసిన హంతక ఉన్మాద చర్య.

ఇది కనీసం ఎనిమిది తొమ్మిది దశాబ్దాలుగా కశ్మీర్ ప్రజలు సామూహికంగా ప్రకటిస్తున్న ఆకాంక్షల అణచివేత. ఇది మానవ నాగరికతా ప్రయాణంలో రూపొందించుకున్న మానవతా విలువల హననం. ఇది స్వయంగా భారత పాలకవర్గాలు గత ఏడు దశాబ్దాలుగా కశ్మీర్ ప్రజలకూ, భారత ప్రజలకూ, అంతర్జాతీయ సమాజానికీ ఇచ్చిన హామీల ఉల్లంఘన. ఇది భారత ప్రజలమైన మనకు మనం రాసి ఇచ్చుకున్న రాజ్యాంగ స్ఫూర్తి విధ్వంసం. ఆ రాజ్యాంగ రచనకు పునాది అయిన జాతీయోద్యమ, ప్రజా ఉద్యమాల విలువల వారసత్వాన్ని ఖననం చేయడం ఇది. ఏడు దశాబ్దాలలో ఎన్నిసార్లు తూట్లుపొడిచినా ఆభాసగానైనా, నటనకోసమైనా, ముసుగుగానైనా ఉన్న కనీస ప్రజాస్వామ్య పద్ధతుల కూల్చివేత ఇది. వలస పాలనా కాలంలోనే దేశపు బహుళత్వమూ విభిన్న జాతుల అస్తిత్వమూ స్ఫురణకు వచ్చి, వలసానంతర సమాజంలో జాతుల స్వయం నిర్ణయాధికార హక్కు అంగీకరిస్తామనే దగ్గర మొదలై, చివరికి కనీసం భిన్నత్వంలో ఏకత్వ పునాదిగా హక్కులను రక్షిస్తామని వాగ్దానం చేసి, మూడు సంవత్సరాల చర్చాక్రమంలో, దేశదేశాల అనుభవాల అవగాహనతో రూపొందించుకున్న దేశ రాజ్యాంగపు సమాఖ్య స్వభావాన్ని పార్లమెంటు సాక్షిగా హత్య చేసిన ఘటన ఇది. ఒక బహుళ సమాజాన్ని పట్టుకుని నీ అభివృద్ధి కోసమే, నీ కోసమే నేనిది చేస్తున్నాను అని గొంతు పిసుకుతున్న ఘటన ఇది. ఒక రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చి మిగిలిన రాష్ట్రాలన్నిటికీ కూడ పెట్టిన బెదిరింపు ఇది. మూడు వారాలు దాటిపోతున్నా, కర్ఫ్యూ విధించి, ఒక్క మనిషి కూడ బైటికి రాకుండా, గొంతెత్తకుండా నిర్బంధించి, ప్రజాందోళనకూ నిరసనకూ నాయకత్వం వహించగలరేమో అనిపించిన ఆరువేల మందిని చెరసాలల పాలుచేసి, సమాచార సంబంధాల వ్యవస్థలన్నిటినీ మూసివేసి, చీకటి రాజ్యం స్థాపించి, వాక్సభాస్వాతంత్ర్యాలను, రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులను ఉత్తరించి ఇదంతా కశ్మీర్ వెలుగు కోసమే నంటున్న అబద్ధాల కోరు ప్రభుత్వం ఇవాళ రాజ్యం చేస్తున్నది. యుద్ధం ముగియకుండానే ఓడిన దేశం మీద పడి ఎవడికి దొరికినది వాడు చేజిక్కించుకునే రాబందుల్నీ జాగిలాల్నీ ఉసి గొలిపినట్టు బహుళ జాతి సంస్థలకూ వారి దళారీలకూ దేశదేశాల సంపన్నులకూ ఎర్రతివాచీ పరిచి ఆహ్వానాలు పలుకుతున్న, ప్రత్యేక సన్నాహాలు చేస్తున్న దుర్మార్గం ఇది.

అన్యాయం, అక్రమం, చట్టవ్యతిరేకత, అప్రజాస్వామికత, క్రూరత్వం, దుర్మార్గం, సిగ్గులేనితనం, హంతక స్వభావం, ధూర్తత్వం, అమానుషత్వం వంటి ఎన్ని మాటలతో వర్ణించినా జరిగిన, జరుగుతున్న దారుణంలో వందోవంతును కూడ చిత్రించడం సాధ్యం కాదు. ఒక ప్రాంతం మీద, ఒక ప్రాంత ప్రజల మీద రెండు పొరుగుదేశాలు జరిపే దౌర్జన్యాలకు కశ్మీర్ ఒక పాఠ్యపుస్తకం వంటి ఉదాహరణ అని గత డెబ్బై సంవత్సరాలలో ఎందరో అన్నారు. ఆ దుర్మార్గ, అక్రమ, హంతక పాఠ్యపుస్తకం మరింత ఎక్కువ ఉదాహరణ ప్రాయ స్థితికి చేరుతున్నది.

ఈలోగా చరిత్ర గమనం సాగుతుంది. ఆ చరిత్రలో, ఆగామి భవిష్యత్తులో ఏం జరగనున్నదో ఊహించడం కూడ కష్టం కాదు. నిన్నటి వరకూ భారతదేశం మీద నమ్మకం పెట్టుకున్న కశ్మీరీలు కూడ ఆ నమ్మకం వమ్ము అయిందని నిరాశలోకీ, ఆగ్రహంలోకీ ప్రయాణిస్తారు. భారత పాలకుల మీద, భారతప్రభుత్వం మీద మాత్రమే కాదు, భారతదేశం మీదికి, అంటే భారత ప్రజల మీదికి కూడ ఆ ఆగ్రహం బదిలీ అవుతుంది. ఆ ఆగ్రహానికి ఆజ్యం పోయడానికి పొరుగుదేశపు పాలకవర్గాలు ఎలాగూ సిద్ధంగా ఉంటాయి. అంటే ఆగస్ట్ 5 పరిణామాలు కశ్మీర్‌లో మరింత మందిలో భారత్ పట్ల వ్యతిరేకతను పెంచుతాయి. మరింతమంది క్రియాశీల, సాయుధ చర్యలలోకి వెళ్లడానికి దారితీస్తాయి. డెబ్బైలక్షల జనాభాకు పది లక్షల సైనిక, అర్ధసైనిక బలగాలను పెట్టి ఇవాళ ఒక శ్మశానశాంతిని స్థాపించి ఉండవచ్చు గాని, త్వరలోనో, ఆలస్యంగానో ఈ శ్మశానశాంతి బద్దలయ్యే విస్ఫోటక పరిణామాలు జరుగుతాయి. అక్కడ మాత్రమే కాదు, కశ్మీర్ ను ఒక జాతి సమస్యగా, ఒక ప్రాంత సమస్యగా కాక ప్రధానంగా మత సమస్యగా చిత్రించినందువల్ల దేశవ్యాప్తంగానే ఆ మతంలోని సున్నిత మనస్కులలో ప్రభుత్వవ్యతిరేక భావనలు పెరిగిపోతాయి. వాటికి ఏ విపరిణామాలు ఉంటాయో ఎవరికి వారు ఊహించుకోవలసిందే. ఇవాళ అన్ని దేశాల ప్రభుత్వాలను, ముఖ్యంగా సామ్రాజ్యవాద ప్రభుత్వాలను, ఐక్యరాజ్యసమితిని, భద్రతామండలిని మాయచేసి మనతో ఉన్నారని అనిపించుకోవచ్చు గాని క్రమక్రమంగా భారత ప్రభుత్వ దుర్మార్గాన్ని నిరసించే దిశగా అంతర్జాతీయ ప్రజాభిప్రాయ సమీకరణ పయనిస్తుంది. గతం నుంచి, ప్రత్యేకంగా పాలస్తీనా నుంచి మనం ఏమన్నా నేర్చుకోగలిగితే, రానున్న రోజుల్లో ఏం జరిగే అవకాశం ఉందో ఊహించవచ్చు. ఆ భవిష్యత్తు ప్రమాదకరమైనదనుకుంటే, దాన్ని ప్రమాదకరంగా మార్చిన ఘనత మన పాలకులదే తప్ప కశ్మీరీ ప్రజలది కాదని మాత్రం గుర్తుంచుకోవాలి.

పాలస్తీనా ప్రజలపై, భూభాగంపై సామ్రాజ్యవాదులు సాగించిన దుర్మార్గం, ఇజ్రాయిల్ ఏర్పాటు, క్రమక్రమంగా ఇజ్రాయెలీల దురాక్రమణ దౌర్జన్యాలు, తమ దేశంలో తామే కాందిశీకులుగా బతకవలసి వచ్చిన పాలస్తీనీయుల స్థితి, తమ హక్కుల పరిరక్షణ కోసం, మాతృభూమి పునరుద్ధరణ కోసం ఇంతిఫాదా సాయుధ పోరాటానికి దిగిన స్థితి, కళ్లూ చెవులూ మూసుకున్న అంతర్జాతీయ సమాజం, ఏడు దశాబ్దాలుగా ఆరకుండా రగులుతున్న అణచివేత–ప్రతిఘటన చరిత్ర పూర్తిగా తెలియని వారికి, ఇప్పుడు కశ్మీర్ పై భారత పాలకవర్గాల దురాక్రమణ ఆ చరిత్రను కళ్ల ముందర పునరావిష్కరిస్తున్నది. ఎదురుగా ముక్కు గుద్దినట్టు కనబడుతున్న ఈ వాస్తవాల పట్ల మానవీయంగా, ప్రజాస్వామికంగా, చట్టబద్ధంగా, చరిత్ర గమనానికి అనుగుణంగా స్పందిస్తామా లేదా చరిత్రలో నమోదవుతుంది. మన స్పందన వల్లనే మారే అవకాశం లేనంత దుస్థితి కొనసాగుతుండవచ్చు, కాని కనీసం మన స్పందన ప్రకటించి చరిత్ర దృష్టిలో క్షమార్హులమవుతామా, నేరస్తులుగా మిగులుతామా ఎవరికి వారు తేల్చుకోవలసిందే. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

కారు - పువ్వు కొట్లాట నిజంగనేనా, ఉల్లెక్కాలనా?

అబ్బబ్బబ్బ, ఏం వార్తలు, ఏం వార్తలు. పెద్దదొర ఢిల్లి సర్కారు మీద యుద్ధం జేస్తనన్నడటగద. ఢిల్లి సర్కారును చెడ తిడ్తాండట గద. సర్కారంటే సర్కారు గాదనుకో, పువ్వు పార్టీని మస్తు తిడ్తాండట గద. ఇగ చిన్నదొరయితె ఇంకొక ఆకు ఎక్కువ జదివినట్టు పువ్వు గుర్తోల్లకు ప్రజాస్వామ్యం అంటేందో సుద్దులు గుడ జెప్పిండట గద. అబ్బ, ఏం కాలమొచ్చెను నాయనా. ఎంత మంచి మాట ఇంటి. నిజంగ తెలంగాణ నెత్తురు ఉడికిపోయిందనుకో. ఎప్పటినుంచి ఢిల్లిని సవాల్ జేస్తాంది తెలంగాణ. ప్రతాపరుద్రుడు ఢిల్లి మీద మర్లబడె, కొట్లాడె, ఒప్పుకున్న పైకం గుడ ఎగ్గొట్టె. ఆఖరికి ఢిల్లి వోడొచ్చి పట్టుకపోతాంటె చస్తెమానాయె గాని ఢిల్లివోని బందినైతనా అని నదిల దునికి సచ్చిపాయె. ఆ తర్వాత మన సర్వాయి పాపన్న ఢిల్లి మీద కొట్లాడె. అటెన్క మన అసఫ్జాహి రాజులు ఢిల్లి బిషాదెంత అని రాజ్జెమే నిలబెట్టిరి. మన తుర్రెబాజ్ ఖాన్ ఢిల్లి మీదనే గాదు, ఢిల్లిల్లో, కలకత్తాల్లో కూసున్న తెల్లోని మీద గుడ కొట్లాడె. కొసాఖరికి ఎన్టిరామారావు గుడ ఢిల్లిదెంత లెక్క, అది పొగసువంటిది అనె. మనం జైతెలంగాణల ఢిల్లి మీద కొట్లాడితిమి. మల్ల ఇరవై ఏండ్లు కొట్లాడ్తిమి. పడుసు పడుసు పోరగాండ్లు ఢిల్లిని ఎదిరించి పానాలిచ్చిరి, ఢిల్లి మెడలు ఒంచి తెలంగాణ దెచ్చిరి. ఇంత కతున్నది గద మనకూ ఢిల్లికి మజ్జెన. మరిప్పుడు పువ్వు గుర్తోల్ల మీద, ఢిల్లి సర్కారు మీద పెద్దదొర, చిన్నదొర ఒంటికాలి మీద లేస్తాంద్రంటే నాకు శాన సంబురమాయె. అబ్బ ఇన్నాళ్లకు గదరా, తెలంగాణ అయిష్యత్ జూపెడ్తాంద్రు అనిపిచ్చె. కాని గాలి దీశింద్రు గద. ఇదంత ఉల్లెక్కాలనేనట గద. నువ్వు కొట్టినట్టు జెయ్యి, నేను ఏడ్శినట్టు జేత్త అని కత జెప్పినట్టు ఇద్దరు పదులుకున్నరట గద. అయినా, నా పిచ్చి గని, పువ్వు గుర్తు ముక్కెమంత్రులు గుడ ఎన్నడు జెయ్యనటువంటి యాగాలు గీగాలు అన్ని పెద్దదొర జేత్తనే ఉండె. నన్నుమించిన హిందువున్నడా అని బస్తీ మె సవాల్ ఇసిరెనే ఇసిరె. నివ్వద్దె. నాగపూర్ అయ్యగార్లనడుగాలె, మా దొర వాండ్ల కన్న రెండాకులు ఎక్కువే జదివిండని కచ్చితంగ జెప్తరు. ఎహె, నాగపూర్ దాక ఎందుకు, ఢిల్లిల పువ్వు సర్కారును మాత్రం దొర ఏమన్న జేశిండా? బల్లపీట మీదెక్కి తిట్టె, బల్లపీట దిగంగనె అలాయిబలాయి ఇచ్చుకునె. ఎన్ని ముచ్చట్లు లెవ్వు? పెద్దనోట్లు ఖతం జేసినప్పుడు దేశమంత తిడ్తాంటె పువ్వు గుర్తు సర్కారును మెచ్చుకున్నది మన దొరే గాదా? గదేందో జీఎస్టో బీఎస్టో బెట్టి దేశాన్ని పజీత జేసినప్పుడు అందరికన్న ముందు దాన్ని ఒప్పుకున్న మారాజు మన దొరేనాయె. గవన్ని పాత ముచ్చట్లనుకో, నిన్న మొన్న ఈడ బీరాలు పల్కుకుంటనే, ఆడ ఢిల్లిల మన దొర జేసిన పనులేంటియి? సమాచార హక్కో గదేందో నాకు నోరు దిరగది గని, దాని మీద పువ్వు గుర్తోల్ల పనులను తిట్టి తిట్టి, ఆఖరికి ఆ పనులకే ఓటేసిండు గద. కశ్మీర్ మీద ఓటెసె, అన్నలను బట్టుకునె ఖానూను మీద ఓటేసె, రాష్ట్రాల సర్కార్ల తోకలు కోస్తాన, అన్ని అతికారాలు నాకే అని పువ్వు గుర్తోల్లు అంటె గుడ ఓటేసె. ఇగ ఢిల్లి మీద కొట్లాట ఏడిది బాంచెన్. అదంత ఉల్లెక్కాల. కార్ల పువ్వు. లేకపోతె పూల కారు. అసలు సంగతి జెప్పాల్నా. కాంగ్రెసోల్లను, తెలుగుదేశపోల్లను, కమ్మినిస్టులను, ఆమాటకొస్తే మాట్లాడిన ప్రతి ఒక్కణ్ని ఖాళీ జేసి, మైదాన్ సాఫ్ జేసి, పువ్వులు బరిచి, పువ్వు గుర్తోనికి హారతి బట్టి తాంబాళంల తెలంగాణను బెట్టి సదివిచ్చింది పెద్ద దొర గాదా, ఇద్దరికి ఎంత సోపతో తెలుస్తలేదా?

వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

మరొకసారి సమీక్షల గురించే...

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లను సమీక్షించాల్సి ఉన్నదని చేసిన నిర్ణయం మీద వివాదం ఇంకా ముగియకుండ గానే, న్యాయస్థానాల చుట్టూ తిరుగుతుండగానే, పోలవరం కాంట్రాక్టు రద్దు, కియా కార్ల కంపెనీకి ఇచ్చిన ప్రోత్సాహకాల వంటి వాటిపై సమీక్ష, అసలు రాజధాని నిర్ణయంపైనే సమీక్ష వంటి ఎన్నెన్నో నిర్ణయాలూ ఆలోచనలూ ప్రతిపాదనలూ ఊహాగానాలూ వెలువడుతున్నాయి. పోలవరం కాంట్రాక్టు రద్దు, రివర్స్ టెండరింగ్ ప్రక్రియను ప్రస్తుతానికి రాష్ట్ర హైకోర్టు ఆపివేసింది గాని, అంతిమ తీర్పు ఎలా వెలువడుతుందో తెలియదు. మిగిలిన నిర్ణయాలు, ఆలోచనలు కూడ సంచలనాత్మకమైనంతగా సార్థకమవుతాయా లేదా తెలియదు. ఈ రద్దులు, సమీక్షలు ఆంధ్రప్రదేశ్ ఆలోచనాపరులను రెండు వర్గాలుగా, పూర్తిగా సమర్థించే వారు, పూర్తిగా వ్యతిరేకించే వారుగా విడదీశాయి. కాని ఇది అంత సులభంగా ఆమోదించడమో, వ్యతిరేకించడమో మాత్రమే చేసి ఊరుకోగల అంశం కాదు. మన ప్రభుత్వాలలో నిర్ణయాధికారం ఉన్నవారందరూ అక్రమాలకు, అవినీతికి నిలయాలుగా మారారు గనుక వారు చేసే ఏ నిర్ణయమైనా, విధానమైనా, పథకమైనా అవినీతి, అక్రమాలతో కూడి ఉండడం ఆశ్చర్యకరమేమీ కాదు. ప్రభుత్వ విధానాలను, కార్యక్రమాలను నిష్పక్షపాతంగా, ప్రజానుకూలంగా సమీక్షిస్తే ప్రతి పథకంలోనూ ఎన్నెన్నో అస్థిపంజరాలు బైటపడతాయి. ప్రజల వైపు నుంచి పరిశీలిస్తే ప్రతి నిర్ణయాన్నీ రద్దు చేయవలసిందే. అయితే అధికారపక్షంగా ఉండిన పార్టీ ప్రతిపక్షంగా మారగానే దాని పాత విధాన నిర్ణయాలను, కార్యక్రమాలను సమీక్షిస్తామని, రద్దు చేస్తామని అనగల అర్హత గాని, ధైర్యంగాని ఇవాళ ఏ ఒక్క పార్టీకైనా ఉన్నాయా అనేది ప్రశ్న. అసలు అధికారంలో ఉండి అక్రమాలకూ అవినీతికీ పాల్పడని చరిత్ర ఉన్న పార్టీ ఒక్కటైనా ఉన్నదా? అలా ఒకరి పనులను మరొకరు సమీక్షిస్తూ పోవడం ప్రజలవైపు నుంచి పూర్తిగా వాంఛనీయమే, ప్రశంసనీయమే గాని అది సాధ్యమా అని మరొక ప్రశ్న. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ మారవచ్చుగాని అధికార వ్యవస్థ కొనసాగుతుంది అని అంటారు. అంటే అధికార విధానాలు, సాధనాలు, పద్ధతులు మారవు అని అర్థం. మరి అధికారంలో ఉన్నప్పుడు వారి అవినీతి, అక్రమాలకు అవకాశం ఇచ్చిన అధికార విధానాలను, సాధనాలను, పద్ధతులను మార్చకుండా ఆ అవినీతి, అక్రమాలను సమీక్షించడం ఎలా సాధ్యమవుతుంది? అంటే మొత్తం మీద తేలేదేమంటే ఇటువంటి సమీక్ష ఈ అధికార వ్యవస్థ ఉన్నంతకాలం వాస్తవంగా ఆచరణసాధ్యం కాదు. మరి ప్రస్తుత ముఖ్యమంత్రి, లేదా ఆయన పార్టీ నాయకులు ఈ ప్రగల్భాలు ఎందుకు పలుకుతున్నట్టు? గత ప్రభుత్వం వారి ఆశ్రితులకు ప్రజాధనం కట్టబెట్టింది, అది సమీక్షించి, రద్దు చేసి, మా ఆశ్రితులకు కట్టబెడతాము అని దాని అర్థం. లేదా, సమీక్షిస్తామని బెదిరించి, ఆ పాత కాంట్రాక్టర్ల దగ్గర కొత్త ముడుపులు వసూలు చేసుకుంటాము అని అర్థం. అంతకన్న ఒక్క పైసా తక్కువా కాదు, ఎక్కువా కాదు. ఈ మొత్తం వ్యవహారం నుంచి ప్రజలు గ్రహించవలసింది ఏమైనా ఉన్నదంటే, ఎంత పెద్ద, గట్టి, భారీ ప్రభుత్వ నిర్ణయాన్నైనా సమీక్షించడానికి, రద్దు చేయడానికి అవకాశం ఉంది అని. నిజంగా ప్రజలకు అధికారం వచ్చినప్పుడు ఆ పని చేయడానికి జంకనవసరం లేదని.

వీ


గ్రీస్ ఎన్నికల ఫలితాలు నేర్పుతున్న గుణపాఠమేమిటి!

- ఎ. నర్సింహారెడ్డి

గ్రీస్ పార్లమెంట్‌కు జూలై 7న జరిగిన ఎన్నికల్లో పాలక వామపక్ష సిరిజా పార్టీని ఓడించి మితవాద న్యూడెమోక్రసీ పార్టీ అత్యధిక సీట్లు సాధించి కిరియకోస్ మిట్సోటకీస్ ప్రధానిగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గ్రీస్‌లో 1990 దశకంలో మొదలైన ప్రైవేటీకరణ, కార్పొరేట్ల అనుకూల విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దశాబ్ద కాలంగా ఆర్థిక సంక్షోభం, పొదుపు చర్యల మధ్య నలుగుతున్న గ్రీన్ ఓటర్ల నిరాసక్తత ఓటింగ్‌లో వ్యక్తమైంది. ఎన్నడూలేని విధంగా 57 శాతం ఓట్లు మాత్రమే పోలైనాయి. వామపక్షంగా చెప్పుకుంటూ తమ ఆశలను నిరాశపర్చిన సిరిజా పార్టీని ఓటర్లు శిక్షించారు. 300 స్థానాలు గల పార్లమెంట్‌లో న్యూడెమోక్రసీ పార్టీ 40 శాతం ఓట్లతో 158 సీట్లు దక్కించుకుంది. కాగాట్సిప్రాస్ నాయకత్వంలోని సిరిజా పార్టీకి 31.5 శాతం ఓట్లతో 86 సీట్లు దక్కాయి. మధ్యేమార్గ పార్టీలు మూవ్‌మెంట్ ఫర్ చేంజ్ 22, మిరా 25 పార్టీ 9, గ్రీస్ సొల్యూషన్ 10 సీట్లతో తొలిసారి పార్లమెంటులో ప్రవేశించగా, ఫాసిస్టు పార్టీ గోల్డన్ డాన్ ఈసారి పార్లమెంటులో అడుగుపెట్టే అవకాశం కోల్పోయింది. అలాగే గత నాలుగున్నర సంవత్సరాలు సిరిజాతో సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఇండిపెండెంట్ గ్రీక్స్ అంతర్ధానమయ్యారు.


సిప్రాస్ 2004లో సిరిజా పార్టీని ఏర్పాటు చేశారు. 2012 ఎన్నికల్లో సిరిజా కూటమి 27 శాతం ఓట్లతో ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. 2015 జనవరిలో జరిగిన ఎన్నికల్లో సిరిజా 36.3 శాతం ఓట్లు, 149 సీట్లతో పెద్ద పార్టీగా అవతరించినా అధికారానికి రెండు సీట్లు తగ్గడంతో మితవాద పార్టీ ఇండిపెండెంట్ గ్రీక్స్‌తో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అధికారం చేపట్టిన వెంటనే ఐరోపా యూనియన్, ఐఎంఎఫ్‌లు విధించిన షరతులను అంగీకరించడంతో పార్టీలో చీలిక వచ్చింది. సిప్రాస్ అధికారంలోకి వస్తే పొదుపు చర్యలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటాడని ప్రజలు ఆశిస్తే ఆయన ఇయుతో ఒప్పందం కుదుర్చుకోవడం పలువుర్ని ఆశ్చర్యపర్చింది. ఇజ్రాయిల్‌తో స్నేహం, అమెరికా నుంచి ఎఫ్-15 యుద్ధ విమానాలు కొనుగోలు, బాల్కన్ ప్రాంతానికి నాటో కూటమి విస్తరించటాన్ని వ్యతిరేకిస్తూ గతంలో గ్రీస్ చేసిన వీటోను రద్దు చేశాడు. ఏ పొదుపు చర్యలను ఆయన వ్యతిరేకించి అధికారంలోకి వచ్చారో, మళ్లీ వాటినే అమలు చేశాడు. ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టాడు. ఐదు వందల నౌకా కంపెనీలు, ఇతర సంస్థలకు పెద్ద మొత్తంలో పన్ను రాయితీ ఇచ్చాడు. పొదుపు పేరుతో పేదలపై పెనుభారాలు మోపాడు. సిప్రాస్ మాటలు, హామీలు ఎలా ఉన్నా, ఆచరణలో ఆయన పూర్తిగా ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేశాడు. ఒక వామపక్ష ప్రభుత్వాన్ని స్వల్ప కాలంలోనే ప్రజలు తిరస్కరించ డానికి కారణం అది అనుసరించిన విధానాలే. ఇయుతో రాజీ తగదని చెప్పిన ఆర్థిక మంత్రి యానిస్ పరోఫకిస్‌ను తొలగించారు.

గ్రీస్ ఎన్నికలు అభ్యుదయవాదులకూ, వామపక్షాలకూ, కమ్యూనిస్టులకూ, విప్లవ కార్మిక వర్గానికీ విలువైన గుణపాఠాలు మిగిల్చింది. ప్రజల ఆంకాంక్ష లను పట్టించుకోకుండా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు అమలు చేసే మితవాద పార్టీల ప్రభుత్వమైనా, వామపక్ష ప్రభుత్వమైనా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని గ్రీస్ ఎన్నికల ఫలితాలు చెప్పకనే చెప్పాయి. గ్రీస్ ఇప్పటికే పీకల లోతు అప్పుల్లో కూరుకుపోయి ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించడం, ఇయు షరతులను తోసిపుచ్చడం అనేది నూతన ప్రధాని మిట్సో టకీస్‌కు కత్తిమీద సామే! వీ







❖ **సగం పిట్ట** – ప్రసాదమూర్తి కథలు – వినూత్న ప్రచురణలు – 216 పేజీలు, 1/8 డెమీ, రు. 150




❖ **ప్రసాదమూర్తి కవిత్వం** – వినూత్న ప్రచురణలు – 214 పేజీలు, 1/8 డెమీ, రు. 150




❖ **ప్రసాద సముద్రం** – ప్రసాదమూర్తి కవిత్వ విశ్లేషణ – సౌభాగ్య – వినూత్న ప్రచురణలు – 148 పేజీలు, 1/8 డెమీ, రు. 125
పై మూడు ప్రతులకు: డా. బి.ఆర్.వి. ప్రసాదమూర్తి, ఫ్లాట్ నెం. బి–402, వైభవ్ సిగ్నేచర్, జవహర్ నవోదయ విద్యాలయ స్కూల్ ఎదురుగా, నల్లగండ్ల, హైదరాబాద్ – 500019, ఫోన్: 84998 66699




❖ **ప్రత్యూష** – పద్య, గేయ సంకలనం – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణలు – 132 పేజీలు, 1/8 డెమీ, రు. 50




❖ **శ్రీ సిద్ధేశ్వర చరిత్రము – కాసె సర్వప్ప ప్రణీతం** – కాకతీయ రాజుల చరిత్ర–ప్రతాప చరిత్ర – సంపాదకుడు: ఖండవల్లి లక్ష్మీరంజనం – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణలు – 296 పేజీలు, 1/8 డెమీ, రు. 120




❖ **శరధార** – ఊటుకూరు రంగారావు – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణలు – 36 పేజీలు, 1/8 డెమీ, రు. 25
పై మూడు ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభారతి, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్ – 500004, ఫోన్ : 040–29703142




❖ **గోదావరి పలకరింపు** – వర్మ కలిదిండి – కల్పన పబ్లికేషన్ ప్రచురణ – 102 పేజీలు, 1/8 డెమీ, రు. 75, ప్రతులకు: కెవిఎన్‌విఎం వర్మ, ఇ.నెం. 3–31, రాజులపేట్, చెరుకువాడ, ఉండి మండలం, పశ్చిమ గోదావరి – 534199, ఫోన్ : 99489 43337



❖ **హిందూత్వ, దేశభక్తి ఉన్మాదాల పరాకాష్ట – తిరిగి అధికారంలోకి వచ్చిన బిజెపి** – సి.పి.ఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ప్రచురణ – 36 పేజీలు, 1/8 డెమీ, రు. 10, ప్రతులకు: సి.పి. భవన్, ఇ.నెం. 2–1–594(బి–34,ఎఫ్–1), రైల్వే స్టేషన్ రోడ్, విద్యానగర్, హైదరాబాద్–500044
ఫోన్: 27668471




❖ **తెలుగింటి వ్యాకరణం** – ఎం.వి. రమణారెడ్డి – కవిత పబ్లికేషన్స్ – 128 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు: కవిత పబ్లికేషన్స్, ఇ.నెం. 3/75, ఖాదరాబాద్ (పి.ఒ.), ప్రొద్దుటూరు, కడప – 516362
ఫోన్: 9063077367



❖ **మహోభి నిష్క్రమణం** – రైతు కనుమరుగు – సడ్లపల్లె చిదంబర రెడ్డి – తపన సాహిత్య వేదిక ప్రచురణ – 104 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: సి. కళానిధి, ఇ.నెం. 21–6–139, వెలుగు–చిగురు, టీచర్స్ కాలనీ, హిందుపూర్, అనంతపురం – 515211, ఫోన్: 9440073636




❖ **అనగనగా సీతారాం** – పెద్దన్న మారాబత్తుల – రోజానా ప్రచురణలు – 104 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: రోజానా ప్రచురణలు, పెద్దన్న మారాబత్తుల, ఇ.నెం. 2–205, మామునూరు, యెర్రుపాలెం, ఖమ్మం, ఫోన్ : 9866881140



❖ **సామాజిక సమస్యలు** – డా. పోలం సైదులు – ఎం.ఎస్.ఒ. పబ్లికేషన్స్ ప్రచురణ – 182 పేజీలు, 1/8 డెమీ, రు. 200



❖ **వర్తమాన రాజకీయాలు** – డా. పోలం సైదులు – ఎం.ఎస్.ఒ. పబ్లికేషన్స్ ప్రచురణ – 188 పేజీలు, 1/8 డెమీ, రు. 200
పై రెండు ప్రతులకు: ఎం.ఎస్.ఒ. పబ్లికేషన్స్ ప్రచురణ, ఇ.నెం. 17–303/146, హిల్‌టాప్ కాలనీ, మల్కాజిగిరి, హైదరాబాద్ – 500047



❖ **చిత్రలిపి** – చదువు చదివించు – ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రచురణ – 96 పేజీలు, 1/8 డెమీ, అమూల్యం, ప్రతులకు: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, సఫాయిబస్తీ, కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం – 507101, ఫోన్ : 7207550867



❖ **మనుమసిద్ధి** – కవిత్వం – కోట్ల వెంకటేశ్వర రెడ్డి – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 36 పేజీలు, 1/8 డెమీ, రు. 20



❖ **అంతర్వాహిని** – కవిత్వం – కోట్ల వెంకటేశ్వర రెడ్డి – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 64 పేజీలు, 1/8 డెమీ, రు. 50
పై రెండు ప్రతులకు: కోట్ల వెంకటేశ్వర రెడ్డి, ఇ.నెం. 4–31/1/2, భగీరథ కాలనీ, మహబూబ్‌నగర్ – 509001

కశ్మీర్ పై భారత పాలకవర్గాల దురాక్రమణ

అధికరణం 370, 35 ఎ ల ఉపసంహరణ ద్వారా కశ్మీర్ స్వతంత్ర ప్రతిపత్తిని రద్దు చేసిన భారత ప్రభుత్వ చర్య నేపథ్యంలో కశ్మీర్ చరిత్రను సింహావలోకనం చేస్తున్నారు **ఎన్. వేణుగోపాల్**

బ్రిటిష్ పాలనలోని భారతదేశమైనా, బ్రిటిష్ రాణితో సార్వభౌమాధికార ఒప్పందం కుదుర్చుకుని కొనసాగుతుండిన స్వతంత్ర సంస్థానాలైనా, భారత ఉపఖండం మొత్తమే బహుజాతుల నిలయమనీ, భారతదేశం అనేది ఒక పౌరాణిక భావనగా తప్ప వాస్తవంలో ఎన్నడూ ఒకే పాలనా ప్రాంతంగా లేదనీ చరిత్ర విద్యార్థులెవరికైనా కనీసంగా తెలుస్తుంది. పాలనలో భిన్నత్వం మాత్రమే కాదు, శీతోష్ణ పరిస్థితులు, ఆర్థిక వ్యవస్థ నిర్మాణం, సమాజ నిర్మాణం, చరిత్ర, భాష, సంస్కృతి, ఆచార వ్యవహారాలు, ఆహారం, కట్టుబొట్టు అన్నిట్లోనూ భిన్నత్వమే, బహుళత్వమే భారత ఉపఖండపు చప్పన్నారు జాతుల స్వభావం. ఆందు వల్లనే వలస పాలన తొలగిపోగానే, ఆ జాతుల ప్రాతిపదిక పైననో, దానికి ఒకానొక రూపమైన భాష ప్రాతిపదిక పైననో ఆయా జాతుల స్వయం నిర్ణయాధికార హక్కును అంగీకరిస్తూ, గౌరవిస్తూ, ఆ జాతుల ఇష్ట ప్రకారం ఒక స్వతంత్ర భారతదేశాన్ని ఏర్పాటు చేస్తామని వలస వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న రాజకీయపార్టీలన్నీ భావించాయి. ప్రకటించాయి.

తర్వాత కాలక్రమంలో ఆ జాతుల స్వయం నిర్ణయాధికార హక్కుకు ఒక్కొక్క పార్టీ ఒక్కొక్క నిర్వచనం ఇస్తూ కుదిస్తూ వచ్చి, భిన్న జాతులు అనే మాటనే రద్దు చేసి ఏకశిలా సదృశ ఏకజాతి సిద్ధాంతం తయారు చేశాయి. భిన్నత్వంలో ఏకత్వం అన్నాయి. అందువల్లనే దేశం సమాఖ్యగా, రాష్ట్రాల సమ్మేళనంగా ఉంటుందని, రాష్ట్రాలకు నిర్దిష్ట హక్కులు ఉంటాయని భారత రాజ్యాంగం ఆమోదించింది. కాని క్రమక్రమంగా ఇటు దేశ దళారీ పాలకవర్గాలూ, అటు సామ్రాజ్యవాదులూ సువిశాల, ఏకీకృత మార్కెట్ తయారు చేసుకునే క్రమంలో జాతుల, రాష్ట్రాల హక్కులను హరిస్తూ వచ్చారు. భిన్నత్వాన్ని అణచివేస్తూ, కొనివేస్తూ, కలిపి వేసుకుంటూ, జీర్ణం చేసుకుంటూ ఏకత్వానికి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చారు. అవి ఈశాన్య ప్రాంత జాతులు కావచ్చు, కశ్మీర్ కావచ్చు, ద్రవిడస్తాన్ ఆలోచనలు కావచ్చు, పంజాబ్ కావచ్చు, రాజ్యాంగంలోపలే ప్రత్యేక రాష్ట్రం కావాలన్న భావనలు కావచ్చు, స్వతంత్ర ప్రతిపత్తి ఆలోచనలు కావచ్చు – తమది భిన్నమైన జాతి అని, తమకు భిన్నమైన చరిత్ర, సంస్కృతి ఉన్నాయని, తమ భవిష్యత్తు ఏమిటో తామే తేల్చుకుంటామని, తమ స్వయం నిర్ణయాధికారాన్ని ప్రకటించిన విభిన్న జాతులను, ప్రాంతాలను రక్తపుటేరులు పారించి మరీ గొంతెత్తకుండా చేసిన చరిత్ర భారత పాలకవర్గాలది. ఆనందపూర్ సాహిబ్ తీర్మానం, సర్కారియా కమిషన్, కేంద్ర – రాష్ట్ర సంబంధాలు, సమాఖ్య స్వభావం, రాష్ట్రపతి పాలన, గవర్నర్ల వ్యవస్థ, ఎస్ ఆర్ బొమ్మై కేసులో సుప్రీంకోర్టు తీర్పు వంటి ఎన్ని చర్చలు జరిగినా దేశం భిన్నత్వం, బహుళత్వం వైపు నుంచి అంతకంతకూ ఎక్కువగా ఏకత్వం వైపు ప్రయాణిస్తున్నది. అఖండ భారత్ అనీ, ఒకే దేశం, ఒకే జాతి, ఒకే జెండా, ఒకే మతం, ఒకే సంస్కృతి, ఒకే భాష (చివరికిప్పుడు ఒకే ఎన్నికలు!) అని నమ్మే సంఘ్ పరివార్ పాలనలో ఈ ఏకత్వం మరింత వికృత, క్రూర స్వభావాన్ని సంతరించుకున్నది.

కశ్మీర్ మీద భారత ప్రభుత్వం ఆగస్ట్ 5న జరిపిన దారుణమైన దౌర్జన్యానికి నేపథ్యం ఇది. అయితే ఈ దౌర్జన్యానికి వెనుక విశిష్టమైన చరిత్ర ఉంది. భారత దేశంలో చేరడానికి కశ్మీర్ ప్రజలు, ప్రజా ఉద్యమం, చివరికి ఆ సంస్థాన పాలకుడు కూడ షరతులతో కూడిన ఒప్పందం చేసుకున్నారు. భారత పాలకవర్గాలు ఆ ఒప్పందాన్ని గౌరవిస్తామని హామీ ఇచ్చాయి. ఆ హామీ కూడ కేవలం కశ్మీర్ ప్రజలకు మాత్రమే కాదు, మిగిలిన భారత దేశం ముందర, అంతర్జాతీయ సమాజం ముందర, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ముందర ఇచ్చాయి. ఇవాళ ఆ హామీలన్నిటినీ తుంగలో తొక్కి అత్యంత దుర్మార్గంగా, అమానుషంగా కశ్మీరీల స్వేచ్ఛాకాంక్షలను హత్య చేశాయి. భారత రాజ్యాంగ స్ఫూర్తిని హత్య చేశాయి. దేశంలో కొస ప్రాణంతో ఉన్న ప్రజాస్వామ్య స్ఫూర్తిని హత్య చేశాయి.

సంఘ్ పరివార్ శక్తులు, ప్రభుత్వ యంత్రాంగం, అజ్ఞానం వల్లనో, భయం వల్లనో యథాతథంగా ఆమోదిస్తూ ప్రచారం చేస్తున్న ప్రచార సాధనాలు కశ్మీర్ చరిత్ర గురించి పచ్చి అబద్ధాలనే పరమ సత్యాలుగా చలామణీ చేస్తున్న ప్రస్తుత సందర్భంలో వాస్తవ చరిత్రను పాఠకుల దృష్టికి తీసుకురావడానికి వీక్షణం ప్రయత్నిస్తున్నది. అందులో భాగంగానే 1989–90లో కశ్మీర్‌లో జరిగిన హింసాత్మక ఘటనలు, అప్పటి గవర్నర్ జగ్ మోహన్ జరిపిన దుర్మార్గాల నేపథ్యంలో 'కశ్మీర్ ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కు' అనే సుదీర్ఘ వ్యాసం రాసి సృజన ఆధునిక సాహిత్య వేదికలో ప్రచురించాను. ఆ వ్యాసం నుంచి చరిత్రకు సంబంధించి ఇవాల్టికీ ప్రాసంగికమైన భాగాలను ఇక్కడ పునర్ముద్రిస్తున్నాను. (పూర్తి పాఠం కోసం 'సృజన' జూన్–జులై 1990 సంచికను చూడండి.) ఆ వ్యాసం రాసి ఇరవై తొమ్మిది సంవత్సరాలు గడిచాయి గనుక, ఈ మధ్యకాలంలో జరిగిన చెప్పుకోదగిన సంఘటనలను, పరిణామాలను కూడ దానికి కలుపుకోవాలి.

1984 సిక్కు ప్రజల మీద జరిగిన దాడి, 1984లోనే జరిగిన జెకెఎల్ఎఫ్ నాయకుడు మఖ్బూల్‌బట్ ఉరి, 1987 కశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో భారత ప్రభుత్వం పాల్పడిన భయానకమైన రిగ్గింగ్, జగ్ మోహన్ గవర్నర్ గా జరిపిన అక్రమాలు, కశ్మీరీ పండితులలో అభద్రతా భావాన్నిరెచ్చగొట్టి, హిందూ–ముస్లిం ఘర్షణకు రంగం సిద్ధం చేయడం,

1990లో సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని కశ్మీర్‌కు వర్తింపజేయడం వంటి ఎన్నో కారణాల వల్ల 1980ల చివరా 1990ల మొదటా కశ్మీర్ పరిస్థితి భయానక స్థాయికి దిగజారిపోయింది. అందుకు పూర్తి బాధ్యత భారత పాలకవర్గాలదే కాగా, ఆ సంక్షోభాన్ని వాడుకుని పాకిస్తాన్ పాలకవర్గాలు సాయుధ ముఠాలను రెచ్చగొట్టాయి. భారత ప్రభుత్వం రోజురోజుకూ వేలాది, లక్షలాది సైనిక, అర్ధసైనిక బలగాలను దించుతూ బలప్రయోగం ద్వారా ఈ సమస్యను పరిష్కరించగలనని భావించింది. కాని ఈ అణచివేత, లెక్కలేనంతమంది అమాయక యువకులను మాయం చేయడం, చంపివేయడం, చిత్రహింసలకు గురి చేయడం పరిస్థితిని మరింత దిగజార్చాయి.

సైనిక, అర్ధ సైనిక బలగాలు కశ్మీర్ యువకుల మీద, స్త్రీల మీద ఒక ఆక్రమిత దేశంలో ప్రవర్తించినట్టుగా ప్రవర్తించాయనడానికి 1990 జనవరి 21న శ్రీనగర్‌లోని గావ్‌కాదల్‌లో ఊరేగింపు మీద సిఆర్ పిఎఫ్ జవాన్లు కాల్పులు జరిపి 51 మంది పౌరులను చంపివేయడం, 1991 ఫిబ్రవరి 23న కునన్ పోష్పొరాలో రాజ్ పుటానా రైఫిల్స్ బలగాలు 31 మంది మహిళ్లపై సామూహిక అత్యాచారం జరపడం ఉదాహరణలు. టెంగ్ పొరా హత్యాకాండ, బిజ్ బెహారా హత్యాకాండ, సామూహిక అదృశ్యాలు, భయానకమైన చిత్రహింసలు వంటి డజన్లకొద్దీ ఘటనలు జరిగినకొద్దీ సాయుధ మిలిటెంట్ బృందాల సంఖ్య, వాటిలో చేరే యువకుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఈ సాయుధ ముఠాల మీద క్రమక్రమంగా పాకిస్తాన్ అనుకూల హిజ్బుల్ ముజాహిదీన్, లష్కర్ ఎ తైబా వంటి సంస్థల పట్టు పెరిగింది. చివరికి ప్రభుత్వం కూడ లొంగిపోయిన మిలిటెంట్లతో సాయుధ ప్రతిఘాతుక ముఠాలు ఏర్పాటు చేసింది. అలా 1990లలో పెరిగిన హింసాకాండ ఎవరు, ఎందుకు చేస్తున్నారో తెలియని స్థితి ఏర్పడి కశ్మీరీ జాతి విముక్తి ఆకాంక్షలు కనబడకుండా అణగిపోయాయి. 1990 నుంచి 1996 వరకు మొదట గవర్నర్ పాలన, ఆ తర్వాత రాష్ట్రపతి పాలన రాష్ట్రాన్ని సైనిక నిర్బంధ శిబిరంగా మార్చివేశాయి. నిజంగా కశ్మీరీ జాతి విముక్తి కోసం పోరాడుతున్న జెకె ఎల్ ఎఫ్ ను 1996లో నిషేధించడం ఒక పక్కనా, ఎందుకోసం, ఎవరికోసం పోరాడుతున్నారో స్పష్టత లేని, పాకిస్తాన్ ప్రేరేపిత, స్వయం ప్రేరిత సాయుధముఠాలు చెలరేగడం మరొక పక్కనా కశ్మీర్ స్థితిని అల్లకల్లోలం చేశాయి. ఈలోగా రాజకీయ ప్రక్రియను పునరుద్ధరించడం కొరకు 26 రాజకీయ, సామాజిక సంస్థలతో కలిపి ఆల్ పార్టీ హురియత్ కాన్ఫరెన్స్ ఏర్పడినప్పటికీ భారత పాలకవర్గాలు దాన్ని చిన్నచూపు చూశాయి. ఆ తర్వాత 1998లో భారత సైనికుల దుస్తుల్లో వచ్చిన ఆగంతుకులు వంధామాలో 23 మంది కశ్మీరీ పండితులను ఊచకోత కోయడం, 2000లో చట్టిసింగ్ పొరా హత్యాకాండ, పత్రిబాల్ బూటకపు ఎన్ కౌంటర్, 2001 పార్లమెంటుపై దాడి, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ ద్వారా కశ్మీర్‌లో ప్రవేశించడానికి భారతీయ జనతా పార్టీ ప్రయత్నాలు, పాకిస్తాన్ తో చర్చలు, అమర్ నాథ్ స్థల వివాదం, కేంద్ర ప్రభుత్వ సంప్రదింపుల బృందం ఏర్పాటు, షోపియన్ అత్యాచారం, మాయం చేయబడిన యువకుల తల్లుల సంఘం, అఫ్జల్ గురు ఉరితీత, పిడిపి-బిజెపి మిశ్రమ మంత్రివర్గం, బుర్ హాన్ వాని హత్య వంటి ఎన్నెన్నో మైలురాళ్లు కశ్మీర్ ప్రజల ఆకాంక్షల సాఫల్యానికి మార్గాన్ని దూరమూ సంక్లిష్టమూ చేశాయి.

ఇప్పుడిక ఆగస్ట్ 5 గొడ్డలివేటు కశ్మీర్ ను చిత్రపటం మీదనే లేకుండా చేసింది. పటాలు మార్చవచ్చు, గద్దెల మీద మనుషులను మార్చవచ్చు, పేర్లు మార్చవచ్చు, ప్రతిపత్తి మార్చవచ్చు కాని మనుషుల కలలనూ ఆశలనూ ఆకాంక్షలనూ మార్చగల, పరిమార్చగల శక్తి బహుశా భూమి మీద ఇంకా పుట్టలేదు. కశ్మీరీలు డెబ్బై సంవత్సరాలుగా ఆ వాస్తవం రుజువు చేస్తున్నారు. బహుశా ఆ రుజువు చేసే పద్ధతి ఇప్పుడు మారుతుంది, కాని కనుమరుగు కాదు.

❖ ❖ ❖

......

కశ్మీర్‌లోయ అనేక శతాబ్దాలపాటు స్వతంత్ర రాజ్యంగా ఉంటూ వచ్చింది. భారత ఉపఖండంలో ప్రవేశించిన సైన్యాలన్నీ ఆ వాయవ్య మూల నుంచే వచ్చినందువల్ల ఒక రాజకీయ పాలనా ప్రాంతంగా కశ్మీర్‌లోయ సరిహద్దులు మారుతూ వచ్చాయి. అయినా పద్నాలుగో శతాబ్దం వరకూ 'భారతదేశం' ఏర్పడనూ లేదు, కశ్మీర్ అందులో 'అంతర్భాగం' కానూ లేదు. అప్పటి వరకూ ఈ ప్రాంతాన్ని బౌద్ధ, హిందూ మతాలకు చెందిన రాజవంశాలు పరిపాలించాయి. ఆ తర్వాత ఆ లోయలోనే ముస్లిం పాలకులు ఒక స్వతంత్ర రాజ్యాన్ని నెలకొల్పారు. 1587లో అక్బర్ సైన్యాలు కశ్మీర్ మీద దండయాత్ర చేసి కశ్మీర్‌ను మొగల్ సామ్రాజ్యంలో అంతర్భాగం చేశాయి. మొగల్ చక్రవర్తులు కశ్మీర్‌ను తమ వేసవి విడిదిగా మార్చుకుని రెండు శతాబ్దాలు పాలించారు. 1752లో అఫ్ఘనిస్తాన్‌కు చెందిన అహ్మద్ షా అబ్దాలీ కశ్మీర్ మీద దండెత్తి మొగల్ సైన్యాలను ఓడించాడు. తర్వాత 67 సంవత్సరాలపాటు పఠాన్ రాజుల కింద ఆటూ ఇటూగా స్వాతంత్ర్యం అనుభవిస్తుండిన సామంత రాజులు కశ్మీర్‌ను పాలించారు. 1819లో సిక్ పాలకుడు మహారాజా రంజిత్ సింగ్ కశ్మీర్‌ను లోబరచుకున్నాడు. 1846 వరకు కశ్మీర్ సిక్కు పాలకుల కిందనే ఉండింది. రంజిత్ సింగ్ జమ్ము ప్రాంతాన్ని కూడ తన అధీనంలోకి తెచ్చుకున్నాడు. 1846లో సిక్కు పాలకులకు, బ్రిటిష్ పాలకులకు మధ్య జరిగిన ఒప్పందాలలో బ్రిటిష్ పాలకులు కోటి రూపాయల కప్పం చెల్లించమని కోరారు. అంత కప్పం చెల్లించ లేనంటూ సిక్కు మహారాజు మిగిలిన ప్రాంతాలతోపాటు జమ్ము, కశ్మీర్‌లను కూడ బ్రిటిష్ వాళ్లకు అప్పగించాడు. కాని అప్పటి గవర్నర్ జనరల్ లార్డ్ హార్డింగ్ ఈ విశాల భూభాగాన్ని ప్రత్యక్షంగా తన అధీనంలో ఉంచుకోవడం అనవసరమైన ఖర్చుగా భావించాడు. అదే సమయంలో జమ్ము పాలకుల సంతతికి చెందిన గులాబ్ సింగ్ తనను జమ్ము, కశ్మీర్ లకు స్వతంత్ర పాలకుణ్ణి చేస్తే బ్రిటిష్ వాళ్లు కోరిన కప్పం చెల్లిస్తానన్నాడు. తర్వాత కొంత భూభాగాన్ని మినహాయించి ఈ కప్పాన్ని 75 లక్షల రూపాయలకు తగ్గించారు. ఈ షరతులతో 1846 మార్చ్ 15న బ్రిటిష్ ప్రభుత్వానికి, గులాబ్ సింగ్‌కు మధ్య అమృతసర్‌లో ఒక ఒప్పందం కుదిరింది. గులాబ్ సింగ్ బ్రిటిష్ ప్రభుత్వ ఆధిపత్యాన్ని గుర్తిస్తూనే స్వతంత్ర సంస్థానంగా కొనసాగుతానన్నాడు. ఆధిపత్యాన్ని గుర్తిస్తున్నందుకు నిదర్శనంగా సంవత్సరానికి ఒక గుర్రాన్ని, పన్నెండు మేలుజాతీ మేకలను, మూడు జతల కశ్మీర్ శాలువలను బ్రిటిష్ ప్రభుత్వానికి కానుకగా ఇస్తానన్నాడు. తర్వాత కాలంలో ఈ కానుక ఒక జత కశ్మీర్ శాలువాలు, మూడు రుమాళ్లుగా తగ్గిపోయింది.

ఇవాళ జమ్ము కశ్మీర్ గా పిలబడుతున్న రాజకీయ పాలనా ప్రాంతం ఏర్పడడానికి నాంది ఈ అమృతసర్ ఒప్పందమే. అయితే ఈ పాలనా ప్రాంతం భౌగోళికంగా నాలుగో ముక్కలుగా ఉంటుంది. దక్షిణాన జమ్ము,

మధ్యభాగాన కశ్మీర్‌లోయ, ఉత్తరాన గిల్గిత్, కశ్మీర్‌లోయకూ టిబెట్‌కూ మధ్యన లడఖ్. ఈ నాలుగు ప్రాంతాలలోను కశ్మీర్‌లోయ మీద గులాబ్ సింగ్ వెంటనే అధికారం సంపాదించలేక పోయాడు. బ్రిటిష్ సైన్యాల సహాయంతోగాని కశ్మీర్‌లోయ గులాబ్ సింగ్ చేతికి రాలేదు. 1925 సెప్టెంబర్ 23 నుంచి 1947 అక్టోబర్ 26 వరకు జమ్ము-కశ్మీర్ పాలకుడిగా ఉండిన లెఫ్టినెంట్ జనరల్ మహారాజా సర్ హరిసింగ్ ఈ గులాబ్ సింగ్ వారసుడే.

కశ్మీర్‌లోయలో ముస్లింల జనాభా ఎక్కువ కాగా, జమ్ము ప్రాంతంలో హిందువుల జనాభా ఎక్కువ. మొత్తం మీద సంస్థానంలో ప్రజానీకం అత్యధికులు ముస్లింలు కాగా, పాలకుడు హిందువు. హరిసింగ్ రాచరిక నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో చెలరేగిన అసంతృప్తికి అటు బ్రిటిష్ ప్రభుత్వం, ఇటు మతోన్మాదశకులు మతం రంగు పులమడానికి మంచి అవకాశం దొరికింది. 1920ల నాటి మోప్లా తిరుగుబాటు ఎట్లా మతకల్లోలాలుగా వక్రీకరించబడి చరిత్రకెక్కాయో, కశ్మీర్ ప్రజాందోళన కూడ ఆ వక్రీకరణకే గురయ్యే అవకాశం తొలి నుంచీ ఉండింది. అయితే నిరంకుశ రాచరికానికి వ్యతిరేకంగా షేక్ అబ్దుల్లా నాయకత్వాన ప్రారంభమైన ప్రజాందోళన సంస్థాన వ్యాప్తంగా విస్తరించడం మాత్రమే గాక ఈ వక్రీకరణ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంది.

కశ్మీర్ ప్రజాందోళనకు నిర్మాణ రూపం ఇచ్చిన సంస్థ మొదట అఖిల జమ్ము కశ్మీర్ ముస్లిం కాన్ఫరెన్స్ గానే ప్రారంభమైంది. ముస్లిం కాన్ఫరెన్స్ కార్యక్రమం విప్లవాత్మకంగా, ఆచరణశీలంగా ఉండేది. నిరంకుశ పాలకుడి స్థానంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని స్థాపించడమే తమ లక్ష్యమని కాన్ఫరెన్స్ నాయకులు ప్రకటించారు. కాన్ఫరెన్స్ ప్రధాన కార్యాచరణ రైతాంగం మధ్య, శ్రామికుల మధ్య, నిరుపేదల మధ్య సాగింది. హిందూ మతశక్తులు ఈ ఉద్యమాన్ని హిందూ వ్యతిరేకమైనదిగా చిత్రించడం ప్రారంభించారు. కాన్ఫరెన్స్ పేరులోనే ముస్లిం అని ఉండడం ఈ స్వార్థపర శక్తులకు ఉపయోగపడింది. ఈ దుష్ప్రచారాన్ని మొగ్గలోనే తుంచి వేసేందుకు షేక్ అబ్దుల్లా ప్రయత్నాలు ప్రారంభించాడు. మత విశ్వాసాలేవయినప్పటికీ, ప్రగతిశీల భావాలుగల కాశ్మీరీలందరినీ కాన్ఫరెన్స్ పతాకం కింద సమీకరించాలని ఆయన ప్రయత్నించాడు. మైనారటీ వర్గాలకు అన్ని రక్షణలూ కల్పిస్తామని, కాన్ఫరెన్స్‌లో చేరమని ఆయన విజ్ఞప్తి చేశాడు. నాలుగుసార్లు కాన్ఫరెన్స్ అధ్యక్షుడుగా ఎన్నికయి, బహుళామోదం పొందిన నాయకుడుగా ఆయన హామీని సిక్కులు, హిందువులు అంగీకరించారు. హిందువులు, సిక్కులు సాంకేతికంగా ముస్లిం కాన్ఫరెన్స్ సభ్యులయే అవకాశం లేనప్పటికీ 1933 నుంచే ఈ ఐక్యత కొనసాగుతూ వచ్చింది.

"మన ముందు ఉన్న ప్రధాన సమస్య సంయుక్త కార్యాచరణను రూపొందించడం. బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పరిచే మార్గంలో మనకు ఎదురవుతున్న అవరోధాలకు వ్యతిరేకంగా ఐక్య సంఘటనను నిర్మించడం. అందుకోసం మనం మన సంస్థను మతరహిత రాజకీయ సంస్థగా పునర్నిర్మించాలి. దాని ప్రణాళికలోను, నిబంధనావళిలోను తగిన సవరణలు చేయాలి. మన రాజకీయ సమస్యలను చర్చించే సమయంలో ముస్లింలు, ముస్లిమేతరులు అనే పద్ధతిలో ఆలోచించడంమాని మత తత్వాన్ని రద్దు చేయాలి" అని - 1938 మార్చ్ 25న షేక్ అబ్దుల్లా అన్నాడు. అన్నట్టుగానే 1939లో అఖిల జమ్ము-కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ అనే కొత్త సంస్థ కుల, మత వివక్ష లేని రాజకీయ కార్యాచరణ సంస్థగా, బాధ్యతాయుత ప్రభుత్వ ఏర్పాటు లక్ష్యంతో ఆవిర్భవించింది.

1944 సెప్టెంబర్ 29, 30 తేదీల్లో నేషనల్ కాన్ఫరెన్స్ తన కార్యక్రమాన్ని ప్రకటించింది. 'నయా కశ్మీర్' పేరుతో ప్రసిద్ధమైన ఈ ప్రణాళిక కశ్మీర్ సమస్యల పట నేషనల్ కాన్ఫరెన్స్ వైఖరికి మార్గదర్శక సూత్రంగా పని చేసింది. కశ్మీర్‌ను ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో పునర్నిర్మించే ఈ ప్రణాళికా పత్రాన్ని మొదట ప్రభుత్వానికే సమర్పించారు. 'కశ్మీర్ సమస్య భారతదేశపు సమస్యలతోనూ, మొత్తంగా ప్రపంచ సమస్యలతోనూ ముడివడి ఉన్నది... ఒక నూతన ప్రాపంచిక వ్యవస్థ నిర్మాణం కోసం ఆలోచనలు చెలరేగుతున్నప్పుడు నేషనల్ కాన్ఫరెన్స్ కూడ తాను నిర్మించదలచిన నూతన కశ్మీర్ అవగాహనను స్పష్టంగా ప్రకటించదలచు కున్నది' అంటూ ఈ ప్రణాళికా రచన ప్రారంభమైంది.

ఈ ప్రణాళికలో రెండు భాగాలున్నాయి. మొదటి భాగంలో కశ్మీర్ రాజ్యపు రాజ్యాంగం గురించి, రెండో భాగంలో జాతీయ ఆర్థిక ప్రణాళిక గురించి అవగాహనలున్నాయి. ఈ ప్రణాళిక ప్రకారం కశ్మీర్ రాజ్యాంగం మత, తెగ, జాతి వివక్ష లేని సర్వ సమానత్వాన్ని హామీ ఇస్తుంది. అన్ని రకాల పౌరహక్కులకు హామీ ఇస్తుంది. పని చేసే హక్కు, పని లేకపోతే జీవన భృతి పొందే హక్కు కూడ ఈ రాజ్యాంగంలో ఉన్నాయి. అంతే కాదు, ప్రజల పక్షాన నిలిచినందుకు విచారణల పాలయ్యే విదేశీ పౌరులకు ఆశ్రయం కల్పిస్తానని కూడ ఈ రాజ్యాంగం హామీ ఇచ్చింది. ఆర్థిక ప్రణాళిక సమ సమాజాన్ని రూపొందిస్తానని, ప్రతిమనిషికీ వ్యక్తీకరణ పొందేందుకు, సంతృప్తిపొందేందుకు, కనీస నాగరిక జీవన ప్రమాణాన్ని పొందేందుకు సమాన హక్కులు కల్పిస్తాననీ వాగ్దానం చేసింది. జాతీయ స్వయం సమృద్ధి, జీవన ప్రమాణాల అభివృద్ధి, మారకం కోసం కాక వినియోగం కోసం ఉత్పత్తి తన లక్ష్యాలుగా ఈ ప్రణాళిక ప్రకటించింది. వ్యవసాయ రంగంలో భూస్వామ్యాన్ని రద్దు చేస్తానని, దున్నే వాడికే భూమి ఇస్తానని, సహకార క్షేత్రాలను ప్రోత్సహిస్తానని, అడవుల మీద ప్రజల ఆధిపత్యాన్ని అంగీకరిస్తానని ప్రకటించింది. పరిశ్రమలలో కీలక పరిశ్రమలన్నిటినీ ప్రభుత్వాధీనంలో ఉంచుతానని, బడా ప్రైవేటు పెట్టుబడిని రద్దు చేస్తామని, గుత్త సంస్థల పెరుగుదలను నిరోధిస్తామని ప్రకటించింది. రైతుల, కార్మికుల, స్త్రీల హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక వాగ్దానాలు చేసింది.

ఈ కార్యక్రమంతో నేషనల్ కాన్ఫరెన్స్ క్రియాశీల ఉద్యమాలు - 1945లో విస్తృతంగా సాగాయి. ఈ సంవత్సరమే హరిసింగ్ తన ప్రధాన మంత్రిగా పరమ నిరంకుశుడైన రామచంద్ర కక్‌ను నియమించుకున్నాడు. బ్రిటిష్ ఇండియాలో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమం ప్రేరణతో నేషనల్ కాన్ఫరెన్స్ 1946 లో 'క్విట్ కశ్మీర్' అనే నినాదాన్ని ఇచ్చింది. మిగిలిన స్వదేశీ సంస్థానాలలో సాగుతున్న ప్రజా ఉద్యమాలేవీ, ఇంత తీవ్రమైన నినాదాన్ని ఇవ్వలేదు. మహారాజు కశ్మీర్‌ను వదిలి అధికారాన్ని ప్రజా ప్రతినిధులకు బదలాయించాలనేది నేషనల్ కాన్ఫరెన్స్ నినాదం లక్ష్యం. మిగిలిన చోట ఆయా సంస్థానాధీశులను లాంఛనప్రాయంగానైనా పాలకులుగా అంగీకరిస్తూనే బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పడాలనే ఆకాంక్ష వ్యక్తం కాగా, షేక్ అబ్దుల్లా నాయకత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ నిజమైన రాచరిక వ్యతిరేకతను వ్యక్తం చేసింది. పాలకులు నేషనల్ కాన్ఫరెన్స్ పైన, నాయకుల పైన భయంకరమైన నిర్బంధాన్ని అమలు చేశారు. 1946 మే 20న షేక్ అబ్దుల్లాను, వందలాది కార్యకర్తలను అరెస్టు చేశారు. ఎందరినో చంపేశారు. సంస్థానాన్ని పూర్తిగా సైనిక పాలనలోకి తీసుకుపోయారు.

ఈ ఆందోళనతో, నిర్బంధాలతో కశ్మీర్ వాతావరణం వేడెక్కుతున్న సందర్భంలోనే భారతదేశానికి స్వాతంత్ర్యం ఇస్తానని బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించింది. భారతదేశం, పాకిస్తాన్ అనే రెండు స్వతంత్ర రాజ్యాలు ఏర్పడనున్నాయని, స్వదేశీ సంస్థానాలు తమ ఇష్ట ప్రకారం ఏ దేశంతోనైనా కలవవచ్చునని ప్రకటన వెలువడింది. భారత ఉపఖండాన్ని రెండు దేశాలుగా ఎట్లా విభజించాలనే విషయమై జవహర్‌లాల్ నెహ్రూకు, మహమ్మద్ ఆలీ జిన్నాకు మధ్య తలెత్తిన వివాదాన్ని పరిష్కరించే బాధ్యత బ్రిటిష్ ప్రభుత్వం తీసుకుంది.

భారత ఉపఖండాన్ని విభజించడానికి సర్ సిరిల్ రాడ్‌క్లిఫ్‌ను తీసుకువచ్చారు. 'ఒక సరిహద్దు కమిషన్‌ను ఏర్పరచి, ఆ కమిషన్‌కు అధ్యక్షుడుగా ఒక నిపుణుడైన ఇంగ్లీషు బారిస్టర్‌ను నియమిస్తామని ప్రభుత్వం అంతకు ముందే ప్రకటించి ఉంది. ఏ పక్షం పట్ల అనవసరమైన పక్షపాతం చూపకుండా ఉండేందుకు గాను భారత ఉపఖండం – గురించి తెలియని వ్యక్తిని కమిషన్ అధ్యక్షుడుగా నియమిస్తామ న్నారు. ఆ రకంగా సర్ సిరిల్ రాడ్‌క్లిఫ్ ఢిల్లీ చేరాడు. ఈ దేశం గురించి, ఈ ప్రజల గురించి, ఈ ప్రజల జీవన్మరణ సమస్యల గురించి ఏ మాత్రం అవగాహనలేని రాడ్ క్లిఫ్‌ను తీసుకువచ్చి, ఆ అవగాహన లేక పోవడమే అర్హతగా చెప్పి, రాడ్ క్లిఫ్ ముందర ఒక భారత ఉపఖండం పటం పెట్టి దాన్ని రెండు ముక్కలు చేయమని ప్రభుత్వం ఆదేశించింది.

'ముస్లింలయినా, ముస్లిమేతరులయినా అత్యధికంగా నివసించే భాగాలు కలిసి ఉండేలా' చూడమని లార్డ్ మౌంట్‌బాటన్ రాడ్ క్లిఫ్‌కు సలహా ఇచ్చాడు. అయితే ఈ 'మెజారిటీ జనాభా' ప్రమాణానికి రాడ్‌క్లిఫ్ ఒక మినహాయింపు ఇచ్చాడు. పంజాబ్‌కు ఉత్తర కొసన గురుదాస్‌పూర్ అనే చిన్న పట్టణం, దాని చుట్టూ ఉన్న ముస్లిం గ్రామాలు, రాడ్‌క్లిఫ్ అవార్డు ప్రకారం భారతదేశంలోకి వచ్చాయి. ఆక్కడ ఆయన తన 'మత ప్రమాణాన్ని' వదిలేసి, రావినదిని సహజ సరిహద్దుగా గుర్తించాడు. భారత దేశం నుంచి జమ్ము–కశ్మీర్‌లోకి వెళ్లగల ఏకైక భూమార్గం ఆ గురుదాస్ పూర్ పట్టణమే. ఆ పట్టణం రాడ్‌క్లిఫ్ అవార్డు ప్రకారం పాకిస్తాన్ లోకి వెళ్లి ఉంటే భారతదేశానికి, జమ్ముకశ్మీర్‌కు మధ్య భౌగోళిక మార్గమే ఉండేది కాదు.

ఈ విధంగా జమ్ము కశ్మీర్ ప్రజా ఆకాంక్షలు పాలకుల ఎతుగడల మధ్య నలిగిపోయాయి. ఒక వైపు సంస్థానాధీశుడు సర్ హరిసింగ్ కశ్మీర్‌ను స్వతంత్ర రాజ్యంగా కొనసాగిస్తానని, రెండు దేశాలలో దేనితోనూ కలవనని ప్రకటించాడు. పాకిస్థాన్, భారతదేశం రెండూ కశ్మీర్ తమలో కలిసిపోవాలని కోరుకున్నాయి. ఈ రగులుతున్న వివాదానికి ఆజ్యంపోస్తూ పబ్బం గడుపుకోవడమే తమ లక్ష్యంగా బ్రిటిష్ పాలకులు తమాషా చూశారు. జమ్ము కశ్మీర్ ప్రజలు మాత్రం తమ మీది నుంచి నిరంకుశ రాచరికం తొలగిపోవాలని కోరుకున్నారు. హరిసింగ్‌ను 'క్విట్ కశ్మీర్' అన్నారు.

కశ్మీర్ ప్రజలు, వారికి నాయకత్వం వహిస్తున్న నేషనల్ కాన్ఫరెన్స్ ఒకవైపు, రాజా హరిసింగ్ ఒకవైపు, నెహ్రూ, మౌంట్ బాటన్, జిన్నా లు మరోవైపు లాగుతూ ఉన్న ఈ చిక్కుముడి 1947 ఆక్టోబరు నాటికి విచిత్రంగా తెగిపోయే పరిస్థితి వచ్చింది. 1947 ఆగస్టు 15న జమ్ము కశ్మీర్ సంస్థానం అటు పాకిస్తాన్‌తోను, ఇటు భారతదేశంతోను చేరకుండానే ఉండిపోయింది. ఆ సమయానికి జమ్ము కశ్మీర్ సంస్థానానికి రోడ్డు సంబంధాలు పాకిస్తాన్‌తోనే ఉన్నాయి. సంస్థానంలో ప్రధాన ఆదాయ వనరు అయిన కలపను పాకిస్తాన్‌లోకి ప్రవహించే నదులతోనే రవాణా చేసే స్థితి ఉంది. అందువల్ల రవాణా సౌకర్యాల దృష్ట్యా, ఆర్థిక వ్యవస్థ దృష్ట్యా సంస్థానానికి పాకిస్తాన్‌ను వదిలే అవకాశం లేదు. భారతదేశంలో కలిసినా, పాకిస్తాన్‌తో కలిసినా అంగీకరించని ప్రజలు హెచ్చు సంఖ్యలోనే ఉన్నారు. ఒకవైపు – రాడ్‌క్లిఫ్ అవార్డు భారత దేశంతో రోడ్డు సంబంధాన్ని నెలకొల్పగా, మరోవైపు కొత్త ప్రధానమంత్రి జనక్ సింగ్ రెండు దేశాలతోనూ యథాతథ ఒడంబడిక ప్రతిపాదించాడు. పాకిస్తాన్ యథాతథ ఒడంబడికపై వెంటనే సంతకం చేసింది. ఒడంబడిక ను పరిశీలించాల్సి ఉందనే కారణంతో భారత ప్రభుత్వం తాత్సారం చేసింది.

యథాతథ ఒడంబడిక మీద సంతకం చేసిన పాకిస్తాన్ ప్రభుత్వం, చేయ్యని భారత ప్రభుత్వం రెండు కూడా కశ్మీర్ ప్రభుత్వం మెడలు వంచడం ఎట్లా అని ఎత్తులకు పై ఎత్తులు వెయ్యడం ప్రారంభించాయి. పాకిస్తాన్ ప్రభుత్వం కశ్మీర్‌లోకి ఆహారం, పెట్రోలు, ఇతర నిత్యావసర వస్తువులు వెళ్లకుండా నిరోధించింది. రెండు దేశాల మధ్య ప్రయాణికుల రాకపోకలపై నిబంధనలు విధించింది. ఈ స్థితితో కశ్మీర్ ప్రభుత్వం భారత ప్రభుత్వాన్ని సాయం చేయమని కోరింది. ఐదువేల – గాలన్ల పెట్రోలు కావాలని కోరితే, భారత ప్రభుత్వం ఐదువందల గాలన్ల పెటోలు మాత్రం అందజేసింది. అతివేగంగా మారిపోతున్న ఈ పరిస్థితుల్లో హరిసింగ్ మరోసారి ప్రధాన మంత్రిని మార్చాడు. కొత్త ప్రధాని మెహర్‌చంద్ మహాజన్ 1947 అక్టోబర్ 15 బ్రిటిష్ ప్రధానికి ఒక ఫిర్యాదు చేస్తూ పాకిస్తాన్ ప్రభుత్వం, యథాతథ ఒడంబడికను ఉల్లంఘిస్తున్నదన్నాడు.

అక్టోబర్ 22 నాటికి కశ్మీర్, పాకిస్తాన్‌ల సరిహద్దులోని గిరిజన తెగలు కశ్మీర్‌లోకి చొరబడడం ప్రారంభించాయి. అక్టోబర్ 24 నాటికి వాళ్లు మహురా పవర్ హౌజెను స్వాధీనం చేసుకుని శ్రీనగర్‌కు విద్యుచ్ఛక్తి సరఫరా ఆపివేశారు. అక్టోబర్ 26 నాటికి శ్రీనగర్ చేరుతామని ప్రకటించారు.

అక్టోబర్ 24 నాడే హరిసింగ్ భారత ప్రభుత్వం సహాయం కోరాడు. పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించేందుకు రక్షణ కమిటీ తరఫున వెళ్లిన వి.పి. మీనన్ అక్టోబర్ 26న ఢిల్లీ చేరి 'కశ్మీర్‌ను చొరబాటుదారుల నుంచి రక్షించాలని సూచించాడు. అయితే అప్పటికి స్వతంత్ర దేశంగా ఉన్న కశ్మీర్‌లోకి భారత ప్రభుత్వ సైనాలు ప్రవేశించడం సరైనది కాదనే వాదనను మౌంట్‌బాటన్ ముందుకు తెచ్చాడు. కశ్మీర్ సంస్థానం గనుక భారతదేశంలో విలీనం కావడానికి అంగీకరిస్తే, అప్పుడు కాశ్మీరు భారతదేశంలో అంతర్భాగమవుతుందని, భారత సైన్యాలు కశ్మీర్‌లోకి నిరభ్యంతరంగా వెళ్లవచ్చునని మౌంట్‌బాటన్ అన్నాడు. సంస్థానం లోంచి చొరబాటుదారులను తరిమివేసి, శాంతి భద్రతలు నెలకొనగానే ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని, ఆ షరతు మీదనే విలీనం జరగాలని కూడా అన్నాడు. నెహ్రూ, ఇతర మంత్రులతో సహా అందరూ ఈ పతిపాదనకు అంగీకరించారు. అట్లా ఒక నాటకీయ సన్నివేశంలో జమ్ము–కశ్మీర్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయ్యక తప్పదని భారత ప్రభుత్వం హరిసింగ్ పై ఒత్తిడి తెచ్చింది. వి.పి. మీనన్ రాసిన ప్రకారమే చొరబాటుదారులు కశ్మీర్‌ల మీద అత్యాచారాలు జరుపుతూండగా శ్రీనగర్ నుంచి పారిపోయి వచ్చి జమ్మూ రాజభవనంలో నిద్రపోతున్న హరి సింగ్‌ను నిద్రలేపి విలీన ఒప్పందం మీద సంతకం చేయించారు. ఆ

ఒప్పందాన్ని ఢిల్లీకి తీసుకువచ్చిన తర్వాత కూడా రక్షణ కమిటీ ముందర సుదీర్ఘమైన చర్చ జరిగింది. 'శాంతి భద్రతల స్థితి అనుకూలించగానే సంస్థానంలో ప్లెబిసైట్ (ప్రజాభిప్రాయ సేకరణ), నిర్వహించడం జరుగుతుంది' అనే షరతుతో ఆ ఒప్పందాన్ని అంగీకరించారు.

1947 నవంబర్ 2న నెహ్రూ రేడియో ఉపన్యాసంలో కూడా ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతామని హామీ ఇచ్చాడు. శాంతి భద్రతలు నెలకొనగానే ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ సంస్థల నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతామనే హామీని కేవలం కశ్మీర్ ప్రజలకు మాత్రమే కాక సకల ప్రపంచానికి ఇస్తున్నామని నెహ్రూ' అన్నాడు. ఇందుకు ప్రతిగా నవంబర్ 4న పాకిస్తాన్ రేడియోలో లియాఖత్ అలీఖాన్ మాట్లాడుతూ అసలు 1846లో జరిగి, అవమానకరమైన అమృతసర్ ఒప్పందం ఫలితంగా నీతి బాహ్యమైన, చట్ట వ్యతిరేకమైన పాలన కశ్మీర్‌లో సాగుతున్నదన్నాడు. నవంబర్ 21న నెహ్రూ తన వాగ్దానాన్ని మరొకసారి పార్లమెంటులో కూడ ప్రకటించాడు. చొరబాటుదార్ల నెపం మీద భారత, పాకిస్తాన్ సైన్యాల మధ్య సాయుధ ఘర్షణలు సాగాయి. రెండు దేశాల మధ్య కశ్మీర్ విషయమై తలెత్తిన వివాదం ఐక్యరాజ్య సమితి భద్రతా సమితికి చేరింది. ఐక్యరాజ్య సమితి తరఫున ఒక శాంతి సంఘం ఏర్పడి కాల్పుల విరమణ రేఖ 1949 జూలై 26న నిర్ణయమైంది. వాస్తవాధీన రేఖగా కూడా ప్రసిద్ధమైన ఈ సరిహద్దుకు ఒక వైపు పాకిస్తాన్ ఆక్రమణ లోని కశ్మీర్, మరో వైపు భారత ఆక్రమణలోని కశ్మీర్ ఉండి పోయాయి. రెండు పక్షాలను ఆదేశించగల మధ్యవర్తిని నియమిస్తారని కాంతి సంఘం చేసిన ప్రతిపాదనను భారత ప్రభుత్వం వ్యతిరేకించినది. 1948 నుంచి 1957 వరకు ఐదుసార్లు భద్రతా సమితి కశ్మీర్‌లో ప్లెబిసైట్ నిర్వహించాలని తీర్మానాలు చేసింది. భారత ప్రభుత్వం ఆ తీర్మానాలను ఖాతరు చేయలేదు. ప్లెబిసైట్ నిర్వహించే సమయంలో ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణే ఉండాలని ఐక్యరాజ్య సమితి, పాకిస్తాన్లు పొదించగా, తన పర్యవేక్షణే ఉండాలని భారత ప్రభుత్వం వాదించింది. మొత్తం మీద 1947 అక్టోబర్ 26న విలీన ఒప్పందం మీద సంతకాలు చేసినప్పటి నుంచి తాము చేసిన వాగ్దానాలన్నిటినీ, ముఖ్యంగా ప్రజాభిప్రాయ సేకరణ వాగ్దానాన్ని భారత ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంగలో తొక్కుతూ వచ్చారు. ప్రతిపక్షాలు కూడ పాలకపక్షానికి వంతపాడడం ప్రారంభించాయి.

ప్లెబిసైట్ గురించి రాజకీయ స్థాయిలో ఈ వాగ్దానాలూ, వాగ్దాన భంగాలూ జరుగుతుండగానే రాజ్యాంగ స్థాయిలో మరొక విచిత్రం జరుగుతూ వచ్చింది. 1947 ఆగస్ 29న ప్రారంభించి 1949 నవంబర్ 26 వరకు భారత రాజ్యాంగ రచన జరిగింది. భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చింది. ఈ రాజ్యాంగంలోని మొట్టమొదటి అధికరణం భారత పాలకవర్గాల విస్తరణ స్వభావానికి అద్దం పడుతుంది: 'యూనియన్ పేరు, భూ భాగం' అనే శీర్షిక ఉన్న ఈ అధికరణంలో '1) ఇండియా, అంటే భారతదేశం, రాష్ట్రాల యూనియన్‌గా ఉంటుంది. 2) రాష్ట్రాలు, భూభాగాలు మొదటి షెడ్యూల్‌లో చూపిన ప్రకారం ఉంటాయి. అ) భారత దేశపు భూ భాగంలో ఆ రాష్ట్రాల భూభాగాలు, ఆ) మొదటి షెడ్యూల్‌లో చూపిన కేంద్రపాలిత ప్రాంతాల భూభాగాలు, ఇ) ఆక్రమించుకోబోయే (సంపాదించుకోబోయే) ఇతర భూభాగాలు కలిసి ఉంటాయి' అని రాశారు.

రాజ్యాంగ రచనా కమిటీ అధ్యక్షుడుగా డా. అంబేద్కర్ ఈ అధికరణానికి వివరణ ఇచ్చాడు. భారత రాజ్యాంగం నిర్మాణరీత్యా సమాఖ్యగా ఉన్నప్పటికీ, తాము కొన్ని సౌకర్యాల కోసం యూనియన్ అనే మాట వాడవలసి వచ్చిందన్నాడు. ఆ సౌకర్యాలు రెండు విషయాలను సూచిస్తాయని అవి, భారత సమాఖ్య తనలోని అన్ని భాగాల ఉమ్మడి ఒప్పందం మీద ఏర్పడినది కాదని, అంతర్భాగమైన యూనిట్లకు విడిపోయే స్వేచ్ఛ లేదని ఆయన వివరించాడు. ఈ రెండు విషయాలలో మొదటిది బలవంతపు ఐక్యత కాగా, రెండోది ఆ ఐక్యతను భంగం చేసే హక్కు లేదని శాసించడం. అయితే కశ్మీర్ విషయంలో ఈ వివరణ కూడా అన్వయించదు. కశ్మీర్ పాలకుడికీ, కేంద్ర ప్రభుత్వానికీ మధ్య కుదిరిన ఉమ్మడి ఒప్పందం ప్రకారమే కశ్మీర్ ఇండియన్ యూనియన్‌లో భాగమైంది. ఆ ఒప్పందానికి ప్రజల మద్దతు ఉన్నదా లేదా పరీక్షిస్తామని భారత ప్రభుత్వమే అనేకసార్లు ప్రకటించింది.

ఈ అధికరణంలోనే చివరి వాక్యం ఇంకా భయంకరమైన ప్రతిపాదన చేస్తున్నది. 'ఆక్రమించబోయే ఇతర ప్రాంతాలు కూడ' భారతదేశంలో భాగమవుతాయంటే, భారత ప్రభుత్వం 1950 జనవరి 26 తర్వాత ఆక్రమించే ఏ ప్రాంతమైనా కూడ 'చట్టబద్ధంగా' భారతదేశంలో అంతర్భాగమే అవుతుంది. 1975 ఏప్రిల్ 26న సిక్కింను భారత ప్రభుత్వం ఇట్లా 'చట్టబద్ధంగానే' కబళించింది. కనుక 1947 లో కశ్మీర్‌ను విలీనం చేసుకుని, ఆ విలీనాన్ని చట్టబద్ధం చేయదలచుకోవడంలో కూడ ఆశ్చర్యం లేదు.

కాని కశ్మీర్‌లో అప్పటి దాకా ఉధృతంగా కొనసాగుతూ వచ్చిన ప్రజాపోరాటాన్ని, కశ్మీరీలలో వ్యక్తమైన స్వాతంత్ర్యా కాంక్షను చూసిన తర్వాత భారత పాలక వర్గాలు సూటిగా కశ్మీర్‌ను కబళించ లేకపోయాయి. తత్ఫలితంగా వచ్చిందే రాజ్యాంగంలోని 370 అధికరణం. రాజ్యాంగం లోని ఒకటో అధికరణాన్ని మినహాయించి మిగతా అధికరణలు జమ్ము కశ్మీర్‌కు వర్తిస్తాయా లేదా అనే విషయాన్ని రాష్ట్రపతి రాష్ట్రప్రభుత్వాన్ని సంప్రదించిన తర్వాతనే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఈ అధికరణం చెపుతుంది. కేంద్ర జాబితాలో అయినా, రాష్ట్ర జాబితాలో అయినా రాష్ట్రం మీద పార్లమెంటరీ శాసనాధికారం చెల్లే అంశాలు విలీన ఒప్పందానికి లోబడి మాత్రమే ఉంటాయి. అంటే విలీన ఒప్పందం ప్రకారం రక్షణ, విదేశీ వ్యవహారాలు, సమాచార సంబంధాలలో మాత్రమే కేంద్ర ప్రభుత్వ అధికారం జమ్ము కశ్మీర్‌లో చెల్లుతుంది. అయితే ఈ అధికరణం తాత్కాలికమైనదే. జమ్ము కశ్మీర్‌లో ప్రత్యేకంగా రూపొందే శాసన నిర్మాణసభ చేసే సిఫారసుల ఆధారంగా రాష్ట్రపతి అంతిమ నిర్ణయం తీసుకోవాలి. అప్పటి వరకు మాత్రమే 370 అధికరణం అమలులో ఉంటుంది.

రాజ్యాంగ రచనలో కల్పించక తప్పని ఈ 370 అధికరణం ద్వారా కశ్మీరీలు ఎక్కడ లాభపడి పోతారోనని, ఈ అధికరణానికి తూట్లు పొడవ దానికి భారత పాలకవర్గాలు మొదటి నుంచీ ప్రయత్నిస్తూ వచ్చాయి. మాటల్లో మాత్రం కశ్మీరీ ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కుపట్ల గౌరవాన్ని వ్యక్తం చేస్తూనే వచ్చారు. తమ భవిష్యత్ 'రాజ్యాంగాన్ని, భారతదేశంతో తమకు ఉండే సంబంధాన్ని అంతిమంగా నిర్ణయించు కోవలసినది కశ్మీర్ ప్రజలేనని భారత ప్రభుత్వం పదే పదే చెప్పింది. రాష్ట్ర ప్రజలు ఎన్నుకునే శాసన నిర్మాణసభకు ఈ అధికారం ఉంటుందని ప్రకటించింది. ఈ ఉద్దేశ్యంతోనే, రాష్ట్రంలో ఒక సర్వసత్తాక శాసన నిర్మాణసభ ఎన్నుకోబడి 1951 అక్టోబర్ 21న తొలి సమావేశం

జరిపింది. అప్పటికే అక్కడ షేక్ అబ్దుల్లా ప్రధానిగా ప్రభుత్వం కొనసాగుతున్నది. విలీనం జరిగిన వెంటనే రాజా హరిసింగ్ పదవి నుంచి తప్పుకుని తాత్కాలిక అత్యవసర ప్రభుత్వాన్ని నిర్మించవలసిందిగా షేక్ అబ్దుల్లాను ఆహ్వానించాడు. షేక్ అబ్దుల్లా ప్రధానిగా కశ్మీర్ ప్రభుత్వం కొనసాగుతుండగానే పైన వివరించిన రాజ్యాంగ వ్యవహారాలు సాగాయి. ఐక్యరాజ్యసమితి నుంచి వాస్తవాధీన రేఖ దాకా రాజకీయాలు సాగాయి. ఈ స్థితిలో నేషనల్ కాన్ఫరెన్స్, షేక్ అబ్దుల్లా స్వాతంత్ర్య కాంక్షకూ, సామరస్యంతో పదవీకాంక్షకూ మధ్య, ప్రజాపునాదికీ, కేంద్ర ప్రభుత్వం వత్తాసుకూ మధ్య ఊగిసలాడడం ప్రారంభమైంది.

1981 అక్టోబర్ 31న సమావేశమైన శాసన నిర్మాణ సభ ముసాయిదా రాజ్యాంగాన్ని చర్చించడం ప్రారంభించింది. ఈ ముసాయిదాలో కశ్మీర్ విలీనాన్ని ఆమోదించడం, రక్షణ, విదేశీ వ్యవహారాలు, సమాచార సంబంధాలు మీసహా మిగిలిన అంశాలలో స్వయం నిర్ణయాధికారం అనే రెండు విషయాలున్నాయి. ఒకవైపు శాసన నిర్మాణ సభ కశ్మీర్ రాజ్యాంగం గురించి చర్చిస్తుండగానే భారత పాలక వర్గాలు ఈ ప్రయత్నాల్ని వమ్ము చేసే ప్రయత్నాలు ప్రారంభించాయి. 1952 జూలైలో ఢిల్లీలో నెహ్రూకూ అబ్దుల్లాకూ చర్చలు జరిగాయి. అప్పటికీ షేక్ అబ్దుల్లా ఇంకా కశ్మీర్ స్వాతంత్ర్యాకాంక్షకు కట్టుబడి ఉన్నాడు. నెహ్రూతో జరిగిన చర్చల. ఫలితంగా వెలువడిన ఢిల్లీ ఒప్పందంలో విలీన – ఒప్పందంలో ప్రస్తావించిన అంశాలు మినహా మిగిలిన అన్ని అంశాలలోను రాష్ట్రానికే సార్వభౌమాధికారం ఉంటుంది' అనే అంగీకారం కుదిరింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి జమ్ము కశ్మీర్‌కు వచ్చేవారిని పూర్తిస్థాయి పౌరులుగా గుర్తిస్తామని, భారతదేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి కశ్మీర్‌లో స్థిరాస్తులు సంపాదించే వీలు లేదని ఈ ఒప్పందం నిర్దేశించింది.

ఈ సమయంలోనే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కశ్మీర్‌కు వ్యతిరేకంగా జాతీయ దురహంకారాన్ని రెచ్చగొట్టడానికి, కశ్మీర్ సమస్యను మత సమస్యగా చూపడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. అనేక సార్లు చర్చలు, వాగ్దానాలు జరిగిన తర్వాతనే అంగీకరించిన కశ్మీర్ ప్రత్యేక హక్కులను రద్దు చేయించడానికి ఆర్ఎస్ఎస్ ఉద్యమం చేపట్టింది. ఒకే దేశంలో ఇద్దరు ప్రధానులు, రెండు రాజ్యాంగాలు, రెండు పతాకాలు చెల్లవని, కశ్మీర్‌ను భారతదేశంలో పూర్తిగా భాగం చేయాలని అర్ఎస్ఎస్ ఉద్యమం చేపట్టింది. ఈ ఉద్యమంలో భాగంగా ఆర్ఎస్ఎస్ శ్యాంప్రసాద్ ముఖర్జీ కశ్మీర్ వెళ్లి అక్కడ అరెస్టయి సహజ కారణాల వల్లనే జైలులో చనిపోయాడు. దీంతో మతోన్మాద శక్తుల ఆందోళన ఇంకా విజృంభించింది. ఈ ఒత్తిడిని గమనిస్తూ వచ్చిన షేక్ అబ్దుల్లా స్వాతంత్ర్యం గురించి మరింతగా పట్టుబట్టారు. 1953 మేలో జరిగిన నేషనల్ కాన్ఫరెన్స్ కార్యవర్గ సమావేశం మళ్లీ ఒకసారి స్వతంత్ర కశ్మీర్ ఆవిర్భావం గురించి ఆలోచించింది.

ఈ స్థితిలో నెహ్రూ ప్రభుత్వం షేక్ అబ్దుల్లాపై విరుచుకుపడి 1953 ఆగస్టు 9న ఆయనను ఆరెస్టు చేసింది. బక్షీ గులామ్ మహమ్మద్ ప్రధాన మంత్రిగా కొత్త ప్రభుత్వం ఏర్పాటయింది. కశ్మీర్ శాసన నిర్మాణసభలోని చాలమంది సభ్యులు జైలు పాలయ్యారు. ఇట్లా ఎందరో సభ్యులు జైల్లో ఉండగా, ప్రజామోదం గల ప్రధాని పదవి నుంచి తొలగించబడి జైలుపాలు కాగా, 1954 ఫిబ్రవరిలో కశ్మీర్ శాసన నిర్మాణసభ సమావేశమైంది. నెహ్రూ ప్రభుత్వ కనుసన్నల్లో మెలిగే బక్షీ గులామ్ మహమ్మద్ సాయకత్వాన విలీన ఒప్పందాన్ని ఏకగ్రీవంగా అంగీకరించడం జరిగింది. కశ్మీర్ శాసన నిర్మాణ సభ చేసిన ఈ తీర్మానం ఆధారంగా 1954 మే 14 నుంచి అమలులోకి వచ్చేలా భారత రాజ్యాంగాన్ని జమ్ము కశ్మీర్‌లను అన్వయింపజేసే ఉత్తర్వును రాష్ట్రపతి జారీ చేశాడు. ఈ ఉత్తర్వు ప్రకారం కేంద్ర ప్రభుత్వ అధికారం కేవలం మూడు అంశాలకు మాత్రమే గాక కేంద్ర జాబితాలోని అన్ని అంశాలకూ వర్తిస్తుంది. ఈ ఉత్తర్వుకు కూడ 1963, 1964, 1965, 1966, 1972, 1974, 1986లలో సవరణలు చేసి కేంద్ర ప్రభుత్వం తన అధికారాలను విస్తృతమూ, పటిష్టమూ చేసుకుంది. ఈలోగా 1957 నవంబర్ 17న కశ్మీర్ శాసన నిర్మాణసభ తన స్వంత రాజ్యాంగాన్ని ఆమోదించుకుంది. స్వంతరాజ్యాంగం ఆమోదించడంతో శాసన నిర్మాణ సభ పని తీరినట్టే గనుక అది రద్దయిపోయింది. భారత రాజ్యాంగంలోని 370 అధికరణం ప్రకారం రాష్ట్రపతి కశ్మీర్ శాసననిర్మాణసభ సిఫారసు పైన మాత్రమే నిర్ణయాలు తీసుకోవలసి ఉంది. గనుక 1957 తర్వాత, రాజ్యాంగంలోని 370 అధికరణం ఒక చిక్కుముడి ఆయిపోయింది.

1956 మార్చ్ 29న లోక్‌సభలో ఒక ఉపన్యాసంలోను, ఏప్రిల్ 2న ఢిల్లీలో ఒక పత్రికా సమావేశంలోనూ నెహ్రూ స్పష్టంగా, తాను ప్లెబిసైట్‌కు వ్యతిరేకమని చెప్పాడు. 1947 నుంచి చేస్తూ వచ్చిన వాగ్దానాలన్నిటినీ ఉల్లంఘిస్తూ, కశ్మీర్‌లో అధికారంలో ఉన్న బక్షీ గులామ్ మహమ్మద్ ప్రభుత్వం తన మాట వింటుందనే నమ్మకంతో నెహ్రూ ప్లెబిసైట్‌ను వ్యతిరేకించాడు, అనుకున్నట్టుగానే కశ్మీర్ శాసననిర్మాణ సభ ఆమోదించిన రాజ్యాంగంలో మూడో అధికరణం 'జమ్ము – కశ్మీర్ రాష్ట్రం భారత యూనియన్‌లో అంత ర్భాగంగా ఉన్నది, ఉంటుంది' అని ప్రకటించారు.

భారత రాజ్యాంగంలో కశ్మీర్‌కు కల్పించిన ఏకైక రక్షణ అయిన 370 అధికరణాన్ని పాలక వర్గాలు ఈ విధంగా నిర్వీర్యం చేశాయి. మరోవైపు రాష్ట్రంగా రాజ్యాంగ రచనను ఫార్సుగా మార్చివేశాయి. ఇక అప్పటిదాకా సాగుతూ వచ్చిన ప్రజాందోళనను, ఆ ఆందోళనకు నాయకత్వం వహించిన నేషనల్ కాన్ఫరెన్స్‌ను నిర్వీర్యం చేయడానికి ఢిల్లీ పాలకులు ఒక వైపు, అణచివేత చర్యలను, మరోవైపు నాయకత్వాన్ని కొనివేయడాన్ని సాగించారు. షేక్ అబ్దుల్లాను మొదట ప్రివెంటివ్ డిటెన్షన్ కింద అరెస్టు చేసి 12 సంవత్సరాలపాటు జైలు పాలు చేశారు. 1964లో కొద్దికాలం పాటు విడుదల చేసి మళ్లీ 1965లో భారత రక్షణ నిబంధనల కింద అరెస్టు చేశారు. 1971 లో రాష్ట్ర బహిష్కరణ విధించారు. చివరికి 1975 ఫిబ్రవరి 24న షేక్ అబ్దులాకూ ఇందిరాగాంధీకీ మధ్య కుదిరిన ఒప్పందం ప్లెబిసెట్ డిమాండ్‌ను ఉపసంహరించుకుంటానని షేక్ అబ్దుల్లా ప్రకటించాడు. అయితే ఈ ఒప్పందం అమలులోకి రాలేదు. 1971 ఎన్నికలలో అధికారానికి వచ్చిన షేక్ అబ్దుల్లా రాష్ట్రంలో అమలవుతున్న అన్ని కేంద్ర చట్టాలను పునః పరిశీలిస్తామని, రాష్ట్ర స్వయం ప్రతిపత్తిని కాపాడతామని అన్నాడు. అసలు ఎన్నికల ప్రణాళికలో 'నయా కశ్మీర్' స్వప్నం గురించి మళ్లీ మాట్లాడాడు.

ఈలోగా 1953 తర్వాత రాష్ట్రంలోని ప్రజాందోళనను అణచివేసి క్రమంలో ఢిల్లి ప్రభుత్వం అసలు రాజకీయ క్రమాన్నే రద్దు చేసింది, వికృతం చేసింది. 1953 తర్వాత, 1977 మినహా, కశ్మీర్‌లో ఒక్క ఎన్నిక కూడ న్యాయంగా, సక్రమంగా జరగలేదు. ఒక్క– ప్రభుత్వం

కూడ ప్రజామోదంతో పూర్తికాలం పాలన జరపలేదు. షేక్ అబ్దుల్లా అరెస్టయిన తర్వాత అధికారానికి వచ్చిన బక్షీ గులామ్. మహమ్మద్ కూడ 1963లో బర్తరఫ్ అయి, అరెస్ట్యాడు. తర్వాత షంసుద్దీన్ బర్తరఫ్ అయ్యాడు. తర్వాత సయ్యద్ మీర్ ఖాసిమ్ గద్దె ఎక్కాడు. ఈ ముఖ్యమంత్రుల మార్పులన్నీ కశ్మీర్ మీద కేంద్ర ప్రభుత్వం మరిన్ని మరిన్ని అధికారాలు సంపాదించుకోవడానికి సాగించిన కుటలో దాగమే.

1982 వరకు అధికారంలో ఉన్న షేక్ అబ్దుల్లా తర్వాత ఆయన కొడుకు ఫరూఖ్ అబ్దుల్లా అధికారానికి వచ్చాడు. 1984 ఫరుక్ అబ్దుల్లాను కూడా బర్తరఫ్ చేసి గులాం మహమ్మద్ షా చేతికి అధికారం ఇచ్చారు. షా కూడ అధికారం పోగొట్టుకున్న తర్వాత హఠాత్తుగా రాజీవ్ గాంధీకీ, ఫరూఖ్ అబ్దుల్లాకూ మధ్య మంతనాలు సాగి కాంగ్రెస్ (ఐ) కీ, నేషనల్ కాన్ఫరెన్స్‌కూ పొత్తుకుదిరింది. జాతి ఆకాంక్షలకు బూర్జువా ప్రజాస్వామిక శక్తులు నాయకత్వం వహించలేవు సరిగదా, ద్రోహం చేస్తాయనే మార్క్సిస్టు అవగాహనను ఈ కాంగ్రెస్ నేషనల్ కాన్ఫరెన్స్ మిశ్రమ ప్రభుత్వం రుజువు చేసింది. నేషనల్ కాన్ఫరెన్స్ ప్రజావిద్రోహ మార్గాన్ని చేపట్టి, రాష్ట్రంలో రాజకీయ క్రమమే విచ్ఛిన్నమై పోతున్న స్థితిని ప్రజలు సరిగానే అంచనా వేశారు. అందువల్లనే ఈ నాలుగు దశాబ్దాలలోను కశ్మీర్‌లో ప్రజలు ఎన్నికలను పెద్దఎత్తున బహిష్కరిస్తూ వస్తున్నారు.

కశ్మీరీల న్యాయమైన ఆకాంక్షలకు ఒకప్పుడు ప్రతినిధిగా నిలిచిన నేషనల్ కాన్ఫరెన్స్ సామరస్య రాజకీయాలకు బలియై పోయినా, ఎప్పటి కప్పుడు కశ్మీరీల సమరశీల శక్తి ఏదో ఒక నిర్మాణ రూపం ధరిస్తూనే వస్తోంది. మొదటిసారి షేక్ అబ్దుల్లాను అరెస్టు చేసిన తర్వాత ఆయన సలహా మీదనే ప్లెబిసెట్ ఫ్రంట్ నిర్మాణమయింది. 1975లో షేక్ ఆబుల్లాకూ ఇందిరాగాంధీకి మధ్య కుదిరిన ఒప్పందంలో షేక్ అబ్దుల్లా ప్లెబిసైట్ డిమాండ్ ను వదులుకుంటానని అనడంతో ప్లెబిసైట్ ఫ్రంట్ రద్దయిపోయింది.

1965లో మఖ్బూల్‌బట్, అమానుల్లా ఖాన్‌ల నాయకత్వంలో జమ్ముకశ్మీర్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ ఏర్పడింది. ఒక సిఐడి ఇన్‌స్పెకర్‌ను హత్య చేసిన నేరం పై మఖ్బూల్‌బట్‌కు 1968లో మరణశిక్ష విధించారు. శిక్ష విధించబడిన తర్వాత మఖ్బూల్‌బట్ శ్రీనగర్ సెంట్రల్ జైలు నుంచి తప్పించుకు పోయాడు. 1975లో ఆయన కశ్మీర్ తిరిగి వచ్చి ఒక బ్యాంకుపై దాడిచేసి అరెస్టయ్యాడు. అప్పటినుంచి అయనపై ఉరిశిక్షను అమలు చేయకుండా ఎనిమిది సంవత్సరాలపాటు జైలులో ఉంచిన ప్రభుత్వం, ఇంగ్లండ్‌లో ఒక దౌత్యాధికారిని కెఎన్ఎల్ఎఫ్ కార్యకర్తలు చంపిన వారంరోజుల లోపే 1984 ఫిబ్రవరి 11న ఉరితీసింది.

కాశ్మీరీ జాతీయ ఆకాంక్షలకు నిర్మాణ రూపం ఇవ్వడంలో మఖ్బూల్ బట్, అమానుల్లా ఖాన్‌ల కృషి గణనీయమైనది. ప్లెబిసైట్ ఫ్రంట్, కశ్మీరీ వర్కర్స్ అసోసియేషన్, జమ్ము-కశ్మీర్ లిబరేషన్ లీగ్, ముస్లిం కాన్ఫరెన్స్, పాకిస్తాన్ కశ్మీరీ ఆర్గనైజేషన్, ఆజాద్ కశ్మీర్ ఫ్రంట్ మొదలైన సంస్థలలోని క్రియాశీల కార్యకర్తలను వీళ్లు ఆకర్షించారు. ఇటువంటి శక్తులతో 1976-77ల్లో జమ్ము కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ ఏర్పడింది. 1982 సెప్టెంబర్ 12న అమానుల్లా ఖాన్ నాయకత్వంలో భారతదేశానికి వ్యతిరేకంగా విస్తృత కార్యకలాపాల్ని కోరుతూ - జెకెఎల్ఎఫ్ లో 'చీలిక వచ్చింది. ఇప్పుడు ఈ జెకెఎల్ఎఫ్ విస్తృత ప్రజాపునాదిని కలిగి ఉంది. ఇది కాక అనేక సంస్థలు ఉన్నప్పటికీ హిజ్ బుల్ ముజాహిదీన్, పీపుల్స్, ఆ జమాయత్-ఎ-ఇస్లామ్ వంటి సంస్థల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. లక్ష్యాల ప్రకారంగా చూసినా, నిర్మాణ, పోరాట పద్ధతుల ప్రకారంగా చూసినా ఈ సంస్థల మధ్య తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయి. పాకిస్తాన్ ప్రోద్బలంతో పని చేస్తున్న సంస్థలు, కశ్మీర్‌ను పాకిస్తాన్‌తో విలీనం చేయాలనే కోరికతో పనిచేస్తున్న సంస్థలు లేకపోలేదు. ముస్లిం మతవాదంతో, హింసవాదంతో పనిచేస్తున్న సంస్థలు లేకపోలేదు. కాని అత్యధిక సంఖ్యాక కశ్మీరీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న జెకెఎల్ఎఫ్ కశ్మీర్ విమోచన లక్ష్యంగా పెట్టుకుంది. రెండు దేశాల ఆక్రమణలోను ఉన్న కశ్మీర్‌ను విముక్తం చేసి స్వతంత్ర కశ్మీర్ ఏర్పరచాలనేది జేకేఎల్ఎఫ్ లక్ష్యం. జేకేఎల్ఎఫ్ మత వ్యవహారాలలో కూడ సెక్యులర్ వైఖరి తీసుకుంటున్నది. 'కాశ్మీరియత్'గా ప్రసిద్ధమైన కాశ్మీరీ సాంస్కృతిక జాతీయ ఐక్యతను ఇది పునాదిగా భావిస్తున్నది.

దశాబ్దాలుగా పేరుకుపోతూ వచ్చిన అసంతృప్తి, రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థలో తగిన అభివృద్ధి లేకపోవడం, జరిగిన అభివృద్ధి ఫలాలు కూడ కశ్మీరీలకు అందక పోవడం, మొదలైన కారణాలు - జాతీయాకాంక్షలతో కలగలసి కశ్మీరీ జాతీయ విముక్తి పోరాటం బలపడింది. సంచలనాత్మక సంఘటనలను మాత్రమే గుర్తించే ప్రచార సాధనాలకు 1983 నవంబర్ ఎన్నికల దాకా కాశ్మీరీల ఆందోళన పట్టనేలేదు. ఆ ఎన్నికలలో అనేక చోట్ల ఒక శాతం నుంచి పది శాతం వరకు మాత్రమే వోట్లు పడ్డాయనే వార్త పత్రికలకెక్కింది. ఆ తర్వాత కేంద్ర హోం మంత్రి కూతురు రుబియా సయీద్‌ను జెకెఎల్ఎఫ్ కార్యకర్తలు కిడ్నాప్ చెయ్యడంతో కశ్మీర్ ఆందోళన పత్రికల్లో రోజువారీ వార్త అయింది. జెకెఎల్ఎఫ్ ఆందోళన వెనుక ఉన్న దశాబ్దాల చారిత్రక విషాదాన్ని పట్టించుకోకుండా, ప్రకటించకుండా ఉన్న ప్రచార సాధనాలన్నీ హఠాత్తుగా ప్రభుత్వ సమాచార పత్రాలన్నే వార్తలుగా ప్రకటించడం మొదలు పెట్టాయి. కశ్మీరీ ఆందోళనకారులను ఉగ్రవాదులుగా, పాకిస్తాన్ ఏజెంట్లుగా ముద్రవేసి ప్రచారం చేయడం మొదలు పెట్టాయి.

1990 జనవరి 19న జగ్‌మోహన్‌ను కశ్మీర్ గవర్నర్‌గా నియమించ దంతో ఈ దుష్ప్రచారం తారస్థాయికి చేరింది. తనకు ఆర్ఎస్ఎస్ భావజాలంతో ఏకీభావం ఉందని బహిరంగంగా చెప్పుకునే జగ్‌మోహన్‌ను ఇటు వంటి సున్నితమైన ప్రాంతానికి పంపడం ద్వారా కేంద్ర ప్రభుత్వం కశ్మీర్ జాతీయాభిమానాన్ని తీవ్రంగా అవమానపరిచింది. జగ్ మోహన్ కశ్మీర్‌కు వెళ్లిన వెంటనే ఆందోళనను మత కల్లోలంగా చిత్రించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. కశ్మీరీ పండితులకు, ముస్లింలకు మధ్య ఘర్షణలు జరుగుతున్నాయనే అబద్ధ ప్రచారం సాగించాడు. కశ్మీర్‌లోయలో హిందువులకు రక్షణ కల్పించలేమని, వాళ్లు జమ్ముకు గాని, ఇతర రాష్ట్రాలకు గాని వెళ్లే ఏర్పాట్లు చేస్తామని ప్రచారం చేసి, మత విద్వేషాన్ని రెచ్చగొట్టాడు. జమ్ము వెళ్లిన హిందూ ఉద్యోగులకు పని చెయ్యకపోయినా జీతాలు ఇస్తూ, శ్రీనగర్‌లోని ముస్లింలపట్ల వివక్ష ప్రదర్శించాడు. కశ్మీర్‌లోయను రోజుల తర బడి కర్ఫ్యూపాలు చేసి, పౌర జీవనాన్ని సంధింపజేశాడు. జగ్‌మోహన్ చర్యలవల్ల కాశ్మీరీల జాతీయకాంక్షలు భారత దేశంలో నెరవేరవని, జాతీయ విముక్తి పోరాటం తీవ్రంగా సాగించవలసిందేనని రుజువైంది.

......

(రచయిత వీక్షణం సంపాదకులు) వీ

కశ్మీర్ - నిజనిర్ధారణ బృందం నివేదిక

ఆర్టికల్ 370 రద్దు తరువాత, ఆంక్షలలో ఉన్న కశ్మీర్‌కు భారత్ నుంచి వెళ్లిన మొట్టమొదటి నిజనిర్ధారణ బృందం ఆగస్ట్ 13న ఢిల్లీలో విడుదల చేసిన వాస్తవ పరిస్థితి నివేదిక

బోనుల్లో కశ్మీర్

మేము ఆగస్టు 9 నుండి 12 వరకు 5 రోజులపాటు కశ్మీర్‌లో విస్తృతంగా పర్యటించాం. భారత ప్రభుత్వం 370, 35ఎ అధికరణలను ఉపసంహరించి, జమ్మూ కశ్మీర్ రాష్ట్రాన్ని రద్దుచేసి, దానిని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన నాలుగు రోజుల తర్వాత ఆగస్టు 9న మా పర్యటన మొదలైంది.

ఆగస్టు 9న శ్రీనగర్ చేరగానే కర్ఫ్యూలో, భారత సైన్యం-పారా మిలటరీతో నింపబడిన, నిర్జన, నిశ్శబ్ద నగరాన్ని చూశాం. ఆగస్టు 5 నుండి పూర్తి కర్ఫ్యూ కొనసాగుతున్నది. శ్రీనగర్ వీధులు శూన్యంగా ఉన్నాయి. అన్ని వ్యాపార సంస్థలు, కార్యాలయాలు మూసివేయ బడ్డాయి. (దుకాణాలు, పాఠశాలలు, గ్రంథాలయాలు, పెట్రోలు పంపులు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు). కొన్ని ఎటిఎంలు, మందుల షాపులు, పోలీస్ స్టేషన్లన్నీ మాత్రం తెరిచి ఉన్నాయి. గుంపులుగా కాకుండా ఒకరు, ఇద్దరు మనుషులు అక్కడా, ఇక్కడా వెళ్తూ కనిపించారు.

శ్రీనగర్ లోపలా, బయటా ప్రాంతాలు-శ్రీనగర్ మధ్యలో భారత మీడియా పనిచేస్తున్న ప్రాంతాన్ని దాటి చాలా దూరం విస్తృతంగా పర్యటించాం. ఆ చిన్న ప్రాంతంలో సాధారణ కార్యకలాపాల వంటివి నెలకొన్నాయి. కశ్మీరులో జన జీవనం సాధారణ స్థితికి తిరిగి చేరిందని భారత మీడియా చెప్పడానికి కారణమదే. అంతకన్న సత్యదూరమైనదేమీ లేదు.

శ్రీనగర్ సిటీ, అలాగే కశ్మీర్‌లోని గ్రామాలు, చిన్న పట్టణాలలో పర్యటించి వందలాది సామాన్య ప్రజానీకంతో మాట్లాడుతూ 5 రోజుల పాటు గడిపాం. మహిళలు, పాఠశాల-కళాశాలల విద్యార్థులు, దుకాణాదారులు, జర్నలిస్టులు, చిన్న వ్యాపారస్థులు, కూలీలు, కార్మికులు, ఉత్తరప్రదేశ్, బెంగాల్ తదితర రాష్ట్రాల నుండి వచ్చిన వలసవారితో సంభాషించాం. లోయలో నివసిస్తున్న కశ్మీరీ పండిట్లు, సిక్కులు అలాగే కశ్మీరీ ముస్లింలతో మాట్లాడాం.

ప్రతిచోటా పరిస్థితి పట్ల ఆగ్రహం వ్యక్తమైంది. మా ఉద్దేశం పట్ల సందేహాలున్న ప్రజల చేత కూడా హృదయపూర్వకంగా మేం ఆహ్వానింపబడ్డాం. బాధ, ఆగ్రహం, భారత ప్రభుత్వం ద్రోహం చేసిందన్న భావం ఉన్న ప్రజలు కూడా మాకు సాదరమైన ఆతిథ్యాన్నిచ్చారు. మేం దీంతో మిక్కిలిగా చలించిపోయాం.

కశ్మీరు విషయంలో 370 ఆర్టికల్‌ను రద్దుచేస్తూ భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మేం కలిసిన వారిలో బిజెపి అధికార ప్రతినిధి తప్ప, ఒక్కరు కూడా బలపరచలేదు. అంతేకాకుండా ఎక్కువ మంది ప్రజలు ఆర్టికల్స్ 370, 35ఎలను రద్దు చేయడం పట్ల, రద్దుచేసిన విధానం పట్ల తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. మేము చూసిన వాటిలో ప్రతిచోట ప్రజల ఆగ్రహం, భయం అధిక భావోద్వేగాలుగా ఉన్నాయి. ప్రజలు తమ ఆగ్రహాన్ని అనధికారిక సంభాషణలలో స్వేచ్ఛగా వ్యక్తం చేసారు. అయితే ఏ ఒక్కరూ కెమెరా ముందు మాట్లాడటానికి సిద్ధంగా లేరు. ఎవరైనా ఆ విధంగా మాట్లాడితే ప్రభుత్వం నుండి హింసా ప్రమాదానికి గురవుతున్నారు.

త్వరలోనో, ఆలస్యంగానో భారీ నిరసనలు బద్దలవుతాయని భావిస్తున్నామని చాలామంది చెప్పారు. (నిషేధాలు సడలించిన తరువాత, ఈద్ తరువాత, ఆగస్టు 15 తరువాత, లేదా ఆ తరువాత కూడా). నిరసనలు శాంతియుతంగా ఉన్నప్పటికీ, హింసాత్మక అణిచివేత ఉంటుందనుకుంటున్నారు.

మా పరిశీలనల సారాంశం

- ఆర్టికల్స్ 370, 35ఎ లను రద్దు చేసిన భారత ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా, రద్దు చేయడానికి అనుసరించిన మార్గాలకి వ్యతిరేకంగా కశ్మీర్‌లో తీవ్ర, వాస్తవిక ఏకగ్రీవ ఆగ్రహం ఉన్నది.
- ఈ ఆగ్రహాన్ని నియంత్రించడానికి ప్రభుత్వం కర్ఫ్యూ లాంటి నిబంధనలను విధించింది. కొన్ని ఎటిఎంలు, మందుల షాపులు, పోలీస్ స్టేషన్లు తప్ప ఎక్కువ భాగం కార్యాలయాలు, వ్యాపార సంస్థలు ఇప్పటికీ మూసివేయబడి ఉన్నాయి.
- ప్రజా జీవనాన్ని నిరోధించడం, కర్ఫ్యూను సంపూర్ణంగా విధించడం కూడా కశ్మీరులోని ఆర్థిక జీవనాన్ని కుంటుపరిచింది. సమృద్ధికి, వేడుకకు ఉద్దేశించిన బక్రీద్ పండుగ సమయం కూడా ఇది.
- ప్రభుత్వం, సైన్యం, పోలీసుల వేధింపుల భయానక పరిస్థితుల మధ్య ప్రజలు జీవిస్తున్నారు. అనధికారిక సంభాషణల్లో ప్రజలు తమ ఆగ్రహాన్ని సేచ్ఛగా వ్యక్తం చేస్తున్నారు; అయితే కెమెరా ముందు మాట్లాడటానికి ఏ ఒక్కరూ సిద్ధంగా లేరు.
- కశ్మీర్లో తిరిగి సాధారణ పరిస్థితి వేగంగా నెలకొంటుందని భారత మీడియా చెప్తూ మోటుగా తప్పుదారి పట్టిస్తున్నది. శ్రీనగర్ మధ్యలోని చిన్న ప్రాంతం నుండి నివేదికల మీద వారు ఆధారపడుతున్నారు.
- వాస్తవంగా శాంతియుతంగానైనప్పటికీ కశ్మీర్‌లో ఏ విధమైన నిరసనలకు చోటులేదు. ఏమైనప్పటికీ సామూహిక నిరసనలు బహుశా త్వరలో లేదా ఆ తరువాత బద్దలవుతాయి.

జమ్మూకశ్మీర్ పట్ల భారత ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై ప్రతి స్పందనలు

మా విమానం కిందకు దిగగానే, ప్రయాణికులు తమ ఫోన్లను స్విచ్

ఆన్ చేసుకోవచ్చునని ఎయిల్‌లైన్స్ సిబ్బంది ప్రకటించగా, మొత్తం విమానంలోని ప్రయాణికులందరూ (ఎక్కువ మంది కశ్మీరీలే) గేలిచేస్తూ పగలబడి నవ్వారు. 'ఏమి జోకు' అని ప్రజలు అంటుండగా విన్నాం. ఆగస్టు 5 నుండి మొబైల్స్, లాండ్‌లైను ఫోన్లు, ఇంటర్నెట్లన్నీ నిరోధించబడ్డాయి.

◆ శ్రీనగర్‌లో అడుగుపెట్టిన వెంటనే, కొద్దిమంది చిన్నపిల్లలు ఆడుకుంటూ ఉండే పార్కు దాటి వచ్చాం. వారు 'ఇబ్లీస్ మోడీ' అనడాన్ని విన్నాం. 'ఇబ్లీస్' అంటే అర్థం 'సాతాను' (దుష్టుడు).

◆ జమ్మూ కశ్మీర్ పై ప్రభుత్వ నిర్ణయాల గురించి పదేపదే ప్రజల నుండి విన్న మాటలు. 'జులుం' (అణిచివేత), 'జ్యాద్తి' (అతి/క్రూరత్వం), 'దోఖా' (ద్రోహం). సఫాకడాల్ (శ్రీనగర్)లో ఒకతను 'కశ్మీరీలని ప్రభుత్వం బానిసలుగా చూసింది. మేము బందీలుగా ఉన్న సమయంలో మా జీవితాలు, భవిష్యత్తు గురించి నిర్ణయాలు తీసుకుంటున్నది. నిర్బంధంలో ఉంచి, నోటిలో బట్ట కుక్కి మా తలకి తుపాకీ గురి పెట్టి బలవంతంగా మా గొంతులను నొక్కేసినట్లుగా ఉంది' అన్నాడు.

◆ మేము పర్యటించిన శ్రీనగర్ సిటీలోని ప్రతివీధిలో, ప్రతి పట్టణంలో, ప్రతి గ్రామంలో కశ్మీర్ వివాద చరిత్ర గురించి సామాన్య ప్రజలు, బడి పిల్లల దగ్గర నుండి కూడా మేము విస్తృతమైన విజ్ఞానం పొందాము. ఈ చరిత్ర తప్పులను భారత మీడియా మరుగుపరచడం పట్ల వారు ఆగ్రహం, ఆందోళనలో ఉన్నారు. 'కశ్మీర్ నాయకుల, భారత నాయకుల మధ్య ఆర్టికల్ 370 ఒక ఒప్పందం. ఆ ఒప్పందంపై సంతకం చేయబడలేదు. భారత్‌తో కశ్మీర్ ఎప్పుడూ అంగీకారం తెలపలేదు. ఆర్టికల్ 370 పోతే, కశ్మీర్ మీద హక్కులను కోరడానికి భారత్‌కు ఎప్పుడూ ఎటువంటి ఆధారం ఉండదు' అని చాలామంది అన్నారు. లాల్ చౌక్‌లో ఒకతను ఆర్టికల్ 370ని 'మంగళసూత్రం' అని, కశ్మీర్, ఇండియా మధ్య ఒప్పందానికి (పెళ్లి ఒప్పందం) చిహ్నామని అభివర్ణించాడు (ఆర్టికల్స్ 370, 35 రద్దుపై మరికొన్ని ప్రజా ప్రతి స్పందనలు కింద ఇవ్వబడ్డాయి).

◆ భారత మీడియాకు వ్యతిరేకంగా విస్తృతమైన ఆగ్రహం ఉన్నది. ప్రజల్ని వారి గృహాలలోనే ఖైదు చేసారు; వారు ఒకరితో ఒకరు మాట్లాడుకోలేకపోతున్నారు; సోషల్ మీడియాలో వ్యక్తం చేసుకోలేకపోతున్నారు; లేదా వారి వాణిని ఏదో ఒక మార్గంలో వినిపించుకోలేకపోతున్నారు. భారత ప్రభుత్వ నిర్ణయాలను కశ్మీరు స్వాగతిస్తున్నట్లు భారత టివి చెప్పడాన్ని వారి గృహాలలో వారు చూస్తున్నారు. వారి వాణిని తుడిచి పెట్టడంతో పట్టరాని కోపంతో వారు ఉద్రేకంతోనున్నారు. సఫాకడాలో ఒక యువకుడు 'అది మా పెళ్లి అనుకుంటే, మరి ఇతరులు మాత్రమే ఎందుకు నాట్యం చేస్తున్నారు? ఈ పని మా ప్రయోజనం-అభివృద్ధి కోసమైనట్లయితే మేం దాన్ని గురించి ఏమి ఆలోచిస్తున్నామని మమ్మల్ని ఎందుకు అడగరు?' అని ప్రశ్నించాడు.

ఆర్టికల్స్ 370, 35 రద్దు పట్ల ప్రతి స్పందనలు

◆ గురీ గ్రామం (అనంతనాగ్ జిల్లా)లో 'హమారా ఉన్‌సే రిష్తా ఆర్టికల్ 370 ఔర్ 35ఎ సే థా. అబ్ ఉన్‌హోనే అప్నేహి పైర్ పర్ కుల్హాడి మార్‌దీ హై. ఇన్ ఆర్టికల్స్ కో ఖతమ్ కర్‌దియా హై. అబ్ తో హమ్ ఆజాద్ హోగయే హై'. (వారితో మా సంబంధం ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఎ తోనే ఉండేది. ఈ ఆర్టికల్స్‌ను వాళ్ల కాళ్లపై వాళ్లే ఎత్తేసుకున్నారు. ఇపుడిక మేం స్వేచ్ఛగా ఉన్నాం' అన్నాడు. 'మాకు స్వేచ్ఛ కావాలి', ఆర్టికల్స్ 370, 35ఎలను పునరుద్ధరించాలి' అని నినదించాడు.

◆ ఆర్టికల్స్ 370, 35ఎలను చాలామంది కశ్మీరీలు తమ అస్తిత్వంగా చెప్పుకున్నారు. వాటిని రద్దు చేయడం కశ్మీరీల ఆత్మగౌరవం, అస్తిత్వం మీద జరిగిన అవమానకర దాడిగా వారు భావించారు.

◆ అందరూ ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలని అడగడం లేదు. భారత్ ఆర్టికల్ 370ని గౌరవిస్తుందని తామేమీ అనుకోలేదని, పార్లమెంటరీ పార్టీలు మాత్రమే అడిగేవని అన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో 'భారత అనుకూల పార్టీ'ల పరువు మాత్రమే పోయిందని, ఇండియా నుండి కశ్మీరీలకు స్వాతంత్ర్యం (ఆజాది) కోరే వారిది న్యాయమని రుజువైందని అన్నారు. 'జో ఇండియా కె గీత్ గాతే హై అప్నే బందే హై, వేబీ బంద్ హై'. (ఇండియా పాటపాడిన వారు, ఇండియా బంధువులు కూడా ఇప్పుడు బందీలయ్యారు) అని బాటమాలులో ఒకరన్నారు. ప్రధాన స్రవంతి పార్టీలకు ఇప్పుడు జరుగుతున్న శాస్తి చూసి చాలామంది సంతోషిస్తున్నారు అని ఒక జర్నలిస్టు అన్నాడు.

◆ 'మోడీ భారత సొంత చట్టాలను, దాని సొంత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసాడు' అనేది మరొక సాధారణ అభిప్రాయం. కశ్మీర్ కంటే భారతదేశానికే ఆర్టికల్ 370 ఎక్కువ ముఖ్యమైంది అని వాళ్లన్నారు. మోడీ ప్రభుత్వం కశ్మీర్‌ను మాత్రమే ధ్వంసం చేయదలుచుకోలేదు, అది భారతదేశ సొంత చట్టాన్ని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేసింది.

◆ 'కాంగ్రెస్ నే పీఠ్ మే ఛురా భోంకా థా, బిజెపినే సామ్నే సే ఛురా భోంకా హై' (కాంగ్రెస్ మమ్మల్ని వెన్నుపోటు పొడిచింది. బిజెపి కడుపులో పొడుస్తోంది) అని శ్రీనగర్‌లో జహంగీర్ చౌక్‌లో లోదుస్తుల వ్యాపారి అన్నాడు.

◆ 370 ఆర్టికల్ రద్దు కన్నా ఆర్టికల్ 35ఎ రద్దు పర్యవసానాల గురించి ప్రజలు ఎక్కువ విచారంతో ఉన్నారు. ఆర్టికల్ 370 నామమాత్రపు స్వయం ప్రతిపత్తి చిహ్నంగా మిగిలిపోయి, ఇప్పటికే దిగజార్చబడిందనేది అందరి అభిప్రాయం. ఇప్పుడు 35ఎ తీసేస్తే 'ప్రభుత్వ భూమి పెట్టుబడిదారులకు చౌకగా అమ్మేస్తారు. అంబానీ, పతంజలి మొదలైనవారు సులభంగా లోపలికి ప్రవేశిస్తారు. కశ్మీరీల వనరులు, భూములు ఆక్రమణకు గురౌతాయి. మిగిలిన దేశం కన్నా కశ్మీర్‌లోనే విద్య, ఉపాధి స్థాయిలు మెరుగ్గా ఉన్నాయి. రేపటి నుండి కశ్మీరీలు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన వారితో పోటీ పడాల్సి ఉంటుంది. ఒకతరం తరువాత ఎక్కువ మంది కశ్మీరీలకు ఉద్యోగాలుండవు. వాటికోసం దేశంలోని ఇతర ప్రాంతాలకు బలవంతంగా వెళ్లాల్సి వస్తుంది'.

'సాధారణ పరిస్థితా'? లేక 'శ్మశాన శాంతా'?

కశ్మీర్‌లో పరిస్థితి సాధారణంగా, శాంతియుతంగా ఉందా? లేదు అని గట్టిగా సమాధానం వస్తుంది.

◆ 'ఇది తుపాకీ గురి పెట్టిన నిశ్శబ్దం', 'ఇది శ్మశాన శాంతి' అని సోపోర్‌లో ఒక యువకుడు అన్నాడు.

◆ గ్రేటర్ కశ్మీర్ వార్తా పత్రికలో మొదటి పేజీలో వార్తలు, వెనుక పేజీలో క్రీడావార్తలు, లోపలి రెండు పేజీలలో పెళ్లిళ్లు-విందుల రద్దు ప్రకటనలు నిండిపోయాయి.

◆ ఆగస్టు 5-9 తేదీల్లో ఆహారం, పాలు, ప్రాథమిక అవసరాల

కొరతతో ప్రజలు ఇబ్బంది పడడం చూశాం. జబ్బు చేసినవాళ్లు ఆసుపత్రులకు వెళ్లటాన్ని కూడా సైనికులు అడ్డుకున్నారు.

◆ కర్ఫ్యూ కాదు, సెక్షన్ 144 మాత్రమే విధించామని ప్రభుత్వం అంటున్నది. అయితే వాస్తవంలో, పోలీస్ వ్యాన్లు శ్రీనగర్‌లో గస్తీ తిరుగుతూ 'కర్ఫ్యూ సమయంలో ఇంట్లోనే ఉండండి, బయటకు రాకండి' అని హెచ్చరిస్తున్నారు. దుకాణాల షట్టర్లు మూసివేయమని చెపుతున్నారు. బయట తిరిగేటపుడు కర్ఫ్యూ పాసులు చూపించమని అడుగుతున్నారు.

◆ కశ్మీర్ అంతా కర్ఫ్యూ కిందే ఉంది. ఈద్ రోజు కూడా రోడ్లు, బజార్లు నిశ్శబ్దంగా, నిర్జనంగా ఉన్నాయి. శ్రీనగర్ అంతా వీధుల్లో ముళ్లకంచెలతో, భారీ పారా మిలటరీ మోహరింపుతో జన సంచారాన్ని నిషేధించారు. ఈద్ రోజు కూడా ఇదే పరిస్థితి. చాలా గ్రామాలలో 'అజాన్' నిషేధించబడింది. పారా మిలిటరీ బలగాలు తిరుగుతున్నాయి. ఈద్ రోజు మామూలుగా మసీదులలో సమిష్టిగా జరుపుకునే నమాజ్ ప్రార్థనలను ఇళ్లల్లోనే చేసుకోమని ప్రజలను నిర్బంధించారు.

◆ అనంతనాగ్, షోపియన్, పాంపోర్ (దక్షిణ కశ్మీర్)లలో ఈద్ రోజున చిన్నపిల్లలు మాత్రమే పండుగ బట్టలు వేసుకొని ఉండటాన్ని చూసాం. ప్రతి ఒక్కరూ విచారంలో మునిగి ఉన్నారు. 'మేము జైలులో ఉన్నట్లుగా అనిపిస్తుంది' అని గురీ (అనంతనాగ్) లో ఒక మహిళ అంది. 'మా సోదరులను పోలీసులు, సైనికులు పట్టుకొని పోయినప్పుడు మేం ఈద్ సంబరాలు ఎలా జరుపుకోగలం' అని నాగోబాల్ (షోపియన్)లో ఒక అమ్మాయి ప్రశ్నించింది.

◆ సోపోర్‌లో కర్ఫ్యూ విరామంలో ఈద్ కోసం ఆహార సామాగ్రి కొనడానికి బజారుకు వచ్చానని ఆగస్టు 11న ఒక మహిళ చెప్పింది. 'గత వారం రోజులుగా మా ఇళ్లల్లో ఖైదీలుగా ఉన్నాం. ఈరోజు కూడా, మా గ్రామం లాంగెట్‌లో దుకాణాలు మూసి ఉన్నాయి. ఈద్ కోసం వస్తువులు కొనుగోలు చేయడానికి సోపోర్ పట్టణానికి వచ్చాను. దాంతోపాటు ఇక్కడ నర్సింగ్ చదువుతున్న నా కూతురుని చూడడానికి వచ్చాను'.

◆ 'ఇది సైనిక పాలన, మోడీ పాలన కాదు. ఇక్కడ ప్రజల కన్నా ఎక్కువ సైనికులు ఉన్నారు' అని బండిపొరాలోని వాటిపొరా దగ్గర బేకరీలో ఒక యువకుడు చెప్పాడు. 'మేము భయాందోళనలో ఉన్నాం. ఎందుకంటే దగ్గరలో ఉన్న సైనిక శిబిరం అసాధ్యమైన నియమాలు పెడుతోంది. ఇంట్లో నుండి బయలుదేరిన అరగంటలో తిరిగి ఇల్లు చేరాలని మా మీద వత్తిడి చేస్తున్నారు. మా పిల్లలకి ఆరోగ్యం బాగలేకపోతే వాళ్లను హాస్పిటల్‌కి తీసుకెళ్లాలి. అక్కడ అరగంట పైన పట్టవచ్చు. ఇంకొకరు ప్రక్క గ్రామంలో ఉన్న కూతురిని చూడ్డానికి వెళ్తే, తిరిగి రావడానికి అరగంటపైనే పట్టవచ్చు. ఏ మాత్రం ఆలస్యం అయినా, సైనికులు మమ్మల్ని వేధిస్తారు' అని ఆయన స్నేహితుడు అన్నాడు. ప్రతి ఇంటి దగ్గర, బయట, ప్రతిచోటా సిఆర్‌పిఎఫ్, పారా మిలటరీ ఉంది. వారు ఉన్నది కశ్మీరీలకు రక్షణ ఇవ్వడానికి కాదు అనేది స్పష్టం. వారు అక్కడ ఉండటం ప్రజలకి భయాందోళన కలిగిస్తున్నది.

◆ గొర్రెల వ్యాపారులు-కాపరులు అమ్ముడుపోని గొర్రెలు-మేకలతో కనిపించారు. ఏడాది పాటు పెంచిన జంతువులు అమ్ముడుపోవు. అంటే వారు భారీగా నష్టపోవాల్సి వస్తుంది. సంపాదనే లేని పరిస్థితిలో పవిత్ర ఈద్‌కు జంతువులను కొనే స్తోమత కూడా ఉండదు.

◆ బిజనూర్ (యు.పి.) నుండి వచ్చిన దుకాణదారు అమ్ముడుపోని మిఠాయిలు, చిరుతిండ్ల నిల్వలు మాకు చూపించాడు. జనం కొనలేక పోతున్నారు కాబట్టి చెడిపోయి వ్యర్థంగా మారిపోతున్నాయి. ఈద్ సందర్భంగా ఆ రోజు దుకాణాలు-బేకరీలు అమ్ముడుపోకుండా మిగిలిపోయిన విలువైన ఆహార పదార్థాలతో కనిపించాయి. వీథుల్లో జనం కనిపించలేదు.

◆ శ్రీనగర్‌లో ఉబ్బస వ్యాధితో ఉన్న ఆటో డ్రైవర్ తన చివరి మోతాదు మందు మాకు చూపించాడు. అనేక రోజులుగా మరికొంత మందు కొనాలని ప్రయత్నిస్తున్నాడు. కాని, మందుల షాపుల్లో, ఆసుపత్రుల్లో మందులు దొరకడం లేదు. ఇతర ప్రాంతాలకు, పెద్ద ఆసుపత్రులకు వెళ్లి వెతుకుదామంటే సిఆర్‌పిఎఫ్ వెళ్లనివ్వడం లేదు. అతను తన ఖాళీ ఇన్ హేలర్ కవర్ చూపించాడు. ఆ మందు కొనడానికి వెళ్లాలని సిఆర్‌పిఎఫ్ పోలీస్‌కి చెప్పినపుడు, ఆ పోలీసు ఆ కవరును తన బూటుకాలి కింద తొక్కాడు. 'అతను ఆ ముద్ర ఎందుకు వేసాడు? మమ్మల్ని ద్వేషిస్తున్నాడు కాబట్టే' అని ఆటో డ్రైవర్ అన్నాడు.

నిరసనలు, నిర్బంధం, క్రూరత్వం

◆ ఆగస్టు 9న సౌరా (శ్రీనగర్)లో 10,000 మంది ప్రజలు నిరసనలు చేపట్టారు. సైనిక బలగాలు తుపాకి కాల్పులతో అనేక మందిని గాయపరిచాయి. ఆగస్టు 10న మేం సౌరాకి వెళ్లడానికి ప్రయత్నించగా సిఆర్‌పిఎఫ్ బారికేడ్లతో నిలిపివేసారు. యువ నిరసనకారులు రోడ్డును అడ్డగిస్తుండడం చూశాం.

◆ శ్రీనగర్‌లోని ఎస్ఎంఎచ్ఎస్ హాస్పిటల్లో పెల్లెట్ తుపాకి గాయాలైన ఇద్దరు బాధితులను కలిసాం. ఆ ఇద్దరి యువకుల (వాఖర్ అహ్మద్, వాహిద్) ముఖాలు, చేతులు, శరీరాలు పెల్లెట్స్‌తో నిండి ఉన్నాయి. వారి కళ్లు నెత్తుటితో నిండి, గుడ్డిగా ఉన్నాయి. వాఖర్‌కు పెట్టి ఉన్న మూత్రపుగొట్టం నెత్తుటితో కనబడుతోంది. వారి కుటుంబ సభ్యులు విచారంతో, పట్టరాని కోపంతో దుఃఖిస్తూ వారు రాళ్లు విసరలేదని, శాంతియుతంగా నిరసన తెలుపుతున్నారని చెప్పారు.

◆ ఆగస్టు 6న, రైజింగ్ కశ్మీర్ అనే వార్తా పత్రికలో గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేస్తున్న సమీర్ అహ్మద్ శ్రీనగర్‌లోని మాండెల్ బర్గ్ ఏరియాలో తన ఇంటి దగ్గరలో ఉన్న సిఆర్‌పిఎఫ్ జవాన్‌కు తన అభ్యంతరం చెప్పాడు. ఒక వృద్ధుడిని వెళ్లడానికి అనుమతించమని అడిగాడు. తరువాత అదే రోజు సమీర్ తన ఇంటి తలుపు తెరవగానే నిష్కారణంగా ఆ సిఆర్‌పిఎఫ్ జవాను పెల్లెట్ తుపాకితో అతనిపై కాల్పులు జరిపాడు. అతని చేతులు, కళ్లకి దగ్గరగా ముఖం మీద 172 పెల్లెట్స్ తగిలాయి. అతని కంటిచూపుకు ఏమీ కాలేదు. ఉద్దేశపూర్వకంగానే ముఖం మీద, కళ్ల మీద గురిపెట్టి పెల్లెట్స్ కాలుస్తున్నారనేది స్పష్టం. నిరాయుధుల మీద, అమాయకుల మీద, ఊరికే ఇంటి ముందు నిలబడి ఉన్నవారి మీద కూడా పెల్లెట్స్ పేలుస్తున్నారు.

◆ కనీసం 600 మంది రాజకీయ నాయకులు, పౌర సమాజ కార్యకర్తలు నిర్బంధంలో ఉన్నారు. ఏ చట్టాల కింద వారిని నిర్బంధించారో లేదా ఎక్కడ నిర్బంధించారో స్పష్టమైన సమాచారం లేదు.

◆ చాలా పెద్ద సంఖ్యలో రాజకీయ నాయకులు గృహ నిర్బంధంలో ఉన్నారు. ఎంతమంది అనేది నిర్ధారించడం అసాధ్యం. సిపిఐ (ఎం),

శాసనసభ్యుడు మహ్మద్ యూసఫ్ తరిగామిని కలవడానికి ప్రయత్నించాం. శ్రీనగర్‌లోని అతని ఇంట్లోకి మమ్మల్ని ప్రవేశించనివ్వలేదు. అతన్ని గృహ నిర్బంధంలో ఉంచారు.

◆ మేం పర్యటించిన ప్రతి గ్రామంలో, అదే విధంగా శ్రీనగర్‌లో పాఠశాల విద్యార్థులను, యువకులను పోలీసులు, లేదా సైన్యం/పారా మిలటరీ నిర్హేతుకంగా అక్రమంగా నిర్బంధించారు. ఆగస్టు 5-11 మధ్యలో పాంపోర్‌లో పోలీస్ స్టేషన్లో నిర్బంధింపబడిన 11 ఏళ్ల బాలుడిని కలిసాం. అతన్ని తీవ్రంగా కొట్టారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుండి తనకన్నా చిన్న పిల్లలను తీసుకొచ్చిన పోలీసు కస్టడీలో ఉంచినట్లు అతను చెప్పాడు.

◆ అర్ధరాత్రి దాడులలో పడుకున్న వారిని పడుకున్నట్టే వందలాది మంది పిల్లలను, యువకులను పట్టుకుపోతున్నారు. ఈ దాడుల ఉద్దేశం భయాందోళనలు కలుగజేయడమే. ఈ దాడుల సందర్భంగా సైనిక దళాల లైంగిక వేధింపుల గురించి మహిళలు, బాలికలు చెప్పారు. తల్లి తండ్రులు మమ్మల్ని కలవడానికి, తమ పిల్లల నిర్బంధం గురించి చెప్పడానికి భయపడ్డారు. ప్రజా భద్రతా చట్టం (పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్) కింద కేసుల్ని బనాయిస్తారని వారు భయపడుతున్నారు. మరొక భయం ఏమిటంటే పిల్లలను మాయం చేయవచ్చు. కస్టడీలో చంపేయవచ్చు. సామూహిక సమాధులలో పూడ్చి పెట్టవచ్చు. ఈ విషయంలో కశ్మీర్‌కు భయంకరమైన చరిత్ర ఉంది. 'ఈ అరెస్టులు రికార్డు కావు. ఇది అక్రమ నిర్బంధం. కనుక ఒక పిల్లవాడు 'మాయమైతే' - అంటే కస్టడీలో చంపబడితే-అతను ఎప్పుడూ మా కస్టడీలో లేడు అని పోలీసులు, సైన్యం చెప్పగలరు' అని అరెస్టయిన బాలుడి పక్కింటి వారు అన్నారు.

◆ అయితే బహుశా నిరసనలు ఆగవు. 'జిత్నా జులుం కరేంగే, ఉత్నా హం ఉభారేంగే' (ఎంతగా అణిచివేస్తే, అంతగా పైకిలేస్తాం) అని సోపోర్‌లో ఒక యువకుడు అన్నాడు. 'నాయకులు అరెస్టయినా ఫరవాలేదు. మాకు నాయకులు అవసరంలేదు. ఒకే ఒక్క కశ్మీర్ బాలుడు బతికి ఉన్నా కూడా, మేం పోరాడతాం' అనే మాట మేం పదేపదే విన్నాం.

మీడియా గొంతు నొక్కేయడం

◆ 'వార్తా పత్రికలు అచ్చవుతున్నాయి. ఇంటర్నెట్ లేకుండా ఏజన్సీల నుండి ఎటువంటి సమాచారం మేం పొందలేం. ఎన్‌డిటివి చూసి పార్లమెంట్‌లో జమ్మూ కశ్మీర్ పరిణామాల వార్తలు రిపోర్టు చేయడం వరకే కుదించబడ్డాము. ఇది అప్రకటిత నిషేధం. ప్రభుత్వం ఇంటర్నెట్-ఫోన్ కనెక్టివిటిని పోలీస్‌లకు మాత్రం ఇస్తూ, మీడియాకు ఇవ్వడం లేదు. దానర్థం ఏమిటి? కొందరు మనుషులు ఆయా ఆఫీసులకి వచ్చి, సైన్యం-సిఆర్‌పిఎఫ్ తరుపున మాట్లాడుతున్నారు. 'కర్ఫ్యూ ప్రభావిత వీధుల ఫోటోలు ఎందుకు ప్రచురిస్తున్నారు అని అడుగుతున్నారు' అని ఒక జర్నలిస్టు అన్నాడు.

◆ కశ్మీర్ టీవి ఛానల్స్ అన్నీ పూర్తిగా మూసివేయబడ్డాయి.

◆ కశ్మీర్ వార్తా పత్రికలు నిరసనల గురించి (సౌరాలో ఒకటీ అరా వంటివి) చాలా తక్కువ ప్రస్తావనలు చేస్తున్నప్పటికీ, వాటివల్ల అధికారుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తోంది.

◆ తమ కదలికలపై అధికారుల నుండి ఆంక్షలు ఎదుర్కొంటున్నామని విదేశీ ప్రెస్ రిపోర్టర్లు చెప్పారు. ఇంటర్నెట్ కొరత వల్ల తమ సొంత ఆఫీసులకు కూడా సమాచారాన్ని ఇవ్వలేకపోతున్నామన్నారు.

◆ ఆగస్టు 13న శ్రీనగర్‌లోని ప్రెస్ ఎన్‌క్లేవ్‌లో వార్తా పత్రికల కార్యాలయాలు మూసివేసి ఉన్నాయి. కొద్దిమంది అటు ఇటు తిరిగే జర్నలిస్టులు, కొంతమంది సిఐడి సిబ్బంది తప్ప మనుషులే లేరు. కనీసం ఆగస్టు 17 వరకు పత్రికలు అచ్చుకావని, ఢిల్లీ నుండి రావాల్సిన న్యూస్ ప్రింట్ రాలేదని, అది లేకుండా నడపలేమని అని ఒక జర్నలిస్టు అన్నాడు.

కశ్మీర్‌లో అభివృద్ధి లేదా?

'నా జన్మస్థలం 'రాతియుగం'లో ఉంది; ఆర్థికాభివృద్ధిలో కశ్మీర్ మిగతా భారతదేశం కన్నా రెండు వందల సంవత్సరాలు వెనుకబడి ఉంద'ని ఒక కశ్మీర్ యువకుడు అన్నాడని 2019 ఆగస్టు 9న టైమ్స్ ఆఫ్ ఇండియాలో మాజీ విదేశాంగ కార్యదర్శి, రాయబారి నిరుపమారావు రాసింది. ఈ 'వెనుకబాటుతనం', 'రాతియుగం' కశ్మీర్‌లో ఎక్కడైనా ఉందా అని చూడటానికి మేము కష్టపడ్డాం.

◆ కశ్మీరులోని ప్రతి గ్రామంలో కళాశాలకు లేదా యూనివర్సిటీకి వెళ్తున్న యువతీ యువకులు ఉండడం మాకు కొట్టవచ్చినట్టు కనబడింది. వారు కశ్మీరీ, హిందీ, ఇంగ్లిష్ భాషలను ఏకధాటిగా మాట్లాడుతున్నారు; రాజ్యాంగంలోని అంశాలను, కశ్మీర్ వివాదానికి సంబంధించిన అంతర్జాతీయ చట్టాలను, వాస్తవికంగా, కచ్చితంగా వాదిస్తున్నారు. మా బృందంలోని నలుగురు సభ్యులు ఉత్తర భారతంలోని రాష్ట్రాల గ్రామాలు బాగా తెలిసినవారు. చెప్పాలంటే బీహార్, యు.పి., ఎం.పి. లేదా జార్ఖండ్‌లలోని ఏ గ్రామంలో కూడా ఇంతటి ఉన్నత స్థాయి విద్యావంతులు అరుదు.

◆ గ్రామీణ కశ్మీర్‌లో ఇళ్లన్నీ కూడా పక్కా నిర్మాణాలు. బీహార్, యు.పి., జార్ఖండ్ గ్రామీణ ప్రాంతంలో సాధారణంగా ఉండే గుడిసెలను ఇక్కడ మేం చూడలేదు.

◆ కశ్మీర్‌లో పేదలు ఉన్నారు. అయితే దిక్కులేనితనం, పోషకాహార కొరత, దారుణమైన పేదరికం, చాలా ఉత్తర భారత రాష్ట్రాలలో కన్పించినట్లుగా గ్రామీణ కశ్మీర్‌లో లేవు.

◆ చాలా చోట్ల ఉత్తర భారతదేశం, పశ్చిమ బెంగాల్ నుండి వచ్చిన వలస కూలీలను కలిసాం. తాము ఇక్కడ సురక్షితంగా ఉన్నామని వారు చెప్పారు. చెప్పాలంటే మహారాష్ట్ర, గుజరాత్‌లలో ఎదుర్కొన్నట్లుగా చిన్నచూపు లేకుండా స్వేచ్ఛగా ఉన్నామన్నారు. 'కశ్మీరు మాకు దుబాయి. మేము ఇక్కడ రోజుకి రు. 600 నుండి రు. 800 వరకు సంపాదిస్తున్నాము. ఇతర రాష్ట్రాలలో సంపాదించిన దానికన్నా మూడు-నాలుగు రెట్లు ఎక్కువ' అని వలసవచ్చిన కూలీలు అన్నారు.

◆ మత ఉద్రిక్తతలు, మూకదాడులు లేని కశ్మీర్‌ని చూసాం. కశ్మీరి పండిట్లను కలిసాం. వారు తమకు కశ్మీర్‌లో రక్షణ ఉందని భావిస్తున్నట్లు చెప్పారు. కశ్మీర్‌లో అందరూ కలిసి పండుగలు జరుపుకుంటామని చెప్పారు. 'మేము ఈద్, హోళీ, దీపావళిలకు ఒక చోట చేరి సంబరాలు చేసుకుంటాం. అది మా కశ్మీరీయత్. ఇది మా ప్రత్యేకత, మా భిన్నత్వం' అని ఒక కశ్మీరీ పండిట్ యువకుడు చెప్పాడు.

◆ కశ్మీర్ మహిళ 'వెనుకబాటుతనం' బహుశా పెద్ద అబద్ధం. కశ్మీరీ బాలికలు ఉన్నతస్థాయి విద్యను పొందుతున్నారు. వారు స్పష్టమైన ఉచ్చారణతో, స్థిరంగా ఉన్నారు. వారి సమాజంలో పితృస్వామ్యం-లింగ వివక్ష ఎదుర్కొంటూ, ప్రతిఘటిస్తూ ఉండవచ్చు.

అయితే బిజెపికి చెందిన హర్యానా ముఖ్యమంత్రి, ముజఫర్ నగర్ ఎంఎల్ఎ కశ్మీరి వధువులను పొందడం గురించి, కశ్మీరీ మహిళలు లూటీ చేయబడే ఆస్తి అని మాట్లాడుతుండగా, కశ్మీర్‌కు స్త్రీవాదం బోధించే హక్కు బిజెపికి ఉందా? మా యుద్ధాలు మేమే చేసుకోగలం. మమ్మల్ని అణచివేసే వాళ్లను విముక్తి చేయమని ఎప్పుడూ అడగం' అని కశ్మీరీ స్త్రీలు, యువతులు అన్నారు.

బిజెపి అధికార ప్రతినిధి 'హెచ్చరిక'

బిజెపి కశ్మీర్ వ్యవహారాల అధికార ప్రతినిధి అశ్వనీ కుమార్ చుంగూను రైజింగ్ కశ్మీర్ వార్తాపత్రిక ఆఫీసులో కలిసాం. మొదట సంభాషణ మైత్రీపూర్వకంగా ఉండింది. ఆర్టికల్ 370 రద్దును ప్రజలు బలపరిచేలా చేయడానికే తాను జమ్ము నుండి కశ్మీరుకు వచ్చానని అన్నాడు. బిజెపి జమ్మూ కశ్మీర్‌లో 46 శాతం వాటా ఓట్లు పొందింది. పార్లమెంటులో ముందెన్నడూలేని మెజారిటీని సాధించింది కనుక, ఆర్టికల్ 370 రద్దు చేస్తామన్న హామీని నిలబెట్టుకోవడం మా హక్కు మాత్రమే కాదు, మా బాధ్యత అనేది అతని ప్రధాన వాదన. '46 శాతం ఓట్ల వాటా–అది మాకు లైసెన్స్' అన్నాడు.

మూడు లోక్‌సభ సీట్లలో (జమ్ము, ఉద్ధంపూర్, లడ్డాఖ్) మాత్రమే 46 శాతం ఓట్ల వాటా పొందారు. ఇతర మూడు లోక్‌సభ సీట్లలో (శ్రీనగర్, అనంతనాగ్, బారాముల్లా)లలో ఎన్నికల బహిష్కరణతో దేశంలోనే అతి తక్కువ పోలింగ్ జరిగింది. ఈ విషయం గుర్తించడానికి అతను తిరస్కరించాడు.

ఏ నిర్ణయానికైతే కశ్మీర్ ప్రజలు ఓటు వేయలేదో, ఆ జన సమ్మతిలేని నిర్ణయాన్ని తుపాకీ గురిపెట్టి ఆ ప్రజలపై విధించవచ్చా అని అడిగినప్పుడు 'బీహార్‌లో మద్య నిషేధాన్ని విధించినప్పుడు, తాగుబోతుల అనుమతి, సమ్మతి కోరలేదు. ఇక్కడ కూడా అదే జరిగింది' అన్నాడు. ఈ పోలికతో కశ్మీర్ ప్రజలపై అతని చిన్నచూపు రుజువవుతున్నది. సంభాషణ ముగింపుగా వాస్తవాలతో, వాదనలతో మేం ఎదుర్కొనడంతో అతను ఉద్వేగపూరితంగా మారాడు. లేచినిలబడి జీన్‌డ్రెజ్ వైపు వేలు ఆడిస్తూ 'మేం మీలాంటి జాతి వ్యతిరేకులను ఇక్కడ పనిచెయ్యనియ్యం. ఇదే నీకు హెచ్చరిక' అన్నాడు.

ముగింపు

కశ్మీర్ అంతా ప్రస్తుతం ఒక జైలు. సైన్యం నియంత్రణలో ఉంది. మోడీ ప్రభుత్వం జమ్మూ కశ్మీర్ మీద తీసుకున్న నిర్ణయం అనైతికం. రాజ్యాంగ వ్యతిరేకం, చట్టరహితం. కశ్మీరీలని ఖైదులో ఉంచడానికి మోడీ ప్రభుత్వం అనుసరించిన విధానం పట్ల వెలువడుతున్న నిరసనలను కూడా అణచివేయడం అనైతికం, రాజ్యాంగ విరుద్ధం, చట్టరహితం.

◆ ఆర్టికల్స్ 370–35ఎలను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నాం.

◆ మేం నొక్కి చెప్పేదేమంటే జమ్మూ కశ్మీర్ హోదా లేదా భవిష్యత్తు గురించి కశ్మీరీల సమ్మతి లేకుండా ఎటువంటి నిర్ణయం తీసుకోవద్దు.

◆ లాండ్‌లైన్ టెలిఫోన్లు, మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్లతో సహా సమాచార వ్యవస్థను తక్షణమే పునరుద్ధరించాలి.

◆ మాట్లాడే, వ్యక్తీకరించే, నిరసన తెలిపే హక్కులపై నిషేధాన్ని తక్షణమే ఎత్తివేయాలి.

◆ జమ్మూ కశ్మీర్ ప్రజలు వేదనలో ఉన్నారు. వారు తమ నిరసనలను మీడియా, సోషల్ మీడియా, బహిరంగ సభలు, ఇతర శాంతియుత పద్ధతులలో వ్యక్తీకరించడానికి అనుమతించాలి.

◆ జమ్మూ కశ్మీర్‌లో జర్నలిస్టుల మీద నిషేధాల్ని ఎత్తి వేయాలి.

(జీన్ డ్రెజ్, ఆర్థికవేత్త;

కవితా కృష్ణన్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్కిస్టు–లెనినిస్టు), ఎఐడిడబ్ల్యుఎ;

మైమూనా మొల్లా, ఆల్ ఇండియా డెమొక్రాటిక్ ఉమెన్స్ అసోషియేషన్– ఎఐడిడబ్ల్యుఎ;

విమల్ భాయి, నేషనల్ అలయెన్స్ ఆఫ్ పీపుల్స్ మూవ్‌మెంట్స్ – ఎన్ఎపిఎం)

మూలానువాదం – జె. కిశోర్ బాబు

వీ



370 అధికరణం - జమ్ము కశ్మీర్ పేదరికం


అధికరణం 370 ఉండడం వల్ల కశ్మీర్ వెనుకబాటుతనానికి గురైందని, అందువల్లనే దాన్ని రద్దు చేస్తున్నామని ప్రకటించిన హోంమంత్రికి వాస్తవ గణాంకాలతో జవాబు చెపుతున్నారు శ్రేయా ఖైతాన్

భారత రాజ్యాంగంలోని అధికరణం 370, అధికరణం 35(ఎ) వల్ల కశ్మీర్ పౌరులకు ఉద్యోగాలు రిజర్వ్ చేయటం, కశ్మీరీయేతరు లకు భూముల అమ్మకంపై పరిమితుల వల్ల జమ్ముకశ్మీర్ (జెకె) 'పేదది'గా ఉండిపోయిందని, రాష్ట్ర అభివృద్ధి వెనకపడిపోయిందని గృహ శాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

అయితే ప్రభుత్వ గణాంకాలను విశ్లేషించిన FactChecker.in ప్రకారం అభివృద్ధి సూచికలైన జీవిత కాలం, శిశు మరణాలు, అక్షరాస్యత, పేదరికం వంటి అంశాలలో దేశ సగటు కంటే రాష్ట్ర పరిస్థితి మెరుగ్గా ఉంది. కానీ ఆర్థిక అభివృద్ధి అంతగా సాధించ లేదు. ఈ రంగంలో ముందున్న మహారాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) 2016-17లో రు. 1,33,141 కాగా, జమ్ము కశ్మీర్‌లో అందులో సగం రు. 62,145 మాత్రమే ఉంది. అయితే బీహార్ వంటి వెనకబడిన రాష్ట్రాలతో పోలిస్తే (తలసరి జిడిపి రు. 25,950) పరిస్థితి మెరుగ్గా ఉంది.

ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడంలో జమ్ముకశ్మీర్ నిజంగా వెనకబడింది, ఇందులో అది బీహార్ కంటేవెనకన ఉంది. దీనికి కారణం అధికరణం 370నా లేక అక్కడ నెలకొన్న అనిశ్చిత భద్రత పరిస్థితా అన్న దాంట్లో నిపుణులకు అభిప్రాయ భేదాలు ఉన్నాయి.

ఆర్థిక సూచికలు




జమ్ము కశ్మీర్ 'పేదది' కాదు

అధికరణం 370 కారణంగా రాష్ట్రం అభివృద్ధి సాధించలేదని, ప్రజలు పేదరికంలో ఉండిపోయారని, కేంద్ర ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసి ప్రజలకు అందకుండా చేశారని 2019 ఆగస్టు 6న లోక్‌సభలోని తన ప్రసంగంలో షా పేర్కొన్నారు. జనాభా గణాంకాల ప్రకారం 2011లో దేశ సగటు పేదరికం 22 శాతం కాగా, రాష్ట్రంలో10.3 శాతం.

సామాజిక సూచికలలో రాష్ట్రం ముందు ఉంది

ఇతర సామాజిక అభివృద్ధి సూచికలలో కూడా దేశ సగటు కంటే రాష్ట్ర పరిస్థితి మెరుగ్గా ఉందని, లేదా దాంతో పోల్చదగినదిగా ఉందని ప్రభుత్వ గణాంకాలు వెల్లడి చేస్తున్నాయి - జీవన కాలం (2012-2016 మధ్య దేశ సగటు 57 కాగా ఇక్కడ 73.5), శిశు మరణాలు (2017లో దేశ సగటు 33 కాగా ఇక్కడ 23), అక్షరాస్యత (2011లో దేశ సగటు 72 శాతం కాగా ఇక్కడ 67 శాతం).

ఆరోగ్య సూచికలు



జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే IV ప్రకారం2015-16లో 20-24 వయస్సు స్త్రీలలో 18 ఏళ్లకు ముందే పెళ్లి అయిన వాళ్లు జమ్ముకశ్మీర్‌లో 8.7 శాతం కాగా దేశ సగటు 26.8 శాతం. ఇది బీహార్‌లో 42.5 శాతం, గుజరాత్‌లో 24.9 శాతం అని గణాంకాలు చెబుతున్నాయి.

2005లో దేశం చేసిన విద్య హక్కు చట్టాన్ని జమ్ము కశ్మీర్ ఆమోదించ లేదనీ, అందువల్ల పిల్లలకు ఈ ముఖ్యమైన ప్రయోజనం అందటంలేదనీ షా తన ప్రసంగంలో పేర్కొన్నారు. 2005 చట్టంలోని కొన్ని అంశాలు లేనప్పటికీ 2002లో జమ్ముకశ్మీర్ విద్యపై చేసిన చట్టం ద్వారా 8వ తరగతి వరకు పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ విద్య లభిస్తోంది.


2015-16లో ఆ వయస్సు పిల్లల్లో ఇంటర్‌లో నమోదైన పిల్లల

శాతం జమ్ముకశ్మీర్‌లో 58.6 శాతం కాగా దేశ సగటు 56.6 శాతం అని మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలు తెలియ చేస్తున్నాయి.

ఆర్థిక ప్రగతి బీహార్ కంటేమెరుగ్గా, మహారాష్ట్ర కంటే వెనకగా ఉంది

ఆర్థిక అభివృద్ధిలో జమ్ముకశ్మీర్ పరిస్థితి దేశంలో ముందున్న రాష్ట్రాలతో పోలిస్తే అంత బాగాలేదు కానీ వెనకబడిన రాష్ట్రాల కంటే బాగుంది. 2016-17లో మహారాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) రు. 1,33,141 తో పోలిస్తే జమ్ముకశ్మీర్ జిడిపి రు.62,145 సగమే, కానీ బీహార్ జిడిపి రు. 25,950 తో పోలిస్తే చాలా ఎక్కువే.


విద్య సూచికలు



ప్రభుత్వ రుణ భారం ఎక్కువ

ఈ రాష్ట్రంలో ప్రభుత్వ జిడిపి నిష్పత్తి ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఎక్కువ, జిడిపిలో ఎంత శాతం ప్రభుత్వ రుణం ఉందనేది ఇది తెలియచేస్తుంది. బీహార్‌లో 32.6 శాతం, గుజరాత్‌లో 17.2 శాతం ఉన్న ఈ నిష్పత్తితో పోలిస్తే జమ్ముకశ్మీర్‌లో 49.2 శాతం.

సహాయం కోసం మంజూరైన నిధులు
(మొత్తం రెవెన్యూలో శాతం)



'ఈ అధిక రుణానికి ప్రధాన కారణం భద్రతపై ప్రభుత్వం పెట్టే ఖర్చు, అంతే కాకుండా 1990 వరకు జమ్ముకశ్మీర్‌కి కేంద్ర ప్రభుత్వ సహాయంలో 70 శాతం అప్పు రూపంలో ఉంది,' అని ఆర్థిక వేత్త, జమ్ముకశ్మీర్ ఆర్థిక శాఖ మాజీ మంత్రి అయిన హసీబ్‌ద్రబు అంటున్నారు. ఇతర రాష్ట్రాల కంటే జమ్ముకశ్మీర్‌కి ఎక్కువ కేంద్ర సహాయం ఇచ్చామని లోక్‌సభలో తన ఉపన్యాసంలో గృహ శాఖ మంత్రి పేర్కొన్నారు.

ఈ అంశానికి సంబంధించిన తాజా గణాంకాలు అందుబాటులో ఉన్న 2017-18 సంవత్సరంలో తన రెవెన్యూ ఆదాయంలో 50 శాతం కేంద్ర ప్రభుత్వం నుంచి జమ్ముకశ్మీర్‌కి గ్రాంట్-ఇన్-ఎయిడ్ రూపంలో లభించింది. దీనితో పోలిస్తే బీహార్ 21 శాతం, గుజరాత్ 12.8 శాతం పొందాయని భారత పార్లమెంటుపై పనిచేసే కొత్త ఢిల్లీలోని పిఆర్ఎస్ లెజిస్లేటివ్ రిసెర్చ్ అనే సంస్థ విశ్లేషణలో వెల్లడయ్యింది.

అయితే చారిత్రికంగా ఇటువంటి పరిస్థితి లేదు. '1990 వరకు కేంద్ర ప్రభుత్వ సహాయంలో జమ్ముకశ్మీర్‌కి 70 శాతం అప్పుగా, 30 శాతం గ్రాంటుగా లభించేది' అని ద్రబు అంటున్నారు. ఘర్షణ నెలకొన్న రాష్ట్రంలో కొంత మొత్తం భద్రతకి ఇచ్చి ఉంటారు కాబట్టి జమ్ముకశ్మీర్‌కి ప్రభుత్వం నుంచి అధిక నిధులు అందాయనడం సరికాదని ఆయన అంటారు. 2011 నుంచి 2019 మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వం నుంచి జమ్ముకశ్మీర్‌కి వచ్చిన ఆదాయంలో 54 శాతం గ్రాంట్‌ల రూపంలో ఉంది. మహారాష్ట్ర, గుజరాత్‌లతో పోలిస్తే ఇది ఎక్కువే. అయితే, రాష్ట్ర బడ్జెట్‌లపై పిఆర్ఎస్ లెజిస్లేటివ్ రిసెర్చ్ చేసిన అధ్యయనం ఆధారంగా మిజోరాం (61 శాతం), నాగాలాండ్ (67 శాతం)లకు కూడా ఇలాంటి సహాయమే లభించిందని తెలుస్తోంది.


ప్రైవేటు పెట్టుబడులు తక్కువ

ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించటంలో, బీహార్ కంటే కూడా జమ్ము కశ్మీర్ వెనక పడి ఉంది. 'జమ్ముకశ్మీర్‌లో ఉద్యోగస్థులకు భవిష్య నిధి చెల్లించే యజమాని లేదు, 500కి మించి శాశ్వత ఉద్యోగస్థులు ఉన్న యజమాని లేదు; ఇది ఆర్థిక అభివృద్ధికి తోడ్పడే పరిస్థితి కాదు,' గతంలో జమ్ముకశ్మీర్ ప్రభుత్వంతో పనిచేసి ఇప్పుడు టీమ్ లీస్ అన్న నియామక సంస్థకి చైర్ పర్సన్ అయిన మనీష్ సబర్వాల్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో 2019 ఆగస్టు 6న రాశారు. 'రాష్ట్రంలో 10 కోట్ల రూపాయల మూలధన పెట్టుబడి ఉన్న ఒకే ఒక్క లిస్టెడ్ కంపెనీ ఉంది' అని ఆయన అంటున్నారు. ఈ అంశాన్ని FactChecker.in స్వతంత్రంగా నిర్ధారించుకోలేక పోయింది.

'తన సామర్థ్యానికి తగినట్టు కశ్మీర్‌లో ఆర్థిక ప్రగతి జరగలేదు,' అని FactChecker.in కి సబర్వాల్ చెప్పారు. ఉదాహరణకి కొత్త డిజైన్లు, సంపన్న మార్కెటు అందుబాటులో లేని కారణంగా రాష్ట్ర హస్తకళలు, తివాచీ పరిశ్రమ తగినంత అభివృద్ధి చెందలేదని ఆయన అంటారు. మిగిలిన దేశం, ప్రపంచంతో అనుసంధానం లేని కారణంగా, 'హస్తకళలలో అదనపు వేతనం ఏమీ లేదు; తివాచీలు నేసేవాళ్లకి రోజుకి 150 రూపాయలు మాత్రమే లభిస్తాయి' అని ఆయన అంటారు.

నిపుణులు అందరూ దీనితో అంగీకరించటం లేదు. 'అంతర్జాతీయంగా వివాదాస్పద ప్రాంతం కావటం, భద్రత పరిస్థితుల కారణంగా

జమ్ముకశ్మీర్‌లో పెట్టుబడి వెనుకబాట



జమ్ముకశ్మీర్‌లో పెట్టుబడులు పెట్టడం లేదు' అంటారు ద్రబు, 'దేశ ప్రయోజనాల కోసం కాకుండా లాభాల కోసం ప్రైవేటు పెట్టుబడులు వస్తాయి. రానున్న ఆరు నెలలు – సంవత్సర కాలంలో కొన్ని ఒప్పందాల మీద సంతకాలు చెయ్యవచ్చు, కానీ ఆ తరవాత పరిస్థితుల మళ్లీ మొదటికే వస్తాయి.'

'ప్రభుత్వ పెట్టుబడుల వెనకే ప్రైవేటు పెట్టుబడులు వస్తాయి' కాబట్టి జమ్ముకశ్మీర్‌లో ఆర్థికాభివృద్ధికి కశ్మీర్ లోయకి మెరుగైన రవాణా సదుపాయాలు వంటి మౌలిక సదుపాయాలు, పరిశ్రమలలో ప్రభుత్వ పెట్టుబడులు, మెరుగైన పాలన అవసరం అంటారు ద్రబు. ఇతర రాష్ట్రాలలోని అభివృద్ధిని గుడ్డిగా అనుకరించడం కాకుండా రాష్ట్రానికి పర్యావరణ పరంగా సుస్థిరమైన పరిశ్రమలు కావాలని ఆయన అంటారు.

మెరుగైన పాలన, మెరుగైన రాజకీయాలు కావాలి


'ఇప్పటి రాజకీయ నాయకులకు కొత్త ఆలోచనలు ఏమీ లేవు, వాళ్లు అలసిపోయి ఉన్నారు. రాష్ట్ర అభివృద్ధికి వాళ్లు ఆటంకాలు కలగిస్తున్నారు' అంటున్నారు సబర్వాల్. భూమిని 99 సంవత్సరాలకు అద్దెకు తీసుకోవచ్చున్న పారిశ్రామిక విధానాన్ని ఉపయోగించు కోవాలనుకున్న ప్రాజెక్టులకు రాజకీయ నాయకులు అడ్డుపడ్డారనీ, రాష్ట్ర ప్రభుత్వం మారినప్పుడు అలాంటి అద్దె ఒప్పందాలను రద్దు చేస్తారని ఆయన చెప్పారు. 'వ్యాపారాల వృద్ధికి తోడ్పడే కొత్త స్థానిక రాజకీయ నాయకులు కావాలి' అంటూ 370 అధికరణాన్ని రద్దు చేయడం అందుకు తోడ్పడుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

370వ అధికరణాన్ని రద్దు చేయడం ద్వారా రాష్ట్రంలోని పాలనా సంబంధ సమస్యలు పరిష్కారం కావని ద్రబు అంటున్నారు. 'గత కొద్ది దశాబ్దాలలో జమ్ముకశ్మీర్‌ని అభివృద్ధి చెయ్యాలని కేంద్ర ప్రభుత్వాలు కానీ, రాష్ట్ర ప్రభుత్వాలు కానీ అనుకోలేదు' అంటూ ముందు ఇది మారాలని అంటున్నారు.

(ఖైతాన్ రచయిత్రి, IndiaSpend, FactChecker.inలలో సంపాదకురాలు. ఈ వ్యాసానికి ఆల్ఫీహాహర్‌షాన్, జమీలా అహ్మద్‌లు తోడ్పడ్డారు)

(అనువాదం కె. సురేష్)

వీ



ఆర్టికల్ 370 రద్దు - కశ్మీరీల స్వేచ్ఛాకాంక్షలపై గొడ్డలి వేటు

కశ్మీర్‌లో వాస్తవ పరిస్థితి ఇదీ!

'అంతా ప్రశాంతంగా ఉంది' అని భారత ప్రభుత్వం చేస్తున్న అబద్ధ ప్రచారాన్ని పటాపంచలు చేస్తూ, అంతర్జాతీయ పత్రిక టైమ్‌కు రాసిన వ్యాసంలో కశ్మీర్ వాస్తవ పరిస్థితిని వివరిస్తున్నారు **షహనాజ్ బషీర్**

టైమ్ పత్రిక కోసం నేనీ వ్యాసం రాస్తున్న సమయానికి జమ్ము నగరం పొలిమేరల్లో ఒక కార్యాలయం వెనుక ఒత్తయిన ఎత్తయిన కలుపు మొక్కల మధ్య రహస్యంగా నిలబడి ఉన్నాను. దజన్లకొద్దీ దోమలు నా చేతుల మీదా, మెడమీదా, కాళ్ల మీదా వాలుతూ, సాయంత్రపు నెత్తుటి భోజనాన్ని సంతోషంగా ఆరగిస్తున్నాయి. నేను అప్పుడప్పుడూ నా శరీరం కదిలిస్తూ, అక్కడా ఇక్కడా గోక్కుంటూ ఉన్నాను గాని నా ఫోన్‌ను వదిలిపెట్టగల స్థితిలో లేను.

గత మూడు వారాలలో, నాకు బ్రాడ్ బాండ్ సంబంధాన్నీ, బైటి ప్రపంచంతో సంబంధాన్నీ కలిగించిన ఒకే ఒక్క స్థలం ఇది.

ఒక రోజు ముందే, నేను వివాదాస్పద హిమాలయ ప్రాంతమైన కశ్మీర్‌లో నా ఇంటి నుంచి రెండు వందల మైళ్లు డ్రైవ్ చేసుకుంటూ ఇక్కడికి చేరాను. కశ్మీర్‌కు బైట ఉండి నా కోసం ఆందోళన పడుతున్న బంధువులకూ మిత్రులకూ ఇప్పుడు ఫోన్ చేసి నేను ఇప్పటికైతే బాగానే ఉన్నానని చెప్పవలసి ఉంది. జమ్మూకు చేరగానే నాకు సరిగ్గా ఒక జైలు నుంచి విడుదలైన ఖైదీకి కలిగే లాంటి భావం కలిగింది. కాని అది కొద్దిసేపు మాత్రమే. రెండు సంవత్సరాల కింద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన ఆరు మైళ్ల పొడవైన చెనాని – నష్రీ సొరంగంలోకి ప్రవేశించగానే, సందేశాలూ, ఇమెయిళ్లూ వరదలాగ ముంచెత్తి నా ఫోన్ హడావుడి చేయడం మొదలుపెట్టింది. సొరంగం బైటికి రాగానే కాసేపు ఆగి నేను కుటుంబ సభ్యులకూ, మిత్రులకూ ఫోన్ చేశాను. వాళ్లందరూ ఒక్కసారి ఫోన్ మోగగానే జవాబిచ్చారు. ఆందోళనతో ఉన్నారు, ఆశ్చర్యపోతున్నారు. నేను వాళ్లకు ఎలా ఫోన్ చేయగలిగానని ఆదుర్దా పడుతున్నారు. బైట ఉన్నవాళ్లెవరికైనా తమ టెలిఫోన్ తెరమీద కశ్మీర్ నంబర్ కనబడడమంటే ఏదో అద్భుతం జరిగినట్టే.

కశ్మీర్‌లో ఉన్న సందర్శకులు, యాత్రికులు అందరూ వెంటనే కశ్మీర్ వదిలిపోవాలని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వు స్కాన్ కాపీ ఆగస్ట్ తొలిరోజుల్లో సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారంలోకి వచ్చింది. వెంటనే పెట్రోల్ పంపులూ, కిరాణా దుకాణాలూ ఖాళీ అయిపోయాయి. జమ్మూ కశ్మీర్ రాష్ట్రపు వేసవి రాజధాని శ్రీనగర్‌లో ఎటిఎంల ముందూ, దుకాణాల ముందూ బార్లు తీరిన సమూహాలను కొందరు మొదట వేళాకోళం చేశారు. కాని ఆగస్ట్ 4 రాత్రికల్లా తాము మూర్ఖంగా ఉన్నామని వారికే తెలిసివచ్చింది. అర్ధరాత్రి ఫోన్ లైన్లు, ఇంటర్నెట్ కనెక్షన్లు తెగిపోయాయి. మర్నాడు ఉదయానికల్లా సూర్యకాంతి పరచుకున్న శ్రీనగర్ వీథుల్లో మానవమాత్రులు కనిపించకుండా పోయారు. తమ తమ ఇళ్లలో ఉండిపోయిన ప్రజలకు మిగిలిన ఒకే ఒక్క వనరు కొన్ని న్యూస్ చానళ్లలో ప్రసారమవుతున్న భారత పార్లమెంటు సమావేశాలు. అక్కడ కొద్దిపాటి ప్రతిపక్ష విమర్శలు ఉన్నప్పటికీ, అధికార భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏకపక్షంగా అధికరణం 370ని రద్దు చేస్తున్నది. గత కొన్ని దశాబ్దాలుగా కశ్మీరీలకు ఎంతో కొంత స్వతంత్ర ప్రతిపత్తి రాజ్యాంగ హక్కులను హామీ ఇచ్చిన అధికరణం అది.

ఆగస్ట్ 5న ఉదయం 11 గంటల సమయంలో నాటిపొరాలోని తాజుద్దీన్ వలీ సమాధి దగ్గర కొద్దిమంది మగపిల్లలు ప్రధాన రహదారికి అడ్డంగా ఇనుప స్తంభాలు, రాళ్లు, తగలబడుతున్న టైర్లు పోగు చేశారు. నాటిపొరా చౌరస్తా దగ్గర యుద్ధ సమయపు సకల కవచాలూ ధరించి మోహరించిన బలగంతో ఉన్న ఒక పోలీసు అధికారి ఆ పిల్లలను తన దగ్గరికి పిలిచాడు. వాళ్లతో మాట్లాడతానన్నాడు. పిల్లలు రాళ్లు విసరడం ఆపేశారు. ముసుగు వేసుకున్న పిల్లవాళ్లతో తమమీద రాళ్లు విసరడం ఆపమనీ, కావాలంటే శాంతియుత నిరసనలు చేసుకోవచ్చుననీ పోలీసులు చెప్పారు. బీహార్ నుంచి వలస వచ్చిన కూలీల పొడవాటి వరుస ఆ పిల్లల ముందు నుంచి కదిలిపోయింది. ఆ కూలీల మూపుల మీద చిరిగిపోయిన, బరువైన, పెద్దపెద్ద సంచులు ఉన్నాయి. కోపంతో ఉన్న పిల్లలు కొందరు వెళ్లిపొమ్మని వారిమీద అరిచారు. అప్పుడే ఆ వీథిలోని పెద్దమనిషి, స్థానిక కిరాణాదుకాణం యజమాని, ఆ పిల్లలకూ బీహారీలకూ మధ్య నిలబడి కూలీల మీద అరిచినందుకు వాళ్లను కోప్పడ్డాడు.

ఆ రోజు సాయంత్రానికల్లా, అధికరణం 370ని రద్దు చేసిన విషయం నిర్ధారిస్తూ టెలివిజన్ తెరల మీద వార్తలు వెల్లువెత్తాయి. అప్పటి నుంచి కశ్మీర్ ఒక జైలుగా మారిపోయింది. ప్రతిరోజూ ఇరవై పేజీలు వెలువడే స్థానిక వార్తాపత్రికలు నాలుగు పేజీలకు తగ్గిపోయాయి. ప్రస్తుతానికైతే అందులో రెండు పేజీలు, వాయిదాపడిన పెళ్లి ఉత్సవాల ప్రకటనలే. సెల్ ఫోన్లు మూగపోయాయి. పెద్ద పెద్ద మీసాల సైనికులతో, మెరుస్తున్న ముళ్ల కంచెలతో నగరం భీతావహంగా మారిపోయింది. అన్నిటికన్న దారుణమూ, ఇవాళ్టికి కూడ కొనసాగుతున్నదీ, అన్ని రకాల సమాచార సంబంధాల మీద పరచుకున్న చీకటి. హజ్ యాత్ర కోసం సౌదీ అరేబియాకు వెళ్లిన వారి బంధువులు దిక్కుతోచని స్థితిలో, ఆందోళనలో ఉన్నారు.

అత్యవసరంగా విమాన టికెట్లు కొనుక్కోవాలన్నా కేవలం శ్రీనగర్ విమానాశ్రయంలో మాత్రమే దొరుకుతాయి. వేరువేరు విమాన సంస్థల కార్యాలయాల దగ్గర మనుషులు లేరు. అక్కడ టికెట్ల ఖరీదు, ఎప్పుడెప్పుడు విమానాలున్నాయో చెప్పే బోర్డులు ఉన్నాయి గాని టికెట్ కొనుక్కోవాలంటే విమానాశ్రయానికి వెళ్లవలసిందే. విమానం బయల్దేరుతుందని చెప్పిన సమయానికి మీరు మీ సామానంతా వేసుకుని అక్కడ సిద్ధంగా ఉండాలి. ఆ విమానంలో తగినంత మంది ప్రయాణికులున్నారా, అసలు విమానం

బయల్దేరుతుందా ఎదురుచూస్తూ ఉండాలి. ఆగస్ట్ 10న సాయంత్రం నాలుగు గంటలకు, మధ్యాహ్నం రెండింటికి రావలసిన విమానం గురించి సమాచారం ఏమన్నా చెపుతారా అని అక్కడ తలమునకల పనిలో ఉన్న అధికారిని విమానాశ్రయం కౌంటర్‌లోని అద్దంలోని చిన్న కంత ద్వారా అడగడానికి ఒక తండ్రి ప్రయత్నిస్తున్నాడు. ఆ విమానంలో ఆయన కొడుకు రావలసి ఉన్నదట. ఆయన ఇంకా ఇంటికి చేరలేదు, ఎందుకు చేరలేదో తండ్రికి తెలియదు, ఎయిర్ లైన్ సంస్థకూ తెలియదు.

ఒక స్థానిక వార్తా చానల్ బంధువుల నుంచి తప్పిపోయిన ప్రజల సందేశాలను ప్రసారం చేయడం మొదలుపెట్టింది. కిడ్నీ వైఫల్యానికి చికిత్స చేయించుకోవడానికి సుదూరాన చండీగడ్‌లో ఆస్పత్రిలో చేరిన ఒక భర్త, కశ్మీర్‌లో చిక్కుబడిపోయిన తన భార్య కోసం సందేశం పంపుతున్నాడు. ఆమె కోసం మర్నాడు వేకువజాముున విమానం బుక్ చేశానని ఆయన ఆమెకు చెప్పదలచాడు. కశ్మీర్‌కు బైట ఎక్కడో చదువుతున్న విద్యార్థులు లోయలోని తమ బంధువులు ఆందోళన పడనక్కరలేదని, తాము బాగానే ఉన్నామని రికార్డ్ చేసిన దృశ్య-శ్రవణ సందేశాలను ఈ చానల్‌లో పంపుతున్నారు. తాము ఎట్లాగో అట్లా డబ్బు అప్పు చేసి, తమ కాలేజి ఫీ చెల్లించామని, కుటుంబాలు ఆందోళన పడనక్కరలేదని సందేశం పంపడానికి అష్టకష్టాలు పడుతున్నారు.

ఒక ప్రభుత్వాధికారికి తన కార్యాలయంలో లేకలేక ఒక పనిచేస్తున్న ఇంటర్నెట్ కనెక్షన్ అందుబాటులోకి వచ్చింది. ఆయన తన రాత్రి డ్యూటీ సమయంలో లాగిన్ అయి, కశ్మీర్ బైట ఆందోళనలో ఉన్న బంధువులతో మాట్లాడుతున్నాడు, చాట్ చేస్తున్నాడు. త్వరలోనే ఆయన కశ్మీర్ బైట ఉన్న తన ఇరుగుపొరుగువారి బంధువులతో కూడ సందేశాలు పంచుకోవలసి వచ్చింది. ప్రతిరోజు పొద్దున్నే ఆయన తన వీధిలో వాళ్ల సందేశాలు, వారి ఫేస్ బుక్ ఐడిలు, వాట్సప్ నంబర్లు సేకరించుకుని వెళ్లి సాయంత్రానికల్లా వాళ్ల బంధువుల జవాబులు, స్పందనలు తీసుకొస్తున్నాడు. ఇక అలా ఇచ్చినవాళ్లు తమ ప్రశ్నలకు జవాబుల కోసం రోజంతా కళ్లకు కాయలు కాచినట్టు ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఆయన తన వీథికంతా దైవదూత అయిపోయాడు.

ఇదంతా నేను భూతకాలంలో రాస్తున్నాను గాని ఇందులో ప్రతి అక్షరమూ వర్తమానం. ఇప్పటికీ జరుగుతున్నది.

ఈద్ రోజున, ఆగస్ట్ 12న, కశ్మీర్‌లో ఆంక్షల మధ్యనే ప్రజలందరూ పవిత్ర నైవేద్యపు మేక మాంసాన్ని, ఖుర్బాన్ మాజ్‌ను, బంధువులకూ మిత్రులకూ పంచిపెట్టాలని ప్రయత్నిస్తుండగా, పోలీసు స్టేషన్లన్నీ పెద్ద పెద్ద గుంపులతో నిండిపోయాయి. కశ్మీర్ బైటికి ఫోన్ చేసే అవకాశం కోసం వాళ్లు పోలీసు స్టేషన్‌కు వచ్చారు. అక్కడ వరుసలో నిలబడ్డవాళ్లకు కాక, తన మిత్రుడికి దొడ్డిదారిన ఫోన్ ఇవ్వడానికి ఒక పోలీసు కానిస్టేబుల్ ప్రయత్నించినప్పుడు పోలీస్ స్టేషన్ ముందర పెద్ద కొట్లాట జరిగింది. అక్కడ ఫోన్ దగ్గర విధినిర్వహణలో ఉన్న పోలీసు అధికారి ఆ కానిస్టేబుల్ చొక్కా కాలర్ పట్టుకున్నాడు.

కశ్మీర్ సంక్షోభం గురించి వార్తలు ఇవ్వాలనే అంతర్జాతీయ ప్రచార సాధనాల ఒత్తిడితో, కశ్మీర్‌లో అంతా సవ్యంగా ఉందనే అభిప్రాయాన్ని భారతీయులకూ, ప్రపంచం మొత్తానికీ ఇవ్వాలనే ఉద్దేశంతో, జమ్ము కశ్మీర్ గవర్నర్ కార్యదర్శి ఒకరు ఆగస్ట్ 16న ఒక పత్రికా సమావేశం నిర్వహించాడు. కశ్మీర్ సంక్షోభంలో వెసులుబాటు కల్పించడానికి ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటున్నదో వివరాలు చెప్పడానికి ఆయన ఉపక్రమిస్తుండగానే మా అమ్మానాన్నా ఆ వార్త చూస్తూ వెటకారంగా పక్కున నవ్వారు. అంతా మామూలై పోతున్నదని, మామూలై పోతుందని, ప్రభుత్వం నీరూ విద్యుత్తూ సరఫరా చేస్తున్నదని ఆయన చెప్పాడు.

ఆయన మాటల అర్థం ఏమంటే ఈ ప్రగల్భాలు ఒక మేలిముసుగు కప్పిన హెచ్చరిక అని. ప్రస్తుతానికి ప్రభుత్వం నీటి సరఫరా, విద్యుత్ సరఫరా యథాతథంగా ఉంచింది అని. తమ మౌలిక మనుగడకు అవసరమైన నీటినీ, విద్యుత్తునూ ఇస్తున్నందుకు కశ్మీరీలు ప్రభుత్వానికి కృతజ్ఞులై ఉండాలి అని. అంటే గాలిలోంచి ప్రాణవాయువునూ, ప్రజల మనసుల్లోంచి ఆలోచనలనూ అదుపు చేయగల శక్తే గనుక ఈ ప్రభుత్వానికి ఉంటే, గాలి పీల్చుకోనిస్తున్నందుకూ, ఆలోచించనిస్తున్నందుకూ ప్రభుత్వానికి కృతజ్ఞులై ఉండాలని ప్రజలను అడిగేవారే.

కశ్మీర్‌లో అంతా సవ్యంగా ఉందని ప్రభుత్వం చేస్తున్న ఇటువంటి ప్రకటనలు కశ్మీర్ ప్రజలను ఎప్పుడూ ఆశ్చర్యపరచలేదు. అది ఒక అరిగిపోయిన మాట అయిపోయింది. తెలివితేటల వెలుగు కోల్పోయిన అబద్ధం అది. కశ్మీరీలకు ఆసక్తి కలిగించేదేమంటే, ప్రజల సొంత మేలు కోసం వారి మీద ఇలా విరుచుకుపడడం అవసరమైందనే ప్రభుత్వ ప్రచారంలోని తర్కాన్ని ప్రపంచం ఎట్లా ఆమోదిస్తున్నదనేదే.

ఇప్పటికిప్పుడు, కశ్మీర్‌లో కల్పించబడిన సంక్షోభపు పద్దెనిమిదో రోజున, కశ్మీర్‌లో వాస్తవ పరిస్థితి సరిగ్గా ఇట్లాగే ఉంది. ఒకే ఒక్క మార్పు, లాండ్ లైన్ ఫోన్లు అప్పుడప్పుడు పనిచేస్తున్నాయి గాని అది కూడ ఊగిసలాడుతూ, చాలసార్లు అవకతవకలుగా, అక్కడో ఇక్కడో మాత్రమే అవి పనిచేస్తున్నాయి. ఎప్పుడైనా ఫోన్ పనిచేస్తే, విదేశాలతో మాట్లాడాలంటే, కశ్మీర్ ప్రజలు కశ్మీర్ బైట ఎవరో ఒక మిత్రుడికో, బంధువుకో ఫోన్ చేసి, వారితో ఒక కాన్ఫరెన్స్ కాల్ ఏర్పాటు చేయించుకుని అప్పుడు మాత్రమే మాట్లాడగలుగుతున్నారు.

ఈ సంక్షోభం మధ్య జీవిస్తూ, ఎప్పటికో ఒకప్పటికి సాధారణ సమాచార సంబంధాలు నెలకొంటాయనే ఆశతో నేను ఎన్నో రోజులు ఎదురుచూశాను. కాని అది జరగలేదు. నేను జమ్మూకు చేరిన రోజున, మందకొడిగా పనిచేసే 2జి ఇంటర్నెట్‌తో నేను కొన్ని ముఖ్యమైన ఇమెయిళ్లు చూసుకోగలిగాను. భారత్‌లోనూ, విదేశాల్లోనూ నా గురించి ఆందోళన పడుతున్నవారికి జవాబివ్వగలిగాను. వారు నా భద్రత గురించి ఎన్నోసార్లు సందేశాలు పంపారు. ప్రార్థనలు చేశారు. నేను క్షేమంగా ఉన్నానా అని అడిగారు. చిట్టచివరికి నా ఫోన్ తెరిచి వాట్సప్‌లో వారి సందేశాలు చూశానని రెండు నీలి రంగు టిక్ గుర్తులు వచ్చాక వారి ఆందోళన తగ్గింది. కాని ఆ మర్నాడే ఆ ఫోన్ సేవలు కూడ మూసివేయబడ్డాయి. సంక్షోభం కొనసాగుతున్నది. అయినా ప్రభుత్వం ఇంకా "అంతా ప్రశాంతంగా ఉన్నద"నే అంటున్నది.

(రచయిత కశ్మీర్‌లో విశ్వవిద్యాలయ జర్నలిజం ప్రొఫెసర్. ది హాఫ్ మదర్ అనే నవల, స్కాటర్డ్ సోల్స్ అనే కథల సంపుటం ద్వారా ప్రపంచ ప్రఖ్యాతి పొందారు.)

https://time.com/5659671/kashmir-indian-government/?fbclid=IwAR1n_CcgaG-7BgBWcrGQVN-zcnXJ7iwku7huXpbZSjQTHp1LPv1MZB3x7yg

కశ్మీరీ పండితులు భారత్ చేతి ఆయుధాలు కావద్దు

స్వయంగా కశ్మీరీ పండిత కుటుంబం నుంచి వచ్చినప్పటికీ కశ్మీరియత్, మానవత్వం, ప్రజాస్వామ్యం ప్రాతిపదికగా కశ్మీరీలకు వర్తమాన విషాదం నుంచి బైటపడే మార్గం సూచిస్తున్నారు **నిశితా త్రిసాల్**

ఈ నెల భారత ప్రభుత్వం ఏకపక్షంగా కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసింది. కశ్మీర్ వివాదానికి శాంతియుత, ప్రజాస్వామ్యయుత పరిష్కారం కనుగొనాలంటూ ఐక్యరాజ్య సమితి భద్రతామండలి చేసిన ఎన్నో తీర్మానాలను ఉల్లంఘిస్తూ జరిగిన చర్య ఇది. కశ్మీరీ ముస్లింల మీద తాను జరుపుతున్న హింసాకాండకు సమర్థన కోసం కశ్మీరీ పండితుల బాధనూ నష్టాన్నీ సాధనంగా వాడుకోవడం అనే పాత వ్యూహానికే ప్రస్తుత ప్రభుత్వం ఈ కనికట్టు చర్యతో మళ్లీ జీవం పోసింది. ఒక కశ్మీరీ పండిత్‌గా, అంతకన్న ముఖ్యంగానూ మొదటగానూ కశ్మీరీగా, ఈ వైఖరిని నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నాను.

కశ్మీరీ పండితులు భారత ఆక్రమణలో ఉన్న ముస్లిం ఆధిక్య ప్రాంతమైన కశ్మీర్‌లోని హిందూ మతానికి చెందిన అల్పసంఖ్యాకవర్గం. వారు భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన 1989 సాయుధ తిరుగుబాటు సందర్భంలో అక్కడి నుంచి తరలివెళ్లారు. అలా ఇతర ప్రాంతాలకు తరలిపోయిన కశ్మీరీ పండితుల సంఖ్యను అధికారిక కథనాలు ఒక లక్షా యాభై వేల మంది నుంచి మూడు లక్షల వరకూ భిన్నంగా చెపుతున్నాయి. కాని ఈ విషాదం గురించిన లెక్కల మీద వాదనలు లోతైన వాస్తవాన్ని మరుగు పరుస్తున్నాయి: 1989 నాటి ఘటనలు, తదనంతర పరిణామాలు కశ్మీరీ పండితులకు తమ గురించి తమకు ఉన్న అవగాహనను, కశ్మీరీ ముస్లింలతో వారి సంబంధాన్ని మౌలికంగా మార్చివేశాయి. అవి ఎప్పటికీ పూడ్చిపెట్టడానికి వీలులేని వేదనను సృష్టించాయి. ఇప్పటికైనా పరిష్కరించవలసిన ఆగ్రహాన్ని సృష్టించాయి.

ఆ వేదనా, ఆ ఆగ్రహమూ స్పష్టంగా కనబడుతుండే కుటుంబంలో నేను పెరిగాను. మేం అమెరికాలో నివసిస్తుండినప్పటికీ, మా జీవితాల్లో కశ్మీర్ ఎప్పుడూ ఉనికిలో ఉంటూ వచ్చింది. మేం ఇంగువ వేసి వండుకునే తామరతూళ్ల, నూల్ కోల్ కూరలో కశ్మీర్ జీవించే ఉంది. మాలో ఒకరితో ఒకరిని మాత్రమే కాదు, నేనెన్నడూ చూడని, కేవలం వినికిడిలో మాత్రమే ఉన్న కశ్మీరీ ముస్లింలను కూడ, మాతో సన్నిహితంగా కలిపే సుమధురమైన కొషుర్ భాషలో కశ్మీర్ జీవించే ఉంది. రాజధాని శ్రీనగర్‌లో వెలుగులీనే మా స్వగృహం గురించిన మా కుటుంబ కథల్లో కశ్మీర్ జీవించే ఉంది.

కాని ఆ ఇల్లు ఇంకెంతమాత్రం మాది కాదు. ఇక కశ్మీర్‌కు తిరిగివెళ్లే సూచనలేమీ కనబడక మా తాతయ్య (అమ్మ తండ్రి) సంకోచిస్తూనే ఆ ఇంటిని 1997లో అమ్మేశాడు. ఆ ఇంటిని ఆయన నలభై ఏళ్ల కింద సొంతంగా నిర్మించాడు. మా అమ్మమ్మ, కొందరు పనివాళ్లు సాయం చేస్తుండగా ఒక్కొక్క కిటికీ చట్రం ఆయనే పేర్చాడు. లెక్కలేనంతమంది ప్రాణాలు కోల్పోయిన, లెక్కలేనంతమంది మాయం చేయబడిన ఆ ఘర్షణలో ఒకానొక ఇంటి ప్రాధాన్యతను అర్థం చేసుకోవడం కష్టం కావచ్చు. కాని 25, బాల్ గార్డెన్ అనే పేరున్న మా కుటుంబ స్వగృహాన్ని కోల్పోవడం అంతకన్న చాల ఎక్కువ నష్టానికి ప్రతీక. అది మా అస్తిత్వాన్ని, చరిత్రను బలవంతాన లాగివేసుకోవడమని మా కుటుంబం అనుకుంటుంది.

సరిగ్గా ఈ కోల్పోయామనే భావననే, ఈ రద్దు భావననే హిందుత్వ శక్తులు 1989 నుంచి సొమ్ము చేసుకుంటున్నాయి. కశ్మీర్‌ను ఒక రాజకీయ వ్యవహారంగా చూసే బదులు, భారతీయ జనతా పార్టీ, దాని మిత్రులు, కశ్మీర్‌ను ప్రాథమికంగా ఒక మతోన్మాద అంశంగా, ఆర్థిక అంశంగా మార్చివేశారు. తమకు అన్యాయం జరిగిందనుకునే కశ్మీరీ పండితుల వాస్తవ అనుభవాన్ని ఎగదోసి, పండితుల బాధలనూ ముస్లింల బాధలనూ ఒకదానికి మరొకదాన్ని పోటీ పెట్టారు.

కశ్మీర్‌ను విభజించి పాలించాలనే ప్రస్తుత హిందుత్వ వ్యూహాలు సరిగ్గా సామ్రాజ్యవాద దురాక్రమణ పద్ధతులను ప్రతిధ్వనిస్తున్నాయి. సామ్రాజ్యవాద పద్ధతులు ప్రస్తుతం పెచ్చరిల్లుతున్న మత వాదానికన్న ముందునుంచే ఉన్నాయి. అటువంటి వ్యూహాలు వలసవాద పూర్వ యుగంలోనూ ఉన్నాయి. భారత స్వాతంత్ర్యం తర్వాత కూడ కొనసాగుతున్నాయి. ఇవాళ ప్రతిపక్షంలో భాగమైన కాంగ్రెస్ పార్టీ కశ్మీర్ రాజ్యాంగ స్వతంత్ర ప్రతిపత్తిని పథకం ప్రకారం బలహీనపరచడానికి, ఎన్నికల ప్రక్రియలో అవినీతికి, రాజకీయ రంగాన్ని చీలికలు చేయడానికి తన వంతు ప్రయత్నాలు చేసింది. ఇప్పుడిక భారతీయ జనతా పార్టీ మనను ఒక అంచుకు నెట్టగలిగింది. "అభివృద్ధి" మీద తన వాదనలకు, కశ్మీరీ పండితుల వలసను కలిపి, భారత్ – అదుపులోని జమ్ము కశ్మీర్ పై తన అప్రజాస్వామిక, చట్టవ్యతిరేక ఆక్రమణను సమర్థించుకుంటున్నది. భారత్ సాగించిన ముట్టడులలోకెల్లా దారుణమైన ముట్టడిని స్థాపించుకుంటున్నది.

ఈ చారిత్రక పూర్వరంగంలో, పండితుల వలసకు దారితీసిన పరిస్థితులను ఎప్పుడూ సక్రమంగా పరిశోధించకపోవడం ఆశ్చర్యకరమేమీ కాదు. ఒకదాని తర్వాత ఒకటిగా ప్రభుత్వాలన్నీ తమ స్థితిని ఇలా ప్రదర్శనకు పెడుతుంటే పండితులు కూడ ఆగ్రహం ప్రదర్శించకపోవడం, అసలు గుర్తించకపోవడం కూడ ఆశ్చర్యకరం కాదు. ఒక వేదన శారీరకంగా, మానసికంగా విశ్లేషణకు గురికాకుండా ఉండిపోయినప్పుడు, ఆ బాధ నుంచీ, దుఃఖం నుంచీ బయటపడడం చాల కష్టం. కశ్మీరీ పండితుల విషయంలో జరుగుతున్నదదే. మానవ జీవితాలను, రాజకీయ స్వేచ్ఛను, సమన్వయాన్ని పణంగా పెట్టి భౌగోళిక సార్వభౌమత్వాన్ని

ఆర్టికల్ 370 రద్దు - కశ్మీరీల స్వేచ్ఛాకాంక్షలపై గొడ్డలి వేటు

బోనులో బంధించబడ్డ పులి కశ్మీర్

కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తినిచ్చే ఆర్టికల్ 370, 35 (ఎ)ను అప్రజాస్వామికంగా రద్దుచేసి కశ్మీర్ ప్రజలను తమ అధికార బలంతో అణచివేయడం సమస్యకు పరిష్కారం కాదని అంటున్నారు **రాజేంద్రబాబు అర్విణి**

ఇప్పుడు బోనులో బంధించబడ్డ పులి కశ్మీర్. నిజానికి కశ్మీర్‌ను పులితో పోల్చడం సరికాదు. అది చెంగుచెంగున ఎగిరే ఒక జింక పిల్ల. చారదేసి కళ్లతో, ఆకాశమంతా వందలాది, వేలాది చల్లటి చందమామలు పరుచుకున్నట్లు, సాగిన చంద్రవంకల లాగా చల్లటి మచ్చలతో మెరుస్తున్న చర్మం, మెత్తగా కొనదేలి ఉన్న కొమ్ములు, చూడగానే చురుకుదనం, చల్లదనం, ప్రశాంత వదనం. కశ్మీర్ లోయలో విరబూసిన అందాల గురించి, కశ్మీరీల గురించి ఉర్దూ, పర్షియన్ భాషలలో ఎన్నో కవితలు రాయబడ్డాయి. 14వ శతాబ్దపు కవి అఖార్ ఖుస్రో 'ఈ భూతలంలో స్వర్గం అనేది ఉంటే... అది ఈ కశ్మీరమే... ఇదే... ఇదే... ఇదే...' అని ఒక కవితలో రాశాడు. కశ్మీర్‌లోయ మాత్రమే కాదు కశ్మీర్ ప్రజలు కశ్మీరియత్ జీవన విధానంతో, సూఫీ వేదాంతం వెదజల్లిన సంస్కృతితో అత్యంత సంస్కారవంతులైనవారు.

అలాంటి కశ్మీర్ ఇప్పుడు బోనులో బంధించబడ్డ పులి. అందంగా, అమాయకంగా ఛెంగుఛెంగున ఎగిరే లేడిపిల్లను ఆగ్రహాన్ని దిగమింగుకొని, చూపరులను భయకంపితులను చేసే బెబ్బులిలా తయారు చేసిన అమానుషత్వం ఏది? (అవును... కశ్మీర్ అంటే భయం. లేకపోతే లక్షలాదిగా సైన్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఎందుకు దింపింది? ప్రతి పదిమంది కశ్మీరీలకు ఒక సైనికుడు చొప్పున ఎందుకు కాపలా కాస్తున్నారు. మారుమూల పల్లెల్లో కూడా ప్రతి ఇంటి ఎదురుగా ఒక సైనికుడో, ఒక పోలీసో ఎందుకు పహారా చేస్తున్నారు. దీనికి ఏది కారణం? ఎవరు కారణం? అందలమెక్కి కోరలు చాచి విషం విరజిమ్మడానికి సిద్ధంగా ఉన్న మతతత్వమా? ప్రకృతి వనరులు మిన్నగా ఉన్న అటవీ ప్రాంతాన్ని కొల్లగొట్టే రాబందులకు ఎరగా వేసే దళారీ తత్వమా? కారణం ఏదైనా కావచ్చు, ఇప్పుడు కశ్మీర్ బోనులో బంధించబడ్డ పులి. బోను బయట ఈలలు వేస్తూ, గేలిచేస్తూ, కేరింతలు కొడుతూ ఆకతాయి కుర్రాళ్లు. ప్లెబిసైట్ అని, జనవాణియే నిర్ణయిస్తుందని అప్పటి గవర్నర్ జనరల్ మౌంటుబాటన్ ప్రతిపాదిస్తే సై అంటూ చంకలెగరేసిన భారత పాకిస్తాన్ దేశాలు రెండూ, తిరిగి మామూలు పరిస్థితులు ఏర్పడగానే జమ్ము కశ్మీర్‌లో జనాభిప్రాయ సేకరణ చేద్దాం అని చెప్పిన ఐక్యరాజ్య సమితి తనకేమీ పట్టనట్లు ఇప్పుడు దిక్కులు చూస్తుంది. అంతర్జాతీయంగా ప్రభుత్వాలు మౌనముద్ర వహించాయి. అగ్రరాజ్యాలు మానవీయ విలువల కంటే 130 కోట్ల మంది కొనుగోలు దారులు గల మార్కెట్ మాకు ముఖ్యం అని మనసులో అనుకొని 'ఇది మీ వ్యవహారం మీరే తేల్చుకోండి, అని పైకి అనేశాయి. ఇతర దేశాలలో ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు మాత్రం కశ్మీర్ ప్రజల వైపే ఉన్నారు. కాని ప్రపంచంలోనే పెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే మనదేశంలో పరిస్థితి ఏమిటి? కశ్మీరీ ప్రజలకిచ్చిన స్వయం ప్రతిపత్తి హామీని ఒక్కొక్క వలువ వొలిచినట్లుగా (1954 నుండి 1995 వరకు ఆర్టికల్ 370,

---

సాధించడానికి దుర్మార్గ కార్యకలాపాలు చేస్తున్న ప్రభుత్వాలు అందుకోసం ఆ దుఃఖాన్ని వాడుకుంటున్నప్పుడు, దాని నుంచి బైటపడడం దాదాపుగా అసాధ్యమవుతుంది. కాని తరతరాల కశ్మీరీ పండితుల దుఃఖాన్ని పరిష్కరించే మార్గం కశ్మీరీ ముస్లింలను అణచివేయడం మాత్రం కాదు.

వారసత్వంగా వచ్చిన అభిప్రాయాలను మార్చివేయడమే ఇప్పుడు కశ్మీరీల ముందు ఉన్న కర్తవ్యం. దశాబ్దాలుగా కశ్మీరీ పండితుల, ముస్లింల నష్టాలూ దుఃఖాలూ ఎందుకూ కొరగానివిగా లెక్కించబడుతున్నాయి. ఎప్పటికంటె ఎక్కువగా ఇప్పుడు కశ్మీరీ యువత ఒక కొత్త మార్గాన్ని కనిపెట్టవలసి ఉన్నది. అది ఒకరితో ఒకరికి సమన్వయ మార్గం, సంఘీభావ మార్గం, మైత్రీబంధపు మార్గం. ఒకరి సత్యాలనూ కథనాలనూ మరొకరు తెలుసుకోవడానికి చురుకుగా ప్రయత్నించడంతో ఆ పని మొదలుపెట్టవచ్చు. మన దుఃఖాన్ని వాడుకుని తన పబ్బం గడుపుకోవ డానికి రాజ్యం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవడం ద్వారా ఆ పని మొదలుపెట్టవచ్చు. సంక్లిష్టమైన కశ్మీర్ చరిత్రను లోతుగానూ, విశాలం గానూ అధ్యయనం చేయడం ద్వారా ఆ పని మొదలుపెట్టవచ్చు. మన కుటుంబాల లోపల మత దురభిమానాన్నీ ద్వేషాన్నీ ఎండగట్టడం ద్వారా ఆ పని మొదలుపెట్టవచ్చు. కశ్మీర్‌లో భారత అత్యాచారాలను ఖండించడం ద్వారా ఆ పని మొదలుపెట్టవచ్చు. కేవలం పోటీపడే అస్తిత్వ ఆకాంక్షలకు కుదించకుండా, భిన్నత్వాన్ని ఆమోదించే, గౌరవించే కశ్మీరీ రాజకీయ సముదాయాన్ని కలగనడం ద్వారా ఆ పని మొదలుపెట్టవచ్చు.

మన నుంచి మనం దాటి చెయ్యి అవతలికి చాచడం మన సొంత సముదాయం పట్ల ద్రోహం అని అనిపించవచ్చు. కాని కచ్చితంగా కాదు. అది మన సామూహిక చికిత్సకూ స్వేచ్ఛకూ ఏకైక మార్గం.

(రచయిత ఆన్ ఆర్బర్‌లోని యూనివర్సిటీ ఆఫ్ మిషిగన్‌లో సోషియో కల్చరల్ ఆంత్రొపాలజీ శాఖలో పరిశోధక విద్యార్థి)

(https://www.washingtonpost.com/opinions/2019/08/22/i-am-kashmiri-pandit-india-must-stop-weaponizing-pain-our-past/bclid=IwAR35CM_HOXUnCIsYllZImk1n 4c8402fLc_0zO1idIdt5pAa3GdfdSNgqAS0)

వీ

ఆర్టికల్ 35 (ఎ)లను బేఖాతర్ చేస్తూ 200 ప్రభుత్వ ఆర్డర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ జారీ చేశాయన్న వాస్తవం మరవొద్దు) విప్పిపారేసి చివరికి అప్రజాస్వామ్యంగా ముట్టడి చేసి, గందరగోళ పరిస్థితికి నెట్టివేయడం ఒక విషాదం అయితే, భారతదేశంలో మధ్యతరగతి ప్రజలు, సామాన్య జనాలు కూడా 'హమ్మయ్య కశ్మీరు సమస్యకు ఒక పరిష్కారం దొరికింది ఇన్నాళ్లకు... ధైర్యంగా నిర్ణయం తీసుకునే నాయకుడు...' అని ఊపిరి పీల్చుకున్నట్లుగా మాట్లాడుకోవడం మరింత పెద్ద పెను విషాదం.

వందలాది ఏళ్లుగా ఎన్నో విషాదాలను దిగమింగుకున్న కశ్మీర్ ఇప్పుడు బోనులో బంధించబడ్డ పులి. 1846 మార్చ్ 16 నాడు గులాబ్‌సింగ్ అమృత్‌సర్‌లో బ్రిటిష్ ప్రభుత్వంతో ఒడంబడిక చేసుకున్నప్పుడు కశ్మీర్‌ను తన పూర్తి ఆధీనంలో ఉంచుకోవడానికి బ్రిటిష్ వారికి ప్రతి సంవత్సరం ఒక గుర్రం, 12 మేలిరకం మేకలు, 3 జతల కశ్మీరీ శాలువలు నజరానాగా ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. ఆ తర్వాత కొద్ది రోజులకే ఆ నజరానా కూడా మారిపోయి 2 కశ్మీరీ శాలువాలు, మూడు కశ్మీరీ చేతి రుమాళ్లకు కుదించబడ్డది. అయినా కశ్మీరీలు తమను ఇంత చౌకగా బేరానికి పెట్టారా అని ప్రశ్నించలేదు. తదుపరి కొన్ని నెలలకు కశ్మీర్, జమ్ము, లధక్, గిల్గిట్‌లను కలుపుకొని ఇండస్, రావి నదుల మధ్య భాగాన్ని గులాబ్‌సింగ్ హస్తగతం చేసుకోవడానికి బ్రిటిష్ వారికి సాలీనా 75 లక్షల రూపాయలు చెల్లించాల్సి వచ్చింది. అప్పుడూ ఇతర ప్రాంతాలను కలిపితేనే తనకు ఆ మాత్రం విలువ అని వగచలేదు. ఒకానొక సందర్భంలో తమకు అత్యవసరంగా 500 లీటర్ల పెట్రోల్ కావలిసివస్తే, ఆ మాత్రం పెట్రోల్ కూడా సాయం చేయ్యలేని పాకిస్తాన్‌పై కశ్మీర్ ఎన్నడూ ఆశలు పెట్టుకోలేదు. ఆపద సమయంలో పెట్రోల్ పంపి ఆదుకున్న భారత్‌నే స్నేహితునిగా భావించింది. కాని ఇప్పుడు విశ్వాసఘాతుకంతో మోసపోయామని, బ్రిటిష్ వాడు దేశం నుండి వెళ్లిపోతూ 'రెండు దేశాల సిద్ధాంతాన్ని' ముందుకు తీసుకొచ్చినప్పుడు 'తాము భారత్‌లో కలిసి తప్పు చేశామని' భావిస్తున్నారు. షేక్ అబ్దుల్లా ముందుచూపు లేకుండా వ్యవహరించాడని చింతిస్తున్నారు. ఇప్పుడు సంఘ్‌పరివార్ శక్తులు షేక్ అబ్దుల్లా స్నేహంలో నెహ్రూ కళ్లు మూసుకుని ప్రవర్తించాడని నిందలు మోపుతున్నారు. కశ్మీర్‌కు అనవసరంగా 370 అధికరణం ద్వారా ఎన్నో హామీలు ఇచ్చి భారత్‌ను అన్యాయం చేశాడని, జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ 370 అధికరణాన్ని వ్యతిరేకించాడని దేశ ప్రజలు నమ్మేలా ప్రచారం చేస్తున్నారు కాని, షేక్ అబ్దుల్లాను అరెస్టు చేసి చాలా కాలం పాటు జైల్లో ఉంచిందెవరు? నెహ్రూ కాదా! ప్రధాన మంత్రి హోదాను షేక్ అబ్దుల్లా నుండి పీకేసింది ఎవరు? నెహ్రూ కాదా! నెహ్రూ కాలం నుండే 370 అధికరణకు తూట్లు పొడవడం ప్రారంభమైందని, విశ్వాసఘాతుక ప్రక్రియ నెహ్రూయే ప్రారంభించాడని కశ్మీరీలు భావిస్తే తప్పేముంది! శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆ సమయంలో కేంద్ర మంత్రి. మంత్రి మండలి సభ్యుడిగా ఆయన 370 అధికరణానికి తన అసమ్మతిని వ్యక్తపరిచినట్లుగా ఎక్కడా రికార్డు కాలేదు. కశ్మీర్ మాదంటే మాదని గత 75 ఏళ్లుగా ఇండియా, పాకిస్తాన్‌లు కొట్లాడుకుంటూనే ఉన్నాయి. కాని కశ్మీరీలను మీ ఇష్టా ఇష్టాలేమి? మీ చరిత్ర ఏమిటి? మీరు ఏ దేశంలో ఉండాలని అనుకుం టున్నారు? అని అడిగిన పాపాన పోలేదు ఎవ్వరు! ఇండియా, పాకిస్తాన్‌లు కాదు... 'మా మానాన మమ్మల్ని వదిలిపెట్టండి' అని కశ్మీరీలు రోదిస్తున్నారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో చర్చకు వచ్చిన ప్లెబిసైట్ ప్రస్తావన హుళక్కి అయిపోయింది. చివరికి భారత రాజ్యాంగం గ్యారంటీ చేసిన ప్రత్యేక హోదా, స్వతంత్ర ప్రతిపత్తి – ఇవన్నీ పోయాయి.

ఇక బోనులో చిక్కిన బెబ్బులి కాక కశ్మీర్ మరేమవుతుంది. కశ్మీర్‌ను తమ దేశ శరీరంలోంచి విడదీయలేని ఒక భాగంగా, కశ్మీర్ అంటే భారతదేశ శిరస్సు అని భారతీయులు ఫీలవుతారు. పాకిస్తాన్ స్కూళ్లలో పిల్లలు, బయట ప్రజలు తమ దేశపు తలపై ఉండే కిరీటంలా భావిస్తారు. కాని కశ్మీరీలు మాత్రం తమ కశ్మీరియత్‌ను కాపాడుకోవాలని, తమ అస్తిత్వం తమకు మిగలాలని, ఫ్యాక్టరీ పొగ గొట్టాలు, గనుల తవ్వకాలు లేకుండా రమణీయ సుందర ప్రకృతిలో భాగంగా ఉండిపోవాలని కోరుకుంటున్నారు. ముస్లిం స్త్రీలు బురఖా ధరించడం మనం చూస్తాం. కాని కశ్మీరీ మహిళలు బురఖ వేసుకోరు. కశ్మీరీ స్త్రీలు పురుషులతో పాటు శ్రమైక జీవన సౌందర్యంలో భాగం. పురుషులు వంట పనుల్లో, పిల్లల పెంపకంలో పాలుపంచుకుంటారు. అది కశ్మీరియత్. ఈనాటి ఈ పరిస్థితికి కారణాలు అన్వేషించినప్పుడు 'జాతీయ వాదం' పేరుమీద 'మెజారిటేరియనిజం' ఊపందుకోవడం మనకు వెంటనే స్ఫురిస్తుంది. 1990 లలో పాకిస్తాన్ నుండి జిహాదీలు పెద్ద ఎత్తున కశ్మీర్‌లోకి ప్రవేశించడం ప్రారంభమైంది. వేర్పాటు వాదులు కూడా రోజు రోజుకూ విజృంభించడం, పాకిస్తాన్‌తో చాలా కాలంగా పెరుగుతున్న శత్రుత్వం – ఇవన్నీ కారణాలు కావచ్చు. 'జై శ్రీరాం' అననందుకు 17 ఏళ్ల ఓ ముస్లిం యువకున్ని నడిరోడ్డు మీద కాల్చి బూడిద చేసిన సంఘటనలు పునరావృతమవుతున్న సామాజిక పరిస్థితులు దేశంలో నెలకొన్నప్పుడు, దానికి మూల్యం చెల్లించుకోవాల్సింది కశ్మీరీల భవిష్యత్తా అన్నది ప్రశ్న. మొన్న జరిగిన ఎన్నికల సందర్భంగా ఓ ర్యాలీలో బిజేపి నాయకుడొకరు 'ముస్లిం స్త్రీల సమాధులు తవ్వి, బయటకు తీసి రేప్ చేయాలని' ప్రసంగించాడంటే ప్రజల ఆలోచనలను ఎంత విషపూరితం చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ అయిదేళ్ల కాలంలో పెల్లెట్ గన్‌ల వల్ల ఎన్నో వందల మంది కశ్మీరీలు అంధులయ్యారు. రాజ్యాంగంలోని 370, 35 (ఎ) అధికరణాల వల్ల నామ మాత్రపు గుర్తింపును, ప్రత్యేకతను, భూముల ఆస్తుల పరిరక్షణను పొందిన కశ్మీరీల పట్ల సానుభూతి ఉండనవసరం లేదన్నట్లుగా, వారిపట్ల చులకన భావం కలిగేటట్లుగా, వారు మన బానిసలుగా ఉండదగ్గవాళ్లు, వాళ్లకు ప్రత్యేకత ఏమిటి అని ప్రజల భావాలను మలిచే ప్రయత్నం ఎలా జరుగుతుందంటే సాక్షాత్తు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి 'అందమైన కశ్మీరీ యువతులను పెళ్లి చేసుకోవచ్చు' అంటూ హిందూ యువకులకు ఉద్బోధిస్తున్నాడు. 1947లో దేశ విభజన జరిగిన సమయంలో అల్లర్లు, విధ్వంసకాండ, మనుషుల ఊచకోత, మానభంగాలు, గృహ దహనాలు ఒకెత్తయితే, ఇప్పుడు కశ్మీర్ భవిష్యత్తును గాఢాంధకారంలోకి తోసివేయడం, అభద్రతా భావం కలగజేయడం మరో పార్శ్వం.

ఈ వ్యాసం రాసే సమయానికి కశ్మీర్ అంతటా అయోమయం అలుముకుంది. చాలా చోట్ల కర్ఫ్యూ లేదా కర్ఫ్యూ లాంటి వాతావరణం. ఇంటర్నెట్ లేదు, టివీలు లేవు. సెల్‌ఫోన్‌లు మూగబోయాయి. కమ్యూనికేషన్ లేదు. 'అనారోగ్యం పాలుకావద్దండి. ఎందుకంటే బాగు చేయడానికి మందులు లేవు. మందుల సరఫరా ఆగిపోయింది' అని

డాక్టర్లు, మందుల దుకాణదారులు సలహా ఇచ్చే పరిస్థితి. న్యూయార్క్ టైమ్స్ పత్రిక (2019 ఆగస్టు 15) అక్కడ మందుల కొరత గురించి ప్రధానంగా పేర్కొంది. మధుమేహ వ్యాధి గ్రస్థులకు అవసరమయ్యే ఇన్సులిన్, చిన్న పిల్లలకు కావాల్సిన పోషకాహారం కొరత తీవ్రంగా ఉంది. బ్యాంకులు, ఎటిఎం సెంటర్లు మూసివేయబడ్డాయి. క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు ఉపయోగించే పరిస్థితి లేదు. (ఇంటర్నెట్ లేదు కాబట్టి). నగదు కొరత, స్కూళ్ల సంగతి సరేసరి. కమ్యూనికేషన్ వ్యవస్థ నిర్వీర్యం కావడంతో సామాజిక సంబంధాలు తెగిపోయాయి. అంతా అస్తవ్యస్తం అయిపోయింది. అధికరణాలు 370, 35 (ఎ)లను రద్దుచేస్తూ పార్లమెంట్, భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న వెంటనే న్యూయార్క్ టైమ్స్ పత్రిక దాదాపు 50 మంది కశ్మీరీలను ఇంటర్వ్యూ చేస్తే వారంతా భారతదేశం తీసుకున్న చర్యను తీవ్రంగా నిరసించారు. ఇప్పటికే చాలా మంది కశ్మీరీలు ఈ దేశంను తమ దేశంగా భావించరు. ఈ చర్య భారత్ నుండి వారి పరాయీకరణను ఇంకా పెంచుతుంది. తద్వారా తిరుగుబాటు దారులు బలపడతారు అన్న భావన వ్యక్తపరిచారు. గ్రామీణ ప్రాంతాలలో ఈపాటికే చాలా మంది యువకులు కనిపించకుండా పోయారని వయసు మీరినవారు చెప్పారు. వారంతా అజ్ఞాత జీవితంలోకి వెళ్లిపోయారని ఏమీ జంకులేకుండా సమాధానమిచ్చారు. రవికాంత అన్న సైనికుని మాటల్లో 'ఎప్పుడు బడితే అప్పుడు, రాత్రి గాని పగలు గాని, వారికి అవకాశం దొరికినప్పుడల్లా గుంపులు గుంపులు, డజను రెండు డజన్లు మూడు డజన్ల మంది మా మీద రాళ్లు విసిరి, చెల్లాచెదురయి పోతున్నారు. ఇక్కడి ప్రజలు చాలా కోపంగా ఉన్నారు. వారు వెనుదీయకుండా ఉన్నారు. ఏమాత్రం భయపడడం లేదు'. సైన్యం, కేంద్ర రిజర్వ్ పోలీసులు, కశ్మీర్ రాష్ట్ర పోలీసు దళాలు లోయలో అంగుళం అంగుళం వ్యాపించి ఉన్నారు. మహమ్మద్ లతీఫ్ పాట్రు మాటల్లో '1990ల నుండి ఇంతవరకు ఎన్నో అణచివేతలను అనుభవించాం గాని, ఇది అన్నింటికన్నా దారుణమైనది. కశ్మీర్ ప్రతిపత్తి... ఒకప్పుడది నిండుకుండ. మెల్లమెల్లగా దాన్ని ఖాళీ చేశారు'. కశ్మీరీల భయం 'బయటి వాళ్లు వచ్చి భూముల్ని కొనేసి, ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకొని వాళ్ల జనాభా పెరిగిపోతుంది. మేము మైనారిటీలమై పోతాము. మా భూమిపై మేము మైనారిటీ'.

వార్తల కోసం, సమాచారం కోసం కశ్మీరీలు మొహం వాచి ఉన్నారు. బయట ప్రపంచంలో ఏమి జరుగుతుంది... తమను గురించి ఎవరు ఏమనుకుంటున్నారు, తమ ప్రాంతంలో పరిస్థితి ఎలా ఉంది... ఈ వార్తలేమీ వాళ్లకు చేరడం లేదు. వారు ఒంటరివారైపోయారు. ఈ అధికరణాలను ఎత్తివేసిన నాలుగు రోజులకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ కశ్మీర్ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ కొత్త ఆశలను, అవినీతి అంతాన్ని వాగ్దానం చేశాడు. ఫెడరల్ వ్యవస్థలో కశ్మీర్‌ను పటిష్టం చేస్తానన్నాడు. ఇవేవీ కశ్మీరీలకు చేరనే లేదు. కొన్ని రోజుల తర్వాత ఏ పత్రిక ద్వారానో తెలుసుకున్న వారు మోడీ మాటలు నమ్మే పరిస్థితిలో లేరు. 'అభివృద్ధిని వాగ్దానం చేస్తున్నారు. కాని, ఈ అభివృద్ధి ఎవరి కోసం?' అని ప్రశ్నిస్తున్నారు. నూయార్క్ టైమ్స్ వార్తా పత్రిక ప్రకారం 50కి పైగా ఉండే కశ్మీరీ దిన పత్రికలలో కేవలం 6 పత్రికలు మాత్రమే ఇప్పుడు అతికష్టం మీద నడుస్తున్నాయి. అదీ తక్కువ పేజీలతో ప్రింటింగ్ మిషిన్ మీద అచ్చువేసి వందల కాపీలు మాత్రమే పంచగలుగుతున్నారు. మొహియిద్దీన్ అనే ఒక చిన్న పత్రికా సంపాదకుడు తాను 5 నిమిషాలలో 500 పేపర్లు అమ్మినట్లు న్యూయార్క్ టైమ్స్ విలేకరితో చెప్పాడు. జర్నలిస్టులు పాత రోజుల లాగా పెన్ను, నోట్‌బుక్‌లతో పనిచేస్తున్నారు. కశ్మీర్ పాత్రికేయులు భయానక పరిస్థితులకు అలవాటు పడ్డారు. ఈ ఐదేళ్ల కాలంలో పలువురు జర్నలిస్టులు చంపబడ్డారు. ఎంతో మందిని అరెస్టు చేశారు. మరికొంత మంది జర్నలిస్టులు వార్తలు సేకరించడానికి వెళ్లి పెల్లెట్ గన్‌లవల్ల కళ్లు పోగొట్టుకున్నారు. న్యూయార్క్ టైమ్స్ విలేకరికి మరో విచిత్రమైన సంఘటన ఎదురయింది. బక్రీద్ పండుగ ముందు కొన్ని గొర్రెలను పెట్టుకొని వాటిని అమ్మడం కోసం ఒక పల్లెటూరి రైతు రోడ్డు పక్కన కూర్చున్నాడు. కొనడానికి ఎవరూ రాలేదు కాని, వీరి కారు అక్కడ ఆగింది. ఆగిన కారు దగ్గరకు ఆ గొర్రెల కాపరి వడివడిగా పరుగెత్తుకొచ్చి 'తుపాకీలు తెచ్చారా, మేం సిద్ధంగా ఉన్నాం' అని అన్నాడు. ఆ కారులో వీరితో పాటు కూర్చున్న ఓ పోలీస్ వ్యక్తిని చూసి అక్కణ్నుంచి మెల్లిగా నడుచుకుంటూ వెళ్లిపోయాడు. న్యూయార్క్ టైమ్స్ పత్రికలో వచ్చిన మరో ఉదంతం: ఓ మారుమూల గ్రామంలోని హాజీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్. పేరు సబ్బాహాజీ. ఆమె తన విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులను ఆన్‌లైన్‌లో తల్లిదండ్రులకు పంపిస్తుండగా, ఇంటర్నెట్ బంద్ అవుతున్నదని వార్త వచ్చింది. అప్పుడు ఆమె స్పందన 'ఇంటర్నెట్‌ను చంపేయవచ్చు. కాని, మేం ఇంకా జీవించే ఉన్నాం. గుర్తుంచుకోండి'.

ప్రజాభిప్రాయాన్ని అణిచిపెట్టడం కొంత కాలం వరకే సాధ్యం. అది ఆ ప్రాంతానికి శాశ్వత శాంతిని సాధిస్తుందా అన్నది అనుమానమే. ఆర్టికల్ 371 (డి)లో పొందుపరచబడిన ఉల్లంఘనలే కదా తెలంగాణ ఉద్యమానికి మూల కారణం. తెలంగాణ ప్రజల అభీష్టాన్ని పాలకులు అణచిపెట్టగలిగారా? ప్రజల మనోభావాలను పక్కదారి పట్టించడానికి ఎన్ని కుట్రలు పన్నారు, ఎన్ని ప్రయత్నాలు చేశారు! అయినా చివరికి ప్రజల ఆకాంక్షల ముందు తలవంచక తప్పలేదు కదా పాలకవర్గానికి!

ఈనాడు బిజెపి పార్టీ పెద్దలను అడగవలసిన ప్రశ్న-మీ పార్టీకి చెందిన ఒకప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారి వాజపేయి కశ్మీర్ ప్రజలకు చేసిన వాగ్దానం ఏమిటి? కశ్మీర్ సమస్యను ఏ విధంగా పరిష్కరిస్తానన్నాడు? 'ఇన్సానియత్, జమ్హూరియత్, కశ్మీరియత్' అని కదా! ఏమయింది మీ ఇన్సానియత్?

ఐదు వందలకు పైగా ఉన్న సంస్థానాలు భారత యూనియన్‌లో విలీనమైన ప్రక్రియ జరిగింది 1947-1951 మధ్య కాలంలో. ఆ ప్రక్రియలో ప్రధానంగా పాల్గొన్నది ఆనాటి గవర్నర్ జనరల్ మౌంట్ బాటన్, ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, ఉప ప్రధాని వల్లభ భాయి పటేల్. వారితో పాటు ముఖ్యపాత్ర నిర్వహించింది అప్పటి ఐసిఎస్ అధికారి విపి మీనన్. ఆయన బ్రిటిష్ వారి కాలంలో రాజ్యాంగ సలహాదారుగా, రాజకీయ సంస్కరణల సంచాలకునిగా కూడా పనిచేశాడు. వల్లభ భాయి పటేల్ పనుపుపై వి.పి. మీనన్ ఆ ప్రక్రియనంతా గ్రంథస్థం చేశాడు. ఆ పుస్తకం పేరు ఇంటిగ్రేషన్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్. అందులో కశ్మీర్ విలీనం గురించి జరిగిన సంగతులన్నీ వివరంగా రికార్డు చేశాడు. కశ్మీర్ గురించిన అధ్యాయాన్ని ఈ కింది వ్యాఖ్యతో ముగించాడు.

'మెన్ ఆర్ నెవర్ మోర్ ది స్లేవ్స్ ఆఫ్ ఫేట్ దాన్ వెన్ దే దెమ్ దెమ్‌సెల్వ్స్ ఇట్స్ మాస్టర్స్'.

(రచయిత రిటైర్డ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్) వీ

ప్రజాస్వామ్యంలో నిరంకుశం

అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని ఘనంగా చెప్పకుంటున్న భారతదేశంలో ప్రస్తుతం పౌరుల ప్రజాస్వామ్య హక్కులు హరించవేయబడుతున్నాయనీ, వ్యవస్థలో క్రమక్రమంగా నిరంకుశత్వం వేళ్లూనుకోవడం సమాజాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందనీ అంటున్నారు **లక్ష్మణ్ గడ్డం**

ఈ దేశంలో ప్రజాస్వామ్యం మరీ ఎక్కువై పోయింది. ప్రతి ఒక్కరు గొంతెత్తి బిగ్గరగా మాట్లాడడం నేర్చుకున్నారు. తమ విధుల గురించి మాట్లాడడం పక్కకుపెట్టి హక్కుల గురించి మాట్లాడేవారే ఎక్కువైపోయారు. ప్రజల తిరుగుబాట్లను వ్యతిరేకించకుండా తిరుగుబాటు పరిస్థితుల కారణాలను వెతికే వారు ఎక్కువైపోయారు. ప్రజలు ప్రతిదానికీ ఉద్యమించడాన్ని ఖండించకుండా శాంతి భద్రతలను కాపాడడానికి ఆ ఉద్యమాలపై ప్రయోగించే అణచివేతను, హింసను ఖండించేవారే అధికమైనారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు తలవంచుకొని పనిచేసి దేశ ప్రగతికి తోడ్పడాలి కాని కార్మికుల పరిరక్షణ చట్టాలు చేయాలని పిడికిలెత్తి ఆందోళనకు దిగేవారే ఎక్కువయ్యారు.

ఏ రాజ్యాంగ వ్యవస్థలైనా సరే ఎట్టకేలకు ప్రభుత్వ ఆధీనంలో పనిచేయాలని అడిగే వారికంటే వాటి స్వయం ప్రతిపత్తి కాపాడాలని అడిగేవారి సంఖ్య ఎక్కువైంది. కేంద్రం ఏది నిర్ణయిస్తే దాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఆనందంతో అందిపుచ్చు కోవాలని చెప్పేవారికంటే ఫెడరల్ స్ఫూర్తికి భంగం వాటిల్లుతుందని గగ్గోలుపడే వారి సంఖ్యే ఎక్కువైంది. ప్రభుత్వ యంత్రాంగాలు సిద్ధంగా ఉన్నాయికదా వాటి పని అవి చేసుకుంటు పోతాయి అని వాదించే వారికంటే అవి సక్రమంగా పనిచేస్తే పరిస్థితులు ఇట్లెందుకుంటాయి అని వాదించే వారి సంఖ్య ఎక్కువైంది. చెప్పిందే మూడు సార్లు చెప్పి భార్యలను వదిలేయడం నేరం అని ప్రభోదించే వారి సంఖ్య కంటే ఒకమాట కూడా చెప్పాపెట్టకుండా భార్యలను వదిలేయడం నేరం అని బోధించే వారి సంఖ్య ఎక్కువైంది.

దేశానికిపుడు కావాల్సింది ఆరుగాలం కష్టించి పనిచేసి ఆహార భద్రతకు తోడ్పడే రైతులని చెప్పే వారు కరువై వారి ఉత్పత్తికి గిట్టుబాటు ధర కావాలని, ఆదాయం రెట్టింపు కావాలని, రుణమాఫీ చేయాలని డిమాండ్ చేసేవారు ఎక్కువైపోయారు. దేశంలో ఏ మూలన ఏం జరుగుతుందో ప్రభుత్వాలకు సమాచారం అందజేసేవారికంటే ప్రభుత్వం వివిధ శాఖల్లో ఏం జరుగుతుందో మాకు తెలపాలని పట్టుపట్టే వారి సంఖ్య ఇటీవల మరీ ఎక్కువైపోయింది.

ఈ సమస్యలు మోడీ ద్వయ పాలనను తీవ్రంగా కలిచివేసింది. ప్రజాస్వామ్యమంటే ఎన్నికలు జరిగి దాని ఎదల మీదుగా నడుచుకుంటూ వెళ్లి అధికార పీఠం మీద కూర్చోవడం మాత్రమే– తర్వాత దాంతో ఇంకేంపని అనే విషయం ప్రజలకు తెలియదు పాపం అనుకున్నారు. పార్లమెంట్‌ను సమావేశపరిచి ఈ పరిస్థితులకు అడ్డుకట్ట వేయాలను కున్నారు. ఫలితంగా ఇటీవల ముగిసిన పార్లమెంట్ సమావేశాల్లో ఏకంగా ఏడు బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదం పొందారు. పార్లమెంట్‌లో వెన్నెముక లేని ప్రతిపక్షాలు ఎగిరెగిరి చివరకు కింద పడ్డాయి. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత కనీస ముఖ్యమైన బిల్లులను క్షుణ్ణంగా చర్చించే సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపించలేదు. అసలు ఈ పార్లమెంట్ ఇప్పటివరకు సెలెక్ట్ కమిటీలను నియమించనే లేదు. ముఖ్యంగా ఇలాంటి సంస్థలు, సంఘాలు దేశాన్ని ముందుకు నడిపించడానికి మోడీ ద్వయ సిద్ధాంతానికి ఆటంకాలు. అందుకనే ఇలాంటి వ్యవస్థలను విస్మరించి అనుకున్న అజెండాను పూర్తిచేసుకున్నారు.

ఎన్నో సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను, ప్రయోజనాలను ఒక్క దెబ్బతో రద్దుచేశారు. మరో దెబ్బతో జమ్ము కశ్మీర్ రాష్ట్ర ఉనికిని తుడ్చిపెట్టారు. పార్లమెంట్‌లో ఈ చర్యల పద్ధతులను అనుసరిస్తున్నారా అని అడిగే సమాచార చట్టాన్ని నీరుగార్చారు. స్కాంలు లేని, అవినీతి లేని పరిపాలన అందిస్తామని ఎన్నోసార్లు ప్రకటించిన బిజెపి వాటిని నిరోధించే సమాచార హక్కు చట్టాన్ని ఎందుకు నీరుగార్చినట్లు?

కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో తెచ్చిన సమాచార హక్కు చట్టం పేదవర్గాలకు బాగా అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వ శాఖల్లోని ఎంతటి కీలక సమాచారాన్నైనా పొందే హక్కును ఈ చట్టం ప్రజలకు ఇచ్చింది. ఈ చట్టం ప్రకారం కేంద్ర సమాచార హక్కు ప్రధాన కమిషనర్‌కు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌తో సమాన హోదా, జీతం ఉంటాయి. ఇతర కమిషనర్‌లకు, కేంద్ర ఎన్నికల కమిషనర్‌ల సమాన రాజ్యాంగ హోదా ఉంటుంది. వీరందరి పదవి కాలం ఐదేళ్లు లేదా 65 ఏళ్ల వయసు వచ్చే వరకు ఉంటుంది. కాని బిజెపి ప్రభుత్వం సమాచార హక్కు కమిషనర్‌లకు ఎన్నికల కమిషనర్‌లకు అసలు పోలికే లేదన్నది. అంటే సమాచార కమిషనర్‌లు ప్రభుత్వాలకు అణిగిమణిగి ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ప్రస్తుత సవరణ ప్రకారం సమాచార కమిషనర్‌ల పదవీ కాలం, జీత భత్యాలు కేంద్ర ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీద అధారపడి ఉంటాయి. పదవీ ఎప్పుడు ఊడుతుందో, జీతం ఎప్పుడు కోతకు గురవుతుందోనన్న భయం వెంటాడుతుంది కనుక ప్రభుత్వానికి లొంగిపోయే నిర్బంధ స్థితి వారికి కలుగుతుంది. ప్రజలు సమాచారం కోరుతూ కమిషనర్‌కు చేసుకునే దరఖాస్తులపై స్వేచ్ఛగా నిర్ణయం తీసుకోలేని నిస్సహాయ స్థితికి చేరుకుంటుంది.

ఇంతకీ పేదవర్గాలకు ఉపయోగపడే ఈ చట్టాన్ని సవరించాలనే ఆలోచన మోడీ ద్వయానికి ఎందుకు వచ్చిందంటే ప్రధానమంత్రి విద్యార్హతలను తెలియజేయాలని ఓ దరఖాస్తు అందింది. అంతేగాక ఎన్నికల్లో వాగ్దానం చేసినట్లుగా వంద రోజుల్లో విదేశాల్లో అక్రమంగా దాచుకున్న సంపదను తిరిగి తెప్పిస్తానన్న దాంట్లో ఇప్పటివరకు ఎంత తెప్పించారో తెలియజేయాలని మరో దరఖాస్తు వచ్చింది. ఉపేక్షిస్తే ఇలాంటి దరఖాస్తులు మరెన్నో వస్తాయని తలంచిన ప్రభుత్వం ఏకంగా

చట్ట సవరణకు పూనుకుంది. ప్రభుత్వ అవినీతికి సంబంధించి సమాచారం అందించే వారికి ప్రభుత్వం రక్షణ కల్పించడం లేదు. ఇప్పటి వరకు 84 మంది సమాచార హక్కు కార్యకర్తలు హత్యలకు గురయ్యారు. నిందితులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు. సమాచార కమిషనర్లు చాలా దరఖాస్తులకు సమాచారాన్ని అందించలేకపోతున్నారు. తీవ్ర సిబ్బంది కొరత ఉంది. కమిషన్ వద్ద 31 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సంస్థను మూసివేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టుంది.

మానవ హక్కుల కమిషన్‌ను నామమాత్ర సంస్థగా మార్చేశారు. బడుగు బలహీన వర్గాలపై దాడులకు, అణచివేతకు గురిచేసే వారిపై చర్యలు చేపట్టే అధికారాలు సంస్థకు లేవు. మానవ హకుల పరిరక్షణ చట్టాన్ని కూడా సవరించి కోరలు పీకేశారు. నియామకాలకు సంబంధించిన సవరణలు ఈ సంస్థ స్వయం ప్రతిపత్తిని బలిగొన్నది. ఇప్పటి వరకు మానవ హక్కుల కమిషన్ చైర్‌పైర్సన్ పదవికి హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తినే నియమించేవారు. సవరణ తర్వాత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తిని కూడా ఆ పదవికి నియమించే అవకాశం కలిగింది. నియామక కమిటీ మొత్తం ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీకి ముగ్గిరిని ప్రభుత్వమే నియమిస్తుంది. దీనివల్ల ప్రభుత్వ జోక్యం పెరిగి అధికారాలు కత్తిరించబడతాయి.

భారత ప్రజాస్వామిక వ్యవస్థలో మరో ముఖ్యమైన సంస్థ ఎన్నికల కమిషన్. ఎన్నికల కమిషనర్ ఒక్కసారి నియమించబడితే తొలగించడం అంత సులువు కాదు. కమిషనర్‌ని తొలగించాలంటే సుప్రీంకోర్టు జడ్జీని తొలగించే పద్ధతిలో పార్లమెంట్‌లో మెజార్టీతో తొలగించాలి. అయితే టి.ఎన్. శేషన్ లాంటి అధికారులు నియమించబడ్డ తరువాత ఎన్నికలలో పాల్గొనే అభ్యర్థులపై ఎన్నో ఆంక్షలు విధించారు. ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థుల పేర్లు గోడల మీద రాయడం, పబ్లిక్ స్థలాల్లో హోర్డింగులు, బ్యానర్లు ఏర్పాటు చేయడం, విచ్చలవిడి లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయడం మీద అనేక ఆంక్షలు విధించారు. ఈ చర్యలు అధికార పార్టీలకు నచ్చలేదు. దాంతో మరో ఇద్దరు కమిషనర్‌లను నియమించి అధికారాలను కుదించారు. కమిషనర్ నియామకం నిష్పక్షపాతంగా వివరాలు సేకరించి నియమించాల్సి ఉండగా, అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నవారినే నియమిస్తున్నారు. దీంతో ఎన్నికల కమిషనర్ స్వతంత్రంగా వ్యవహరించని స్థితికి నెట్టబడుతాడు.

ఎన్నికల కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తిని దిగజార్చిన ఘనత బిజెపి ప్రభుత్వానికి దక్కుతుంది. ఈ పరిస్థితుల వల్లనే తెలంగాణలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న ఓటర్లను గుర్తించి తొలగించడం జరిగింది. అంతే కాకుండా పోలైన ఓట్లకు లెక్కించిన ఓట్లకు మధ్య వేల సంఖ్యలో తేడా వచ్చింది. తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి అన్నిటికి గంపగుత్తగా ఒక్క 'సారి' చెప్పి జారుకున్నారు. ఇదంతా కేంద్రంలో బిజెపికి, రాష్ట్రంలో టిఆర్ఎస్‌కి సహృద్భావ సంబంధాలుండడం వలన ఏ చర్య తీసుకోలేదు.

వాజ్‌పాయి ప్రధానిగా ఉన్న సమయంలో జాతీయ భద్రతా సలహాదారు పదవిని సృష్టించారు. తొలి ఎన్ఎస్ఏగా పనిచేసిన బ్రజేష్ మిశ్రా గాని, తరువాత పనిచేసిన జె.ఎన్. దీక్షిత్, ఎం.కె. నారాయణ్, శివశంకర్ మీనన్‌లు భద్రతా అంశాలకు మాత్రమే పరిమితమయ్యారు కాని, ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం తీసుకోలేదు. కాని ప్రస్తుత సలహాదారు ప్రత్యక్ష రాజకీయాల్లో చక్రం తిప్పుతున్నాడు. బిజెపి కార్యకర్తగా వ్యవహరిస్తున్నాడు. మోడీ ద్వజ పాలనను పొగుడుతూ ఆకాశానికెత్తుతున్నాడు. కశ్మీర్‌లోకెళ్లి నలుగురితో నడివీధుల్లో నిలబడి భోజనం చేస్తున్నాడు. దోవల్ కుమారుడు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ వ్యాపారం నడిపిస్తున్నాడు. పన్ను ఎగవేత, మనీ లాండరింగ్‌లకు పేరెన్నిక గన్న కేమన్ దీవుల్లో ఆయన వ్యాపారం చక్కగా నడుస్తున్నది.

ప్రభుత్వాలు ఇటీవల ప్రజలకు వారసత్వ పరీక్షలు పెడుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా అడవిలో నివసిస్తున్న ఆదివాసులకు మీరు ఆ అడవిలో గత 75 ఏళ్లుగా నివసిస్తున్నట్లుగా రుజువు చేయాలంటుంది తెలంగాణ ప్రభుత్వం. రుజువులు లేకపోతే అడవి నుంచి వెళ్లగొడుతుంది. ఆదివాసులను అడవి నుంచి తొలగించి భూములను కార్పొరేట్లకు అప్పజెప్పేది అసలు ఉద్దేశం. ఇలాంటి పౌరసత్వ పరీక్షలు ఇప్పుడు అస్సాంలో కూడా జరుగుతున్నాయి. జాతీయ పౌర జాబిత (నేషనల్ రిజిష్టర్ ఫర్ సిటిజెన్స్) అస్సాంలో లక్షలాది మందిని ఆందోళనకు గురిచేస్తుంది. అస్సాంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న బంగ్లాదేశ్ వారందరిని తిప్పి పంపించాల్సిందేనని బిజెపి కృత నిశ్చయంతో ఉంది. అక్రమంగా దేశంలోకి వచ్చిన వారందరినీ కట్టకట్టి తరలించాల్సిందేనని ప్రధాని ప్రకటించినప్పటి నుండి కార్యాచరణ ఊపందుకుంది.

అస్సాంలో 3 కోట్ల 29 లక్షల మంది భారత పౌరులమని జాతీయ రిజిస్టరులో తమ పేర్లు చేర్చాలని ధరఖాస్తు చేసుకున్నారు. అందులో 2 కోట్ల 89 లక్షల 70 వేలమంది పేర్లను రిజిస్టరులో చేర్చారు. ఈ జాబితాను 2018 జూలై 31న అధికారికంగా ప్రకటించారు. అయితే 40 లక్షల 70 వేల మంది పేర్లు ఆ రిజిస్టర్‌లో లేవు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా కఠిన వైఖరి అవలంభించడంతో రిజిస్టర్‌లో పేర్లు లేని వారందరూ తాము భారతీయులమేనని నిరూపించుకునేందుకు అష్ట కష్టాలు పడుతున్నారు. ఇందుకు గాను 100 ట్రిబ్యునల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ ట్రిబ్యునల్స్‌లో తమ భారతీయ ధృవీకరణ పత్రాలను 2019 ఆగస్టు 31 లోగా సమర్పించాలి. ఇందుకు గాను తాము లేదా తమ పూర్వీకులు 1971 మార్చ్ 24 అర్ధరాత్రి కన్న ముందు నుంచి అస్సాంలో నివసిస్తున్నట్లు ధృవీకరణ పత్రాలు సమర్పించాలి. దాంతో పాటు తమ పూర్వీకుల బంధుత్వ నిరూపణ పత్రం కూడా సమర్పించాలి. ట్రిబ్యునల్స్ 2019 ఆగస్టు 31 నాటికి తుదితీర్పు వెలువరిస్తుంది. దీంతో వారి భవితవ్యం తేలబోతుంది.

ఆగస్టు 31న ఎన్ఆర్‌సి వెలువరించే రిజిస్టర్‌లో పేర్లులేని వారిని విదేశీయులగానే పరిగణించి వారిని బంగ్లాదేశ్‌కు తరలిస్తారు. బంగ్లాదేశ్ వారిని స్వీకరించడానికి సిద్ధంగా లేకపోతే వారి పరిస్థితి ఏమిటన్నది పెద్దప్రశ్న. అస్సాం ప్రభుత్వం వీరి కోసం ఇప్పటికే ఆరు డిటెన్షన్ సెంటర్ల (జైళ్లు)ను ఏర్పాటు చేసింది. మరిన్ని ఏర్పాటు చేయబోతుంది. స్వాతంత్ర్యం రాకపూర్వం నుంచి ఇక్కడే ఉన్న వీరిని ఆకస్మాత్తుగా భారతీయులు కారనడం న్యాయమా? నిరక్షరాస్యులు, ముఖ్యంగా మహిళలు 50 ఏళ్ల కిందటి సాక్ష్యాలు ఎక్కడికెళ్లి తేగలరు? హిందూ, బౌద్ధ లేదా ముస్లిమేతర వారిని మాత్రం వెనక్కి పంపేది లేదని బిజెపి శ్రేణులు మాట్లాడుతుండడం వలన ముస్లింలు మాత్రమే టార్గెట్ అవుతున్నారని ఆందోళన పెరుగుతుంది. బిజెపి సమాజాన్ని ముక్కలు చేస్తుంది.

నూతన జాతీయ విద్యా విధానం ఇటీవల ప్రకటించడం ద్వారా ఉమ్మడి జాబితాలోని ఈ రంగం కేంద్ర జాబితాలోకి వెళుతుంది. రాష్ట్రీయ శిక్షా ఆయోగ్ ఏది నిర్ణయిస్తే దాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించాలి. బిజెపి దేశవ్యాప్త విద్యా కాషాయీకరణకు ప్రయత్నిస్తుంది. నదీ జలాల

లింగన్నది ప్రభుత్వ హత్యే

అడవులను, ఖనిజ సంపదను బహుళజాతి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులపై నిర్బంధాన్ని అమలు చేస్తున్నాయనీ, ఈ అణచివేతలో భాగంగానే బూటకపు ఎన్‌కౌంటర్‌లు చేస్తున్నాయనీ అంటున్నారు **ఎన్. నారాయణరావు**

పోడు భూముల ఆక్రమణలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలు చేస్తున్నారు, ఉద్యమిస్తున్నారు. ఎల్లందు, గూండాల, సత్తుపల్లి ప్రాంతాల్లో ఆదివాసీలకు అండగా న్యూడెమోక్రసీ పార్టీ క్రియాశీలకంగా పనిచేస్తున్నదని లింగన్న హత్యద్వారా మనకు అర్థమవుతున్నది. పోడు రైతులపై దాడులు సహించం, సెంటు భూమిని కూడా వదులుకోం, పోడు క్షేత్రాల నుండి ఫారెస్టు అధికారులను వెనక్కిపంపాలి, ఆదివాసుల అణిచివేతను అరికట్టాలి అనే నినాదాలతో జూలై 23న కొత్తగూడెంలో పెద్ద ధర్నా నిర్వహించారు. పోడు భూములను స్వాధీనం చేసుకోవాలని 2019 ఫిబ్రవరి 13న సుప్రీంకోర్టు తీర్పు బహుళజాతి కంపెనీలకు అడవిని అప్పజెప్పడానికి జరిగిన రాజకీయ కుట్రగా ప్రజలు భావించాలని, ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు.

టేకులపల్లి ఒడ్డుగూడెంలో ఫారెస్టు అధికారుల దాడులకు వ్యతిరేకంగా ఆదివాసులు, నాయకులు ఊరేగింపుగా భూముల వద్దకు వెళ్లారు. తాత ముత్తాతల కాలం నుండి సాగుచేసుకుంటున్న పోడు భూములను అన్యాయంగా ఆక్రమిస్తున్నారని ఆక్రోశిస్తున్నారు. మా జీవితాలు పోడుపైనే ఆధారపడ్డాయని దయచేసి సాగులో ఉన్న పోడు భూముల్లో 'హరితహారం' మొక్కలు నాటవద్దని పోడు రైతులు ప్రభుత్వానికి ప్రతిరోజు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. కాప్సిరాయి, ఒడ్డుగూడెం, మోదుగుల గూడెం, రాజారాం తాండ గ్రామాలకు చెందిన రైతులు ఒడ్డుగూడెంకు ఊరేగింపుతో వెళ్లి అడవిలోని పోడు భూములు ఇవ్వమని తేల్చి చెప్పారు. అలాగే ఖమ్మం, మయూరి సెంటర్‌లో వామపక్ష పార్టీల ప్రదర్శన జూలై 25న కొనసాగింది. పోడు భూములను సాగు చేసుకుని జీవిస్తున్న గిరిజనులపై, ఆదివాసులపై అటవీశాఖ వారి దాడులకు వ్యతిరేకంగా ఈ ప్రదర్శన జరిగింది.

ఆదివాసులు భూమి భుక్తి కొరకు పోరాటం చేశారని, అనేక ఏళ్లుగా జల్, జంగల్ జమీన్ కొరకు నిర్వహించిన పోరాటాల మూలంగానే 2006లో అటవీ హక్కుల గుర్తింపు చట్టం అమలులోకి వచ్చింది. దీనిలో భాగంగానే పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయడం జరిగింది. ప్రజలు చేసుకుంటున్న పోడు భూములను రాష్ట్ర ప్రభుత్వం హరితహారం పేరుతో తీసుకుంటున్నది. ఫిబ్రవరి 13న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో అటవీశాఖ పోడు భూములను బలవంతంగా లాక్కొంటున్నది. ఈ పరిస్థితి పోడు భూములున్న చోట, ప్రజా ఉద్యమాలు బలంగా ఉన్నచోట మనం చూస్తున్నాం. ఉద్యమాలు బలహీనంగా ఉంటే కొమురం భీం జిల్లా కొలాంగోంది గ్రామ పరిస్థితి ఏర్పడుతుంది. తరతరాలుగా పోడు చేసుకుంటున్నప్పటికి అందరిని గ్రామం నుండి రాష్ట్ర ప్రభుత్వం వాంకిడికి వెళ్లగొట్టించి వారి జీవనోపాధి హక్కును కొల్లగొట్టారు. పోడు భూములు ఉన్నచోట ప్రజలు ఉద్యమిస్తున్నారు. వారికి పార్టీల అండా కూడా బలంగానే కొనసాగుతున్నది. జూన్ 10న న్యూడెమోక్రసీ పార్టీకి చెందిన తుపాకుల నాగేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకొని పూనెం లింగన్న, పూనెం రమేష్‌లకు కాంట్రాక్టర్ సర్వోత్తం రెడ్డి నుండి వచ్చే డబ్బు లావాదేవీలతో బయటపెట్టి అప్పటినుండే లింగన్నను నియంత్రించడం కోసం దృష్టి పెట్టినట్టుగా అర్థమవుతున్నది. లింగన్న సుదీర్ఘకాలం అజ్ఞాతంలో ఉండి ప్రజలతో సత్‌సంబధాలు కలిగి ఉంటూ

బిల్లు రాష్ట్రాల స్వేచ్ఛను కొల్లగొడుతుంది. కార్మికుల జీతభత్యాలకు, భద్రతకు సంబంధించిన 17 చట్టాలను రెండింటిగా కుదించి కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చింది.

'పోలీసులు సామాజిక కార్యకర్తల జోలికి పోరు. పేద ప్రజలను తప్పుదారి పట్టించి సాయుధ పోరాటం వైపు మళ్లిస్తున్న పట్టణ నక్సలైట్ల ఆట మాత్రమే కట్టించవలసి ఉన్నది' అని, అర్బన్ నక్సలైట్లను కనికరించేది లేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించిన వెంటనే చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) సవరణను పార్లమెంట్‌లో ఆమోదింపజేసుకున్నాడు. 1967 నాటి ఈ చట్టానికి తెచ్చిన సవరణ ప్రకారం ఇక నుంచి సంస్థలనే కాకుండా వ్యక్తులను కూడా ఉగ్రవాదులుగా ముద్రవేసి చర్యలు తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికి సంక్రమించింది. ఇది వ్యక్తి స్వేచ్ఛను తీవ్రంగా హరించి వేస్తుంది. ఉగ్రవాదుల పేరుతో పాలక వర్గాల వారి సిద్ధాంతాలకు, ఆశయాలకు విరుద్ధమైన విశ్వాసాలున్న వారిని శిక్షించడానికి ఉపయోగిస్తారు. చైతన్యవంతులు ప్రశ్నించే హక్కును రాజ్యాంగం కల్పించింది. ప్రశ్నించే వారిని అర్బన్ నక్సల్స్ ముద్ర వేయడం రాజ్యాంగ వ్యతిరేకం. పట్టణాల్లో పనిగట్టుకుని నక్సలైట్లను తయారు చేసే ఫ్యాక్టరీ అంటూ ఏదీ ఉండదు. హోం మంత్రి చెబుతున్నట్లు పేద ప్రజలను సాయుధ పోరాటాల వైపు మళ్లించడానికి ఎవ్వరూ పట్టణాల్లో కూర్చుని లేరు. మళ్లిస్తే మళ్లేది కాదు నక్సలిజం. సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, హింసా, అణచివేత పరిస్థితులు ఒక వ్యక్తిని అటువైపు నెట్టవచ్చునేమో!

జాతీయ దార్యప్తు సంస్థ రాష్ట్రాల పరిధిలోకి విస్తృత అధికారంతో ప్రవేశించాలంటే రాష్ట్ర డిజిపిల అనుమతి తీసుకోవాలి. కాని సవరణ ప్రకారం ఎవ్వరి అనుమతి అవసరం లేదు. రాష్ట్రాల సబ్జెక్టులను కేంద్రం కొల్లగొట్టడానికి పూనుకుంటుంది. వేయి ఆలోచనలు సంఘర్షించాల్సిన ప్రజాస్వామిక వ్యవస్థలో క్రమక్రమంగా నిరంకుశం వేళ్లూనుకోవడం భారత సమాజాన్ని ఆందోళనకు గురి చేస్తుంది.

(రచయిత అధ్యక్షులు, పౌరహక్కుల సంఘం) వీ

ప్రజల మధ్య వైరుధ్యాలను, ఘర్షణలను ప్రజా కోర్టుల ద్వారా పరిష్కరించి ప్రజలందరిని మెప్పించాడు. అటువంటి నాయకున్ని కోల్పోవడం నిజంగానే ఉద్యమ ప్రజలకు తీరని లోటుగానే లింగన్న ఎన్‌కౌంటర్‌ను భావించినట్టుగా ఉంది.

2017లో డిసెంబర్ 7న రఘునాద పాలెంలో లింగన్న అరెస్టు కాబడి కొద్దికాలం జైలు జీవితం గడిపి కొంతకాలం ఇంటి వద్దనే ఉన్నట్టుగా కుటుంబీకులు తెలియజేస్తున్నారు. ఈ స్థితిలో రాష్ట్ర నాయకుడు మధు రెండవ దఫా హైదరాబాద్‌లో అరెస్టు కావడంతో, అప్పుడే వచ్చిన సర్పంచ్, ఎం.ఎల్.ఏ, ఎం.పి ఎన్నికలు ఉండడంతో తమకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడడంతో గత్యంతరం లేని స్థితుల్లో ఎం.పి.టి.సి ఎన్నికల ముందు అజ్ఞాతంలోకి వెళ్లినట్టుగా తెలుస్తున్నది. గుండాల మండలంలోని మెజార్టి సీట్లను కైవసం చేసుకొని ఎం.పి.టి.సి ని, జెడ్.పి.టి.సి ని నిలబెట్టుకున్నది న్యూడెమొక్రసీ పార్టీ. కానీ అధికార టి.ఆర్.ఎస్ పుంజుకుంటుందని అంతా భావించారు. కానీ ఎం.పి.పి, జెడ్.పి.టి.సి సీట్లు చేజారడం న్యూడెమొక్రసీ గెలుపొందడం లింగన్న కృషి అని ప్రజలు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే లింగన్నను ఎన్‌కౌంటర్ రూపంలో హత్య గావించారని గ్రామస్థులు ప్రభుత్వంపై కోపంతో ఉన్నారు. మావోయిస్టుల అమరుల వారోత్సవాల నేపథ్యంలో ఒకవైపు నిర్వహిస్తున్న భారీగా పోలీసుల కూంబింగ్ ఒకవైపు మరోవైపు న్యూడెమొక్రసీ కీలకనేత లింగన్న ఎన్‌కౌంటర్ జరగడం దాన్ని తట్టుకోలేని ప్రజానీకం తిరుగుబాటు చేసి అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజల చైతన్యం పెల్లుబికిన స్థితిలో నిజంగానే ప్రభుత్వం భయపడిపోయింది.

లింగన్న హత్య తర్వాత ప్రజల తిరుగుబాటు ఒక ఉద్యమ సంకేతంగా మారింది. మావోయిస్టు ఉద్యమాన్ని అణచివేయడంలో భాగంగా దండకారణ్యం లోతట్టులోకి నెట్టడానికి ఫాసిస్టు నిర్బంధాన్ని ప్రభుత్వాలు అమలు చేశాయి. ప్రజలకోసం పనిచేసే పార్టీలు, వ్యక్తులు, వ్యవస్థలో పుడుతూనే ఉంటారు. ఉద్యమంలో కొనసాగుతూనే ఉంటారు. దానికి అడ్డుకట్ట వేయాలనుకోవడం జరగని పని. సమస్యను వాయిదా వేయగలం కానీ సమస్యనే లేకుండా చేయడం ప్రభుత్వాలకు సాధ్యం కానీ విషయం. మావోయిస్టు పార్టీపై నిషేధం పెడితే న్యూడెమొక్రసీ పార్టీ ముందుకు వచ్చింది. దానిపై నిర్బంధం అమలైతే ప్రజలకోసం పోరాడే ఏ సంఘాలైన నిలబడతాయి. వామపక్ష పార్టీలు ప్రజా సమస్యలను పెడచెవిన పెడితే బూర్జువ పార్టీలు ఎలాగైతే విశ్వాసం కోల్పోయాయో వామపక్ష పార్టీలు కూడా అదే స్థితికి చేరుకుంటాయి. లింగన్న, శృతి, సాగర్‌ల హత్యల తర్వాత ప్రజా వెల్లువను చూశాం. శృతి, సాగర్‌లప్పుడు ఊరేగింపులు జరిగాయి. వేలాదిగా అరెస్టులు జరిగాయి. కానీ నేడు లింగన్న హత్య తిరుగుబాటు స్థాయికి ప్రజా చైతన్యాన్ని తీసుకువచ్చింది. ప్రజలు పోరాటాల్లోనే వారి సమస్యలకు పరిష్కారాలను వెతుక్కుంటారు. ప్రభుత్వాలు ఆలోచించుకోవాల్సిన సమయం ఇది.

లింగన్న హత్య తర్వాత శవాన్ని తీసుకెళ్లడానికి పోలీసులు ప్రజలపై కాల్పులు జరిపి దొంగతనంగా తీసుకెళ్లగలిగారు. ఆ తర్వాత గుండాలే కాదు ఇల్లెందు ప్రాంతమంతా కూడా నేటి కాశ్మీర్‌లాగా నిషేదిత ప్రాంతంగా మార్చేశారు. వందలాది అరెస్టులు చేశారు. శవాన్ని చూడడానికి కూడా ఎవరికీ కనీస హక్కు లేకుండా చేశారు. చివరికి కుటుంబసభ్యులు చూడకుండానే పోస్టుమార్టం చేసి శవాన్ని తరలించడానికి పోలీసులు ఒత్తిడి తీసుకువచ్చారు. అప్పటికింకా హైకోర్టులో రీ పోస్టుమార్టం కోసం వాదనలు జరుగుతున్నాయి. మరుసటి రోజు ఉదయం 7 గంటలకే గాంధీ హాస్పిటల్‌కు వెళ్లిన ప్రజాసంఘాల మిత్రులందరిని అరెస్టు చేసి బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. 10 గంటల ప్రాంతంలో పౌరహక్కుల సంఘం నాయకత్వం, కేసు పిటిషనర్, కేసుకు సంబంధించి హైకోర్టు అడ్వకేట్‌లు గాంధీ హాస్పిటల్ సూపరిండెంట్ శ్రవణ్‌కుమార్‌ను కలిసి బయటికి వస్తున్న వారిని బలవంతంగా అరెస్టు చేసి తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హైకోర్టులో వాదనలు జరుగుతున్నప్పుడే పోలీసులు శవాన్ని తరలించడానికి తొందరపెడుతూ మేము జాతీయ మానవహక్కుల కమిషన్ మార్గదర్శకాల ప్రకారమే పోస్టుమార్టం నిర్వహించామని కాబట్టి కొత్తగా మేము చేయాల్సిందేమి లేదు, శవాన్ని తీసుకెళ్లమని కుటుంబ సభ్యులను బెదిరించారు. కానీ హైకోర్టు ఉత్తర్వుల మేరకు గాంధీ హాస్పిటల్ రీ పోస్టుమార్టం నిర్వహించారు. ఇది కూడా జాతీయ మానవహక్కుల కమిషన్ ప్రకారం జరిగినట్టుగా ఏమి అనిపించలేదు. ఎందుకంటే పోస్టుమార్టం గదిలోకి కుటుంబ సభ్యులను కూడా రానియ్యలేదు. రీ పోస్టుమార్టం ఎప్పుడు మొదలైంది? ఎప్పుడు అయిపోయిందో కుటుంబ సభ్యులకు గానీ కేసు వేసిన పిటిషనర్‌కు కూడా తెలియనివ్వలేదు. మొత్తంగా మధ్యాహ్నం 1, 2 గంటల ప్రాంతంలో మధ్యాహ్నం శవాన్ని రోళ్లగడ్డకి తరలించి, ఆ రాత్రే అంత్యక్రియలు జరిగే విధంగా తీవ్ర ఒత్తిడిని పెట్టి కార్యక్రమాన్ని పూర్తి చేపించారు. శవానికి ఉండే హక్కులను కూడా కాలరాచి వేశారు.

లింగన్న ఎన్‌కౌంటర్ విషయంలో ఆగస్టు 5న పౌరహక్కుల సంఘం నిజ నిర్ధారణను నిర్వహించి ఘటనా స్థలాన్ని అతను అడవిలో ఉన్న స్థలాన్ని, ఉదయమే అతను కలుసుకున్న గ్రామస్థులను కలిసి విచారించాము. అంతేకాక లింగన్నను హత్య చేసిన తర్వాత పంట చేన్లకు మందు వెయ్యడానికి వచ్చిన రోళ్లగడ్డ గ్రామస్థులకు పోలీసులు యూనిఫారమ్ తొడిగి మిమ్మల్ని చంపేసి మీ కుటుంబ సభ్యులకు లక్ష రూపాయలు ఇస్తామని, దళ సభ్యులమని ఒప్పుకొమ్మని తుపాకులు చూపెట్టి బెదిరించిన విషయం పత్రికాముఖంగా బహిర్గతం చేశాం. మా నిజనిర్ధారణలో కాలుకు గాయమై సజీవంగా దొరికిన లింగన్నను 2 గంటల పాటు తీవ్ర చిత్రహింసలకు గురిచేసి, అతి దగ్గర నుండి కాల్పులు జరిపి చంపిన విషయాన్ని బహిరంగపరిచాం. టిఆర్ఎస్ ప్రభుత్వం శృతి, సాగర్‌ల ఎన్‌కౌంటర్‌ల తర్వాత ఎన్‌కౌంటర్ హత్యలుండవని ప్రకటించింది. కానీ ఇదే ప్రాంతంలోని టేకులపల్లిలో 9 మందిని హత్య చేసింది. ఆ ప్రాంతంలో ఉన్నటువంటి ఖనిజ సంపదను, భూమి బ్యాంకును బహుళజాతి కంపెనీలకు అప్పజెప్పాలనే ప్రభుత్వం ఉద్యమకారులను అప్రజాస్వామిక హత్యలు చేస్తున్నది. జూలై 18న ఎన్‌కౌంటర్‌ల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఈ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులందరిపై 302 హత్యానేరం నమోదు చేయాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాం. జలగాం వెంగల్‌రావ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుండి నేటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వరకు జరుగుతున్న ఎన్‌కౌంటర్‌లన్నీ ప్రభుత్వ హత్యలే. ప్రజాస్వామ్యంలో ఎన్‌కౌంటర్ హత్యలతో పరిపాలన చేయడమనేది పూర్తిగా దిగజారిపోయిన అప్రజాస్వామిక పరిపాలనకే పరాకాష్ట.

(రచయిత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పౌరహక్కుల సంఘం) వీ

యురేనియం వ్యతిరేక ప్రజాందోళన

నల్లమల ప్రాంతంలో యురేనియం వెలికితీయడం వల్ల పర్యావరణ విధ్వంసంతో పాటు జీవావరణానికి ప్రమాదం ఉందనీ, ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పెద్దఎత్తున ఆందోళన చేస్తున్నారనీ అంటున్నారు ఎం. రత్నమాల

నాగర్‌కర్నూల్ జిల్లాలోని (పాత మహబూబ్‌నగర్ జిల్లాలోని ఒక మండలం) అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో ఉన్న ప్రతాపరుద్ర కోట నుంచి పదిరనామం వరకు 76 చదరపు కిలోమీటర్ల నల్లమల అటవీ ప్రాంతంలో, నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో 7 చదరపు కిలోమీటర్లు మొత్తం 83 చదరపు కిలోమీటర్లలో యురేనియం తవ్వకాలకు కేంద్ర అణు ఇంధన సంస్థ ప్రయత్నిస్తున్నది. ఈ ప్రయత్నాలను స్థానిక ప్రజలు తీవ్రంగా అడ్డుకుంటున్నారు. మొదట కేంద్ర ప్రభుత్వం బహుళజాతి సంస్థ డిబీర్స్ కంపెనీతో ఈ ప్రాంతంలో యురేనియం తవ్వకాలకు ఒప్పందం చేసుకుంది.

2012లో డీబీర్స్ కంపెనీ సర్వే చేసి అమ్రాబాద్ మండలం ఉడిమిల్ల, బి.కె. తిర్మలాపూర్ మొదలైన గ్రామాల పరిధిలో యురేనియం ఖనిజ నిక్షేపాలు భూగర్భంలో ఉన్నట్లు నిర్ధారించారు. 2016లో ఉచితంగా బోర్లు వేస్తున్నామని అబద్ధాలు చెప్పి బోర్ల ద్వారా తవ్విన మట్టిని సంచుల్లో నింపుతుంటే స్థానిక ప్రజలు అడ్డుకుని బోర్లు తెచ్చిన వాహనాలను, బోర్లను ధ్వంసం చేశారు. మరోసారి పోలీసులను వెంటబెట్టుకుని అడవిలో ప్రవేశించడానికి డీబీర్స్ కంపెనీ ప్రయత్నాలను ప్రజలు గమనించి రోడ్డుకు అడ్డంగా వెళ్లి అడుగు ముందుకు వేస్తే ఊరుకోం అంటూ ఎదుర్కోవడంతో పోలీసులతో సహా డీబీర్స్ కంపెనీ అధికారులు వెనక్కు వెళ్లారు. 2017లో కేంద్ర అణు ఇంధన సంస్థ డీబీర్స్‌తో ఒప్పందం రద్దు చేసుకోకుండా లోపాయకారిగా ఒప్పందం అలాగే కొనసాగిస్తూ అణు ఇంధన సంస్థ నేరుగా తవ్వకాలకు పూనుకోగా ప్రజలు బోర్లు, వాహనాలను ధ్వంసం చేసి ఆ ప్రయత్నాలను తిప్పికొట్టారు.

1986లో రష్యాలో చెర్నోబిల్ దుర్ఘటన యురేనియం విధ్వంసకర లక్షణాలను ప్రపంచ ప్రజలకు తెలియజేసింది. మనదేశంలో జార్ఖండ్ రాష్ట్రంలోని జాదుగూడ యురేనియం వల్ల ప్రజలపై, పర్యావరణంపై కలిగే విధ్వంసకర ప్రభావాన్ని భారత ప్రజలకు చూపించింది. జపాన్‌లో యురేనియం గనులను చాలా వరకు మూసివేశారు. ఇంకా అనేక దేశాలు ఇదే విధంగా యురేనియం గనులు మూసేస్తున్నాయి. 2002-03లో నల్లగొండ జిల్లా శేరిపల్లి మండలం పెద్దమునికత గ్రామం, పెద్ద అడిశపల్లి (పిఎపల్లి) మండలం సంభాపురం, పెద్దగట్టు గ్రామాల ప్రాంతాల్లో తలపెట్టిన యురేనియం తవ్వకాల ప్రయత్నాలను రాష్ట్ర ప్రజల మద్దతుతో పోరాడి విజయవంతంగా తిప్పకొట్టారు. నల్లగొండ జిల్లా ప్రజలు యురేనియం తవ్వకాలను విజయవంతంగా అడ్డుకోవడంతో దీన్ని కడప జిల్లాకు తరలించారు. ఇప్పుడు అక్కడ యురేనియం ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని ఎంత విధ్వంసం చేసిందో మన కళ్ల ముందున్న ఉదాహరణ.

1945లో హిరోషిమా, నాగసాకిలపై వేసిన అణుబాంబు వల్ల విధ్వంసం, అణు బాంబు తయారీలో యురేనియం ఉపయోగిస్తారని, అందువల్ల కలిగే నష్టం, ప్రాణ నష్టం, పర్యావరణ విధ్వంసం వల్ల యురేనియం అణు బాంబు తయారీకి ఉపయోగపడే పరోక్ష ప్రమాదం తెలుసు. కానీ రష్యాలో 1986లో, చెర్నోబిల్, జపాన్‌లో ఫుకుషిమాలో 2011లో అణు విద్యుత్ రియాక్టర్లు పేలిన దుర్ఘటనల వల్ల యురేనియం విధ్వంసక శక్తి ప్రభావం తెలిసింది. కానీ ఏ రియాక్టర్లు పేలకపోయినా యురేనియం భూమిలో ఉన్నంత వరకే. కాని భూగర్భం నుంచి బయటికి తీస్తే యురేనియం ఖనిజం నుంచి ఉత్పన్నమయ్యే అణు ధార్మిక ధూళి, అణు ధార్మిక శక్తి జల, వాయువులను విషపూరితం చేస్తుందని ప్రపంచానికి ఇప్పుడు తెలిసివచ్చింది.

నల్లమలలో యురేనియం తవ్వకాల పట్ల ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడానికి పియుసిఎల్ నుంచి జయవింద్య బృందంతో కలిసి విస్తాపన్ విరోధి, జనవికాస్ ఆందోళన్ జిల్లా కమిటీ, నిర్వాసిత వ్యతిరేక ప్రజాందోళన కమిటి, నేను (రత్నమాల) ఈ నెల (ఆగస్టు) 11న మన్ననూర్ నుంచి మాదవానిపల్లె మొదలైన గ్రామాల్లో ప్రజలతో మాట్లాడుతున్న సందర్భంలో మాదవానిపల్లె పరిసర అడవిలో కారులో కొందరు డ్రిల్లింగ్ మిషన్లు తెచ్చి రహస్యంగా తవ్వకాలు సాగిస్తున్నారని పొలాల్లో పనిచేసుకుంటున్న రైతులు గమనించడంతో పరిసర గ్రామాల ప్రజలు కూడా అప్రమత్తులై అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నాలు చేయగా తప్పించుకుంటూ చివరికి మన్ననూర్ వద్ద ప్రజలకు చిక్కారు. యురేనియం తవ్వకాల పట్ల ప్రజలు ఎంత అప్రమత్తంగా ఉన్నారో, ఎంత పకడ్బందిగా అడ్డుకుంటున్నారో ఈ ఘటన వల్ల మాకు అర్థమయింది. మన్ననూర్ వద్ద డ్రిల్లింగ్ మిషన్లు ఉన్న కారును పట్టుకొని ప్రజలు చితగొట్టే సమయంలో పోలీసులు వచ్చి వాళ్లను నిర్బంధంలోకి తీసుకొని విచారించారు. బంగారం నిక్షేపాల గురించి వచ్చామని వాళ్లు చెప్పినట్లు పోలీసులు అంటున్నారు. ఏదీ ఏమైనా యురేనియం తవ్వితీసే ప్రయత్నాలను ప్రజలు ఎంతమాత్రం అంగీకరించరని ఇటువంటి సంఘటనల వల్లనైనా గుర్తించాల్సి ఉంది. అణు విద్యుత్ కంటే జల విద్యుత్, గాలి విద్యుత్ ఉత్పత్తి చాలా చవక.

యురేనియం ఖనిజం వెలువడే రేడాన్ గ్యాస్ అణువుల విచ్ఛిన్నం వల్ల ఉత్పన్నమయ్యే రేడియో ధార్మికత క్షణాల్లో గాలిలో కలిసి వ్యాపిస్తుంది. యురేనియం తవ్వకం వల్ల భూగర్భంలోంచి వచ్చే నీటి ఊట యురేనియం అణువులు కలిగి ఉండే భూగర్భంలో ఇంకి భూగర్భ జలాలు కలుషితం అవుతాయి. నల్లమలలో ఈ యురేనియం తవ్వకాలు మన్ననూర్‌లోని ప్రతాపరుద్ర కోట నుంచి పదిర గ్రామం వరకు 38 చదరపు కిలోమీటర్లు,

మొదటి బ్లాకు పదిర గ్రామం నుండి ఉడిమిల్ల గ్రామం వరకు మరో 38 చదరపు కిలోమీటర్లు, రెండో బ్లాకు మొత్తం 76 చదరపు కిలోమీటర్లు. నల్లగొండ జిల్లాలోని నారాయణపురం నుంచి చందంపేట వరకు 7 చదరపు కిలోమీర్లు, అంతా కలిపి 83 చదరపు కిలోమీటర్లు యురేనియం తవ్వి తీసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నాలను వన్యమృగ సంరక్షణ బోర్డు మొదట అనుమతించలేదు. కాని స్థానిక శాసన సభ్యుడు గువ్వల బాలరాజు, అటవీశాఖ మంత్రి జోగు రామన్న తవ్వకాలకు సమ్మతి తెలుపుతూ సంతకాలు చేశాక కొన్ని శరతులతో తవ్వకాలకు అనుమతి వచ్చింది. ప్రజలు వీరిద్దరిని నిలదీయడంతో మేం సంతకాలు చేయలేదని బుకాయించారు. కానీ కాంగ్రెస్ నాయకుడు వంశీచందర్ వారు సంతకాలు చేసిన పత్రాల నకళ్లను బయట పెట్టడంతో చేసేది లేక ఎన్నికలకు ముందు మేం కూడా యురేనియం తవ్వకాన్ని వ్యతిరేకిస్తున్నాం అన్నారు. కానీ ఆ తర్వాత తిరిగి యథావిథిగా యురేనియం తవ్వకాలకు సహకరిస్తున్నారు.

యురేనియం తవ్వకాలకు సంబంధించి మొదటి బ్లాకులో 66 చెంచు పెంటలున్నాయి. (పెంట అంటే చెంచు భాషలో పల్లె). చట్ట ప్రకారం ఏజెన్సీ ప్రాంతం అయిన ఈ చెంచు పెంటలకు ప్రవేశించడానికి ఏ ప్రభుత్వానికి కూడా గ్రామ సభల అనుమతి అవసరం. కానీ యురేనియం తవ్వకాల విషయంలో గ్రామ సభల అనుతికి ప్రయత్నించలేదు. పైగా నీటి కోసం బోర్లు వేస్తున్నామని అబద్దాలు చెప్పారు. మన్ననూర్ ఇంకో గ్రేటర్ ట్రైబల్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఐటిడిఏ) పరిధిలోని 66 చెంచు పెంటల్లో పదివేల మంది చెంచులున్నారు. మన్ననూరు ఐటిడిఏ ముందు వేలాది మంది చెంచులు ఒకరోజు నిరసన ప్రదర్శన చేశారు.

తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఏర్పడి పనిచేస్తున్నది. ఈ ఐక్యవేదిక కన్వీనర్ నాగయ్య చెంచు. కాంగ్రెస్ మొదలైన రాజకీయ పార్టీలు, అంబేద్కర్ యువజన సంఘం, భాకు ఆర్మా నల్లమల కళాకారుల సంఘం మొదలైన సంఘాలతో నల్లమల యురేనియం వ్యతిరేక రాజకీయ జెఏసి నాసరయ్య. నాసరయ్య దళిత చెంచు పెంటల్లో ఉన్నది చెంచులు కాగా, మిగతా గ్రామాల్లో ఉన్నది ఆదివాసేతరులు. దాదాపు అందరు దళితులు. నల్లమలలో మావోయిస్టులు (అప్పుడు పీపుల్స్‌వార్) దళాల అండదండలతోనే గ్రామాల్లో మేం భూమి సాగుచేసుకున్నామని ఆ గ్రామాల ప్రజలు చెప్పారు. ఇప్పుడు వాళ్లే ఉంటే యురేనియం తవ్వడానికి వీళ్లు ధైర్యం చేసేవాళ్లు కాదు అని కూడా అన్నారు. ఏదీ ఏమైనా ఇప్పటి వరకు చెంచులు, ఆదివాసులు కూడా యురేనియం తవ్వకాలను వ్యతిరేకిస్తున్నారు.

అంతేకాదు రాష్ట్ర స్థాయి ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక వాదులు ఈ ప్రాంతంలో పర్యటించి వస్తున్నారు. కాని గతంలో 2002-2013లో నల్లగొండ జిల్లాలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా రాష్ట్ర స్థాయి ఐక్య సంఘీభావాల వంటి ఏర్పాటు కావలసి ఉంది. నల్లమలలో యురేనియం తవ్వకాల వల్ల నష్టం ఆ ప్రాంతానికే కాదు, కృష్ణా నదీ జలాలు, తద్వారా సాగునీరు, సాగర్ జలాలు కలుషితమై జంట నగరాలు, పరిసర జిల్లాలు కర్నూలు, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాలను కూడా ప్రభావితం చేస్తుంది.

నల్లమలలో యురేనియం చేసే ప్రాంతంలో అనేక చెరువు ఉన్న వాగులు ఉన్నాయి. మన్ననూరు దగ్గర ధర్మ సముద్రం చెరువు, దుర్యాసనుల చెరువు, చింతల మామిడి చెరువు, మొలకలమామిడి వద్ద పెద్ద చెరువు, కలమలోని పల్లెవద్ద రెడ్ల చెరువు, అమ్రాబాద్ వద్ద లోకేశ్వరం చెరువు, కుమ్మరోనిపల్లె వద్ద కొత్త చెరువు. ఇవన్నీ గొలుసుకట్టు చెరువులు. ఈ చెరువులు అలుగు పోస్తే మందవాగు పారుతుంది. ఈ మందవాగే లక్ష్మీపురం వద్ద నర్సింహుల వాగై ఆ తర్వాత మానుదద్ద వాగై పోసులేటికయ్య దగ్గర కృష్ణా నదిలో కలుస్తుంది. అమ్రాబాద్‌కి కుడివైపుగల కోతుల కొండవపెంట (చెంచుపెంట) వైపు నుంచి అడవిలో కురిసిన వర్షం ధార ఆధారంగా ధారవాగులుగా, ధార మదవాగుగా మారి కృష్ణా నదిలో కలుస్తుంది. అందువల్ల ఈ ప్రాంతంలో యురేనియం తవ్వకాల వల్ల ఈ చెరువుల్లో, వాగుల్లో కలిసిపోయిన యురేనియం కృష్ణా నదిలో, ఆ తర్వాత సాగర్ జలాల్లో కూడా కలుస్తుంది. ఈ రకంగా ఇక్కడ యురేనియం తవ్వకాల ప్రభావం వల్ల కలిగే నష్టం జంట నగరాలు, తెలంగాణకే కాదు, ఆంధ్రప్రదేశ్‌పై కూడా ఉంటుంది. ఇవన్నీ ఏమీ పరిగణన చేయకుండా అనుమతి ఇచ్చిన అటవీ శాఖ, ఇంధన శాఖ, కేంద్ర ప్రభుత్వంపై కూడా నిరసన కార్యక్రమాలు కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. ఈ జిల్లాకు చెందిన, తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన సోలిపేట రామలింగారెడ్డి మొదలైన వారు కూడా తవ్వకాలను వ్యతిరేకిస్తూ మాట్లాడుతున్నారు. కనుక ఆ పార్టీపై, ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి తవ్వకాలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర శాసనసభ తీర్మానించి ప్రభుత్వమే ఈ తవ్వకాలను వ్యతిరేకిస్తూ కేంద్రానికి నిర్ణయం తెలియజేయాలి. ఈ విషయంలో ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీయాలి.

నల్లమలలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజాందోళన కొనసాగుతుండగానే మరోపక్క యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యుసిఐఎల్) నల్లగొండ జిల్లాలో 542 హెక్టార్లలో 18,550 టన్నుల నిల్వలున్నాయని, దీన్ని వెలికితీయడానికి సంబంధిత గ్రామాల్లో భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైందని, ఈ ఏడాది చివర్లో లేదా 2020 సంవత్సరారంభంలో తవ్వకాలు మొదలు కావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతి ఇచ్చాయని ఆగస్ట్16న పత్రికల్లో వార్తలు వచ్చాయి. కేంద్ర పర్యావరణ సంస్థ కూడా అనుమతి ఇచ్చింది. యుసిఐఎల్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 13 యురేనియం ప్రాజెక్టులను చేపట్టడానికి కేంద్ర అణు ఇంధన సంస్థ (ఆటమిక్ ఎనర్జీ కమిషన్ (ఏఇసి) అనుమతి కూడా ఇచ్చింది. నాగార్జున సాగర్ నియోజకవర్గ పరిధదిలో లంబాపూర్, పులిచర్ల నామాపురం, ఎల్లాపురం గ్రామాల పరిధిలో ఈ యురేనియం నిల్వలున్నాయని గుర్తించారు. ఈ తవ్వకాలు ఏడు సంవత్సరాలు కొనసాగ వచ్చని అధికారులు పేర్కొన్నారు.

అయితే ఇక్కడ గమనించవలసిన విషయం ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన విషయం ఏమిటంటే ఈ వార్తలో నల్లమల ప్రజలను మభ్యపెట్టే విషయం కూడా ఉండడం. అది రాష్ట్రంలో యురేనియం తవ్వకాలు జరుపబోయేది మహబూబ్‌నగర్ జిల్లా కాదు నల్లగొండ జిల్లాలో అని ఆ వార్త. నల్లగొండ జిల్లాలో తవ్వకాలు చేయడం వల్ల మహబూబ్‌నగర్ జిల్లా నల్లమలలో తవ్వకాలు చేయరని అనుకోవడానికి లేదు. దేశంలో యురేనియం నిల్వలున్న అన్ని ప్రాంతాల్లో తవ్వకాలను చేపట్టాలన్నది కేంద్ర అణు ఇంధన శాఖ సంకల్పం. ఈ విషయాన్ని రెండు జిల్లాల ప్రజలు గుర్తించి అప్రమత్తంగా ఉండాలి.

విస్తాపన్ విరోధి జన వికాస్ ఆందోళన్
(నిర్వాసిక వ్యతిరేక ప్రజాందోళన జాతీయ కమిటీ)
(రచయిత విరసం సభ్యురాల)

వీ

సమాచార హక్కు చట్టానికి తూట్లు

***జవాబుదారీతనం లేకుండా, ప్రశ్నించడానికే వీలు లేకుండా ప్రజలను అభద్రతా భావంలో ఉంచడానికే బిజెపి ప్రభుత్వం సమాచార హక్కు చట్టంలో సవరణలు చేసిందనీ, ఇది సమాఖ్య స్ఫూర్తినే అగౌరవపరిచేదిగా ఉందనీ అంటున్నారు* బైరెడ్డి సతీష్**

అధికార రహస్యాల చట్టాల పరదాల చాటున రాజకీయ కార్యనిర్వాహక వ్యవస్థ, బడా ఉద్యోగి స్వామ్యం చీకటి పాలన చేస్తున్న రోజుల్లో దశాబ్దానికి పైగా సాగిన ప్రజా ఉద్యమాల ఒత్తిడితో ఆనాటి యుపిఎ ప్రభుత్వం 2005 అక్టోబర్‌లో సమాచార హక్కు చట్టాన్ని తీసుకొచ్చింది. ప్రజల పేరుతో నడిచే 'ప్రజాస్వామిక' ప్రభుత్వాల ఏలుబడిలో ప్రజలకు సంపూర్ణ భాగస్వామ్యం కాకపోయినా తాము చెల్లించే పన్నులతో నడిచే అనేక ప్రభుత్వ వ్యవస్థలు తాము సమాచారం పొందడం కూడా హక్కుగా గుర్తించాలనే డిమాండ్ చట్ట రూపమే సమాచార హక్కు చట్టం. వేళ్లూనుకొని పోయిన రాజకీయ, ఉద్యోగిస్వామ్య అవినీతి కొంతమేరకైనా తగ్గడానికి, పాలనలో పారదర్శకత, జవాబుదారి తనం మెరుగుపడడానికి ఈ చట్టం ఒక సాదనంగా ఉపయోగపడు తుందని ఈ హక్కు కోసం తపించి పోరాడిన వారందరూ భావించారు. మొత్తంగా అద్భుతాలేవి జరిగి అవినీతి అంతమై ప్రజల చెంతకు అభివృద్ధి చేరుతుందని కాదుగాని గ్రామ సచివాలయ స్థాయి నుండి రిజర్వు బ్యాంకు, ప్రధానమంత్రి కార్యలయం వరకు ఏం జరుగుతుందో, జరిగిందో తెలుసుకునే అవకాశం హక్కుగా ప్రజలకు ఉంటుందని ఈ చట్టం కార్యరూపం దాల్చిన దాదాపు దశాబ్దన్నర కాలం తరువాత కొంతమేరకైనా తెలియవచ్చింది. ఏవో కొన్ని చీకటి లావాదేవీలు, అవినీతి భాగోతాలు బయటపెట్టకుండా దాచిపెట్టలేని అనివార్య స్థితి అయితే నెలకొని ఉన్నది.

ఉద్యోగ వ్యవస్థలో సమాచార చట్ట భయం నామమాత్రంగానైనా ఆవరించి ఉన్నది. సాధారణ పౌరునికి కూడా ప్రభుత్వ వ్యవహారాల, లావాదేవీల సమాచారాన్ని హక్కుగా పొందే పరిస్థితులు కల్పించబడ్డాయి. దేశవ్యాప్తంగా ప్రజల పన్నులతో నడిచే గ్రామస్థాయి కార్యాలయాల నుండి ప్రధానమంత్రి కార్యాలయం వరకు కూడా అనేక పాలనా వ్యవహారాలకు సంబంధించి తప్పుడు సమాచారాన్ని, అబద్దాలను అతిశయోక్తులను ఇచ్చే సాహసం చేయలేకపోతున్నాయి.

ప్రతి సంవత్సరం 60 లక్షలకు పైగా వివిధ రకాలైన సమాచారాన్ని కోరుతూ దేశవ్యాప్తంగా విజ్ఞాపనలు వస్తున్నాయంటే గత 14 సంవత్సరాలుగా సమాచార హక్కు చట్టం ఎంతగా సాధారణ ప్రజల్లోకి చొచ్చుకొని పోయిందో అర్థం చేసుకోవచ్చు. ఈ కాలంలోనే దేశ వ్యాప్తంగా 80 మందికి పైగా సమాచార హక్కు కార్యకర్తలు హత్యకు గురయ్యారు.

ప్రజా ప్రయోజనాలు పరిరక్షించడానికి, అక్రమ వ్యవహారాలను వెలికితీయడానికి పాలనలో పారదర్శకత, జవాబుదారి తనం పెరగడానికి తోడ్పడే ఈ చట్టం అధికార పీఠాలను ప్రశ్నించేదిగా ఉంటుంది కాబట్టి రాష్ట్ర, కేంద్ర స్థాయిలో స్వేచ్ఛాయుతంగా, స్వతంత్ర అధికారాలతో పనిచేసేలా దాని నిర్మాణాన్ని ఏర్పరచడం జరిగింది. అధికార వ్యవస్థ సమాచారాన్ని విధిగా ఇవ్వాల్సి ఉన్న సందర్భంలోనూ చట్టం పేర్కొన్న కారణాలు కాకుండా మరే ఇతర దురుద్దేశంతో నిరాకరించినా కేంద్ర, రాష్ట్ర సమాచార కమిషనర్‌లు ఆయా వ్యవస్థలను సమాచారాన్ని పొందుపరచమని ఆదేశించవచ్చు. అనేక సందర్భాల్లో శక్తిమంతమైన వ్యవస్థలతో ఢీకొనాల్సి రావడం, దాని ఫలితంగా పాలక వర్గాలు స్వీయ రక్షణలో పడాల్సి వస్తున్నది.

ఆచరణలో ఎదురయ్యే సవాళ్లు, బెదిరింపుల దృష్ట్యా సమాచార కమిషన్ వ్యవస్థకు నిర్ణీత పదవీకాలం, జీతభత్యాలు, స్వంత కార్యాలయ సిబ్బంది, సర్వీసు సంబంధ అంశాలన్నీ ఎలాంటి ఒత్తిళ్లకు, బెదిరింపులకు గురికాని విధంగా ఏర్పరచారు.

కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్ (సిఐసి) ఇతర కమిషనర్‌ల పదవి కాలం ఐదు సంవత్సరాలుగా లేదా 75 సంవత్సరాల వయసు వచ్చేవరకు పదవిలో కొనసాగేలా నిర్ణయించడం, జీతభత్యాలు, హోదా స్థాయిలలో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ మిగతా కమిషనర్‌లతో సమానమైన ప్రతిపత్తిని కల్పించారు. రాష్ట్రాల్లో రాష్ట్ర సమాచార ప్రధాన, ఇతర కమిషనర్‌ల పదవీ కాలం కూడా అలాగే నిర్ణయించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందే స్థాయిలో అన్ని ఆర్థిక ప్రయోజనాలు, సదుపాయాలు కల్పించడం జరుగుతున్నది. స్థిరమైన పదవీ కాలం, విధి నిర్వహణకు అవసరమైన స్వేచ్ఛాయుత పరిస్థితులు, హోదాలో రాజ్యాంగబద్ధ సంస్థల పదవులతో సమానమైన స్థాయిని కలిగి ఉన్నపుడే శక్తివంతమైన అధికార వ్యవస్థలను ప్రశ్నించే, అదేశించే, జవాబుదారితనాన్ని రాబట్టే వీలుంటుంది. ప్రజల వైపున నిలబడి వారి ప్రయోజనాలను పరిరక్షించగలిగే ఏ నిర్మాణాన్ని పాలక వర్గాలు సహించే స్థితిలో లేవు. అలాంటి వ్యవస్థలను ఏర్పరచమని ప్రజలు పోరాటాలు చేస్తుంటే పాలకులు మాత్రం వాటి అణచివేతకు పాల్పడుతూ అనివార్యమైన స్థితిలో మాత్రమే అటువంటి వ్యవస్థలను అయిష్టంగా ఏర్పరచడమే కాకుండా వాటి స్ఫూర్తిని, క్రియాశీలతను నిర్వీర్యపరిచే ప్రయత్నం ఎపుడూ చేస్తూనే ఉంటారు.

సరిగ్గా ఆర్‌టిఐ విషయంలో కూడా అదే జరిగింది. తమ మాటే అంతిమమని, తమకు తెలియనిది లేదనుకునే అహంకారపూరితమైన ఉన్నత ఉద్యోగ స్వామ్యానికి పాలనలో పారదర్శకత అన్నా, జవాబుదారీతనం అన్నా ఏమాత్రం సహింపు ఉండదు. ఈ చట్టం అమలులోకి వచ్చిన ఆరు నెలల నుండే దీన్ని సవరించాలని ఉన్నత ఉద్యోగవర్గం పట్టుపడుతూ వచ్చింది. ఈ డిమాండ్‌లో తమకూ ప్రయోజనాలు ఉన్నాయి కాబట్టి రాజకీయ కార్యనిర్వాహక వర్గం కూడా

తల ఊపింది. ఈ చట్టాన్ని రూపంలో అలాగే ఉన్నదనుకునేలా చేసి మొత్తంగా దాని స్ఫూర్తిని చంపివేసే పనిని చేయడం తరుచూ జరుగుతూనే ఉన్నది. విధి వాదాన్ని, కేంద్రీకృత పద్ధతులను బాగా ఇష్టపడే సంఘ్‌పరివార్– బిజెపికి ప్రజలన్నా, వారి హక్కులన్నా పెద్దగా గౌరవం పట్టింపు ఉండదు.

ప్రజల జీవితాలన్నీ ముందుగానే దైవ నిర్ణాయానుసారమే సాగుతాయనే తాత్వికతను ముందుకు తీసుకెళ్లే ఈ శక్తులకు సమాచార హక్కు చట్టం లాంటిది ప్రజలకు పెద్దగా మేలు చేయదని అందునా ప్రశ్నించడం అసలు చేయకూడదని మొత్తంగా సమాచార చట్టాన్నే సమాధి చేసే పనికి ఒడిగట్టారు. రేపు సమాచారాన్ని పదే పదే డిమాండ్ చేయడాన్ని, హక్కుగా అడగడాన్ని తీవ్రవాదంగా కూడా పరిగణిస్తారేమో. చట్టం యథావిధిగా అమల్లో ఉంటుంది పై పై మార్పులే చేస్తున్నామని బిజెపి ప్రభుత్వం చెబుతున్నప్పటికీ సారంలో మొత్తంగా ఆ వ్యవస్థను తన గుప్పిట్లోకి గుంజుకొని దాని ఉన్నత స్థాయి కమిషనర్ల కంఠాన్ని నులిపెట్టే పనిచేసింది.

రాజ్యాంగబద్ధమైన, అత్యున్నత స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ అయిన ఎన్నికల కమిషనర్లతో సమానమైన స్థాయిని కేవలం చట్టబద్ధమైన సమాచార కమిషన్ వ్యవస్థకు ఎలా ఇవ్వగలం అని ప్రశ్నిస్తున్నది బిజెపి. కేంద్ర, రాష్ట్ర కమిషనర్ల పదవీ కాలం నిర్ణీతంగా కాకుండా, వారి జీత భత్యాలకు సంబంధించిన, పదవీ పరిస్థితులు మొత్తంగా నియామక ప్రక్రియంతా తన వద్దనే కేంద్రీకరించేలా సమాచార హక్కు చట్టంలో సెక్షన్ 13, 16, 127లను సవరించింది.

పార్లమెంట్‌లో ప్రత్యేకించి లోక్‌సభలో తనకున్న మంద బలంతో ఏ వ్యవస్థనైనా ఇట్టే రద్దు పరచగలమని ఈ సవరణలను ఆమోదింప చేసుకోవడం ద్వారా నిరూపిస్తున్నది. రాజ్యసభలో బలం లేకపోయినా కేంద్ర అధికార బలంతో అనేక పార్టీలను బతిమిలాడటంకంటే భయపెట్టి మరీ తనకు అనుకూలంగా ఓటు వేయించుకున్నది పాలక పక్షం. ఎంతో సూత్రబద్ధంగా వ్యవహరిస్తాయనుకున్న పార్టీలు సహితం ఈ సవరణలకు జీ హుజూర్ అన్నాయి.

రాష్ట్రాల అధికారాలను కేంద్రం హరించి వేస్తున్నదని గగ్గోలు పెట్టే ప్రాంతీయ పార్టీలయిన ప్రధానంగా టిఆర్ఎస్ కూడా బిజెపికి వంతపాడింది. నిజానికి రాష్ట్రాల సమాచార కమిషనర్ల నియామకం, వారి జీతభత్యాలు, పని పరిస్థితుల నిర్ణయం అంతా కూడా సవరణలకు ముందు రాష్ట్రాలకున్న అధికారాన్ని అసాంతం కేంద్రమే దఖలు పరుచుకున్నది. ఇంతగా అధికారాలను కేంద్రీకృతం చేసుకోవడం ఫెడరల్ స్ఫూర్తికి భంగకరం అని కానీ, రాజ్యాంగ సూత్రాలను ఉల్లఘించడం అని కానీ భావించి ఎదిరించే స్థితిలో రాష్ట్రాలు లేకపోవడమే పెద్ద విషాదం. పోనీ దేశంలో ఇంకేమీ అత్యవసరంగా సవరించాల్సిన, రద్దు పరచాల్సిన, కాలం చెల్లిన, ప్రజల హక్కుల్ని హరించే చట్టాలేవి లేవన్నట్టు ఎందుకు సమాచార హక్కు చట్టం పైననే కేంద్రం పడ్డట్టు అనే ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతుంది. అసలు ప్రశ్నించడాన్ని, అలాంటి హక్కు ఉంటుందనే అంశాన్ని గుర్తించని పరివార్ పాలక వర్గాలకు అసలు 'ప్రభువు'కు సంబంధించిన సమాచారాన్ని అడగటమే పెద్ద నేరమయిపోయింది. ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నత విద్యా వివరాలు అందివ్వాలని అదేదో వ్యక్తిగత సమాచారంగా కాక ఆయన చదువుకున్న కాలం నాటి విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన వారి డేటాను అందివ్వాలని కేంద్ర సమాచార కమిషనర్ గుజరాత్ యూనివర్సిటీని కోరడమే పాలక వర్గాల కన్నెర్రకు కారణమైంది. ప్రభువులను మమ్మల్నే ప్రశ్నిస్తారా మీ రెక్కల్ని విరిచేస్తామని అన్నంతపని చేసింది బిజెపి.

పదకొండు సంవత్సరాల ఉద్యమ కృషి అనేక బలిదానాల ద్వారా సంపాదించుకున్న ఒకానొక ప్రయోజనకర చట్టాన్ని, దాని స్వతంత్రతను తుంచివేసింది. ఏదైనా నూతన చట్టాన్ని రూపొందించే ముందు లేదా అప్పటికే అస్తిత్వంలో ఉన్న చట్టాన్ని సవరించే ముందు ప్రజా క్షేత్రంలో చర్చించడం, ప్రజాభిప్రాయాన్ని స్వీకరించడం అనే కనీస ప్రజాస్వామిక మైన ప్రక్రియను కూడా పాటించకుండా ఏకపక్షంగా తమకు ఇష్టమైన వారిని నియమించుకోవడానికి, తనకు అనుకూలంగా వ్యవహరించేలా ఉంటేనే వారి పదవికి డోకా ఉండదనే సంకేతాన్ని ప్రత్యక్షంగానే పంపింది.

నిజానికి ఈ సవరణ చేయడం ద్వారా ప్రభుత్వ అధికార వ్యవస్థల చుట్టూ ఇనుప కంచెలను నిర్మించి ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి కార్యాలయాలకు సమాచార కమిషన్ వ్యవస్థను ఒక శాఖగా మార్చుకున్నది ప్రభుత్వం. సాధారణంగా చట్టం నిర్దేశించినట్టు ఈ సమాచార కమిషనర్ లుగా మీడియా, శాస్త్ర సాంకేతిక రంగం, సామాజిక సేవారంగం, సమాచార రంగంలో అనుభవం ఉన్నవారిని నియమించాలి. దీనికి భిన్నంగా తమకు విశ్వాస పాత్రులైన, తమ ఎజెండాకు అనుకూలంగా, తమ ప్రయోజనాలను నిలబెట్టే, నిలబెడతారనుకునే మాజీ బ్యూరోక్రాట్స్‌ను నియమించడం ద్వారా ఈ వ్యవస్థను ఇప్పటికే బలహీనపరిచారు. కేంద్ర సమాచార కమిషనర్ కార్యాలయాన్ని యాభై మూడు కోట్లతో ఢిల్లీలో నిర్మించినప్పటికీ కేసులను సత్వరమే పరిష్కరించేలా ఉండాల్సిన కమిషనర్ల ఖాళీలను కానీ, ఇతర ఉద్యోగ వర్గాన్ని భర్తీ చేయకుండా ఉన్న ఒకరిద్దరి పైన మొత్తం భారం పడేలా వ్యవహరించడం ద్వారాను దాని క్రియాశీలతను బలహీనం చేశారు.

కమిషనర్ల పదవీకాలం ఫిక్స్‌డ్‌గా ఉండడం, తొలగించే ప్రక్రియ కష్టంగా ఉండడంతో వారంతా స్వతంత్రంగా వ్యవహరించారు. ఇపుడంతా వారి పదవీ కాలం ప్రభుత్వ ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. నియామకానికి ముందుగానే మీ పదవీకాలం, జీతభత్యాలు, పనిపరిస్థితులు మా చేతుల్లోనే ఉన్నాయి జర భద్రం అనే సంకేతాన్ని ప్రభుత్వమే ప్రత్యక్షంగా ఇవ్వవచ్చు. మమ్మల్ని సంతోషపెట్టినంత కాలమే మీరా పదవుల్లో ఉంటారు లేదంటే దిగిపోవాల్సిందే అనే దృశ్యం స్పష్టమయ్యాక ఇంకా సమాచార హక్కు చట్టానికి స్వతంత్రత ఎక్కడున్నది? ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వాన్ని ప్రశ్నించే, జవాబుదారితనాన్ని రాబట్టే నిర్భీతి ఎక్కడుంటుంది?

రిజర్వు బ్యాంకును నిరర్థక ఆస్తులు ఎన్ని ఉన్నాయి, పన్ను ఎగవేతదారుల జాబితా ఇవ్వండి, నోట్ల రద్దు ద్వారా జమఅయిన నగదు ఎంత, ఎంత మందికి ఉద్యోగాలు కల్పించారు, ఎందరు నిరుద్యోగులు ఉన్నారు, రైతుల ఆత్మహత్యలు ఎన్ని జరిగాయి, ప్రధాని విదేశీ పర్యటనల ఖర్చు ఎంత లాంటి ప్రశ్నలు, సమాచారం ఇవ్వండని ఆదేశించడాలు దేశ రాజ్యాంగాన్నే మార్చాలనుకునే పరివార్ ప్రభుత్వానికి ఆర్టికల్ 19లో భాగమైన సమాచారం పొందే హక్కును ఎలా సహిస్తుంది? అందుకే ఏదో ఒక సాకుతో బలహీనం చేసేశారు.

2005 నాటి సమాచార హక్కు చట్టం ప్రకారమైతే సమాచారం

తలాక్ - పౌర పరిష్కారమా? నేరమా?

సుప్రీంకోర్టు పౌరవ్యవహారంగా నిర్వచించిన ట్రిపుల్ తలాక్‌ను కేంద్ర బిజెపి ప్రభుత్వం ఒక నేరపూరిత చర్యగా పరిగణించడం దుర్మార్గమనీ, మత విశ్వాసాలకూ, మహిళలకూ సంబంధించిన అంశం కాబట్టి దీనిపై మరింత చర్చ జరగాల్సిన అవసరం ఉందనీ అంటున్నారు **డానీ**

నరేంద్ర మోదీ 2.0 ప్రభుత్వం తిరిగి ఎన్నికయిన నాటి నుండే ముస్లిం సమాజాన్ని వేధించడానికి దూకుడుగా వ్యవహరిస్తున్నది. ప్రభుత్వం నేరుగానో, పరోక్షంగానో, ప్రాయోజితంగానో కొన్ని చిన్న సమూహాల మీద అలా వేధింపుల్ని సాగిస్తుంటే మిగిలిన విస్తార సమూహాలు వాటిని ఆస్వాదిస్తూ అధికారపక్షానికి బలమైన ఓటు బ్యాంకుగా మారే ఒక అమానవీయమైన రాజకీయ వాతావరణం మన చుట్టూ ఉంది. ఆ ఓటు బ్యాంకును ఉత్తేజపరచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ కార్యకలాపాలు సాగుతున్నాయి.

17వ లోక్‌సభ ఎన్నికల తరువాత ఏర్పడిన కేంద్ర మంత్రివర్గం తొలి సమావేశంలోనే ముస్లిం మహిళ (వైవాహిక హక్కుల పరిరక్షణ) బిల్లు – 2019కు తుది మెరుగులు దిద్దింది. కొత్త పార్లమెంటు సమావేశాల తొలి రోజే ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. తక్షణ ముమ్మారు తలాకులు చెప్పిన భర్తల మీద నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి మూడేళ్ల వరకు కారాగార శిక్ష విధించే వివాదాస్పద క్లాజ్ ఉన్న ఈ బిల్లును జులై 30న పార్లమెంటు ఆమోదించింది.

ట్రిపుల్ తలాక్ వ్యవహారాన్ని బిజెపి మూడేళ్లుగా ఒక రాజకీయ వివాదంగా మండిస్తూనే ఉంది. ముస్లిం మహిళ (వైవాహిక హక్కుల పరిరక్షణ) బిల్లు – 2017ను ఆ ఏడాది డిసెంబరు 28న లోక్‌సభ ఆమోదించింది. అయితే, అప్పట్లో రాజ్యసభలో అధికార జాతీయ ప్రజాస్వామిక కూటమికి తగిన ఆధిక్యత లేని కారణంగా ఆ బిల్లు చట్టం కాకుండ ఆగింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో కేంద్ర మంత్రివర్గం ఒక ఆర్డినెన్స్ ద్వార ఈ బిల్లును అమల్లోనికి తెచ్చింది.

తక్షణ ముమ్మారు తలాక్ బిల్లు రాజ్యసభ ఆమోదాన్ని పొందగానే 'ఇది లింగ న్యాయానికి ఘన విజయం' అని ప్రధాని నరేంద్రమోదీ ట్వీట్ చేశారు. వారు ఎర్రకోట బురుజుల మీద నిలబడి ఇచ్చిన స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలోను ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'ఇన్నాళ్లూ ముస్లిం మహిళల్ని తక్షణ ముమ్మారు తలాక్ భయం వెంటాడుతూ ఉండేది. మేము దానికి చరమ గీతాన్ని పాడాము' అన్నారు.

షాయరా బానూ అనే ముస్లిం మహిళ విడాకుల కేసును విచారించిన భారత ఉన్నత న్యాయస్థానం 2017 ఆగస్టు 22న తక్షణ ముమ్మారు తలాక్ చెల్లదని తీర్పు చెప్పింది. దాన్ని ప్రాథమిక హక్కులకు వ్యతిరేకం గానూ, రాజ్యంగ విరుద్ధంగానూ పేర్కొనడమేగాక అది ఇస్లామిక్ మౌలిక ఆదర్శాలైన ఖురాన్ హదీసులకు కూడ వ్యతిరేకం అని తేల్చి చెప్పింది. సుప్రీంకోర్టు తక్షణ ముమ్మారు తలాక్ చెల్లదని చెప్పడం అంటే ఆ భార్యా భర్తల మధ్య విడాకులు రద్దు అయిపోయి వివాహ బంధం పునరుద్ధరణ జరగాలని అర్థం.

సుప్రీం కోర్టు తీర్పు తరువాత కూడ దేశవ్యాప్తంగా 345 తక్షణ ముమ్మారు తలాక్ కేసులు నమోదయ్యాయని కేంద్ర న్యాయశాఖా మంత్రి రవి శంకర్ ప్రసాద్ పార్లమెంటులో ప్రకటించారు. ఈ సాంఘీక దురాచారాన్ని అంతం చేయడం కోసం దాన్ని శిక్షార్హమైన నేరంగా

పొందడం రాజ్యాంగ హక్కుగా భావింపబడితే అదే చట్టాన్ని పార్లమెంట్‌తో ఎలాంటి సంబంధం లేకుండానే ఎపుడైనా సవరించగలమనే ఈ సవరణలను తీసుకొచ్చిపెట్టింది ప్రభుత్వం. ఈ సవరణకంటే ముందు కేంద్ర సమాచార కమిషన్ ఆదేశాలను (దాదాపుగా 1700) కోర్టుల్లో కేంద్ర ప్రభుత్వం సవాలు చేయడం ద్వారా తమ పాలన పారదర్శకతకు, జవాబుదారితనానికి వ్యతిరేకమని చెప్పకనే చెప్పింది.

అవినీతిని సమూలంగా నిర్మూలిస్తానని ఉపన్యాసాలిచ్చిన మోడీ దానికి ఎంతో కొంత ఉపకరించే చట్టాన్నే చట్టుబండలు చేసేశాడు. చట్టబద్ధ హోదా, స్వయం ప్రతిపత్తి, స్వతంత్రత ఉన్న కేంద్ర సమాచార కమిషన్ ఇకనుండి కేంద్ర ప్రభుత్వ ఒకానొక శాఖగా మాత్రమే మిగిలిపోనున్నది. విదేశాల్లో దాచుకున్న అక్రమ సంపాదనను స్వదేశానికి రప్పించి ప్రతి ఒక్కరి ఖాతాలో 15 లక్షలు జమచేస్తానని ఆర్భాటంగా పలికిన ప్రధానికి ఈ చట్టాన్ని చంపేయడం ద్వారా మరింత అక్రమ సంపాదనకు దారులు పడతాయన్న సంగతి తెలియదా? పాలనలో పారదర్శక సంస్కృతిని పాదుకొల్పాల్సింది పోయి మళ్లీ 'రహస్య' సంస్కృతి వైపు ఎందుకు పరుగులు పెడుతున్నారో పాలకులే చెప్పాలి.

ఈ చట్ట సవరణ చేయడం ద్వారా రాజ్యాంగ సూత్రాల ఉల్లంఘణకు పాల్పడడమే కాకుండా సమాఖ్య స్ఫూర్తిని కూడా అగౌరవపరిచింది. ఈ చర్య అప్రజాస్వామికమే కాకుండా ప్రజలకుండే సమాచార హక్కును నిరాకరించినట్లవుతున్నది. అసలు జవాబుదారితనమే లేకుండా, ప్రశ్నించడానికే వీలులేని ఒక వాతావరణాన్ని కూడా ఈ సవరణ ఏర్పరుస్తున్నది. ఒకవైపు ప్రజల ప్రాథమిక హక్కయిన గోప్యతను భంగపరుస్తూ తను మాత్రం పాలన ప్రజలకు చెందని అంశమన్నట్టుగా వ్యవహరించడం ప్రజల్ని బలహీనపరిచే చర్యగానే పరిగణించాలి. ప్రజలు పోరాడి సాధించుకున్న హక్కుని ఒక్క కలం పోటుతో రద్దుపరచడం పెద్ద దుర్మార్గం. మళ్లీ పోరాటాలకు సిద్ధం కాకపోతే మరిన్ని హక్కులు రద్దవడం మరెంతో దూరంలో లేదని గ్రహించాలి.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

ప్రకటిస్తూ చట్టం చేయాల్సిన అవసరం ముందుకు వచ్చిందన్నారు. 'ఈ బిల్లు మన దేశ ఆడబిడ్డల న్యాయం, గౌరవానికి సంబంధించింది. మహిళల హక్కులు, సాధికారత కోసం దీన్ని తీసుకువస్తున్నాం. దీనికి మతం, కులంతో సంబంధం లేదు. దీన్ని రాజకీయ కోణంలో చూడకండి' అని వారు విపక్షాలను కోరారు.

ప్రభుత్వాలు ప్రభుత్వాధినేతలు కొత్త చట్టాలను చేస్తున్నప్పుడు అనేక గొప్ప ఆదర్శాలను వల్లె వేస్తారు. కొందరిని బాధితులుగా చూపి వాళ్ల భయాందోళనల్ని పోగొట్టి ఆదుకోవాల్సిన బాధ్యతను తక్షణ జాతీయ అవసరంగా చిత్రిస్తారు. నిజంగానే వాళ్లు చెపుతున్న లక్ష్యాల కోసమే కొత్త చట్టాలను వినియోగిస్తారా? బాధితుల్ని నిజంగానే ఆదుకుంటారా? లేకుంటే ఇప్పుడు పైకి చెప్పని రాజకీయ ప్రయోజనాల కోసం వాటిని దుర్వినియోగం చేస్తారా? అనేవి ప్రజలు ప్రతిపక్షాలు అడగాల్సిన సమంజసమైన ప్రశ్నలే.

ముస్లిం మహిళల గురించి అంతగా ఆవేదన చెందుతున్న ప్రధాని నరేంద్ర మోదీ కొత్త చట్టం ద్వార వాళ్లకు కల్పిస్తున్న కొత్త ఆశ్వాసన ఏమిటీ? తక్షణ ముమ్మారు తలాక్ చెప్పడాన్ని నేరంగా పరిగణించి భర్తను మూడేళ్లు జైలుకు పంపించడంతో చట్టం పని అయిపోతుంది. అప్పుడు ఆ భార్య వైవాహిక స్థానం ఏమిటీ? తక్షణ ముమ్మారు తలాక్ చెల్లేదయితే ఆమె విడాకులు పొందిన మహిళ అవుతుంది. తక్షణ ముమ్మారు తలాక్ చెల్లకపోయేదయితే ఆమె వివాహిత మహిళ అవుతుంది. అప్పుడు, తనే జైలుకు పంపిన భర్తకు మూడేళ్లు బలవంతపు భార్యగా కొనసాగాల్సి ఉంటుంది.

దాంపత్య జీవితంలోలేని భర్తకు, తనను ఈసడించుకుంటున్న వ్యక్తికి ఒక మహిళ బలవంతంగా మూడేళ్లు భార్యగా ఉండాల్సిందేనా? అది ఆమె ప్రాథమిక హక్కులకు, ఆత్మగౌరవానికీ భంగం కాదా? ఈ మూడేళ్లు ఆమెకు జీవనాధారం ఏమిటీ? ఆమెకు పిల్లలుంటే వాళ్లను ఎవరు సాకాలీ? బాధితురాలు, ఆమె పిల్లల పోషణ కోసం ప్రభుత్వం ఏమైనా ప్రత్యేక నిధినిగానీ పథకాన్ని ఏర్పాటు చేస్తుందా? మూడేళ్ల తరువాత కారాగారం నుండి విడుదలై వచ్చిన భర్తతో ఆమె సంబంధాలు ఎలా ఉండాలి? ఇవన్నీ సందేహాలే. వీటిల్లో ఒక్కదానికి కూడా ప్రభుత్వం దగ్గర సమాధానం లేదు.

విడాకులనేవి కేవలం ముస్లిం సమాజంలో మాత్రమే కొనసాగుతున్న సాంప్రదాయం ఏమీకాదు. దేశంలోని అన్ని సమాజాల్లోనూ విడాకులున్నాయి. సంఖ్య రీత్య చూసుకున్నా, శాతం రీత్య చూసుకున్నా ముస్లింల కన్నా విడాకులు ముమ్మరంగా సాగుతున్న సమాజాలున్నాయి. ముస్లిం సమాజంలో విడాకులకు ధార్మిక సమర్ధన కూడ ఉంది గాబట్టి గణాంకాలు కచ్చితంగా ఉంటాయి. ఇతర సమాజాల్లో లాంఛనంగా విడాకులు తీసుకోకుండానే విడిపోతున్న దంపతుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటోంది. పైగా, ముస్లిం మహిళలకు ఒక సౌలభ్యం కూడా ఉంది. పునర్వివాహాలు, వితంతు పునర్వివాహాలు ముస్లిం సమాజంలో అతి సాధారణ విషయాలు. ఇతర సమాజాల్లో అదొక అసాధారణ వ్యవహారం. విడాకులు ఇచ్చిన ముస్లిమేతర భర్తల్ని వదిలేసి కేవలం ముస్లిం భర్తలనే శిక్షించ పూనుకోవడం మత వివక్ష కాదా? సాక్షాత్తు ప్రభుత్వమే మత వివక్షకు ఇంత బాహాటంగా పాల్పడవచ్చా?

ఏనుగుకు కనిపించే దంతాలు వేరు నమిలే దంతాలు వేరు అన్నట్టు చట్టాలకు సంఘపరివారం చెప్పే కారణాలు వేరు సాధించ దలిచే లక్ష్యాలు వేరు. ముస్లిం భర్తల్ని జైళ్లకు పంపి, ముస్లిం భార్యల్ని రోడ్ల మీద పడేసే పన్నాగం ఈ చట్టం వెనుక దాగి ఉందని కొందరు వ్యక్తం చేస్తున్న ఆందోళన కొట్టిపడేయదగ్గదేమీ కాదు.

2016లో సుప్రీం కోర్టులో మొదలయిన ఈ వివాదం పార్లమెంటులో చట్టంగా మారి రాష్ట్రపతి ఆమోదముద్ర కూడ పడిన తరువాత మళ్లీ సుప్రీం కోర్టుకు చేరింది. ముస్లిం మహిళ (వైవాహిక హక్కుల పరిరక్షణ) చట్టం–2019 మీద జమాతే ఉలేమా– ఏ– హింద్ లేవనెత్తిన అభ్యంతరాలను సుప్రీం కోర్టు 2019 ఆగస్టు 23న విచారణకు స్వీకరించి, తన వాదనను వినిపించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి నోటిసులు పంపింది. దానితో దేశవ్యాప్తంగా విడాకుల విధివిధానాల మీద మరో మారు ఒక విస్తృత చర్చకు తెర లేచింది.

విడాకుల మీద లోతైన చర్చకు వెళ్లడానికి ముందు ముస్లిం సమాజానికి చెందిన కొన్ని మౌలిక అంశాల మీద ప్రాథమిక అవగాహన ఏర్పరచుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఇతర సమాజాలు ఇస్లాం గురించి అర్థం చేసుకున్నది తక్కువ అపార్థం చేసుకుంటున్నది ఎక్కువ.

ఇస్లాం సామాజిక విప్లవం

ప్రపంచ మతాలు మూడింటిలో బౌద్ధం, క్రైస్తవం కన్నా కొత్తది కావడాన ఇస్లాంలో ఆధునిక భావాలు పుష్కలంగా కనిపిస్తాయి. విగ్రహారాధనను నిషేధించడంలో హేతువాద, నాస్తిక చింతనలు దర్శనమిస్తాయి. దేవుని ముందు మనుషులందరూ సమానులు, వాళ్లందరూ సోదరులు అనే ఒక సామాజిక విప్లవ ప్రకటనతో ఇస్లాం ఆవిర్భవించింది. ముస్లిం సమాజంలోని సౌభ్రాతృత్వం (మిల్లత్)కు ఇది పునాది. వడ్డీ నిషేధం, 'కార్మికుల వంటికి పట్టిన చెమట ఆరిపోకముందే వారి కూలీని చెల్లించండి', 'మీరు తినే ఆహారాన్నే పేదలకు పెట్టండి' 'మీరు ధరించే దుస్తులనే ఇతరులకు దానం చేయండి', 'పేదల ఆకలిని తీర్చాల్సిన బాధ్యత సంపన్నులది', 'స్త్రీ పురుషులు, పిల్లలు, ప్రతి ఒక్కరూ ధర్మ గ్రంథాలను చదివి తీరాలి'.

'ఆకలితో ఉన్నవారికి ఆహారం ఇవ్వండి', 'అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని సందర్శించండి', 'ఎవరినైనా అన్యాయంగా నిర్బంధిస్తే ఆ బందీని విడిపించండి', 'అణచివేతకు గురౌతున్నవారు ముస్లింలు అయినా, ముస్లిమేతరులు అయినా వారికి సహాయం చేయండి' వంటి ఆదేశాలు ఒక కొత్త సమాజ సృష్టికి బీజాలేశాయి.

స్త్రీలకు విద్య, ఆస్తి హక్కులతోపాటూ పునర్వివాహ హక్కును కూడా కల్పించి ఆర్థిక, నైతిక, సాంస్కృతిక రంగాలన్నింటినీ ఇస్లాం ఏడవ శతాబ్దంలోనే విప్లవీకరించింది. ఇస్లాం ప్రభావంతో మధ్య ప్రాచ్యంలో విజ్ఞాన శాస్త్రాలు, వ్యాపార గణాంక శాస్త్రాలు వేగంగా అభివృద్ధి చెందాయి. మరో మాటల్లో చెప్పాలంటే 18వ శతాబ్దపు ఆరంభంలో వాల్టైర్, రూసోలు రంగప్రవేశం చేసి ఫ్రెంచి విప్లవ కాలంలో నిస్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలు అని నినదించే వరకు ప్రవక్త ముహమ్మద్ సందేశాలే ఆధునిక భావనలుగా కొనసాగాయి అంటే అతిశయోక్తికాదు.

వివాహం - విడాకులు

స్త్రీపురుష సంబంధాల గురించి మాత్రమేగాక సంభోగం గురించి సహితం ఇస్లాం చాలా విపులంగా చర్చించింది. ముస్లిం వివాహం ఒక ఒప్పంద బంధం. ఆధునిక పరిభాషలో అగ్రిమెంట్ మ్యారేజ్. వివాహానికి వధువు అంగీకారాన్ని తప్పనిసరి చేయడం ఆ కాలంలో సామాన్యమయిన విషయం కాదు. ఇస్లాం ఆ పని చేసింది. విడాకుల హక్కుల గురించి ఇతర సమాజాలు ఆలోచించడం కూడా సాధ్యంకాని రోజుల్లో వివాహ బంధం నుండి విడిపోవడానికి కూడా ఒక ప్రక్రియను ఇస్లాం రూపొందించింది. ఇతర సమాజాలు ఇరవయ్యవ శతాబ్దంలో అలాంటి హక్కుల కోసం పోరాడడం మనకందరికీ తెలుసు.

ముస్లిం సమాజంలో వివాహబంధం నుండి విడిపోయే హక్కు భార్యా భర్తలు ఇద్దరికీ ఉంటుంది. భర్త ఇచ్చే విడాకుల్ని తలాక్ అంటారు. భార్య ఇచ్చే విడాకుల్ని ఖులా అంటారు. పరస్పర అంగీకారంతో తీసుకునే విడాకుల్ని ముబారత్ అంటారు.

తలాక్‌కు భార్య అంగీకారంతో పనిలేదు. భర్త ఏకపక్షంగా విడాకులు ఇవ్వవచ్చు. ఖులాకు భర్త అంగీకారం కూడా కావాలి. ఇదొక పరిమితి. అయితే, తనకు తలాక్ హక్కులు ఉండాలని వివాహ సమయంలో ప్రత్యేకంగా కోరే అవకాశం వధువుకు ఉంటుంది. అలాంటి ప్రత్యేక హక్కులు పొందిన వధువు భర్త అంగీకారంతో పని లేకుండానే ఎప్పుడయినా విడాకులు ప్రకటించి వివాహ బంధాన్ని రద్దు చేసుకోవచ్చు.

భారత ముస్లిం సమాజంలో ఇటీవలి కొత్త పరిణామం ఏమంటే భర్తలు ఇచ్చే విడాకుల (తలాక్) సంఖ్య కన్నా, భార్యలు ఇచ్చే విడాకుల (ఖులా) సంఖ్య ఎక్కువగా ఉంటోంది. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన ఒక నమూన సర్వే ప్రకారం తలాక్ కేసుల కన్నా ఖులా కేసులు దాదాపు 50 శాతం ఎక్కువగా ఉంటున్నాయట. 40 శాతం తలాక్ కేసులుంటే 60 శాతం ఖులా కేసులుంటున్నాయని దీని అర్థం. మహిళల్లో ఆర్థిక స్వావలంబన పెరిగిన తరువాత వివాహ వ్యవస్థలో వస్తున్న మార్పుగా దీన్ని భావించాల్సి ఉంటుంది.

తలాక్ ఒక సుదీర్ఘ ప్రక్రియ

ముస్లిం జీవన విధానానికి ప్రమాణాలు రెండు. మొదటిది, ఖురాన్ రెండోది, హదీస్. ఖురాన్ అంటే సూరాలు, ఆయతులు. హదీస్ అంటే ప్రవక్త ముహమ్మద్ ప్రవచనాలు, వారి జీవిత ఆచరణ.

పై రెండు ప్రాణప్రద ప్రమాణాల ప్రకారం ముస్లిం దాంపత్య జీవితంలో విడాకుల వ్యవహారం సుదీర్ఘకాలం సాగాల్సిన ప్రక్రియ. ఇందులో అనేక దశలున్నాయి. భార్యా భర్తల మధ్య బేధాభిప్రాయాలు తలెత్తడంతో ఈ ప్రక్రియ ఆరంభం అవుతుంది. మనస్పర్థలు అనేవి ఏ రంగంలో నుండైనా తలెత్తవచ్చు. ధార్మిక, ఆర్థిక, కామ, నైతిక, సాంస్కృతిక, ఉపాధి, రాజకీయ, కుటుంబ వ్యవహారాలు మరేదైనా కావచ్చు.

విడాకులను ప్రధాన కథాంశంగా తీసిన అస్గర్ ఫర్హాది 2012 ఆస్కార్ పురస్కార పర్షియన్ సినిమా జుదాయి (వేర్పాటు). తన పిల్లలు ఇరాన్ వంటి 'ఉద్రిక్త వాతావరణంలో కాకుండా అమెరిక' వంటి 'ప్రజాస్వామిక' వాతావరణంలో పెరగాలని భార్య ఆశిస్తుంది. అల్జీమర్స్ వ్యాధితో బాధ పడుతున్న తన తండ్రిని రోడ్డు మీద వదిలేసి ఇతర దేశాలకు వెళ్లడం తప్పు అని భర్త భావిస్తాడు. భార్యాభర్తల మధ్య అనేక రాత్రుళ్లు ఈ విషయమై చర్చలు జరుగుతాయి. ఎవ్వరూ తమ అభిప్రాయాలను మార్చుకోవడానికి సిద్ధపడరు. ఇక ఏకాభిప్రాయం కుదరదని నిర్ణయించుకున్నాక ఇద్దరూ వెళ్లి ఖాజీకి విడాకుల కోసం దరఖాస్తు చేసుకోవడంతో 'జుదాయి' సినిమా ఆరంభం అవుతుంది.

మనస్పర్థలు, బేధాభిప్రాయాలు మొదలవ్వగానే మొదటి దశలో భార్య భర్తలు ఇద్దరూ కూర్చొని తమ అసంతృప్తికి కారణాలను పరస్పరం చెప్పుకోవాలి. తీరు మార్చుకోమని కోరాలి. సమస్య భార్యా భర్తల మధ్య పరిష్కారం కానప్పుడు రెండో దశలో ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో పరిష్కారం కోసం ప్రయత్నించాలి. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే మూడవ దశలో విడాకుల సన్నాహాలు మొదలెట్టాలి. భార్యకు భర్త గానీ తద్విరుద్ధంగా గానీ తొలి తలాక్ ప్రకటించడంతో మూడు నెలల ఇద్దత్ గడువు (మూడు బహిష్టుల కాలం) మొదలవుతుంది.

భార్యాభర్తల మధ్య కేవలం ద్వేషభావం మాత్రమే ఉంటుందనుకోవడం ఒక తప్పుడు అభిప్రాయం. వాళ్ల మధ్య ప్రేమానురాగాలు సహితం ఉంటాయి. ద్వేషభావం బలంగా ఉన్నప్పుడు ఒక ఉద్రేకంలో తలాక్ చెప్పేసినా తరువాతి కాలంలో ప్రేమానురాగాలు గుర్తుకొచ్చి మనసు మార్చుకునే అవకాశం దంపతులకు ఉంటుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి తలాక్‌ను ప్రకటించిన తరువాత కూడ భార్యాభర్తలు ఒకే ఇంట్లో ఉండాలనే నియమం ఉంది. నెల తిరక్కుండానే తలాక్‌ను ఉపసంహరించుకోవచ్చు. లేదా రెండో నెల ఆరంభంలో రెండోసారి తలాక్ చెప్పవచ్చు. ఏ క్షణాన్నైనా తలాక్‌ను ఉపసంహరించుకునే అవకాశం మూడు నెలల వరకు ఉంటుంది. మూడు నెలల ఇద్దత్ గడువు పూర్తయిన కూడ మనసు మార్చుకోకపోతే మూడోసారి తలాక్ చెప్పవచ్చు. దానితో విడాకులు ఖాయం అయిపోయినట్టు.

ఇద్దత్ గడువు ముగిసే నాటికి భార్య గర్భవతి అని తేలితే విడాకుల వ్యవహారం వాయిదా పడిపోతుంది. పుట్టబోయే శిశువుకు భర్త తండ్రి బాధ్యతల్ని నెరవేర్చాల్సి ఉంటుంది.

ముస్లిం వివాహాల్లో వరునికి వధువు కట్నం ఇచ్చే సాంప్రదాయం లేదు. పెళ్లి సమయంలో వరుడే వధువుకూమహర్ణ (భరణం) ప్రకటిస్తాడు. భార్యకు భర్త ప్రకటిత మహర్ ను సంపూర్ణంగా చెల్లించడంతో విడాకుల ప్రక్రియ పూర్తి అవుతుంది.

విడాకుల కోసం ఇంతటి సుదీర్ఘ ప్రజాస్వామిక ప్రక్రియను మరే ఇతర సమాజాల్లోనూ చూడలేము. ముస్లిం సాంప్రదాయంలో వీటిని 'తలాక్– ఏ – అహసన', 'తలాక్ – ఏ – హస్సన' పేర్లతో పిలుస్తారు. ఈ రెండు తలాక్ ప్రక్రియలూ ఖురాన్, హదీసుల ప్రకారం ఆమోద యోగ్యమైనవి. నిజానికి విడాకులకు ఇంతకన్నా సుదీర్ఘ ప్రక్రియ అవసరమని ఖలీఫాలు భావించిన సందర్భాలున్నాయి. విడాకుల ప్రక్రియను నాలుగయిదు నెలలకు కుదించడానికి రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ ఫారూఖ్ ఒప్పుకోలేదట. 'సహనం వహించాల్సిన చోటే మీరు తొందర పడుతున్నారు' అని అసహనం వ్యక్తం చేశారట.

నడమంత్రపు విడాకులు

వెయ్యేళ్ల క్రితం ఇప్పటి సిరియా, టర్కి ప్రాంతాల్ని పాలించిన ఉమయ్యాద్ వంశీకులు ముస్లిం వివాహ వ్యవస్థలో తప్పుడు సాంప్రదాయాలను ప్రవేశపెట్టారు. విలాసాలకు అలవాటుపడిన ఆ చక్రవర్తులు అనేక

మంది స్త్రీలను వివాహమాడేవారు. ఇస్లాం బహు భార్యత్వాన్ని ఆమోదిస్తున్నప్పటికీ దానికీ కొన్ని పరిధి పరిమితులున్నాయి. మరోవైపు, వివాహం చేసుకోకుండా లైంగిక సంబంధాలు పెట్టుకోవడం మీద నిషేధం ఉంది. వివాహేతర లైంగిక సంబంధాన్ని ఇస్లాం చాలా తీవ్రమైన అంశంగా పరిగణిస్తుంది. ఈ నియమాలకు భంగం కలగకుండ కొత్త వారిని వివాహం చేసుకోవడానికి వీలుగా పాత భార్యలను వేగంగా వదిలించుకోవడానికి వాళ్లు ఒక వినూత్న విడాకుల విధానాన్ని కనిపెట్టారు.

విడాకుల ప్రక్రియలో భార్యాభర్తల సంప్రదింపుల్ని, బంధుమిత్రుల హితోక్తుల్ని, మూడు నెలల ఇద్దత్ గడువును రద్దు చేసి తలాక్ – ఏ– బిద్దత్ అనే ఒక కృత్రిమ విడాకుల విధానాన్ని సృష్టించారు. పర్షియన్, అరబ్బీ భాషల్లో బిద్దత్ అంటే సృజనాత్మకత, కృత్రిమ, సృష్టి, తక్షణం వంటి అర్థాలున్నాయి. ఒక్క గుక్కలో మూడుసార్లు తలాక్ చెప్పేస్తే ఆ క్షణం విడాకులు అయిపోయినట్టేనని తలాక్–ఏ బిద్దత్ అంటుంది. దీనినే ఇప్పుడు ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్, తక్షణ ముమ్మారు తలాక్ అనే పేర్లతో పిలుస్తున్నారు.

స్త్రీలోలురైన కొందరు చక్రవర్తులు కృత్రిమంగా సృష్టించిన తలాక్ –ఏ– బిద్దత్ కు ఇస్లాంలో ఎన్నడూ ధార్మిక సమర్ధన లేదు. ఇది ఖురాన్, హదీస్ రెండింటికీ వ్యతిరేకం. పాకిస్తాన్‌తో సహా దాదాపు 22 ముస్లిం దేశాలు తలాక్ – ఏ– బిద్దత్‌ను చెల్లదని ప్రకటించాయి.

టెకీ తలాకులు

సమాచార సాంకేతిక (ఐటి) విప్లవం యువతరంలో రెండు పెదధోరణులకు బాటలేసింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ చదివి ఉద్యోగాలు రానివారు తీవ్ర నిరాశలో మునిగిపోతుంటే, ఉద్యోగాలు పొందిన వాళ్లు అతిశయంలో జీవిస్తున్నారు. ఈ అతిశయం వైవాహిక వ్యవస్థానూ ప్రభావితం చేస్తున్నది. నేటి 'జియో'తరం ముస్లిం యువకులు స్మార్ట్‌ఫోన్‌ల ద్వార, ఎస్ఎంఎస్, ఎంఎంఎస్, ఈమెయిల్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, వీడియో కాల్ వగయిరాల ద్వార తక్షణ ముమ్మారు తలాకులు చెప్పడం మొదలెట్టారు. 2017 తరువాత దేశవ్యాప్తంగా ఇలాంటి కేసులు దాదాపు 550 నమోదయ్యాయి.

ముస్లిం ధార్మిక సంస్థల తప్పిదం

మనది అసమాన సమాజం. ఇప్పటికీ ఎక్కువ మంది గృహిణులు ఆర్థిక వ్యవహారాల్లో భర్తల మీదనే ఆధారపడి జీవిస్తుంటారు. విడాకులవల్ల వాళ్లు దాంపత్య జీవితంలోనేగాక ఆర్థిక ఆలంబనలోనూ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. తలాక్– ఏ– బిద్దత్ విడాకుల వ్యహారాన్ని ముస్లిం ధార్మిక సంస్థలు తేలిగ్గా తీసుకున్నాయి. విడాకుల బాధితులయిన మహిళల పక్షాన నిలబడాల్సిన సామాజిక బాధ్యతను వాళ్లు సకాలంలో గుర్తించలేదు.

ధార్మిక సంస్థల పెద్దల్లో ఎక్కువ మంది పురుషాధిక్య భావజాలాన్ని కలిగి ఉంటారు. భార్యాభర్తల వివాదాలను పరిష్కరించాల్సి వచ్చినపుడు వాళ్లు పురుష పక్షపాతంతో వ్యవహరిస్తు తీర్పులు చెపుతుంటారు. ఇస్లాం జీవన విధానంలోని అనేక ప్రగతిశీల అంశాలను ఈ మతపెద్దలు తమ పురుషాధిక్య తప్పుడు భావజాలంతో చిదిమేస్తుంటారు. సమీప గతంలో వీరి పురుషాధిక్య భావజాలం 1986లో బయటపడింది. మధ్యప్రదేశ్ ఇండోర్ కు చెందిన ఒక ముస్లిం వ్యాపారి తన 62 ఏళ్ల భార్య, ఐదుగురు పిల్లల తల్లి అయిన షాబానో కు విడాకులిచ్చాడు. ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించగా షాబాను భర్త నెలకు 179 రూపాయల చొప్పున మనోవర్తి చెల్లించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఆరోజుల్లో కూడ నెలకు 179 రూపాయలు అనేది చాలా చిన్న మొత్తమే. నిజానికి ముస్లిం సమాజం ఆ మనోవర్తి నెలసరి మొత్తాన్ని పెంచాలని ఆందోళన చేసి ఉండాల్సింది. కానీ అలా జరగలేదు. అందుకు పూర్తి విరుద్ధంగా జరిగింది. గడువు తరువాత భర్త పరాయి పురుషుడు అయిపోతాడని ముస్లిం మతాచార్యులు కొత్త భాష్యాలు చెప్పారు. ఒక మహిళ పరాయి పురుషుని నుండి ఆర్థిక సహాయాన్ని పొందడాన్ని ముస్లిం ధార్మిక విలువలు అంగీకరించవని వాదించారు.

అప్పట్లో మత ఓటు బ్యాంకు ప్రయోజనాలను ఆస్వాదిస్తున్న ప్రధాని రాజీవ్ గాంధి ముస్లిం ఛాందసులవాదం వైపు మొగ్గు చూపించారు. విడాకులు పొందిన ముస్లిం మహిళలు మనోవర్తి తీసుకోవడానికి వీలు లేకుండ ముస్లిం మహిళల (విడాకు హక్కుల పరిరక్షణ) చట్టం – 1986ను తెచ్చారు. ఇలాంటి ధోరణులవల్ల యువతరానికి ముఖ్యంగా మహిళలకు ధార్మిక పెద్దల మీద నమ్మకం తగ్గిపోతూ ఉంటుంది.

ముస్లింల పౌరస్మృతిని షరియత్ అంటారు. ఇది దాదాపు 7వ శతాబ్దంలో రూపుదిద్దుకుంది. అప్పటికి స్మార్ట్‌ఫోన్లు లేవు. స్మార్ట్‌ఫోన్, వీడియో చాట్ విడాకులు ఇస్లాం వ్యతిరేకం అని చెప్పడానికి ఈ ఒక్క అంశం చాలు. దానికి పెద్ద పరిశోధనలు అక్కర లేదు. అయినప్పటికీ ముస్లిం మతాచార్యులు మౌన ప్రేక్షకులుగా ఉండిపోయారు. ప్రభుత్వం తమ పౌరస్మృతిలో జోక్యం చేసుకోదనే అతివిశ్వాసంలో వాళ్లు ఉండిపోయారు.

జమాత్ ఏ ఇస్లాం, జమాత్ ఏ ఉలేమా ఏ హింద్ వంటి ఒకటి రెండు జమాత్ లకు తప్ప దేశంలోని ఇతర ముస్లిం జమాత్ లకు సామాజిక రాజకీయ అంశాలు అస్సలు పట్టవు. ధార్మిక జీవితమే (దీన్ దారి) సర్వస్వం అనే భ్రమల్లో వాళ్లు బతుకుతుంటారు. సామాజిక రాజకీయ పరిణామాలను (దునియాదారీ) పట్టించుకోకపోతే ఒకరోజు తమ ధార్మిక జీవితానికి కూడా ముప్పు వస్తుందన్న సోయి కూడ వాళ్లకు ఉండదు.

వివాహం విషయంలో ఉన్నతమైన ఇస్లామిక్ వివాహ సాంప్రదాయాలు వేటినీ ఈ తరం యువకులు పాటించరు. పెద్ద ఎత్తున కట్నకానుకలు కావాలని కోరుతారు. విలాసంగా పెళ్లి విందు జరపాలని కోరుతారు. కానీ విడాకుల విషయం రాగానే మతంలో ఎక్కడో ఓ మూలన తుప్పుపట్టి పడిఉన్న తలాక్ ఉఏ– బిద్దత్ ను బయటికి తీస్తారు. ఇది పచ్చి అవకాశవాదం. మహర్ విషయంలోనూ వీరిది అవకాశ వాదమే. లక్షల రూపాయలు కట్నకానుకలు తీసుకుని చేసుకునే పెళ్లిలో మహర్‌ను మాత్రం సాంప్రదాయం ముసుగులో వందలు, వేలకు మాత్రమే పరిమితం చేస్తారు. ఈ వివాహాలూ ఇస్లాం వ్యతిరేకమైనవే, ఈ విడాకులూ ఇస్లాం వ్యతిరేకమైనవే.

స్మార్ట్‌ఫోన్ విడాకుల వ్యవహారం తమ దృష్టికి రాగానే వాటిని ఇస్లాం వ్యతిరేకమని పేర్కొంటూ జమాతులు తక్షణం ఫత్వాలు (ప్రకటనలు) జారీచేసుంటే బాగుండేది. వాళ్లు ఆ పని చేయకుండా నిర్లిప్తంగా ఉండిపోయారు. ఒక చారిత్రక అపచారం చేశారు. మొత్తం భారత

ముస్లిం సమాజాన్ని రక్షణాత్మక స్థితిలోనికి నెట్టేశారు. ముస్లింలను వేధించడానికి సంఘపరివారంకు కొత్త అవకాశలు కల్పించారు. ఈ పాపం నిస్సందేహంగా ముస్లిం జమాతులదే.

ముస్లిం (పౌరస్మృతి) పర్సనల్ లా

ముస్లిం సమాజంలో వివాహ, వారసత్వ, వితరణ (వక్ఫ్) తదితర వ్యవహారాల్లో తలెత్తే వివాదాలను పరిష్కరించడానికి మన దేశంలో 13వ శతాబ్దం ఆరంభం నుండి కొన్ని ప్రత్యేక న్యాయస్థానాలు వెలిసాయి. బానిస వంశస్తుల పాలన కాలంలోనే ముఫ్తీల పర్యవేక్షణలో ఈ ధర్మపీఠాలు నడిచేవి. ఇది మొఘల్ చక్రవర్తుల వరకు సాగింది. 1757లో బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన మొదలయ్యాక కొత్త శిక్షా స్మృతి వచ్చింది. అయితే, భిన్నత్వంలోనూ బహుళత్వం కలిగిన భారత సాంస్కృతిక జీవనంలోనికి జోక్యం చేసుకోవడం అంత సులువైన వ్యవహారం కాదని కంపెనీ పాలకులకు మొదట్లోనే తెలిసిపోయింది. 1773 నాటి రెగ్యులేషన్ చట్టం కూడ పౌరస్మృతుల్ని ఆయా సమూహాల అంతర్గత వ్యవహారంగా వదిలేసింది. 1930వ దశకం చివర్లో వైస్రాయిగా ఉన్న ద మార్క్వెజ్ ఆఫ్ లింలిత్ గోవ్ ముస్లిం పౌరస్మృతికి చట్టబద్ధ పరిరక్షణ కల్పించాలను కున్నాడు. అలా ద ముస్లిం పర్సనల్ లా (షరియత్) అప్లికేషన్ యాక్ట్ – 1937 అమల్లోనికి వచ్చింది. ఆయన కాలంలోనే ద డిజల్యూషన్ ఆఫ్ ముస్లిం మ్యారేజ్ యాక్ట్ – 1939 వచ్చింది.

స్వాతంత్ర్యానంతరం కూడ ఈ రెండు చట్టాలు యధతథంగా కొనసాగాయి. 1986లో అదనంగా ముస్లిం మహిళల (విడాకు హక్కుల పరిరక్షణ) చట్టం వచ్చి చేరింది.

ముస్లిం వివాహిత మహిళ తన వివాహాన్ని రద్దు చేసుకోవడం కోసం న్యాయస్థానం నుండి అనుమతి (ఐవషతీవవ) పొందడానికి ప్రాతిపదిక అయిన 12 అంశాలను ద డిజల్యూషన్ ఆఫ్ ముస్లిం మ్యారేజ్ యాక్ట్ – 1939లో పొందుపరిచారు. అయితే, ముస్లిం వివాహిత పురుషుడు తన వివాహాన్ని రద్దు చేసుకోవడం కోసం న్యాయస్థానం అనుమతి పొందడానికి ప్రాతిపదికను ఇందులో పేర్కొనలేదు. అంచేత, సాంప్రదాయ పద్ధతిలో 'తలాక్– ఏ – అహసన' 'తలాక్ – ఏ – హస్సన' పద్ధతుల్లో విడాకులు కోరడం తప్ప ముస్లిం పురుషులకు మరో మార్గం లేకుండా పోయింది. అలా కాకుండ ద డిజల్యూషన్ ఆఫ్ ముస్లిం మ్యారేజ్ యాక్ట్ – 1939లో నిమహిళ అని పేర్కొన్న చోట 'దంపతుల్లో ఏ ఒక్కరై' అని చేర్చి ఉంటే ముస్లిం భర్తలు సహితం చట్టబద్ధంగా విడాకులు తీసుకోవడానికి వీలుండేది. పాత చట్టంలో ఆ ఒక్క మాటను సవరిస్తే సరిపోయేదానికి భూమ్యాకాశాలను ఏకంచేసి కొత్తచట్టం చేయడం దేనికీ?

సుప్రీం కోర్టు దృష్టిలో తలాక్

షాయరా బానో కేసులో ఆఫ్రీన్ రహమాన్, గుల్షన్ పర్వీన్, ఇష్రత్ జహా, అతియా సాబ్రీ అనే మరో తక్షణ ముమ్మారు తలాక్ బాధిత మహిళలు చేరారు. దాదాపు ఏడాదిన్నర సాగిన ఈ కేసు విచారణలో ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన విస్తృత ధర్మాసనం ఏకాభిప్రాయానికి రాలేక 2017 ఆగస్టు 22న 3:2తో విభజిత తీర్పు చెప్పింది.

జస్టిస్ ఆర్ ఎఫ్ నారిమన్, జస్టిస్ యు.యు. లలిత్, జస్టిస్ కురియన్ లతో కూడిన మెజారిటీ న్యాయమూర్తులు ఇన్ స్టాంట్ ట్రిపుల్ తలాక్‌గా పిలవబడే తలాక్ ఉఏ– బిద్దత్ చెల్లదని చెప్పారు. ఇందులో ఇద్దరు జడ్జీలు ఇన్‌స్టాంట్ ట్రిపుల్ తలాక్‌ను చట్ట విరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం అని పేర్కొనగా, మూడవ జడ్జీ మాత్రం ఇది ఇస్లాం సాంప్రదాయానికే విరుద్ధం గనుక చెల్లదన్నారు.

మెజారిటీ తీర్పుతో విభేదించిన ఇద్దరిలో అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్‌తో పాటు జస్టిస్ ఎస్ అబ్దుల నజీర్ ఉన్నారు. ఒక సమూహంలో వెయ్యేళ్లుగా కొనసాగుతున్న ఒక ధార్మిక సాంప్రదాయాన్ని న్యాయస్థానాలు తప్పు పట్టవచ్చునా? అనే సందేహాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ వ్యక్తం చేశారు. పౌర సాంప్రదాయాల్లో న్యాయస్థానాల జోక్యాన్ని ద ముస్లిం పర్సనల్ లా (షరియత్) అప్లికేషన్ యాక్ట్ – 1937 నిరోధిస్తున్నదన్నారు. పౌరులు మత విశ్వాసాలు కలిగి ఉండడానికీ, ఆచరించడానికీ, ప్రచారం చేసుకోడానికి రాజ్యాంగంలోని 25 (1) అధికరణ హక్కును కల్పిస్తున్నపుడు వాటి మంచిచెడుల్ని విశ్లేషించే అధికారం న్యాయస్థానాలకు ఉండదనే అభిప్రాయాన్ని కూడ వారు వ్యక్తం చేశారు. అయితే, పాత చట్టాలను సవరించే అవకాశం పార్లమెంటుకు ఉంటుందని గనుక ప్రభుత్వం అలాంటి ఒక కొత్త చట్టాన్ని రూపొందించ వచ్చని సూచించారు.

మరో సందర్భంలోనూ సుప్రీం కోర్టు ధర్మాసనం విడాకుల మీద అనేక విలువైన అభిప్రాయాలను వ్యక్తం చేసింది. మరొకరి భార్యతో ఇష్టపూర్వకంగా అయినాసరే వివాహేతర సంబంధాన్ని కొనసాగించిన పురుషుల్ని శిక్షించే ఐపిసి 497ను 2018 సెప్టెంబరు 27న ఐదుగురు సభ్యులతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం రద్దు చేసింది.

ఈ కేసు విచారణ సందర్భంగా విడాకుల అంశం చర్చకు వచ్చింది. 'వివాహేతర లైంగిక సంబంధాన్ని నేరపూరిత చర్య అనలేం. మహా అయితే అదొక పౌర తప్పిదం మాత్రమే అవుతుంది. పౌర తప్పిదాలకు పౌర పరిష్కారంగా విడాకులు ఎలాగూ ఉన్నాయి. ఇక శిక్షలు దేనికీ? వివాహేతర లైంగిక సంబంధాన్ని పెట్టుకున్నంత మాత్రాన ఒక వ్యక్తిని ఐదేళ్లు జైలుకు పంపడం ఇంగితజ్ఞానంతో కూడిన చర్య అనిపించుకోదు' అని సుప్రీంకోర్టు అప్పటి ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా అన్నారు. ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యల్లో మూడు ప్రాణప్రద అంశాలున్నాయి. మొదటిది, వివాహేతర లైంగిక సంబంధాన్ని పెట్టుకోవడం జైలుకు పంపాల్సినంత నేరం కాదు. రెండోది, పౌర తప్పిదాలకు పౌర పరిష్కారంగా విడాకులు వున్నాయి. మూడోది, విడాకుల సౌకర్యాన్ని వాడుకోవడం నేరం ఏమీకాదు.

సుప్రీం కోర్టు ఒక పౌరవ్యవహారంగా నిర్వచించిన విడాకుల్ని కేంద్ర ప్రభుత్వం ఒక నేరపూరిత చర్యగా పరిగణిస్తు చట్టం తేవడమే ఒక వైచిత్రి. ముస్లిం మహిళ (వైవాహిక హక్కుల పరిరక్షణ) బిల్లు – 2019 మీద జమాతే ఉలేమా ఏ హింద్ పిటీషన్‌ను విచారణకు స్వీకరించిన సందర్భంగా ముగ్గురు సభ్యుల ధర్మాసనంలోని జస్టిస్ ఎన్ వి రమణ 'న్యాయస్థానం చెడ్డదిగా ప్రకటించిన ఒక చర్యను పార్లమెంటు నేరంగా ప్రకటించ వచ్చునా?' అని ఒక సందేహాన్ని వెలుబుచ్చారు. ధర్మాసనం సందేహం ఎక్కడికి దారి తీస్తుందో భవిష్యత్తు చెప్పాలి.

(రచయిత ముస్లిం ఆలోచనాపరుల వేదిక కన్వీనర్) వీ

'కాఫీడే' సిద్ధార్థ - ఆత్మహత్యా? వ్యవస్థ చేసిన హత్యా?

కాఫీ మార్కెట్‌ను చేజిక్కించుకోవాలనే ఉద్దేశంతో కార్పొరేట్ శక్తులు చేసిన ఒత్తిడులు, వేధింపులే సిద్ధార్థ ఆత్మహత్యకు దారితీశాయని అంటున్నారు* **బి.ఎస్. రాజు

ఈ దేశంలో అనునిత్యం భూమిని నమ్ముకుని బ్రతుకుదామనే రైతు ఆత్మహత్య చేకుంటున్నాడు. ఎదో చిన్న చితక వ్యాపారం చేసుకు బతుకుదామనే చిరు వ్యాపారస్థుడు మొత్తం కుటుంబాన్నే చంపి, తన్నుతాను చంపుకుంటున్నాడు. పెద్దపెద్ద వ్యాపారస్తులకు అటువంటి బాధలుండవనుకుంటే ఇపుడటువంటి బడా వ్యాపారస్తులు కూడా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వీటన్నిటికి మూలం ఒక్కటే! అప్పులు, అప్పుల మీద వడ్డీలు. అవి కట్టాలంటే తిరిగి అప్పులు. ఇది ఒక సుడిగుండంగా మారి మోసాలు చేతకానివారు, సీదా సాదా వ్యవహారం తప్ప ఇంకేమీ తెలియని వారు, ఆత్మాభిమానమనే ఉరితాడుకు వేలాడుతున్నారు. ఆత్మహత్యలనే ముగింపును కౌగలించుకుంటున్నారు.

ఇవి నిజానికి ఆత్మహత్యలేనా? లేక ఈ దుర్భర హింసాత్మక వ్యవస్థ చేస్తున్న హత్యలా? ఈ భూగోళంపై, సువిశాల భారతదేశం అహింస అనే పునాదితో ఏర్పడ్డ ఏకైక ప్రజాస్వామిక దేశమని మనం గర్విస్తూఉంటాం. దేశ ప్రజలంతా అలానే నమ్ముతున్నారనుకుంటా! లేక ఆలా భ్రమింపచేస్తున్న రాజకీయ వలయంలో చిక్కుకుని విలవిల్లాడుతున్నారనుకుంటా! ఈ ఆత్మహత్యల, లేక ఈ వ్యవస్థ చేస్తున్న హత్యల పరంపరలో 'కెఫే కాఫీ డే' వ్యవస్థాపకుడైన 'వి.జి. సిద్ధార్థ' మరణం వచ్చిచేరింది.

చిన్న స్థాయి వ్యాపారం నుండి రాకెట్ వేగంతో ఎదిగి, దేశ వ్యాపార రంగంలో వెలుగులు విరజిమ్మిన 'కెఫే కాఫీ డే' అధినేత 'వి.జి. సిద్ధార్థ' ఆత్మహత్య యావత్ భారతదేశపు కార్పొరేట్, వ్యాపార, వాణిజ్య రంగాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇదొక విషాద సంఘటన. కాఫీ డే చైర్మన్ సిద్ధార్థను విలువలులేని, మోసపూరిత వ్యాపారవేత్త అని అనలేం! సొంత విలాసాలకు, జల్సాలకు పాల్పడి బతికిన వ్యాపారస్తుడు కాదు. బ్యాంకులను ముంచి విదేశాలకు పారిపోయే కుతంత్రుడు కాదు. అటువంటివారికి ప్రభుత్వాలు పరోక్షంగా రక్షణ కల్పించిన, లేక తెలిసీ తెలియనట్టు కళ్లుమూసుకుని తీరం దాటిపోవడానికి దోహదపడ్డ దాఖలాలు మన కళ్ల ముందే ఉన్నాయి. తిమింగలాల మధ్య ఓ మెత్తని చేప ఎలా నెగ్గుకొచ్చిందో నెగ్గుకొచ్చి, ఎదిగి, తిరిగి ఆ తిమింగలాల వలయం నుండి బయటపడలేక చావును కోరుకుంది 'వి.జి. సిద్ధార్థ' అనే మెత్తని చేప.

1994లో ఒక షాపుతో ప్రారంభమైన 'కెఫే కాఫీ డే' దేశ విదేశాల్లో 250 నగరాల్లో రమారమి 2000 కాఫీ షాపులు స్థాపించింది. 20,000 ఎకరాల కాఫీ తోటలు, 3000 ఎకరాల అరటి తోటలు ఆ యాజమాన్యానికి వెన్నుదన్నుగా ఉన్నాయి. బెంగళూరు నడిబొడ్డున 120 ఎకరాల సాఫ్ట్‌వేర్ పార్క్ ఉంది. మైండ్ ట్రీ అనే సాఫ్ట్‌వేర్(అమ్మివేసిన) కంపెనీ, ఇతర వ్యాపారాలు ఈ సంస్థ గొడుకు కిందనే ఉన్నాయి. సుమారు 50,000 మందికి ఉద్యోగ కల్పన చేసిన గర్వించదగ్గ ఓ 53 ఏళ్ల దేశీయ వ్యాపారవేత్త, నేను వ్యాపార నిర్వహణలో విఫలమయ్యాను, క్షమించండి అని లెంపలు వేసుకుని నదిలో దూకిన పరిస్థితిని ఏమనుకోవాలి? ఎలా అర్థం చేసుకోవాలి?

ఆదానీ అనే వ్యాపారస్తుడు లెక్కకట్టలేని అప్పులు చేసి కూడా ఎవరూ ఊహించలేని విధంగా వ్యాపారాల్లో విస్తరిస్తున్నాడు. విమానాశ్రయాలను సొంతం చేసుకుంటున్నాడు. దేశమంతా నౌకాశ్రయాలను కబ్జా చేసే పనిలో ఉన్నాడు. అన్ని రాష్ట్రాల్లోనూ భూములు చవకగా కొట్టేస్తున్నాడు. ఇక బొగ్గు, ఇతర ఖనిజాల గనుల ఆక్రమణ, దోపిడీ సంగతి చెప్పనక్కర్లేదు.

మన దేశంలో అత్యంత ధనికుడు, ప్రపంచ కుబేరుల చిట్టాలో పై పదిమందిలో నిలిచిన ముఖేష్ అంబానీ దేశ విదేశీ అప్పులెన్ని? 22 బిలియన్ డాలర్లు అంటే ఒకటిన్నర ట్రిలియన్ రూపాయిలు. అంటే ఇప్పటి డాలరు-రూపాయి మారకపు విలువ ప్రకారం 1,65,000 కోట్ల రూపాయలు. ఆదానీ అప్పులెన్ని? ఆ! ఎన్నోనా? ఓ 75 వేల కోట్లు. ఈ రెండు కంపెనీ పందికొక్కుల గురించి రాయాలంటే ఇది సమయం కాదు గాని, ఒక విషయం మట్టుకు ఇక్కడ చెప్పాలి. వీళ్ల 'ఇషారా' పై నడిచే ప్రభుత్వాలు ఉన్నప్పుడు, అటువంటి ప్రభుత్వాలు ప్రజాస్వామ్యం ముసుగులో ఫాసిజాన్ని అమలుచేస్తున్నపుడు, సిద్ధార్థ వంటి కొన్ని కనీస విలువలుగల వ్యాపారస్తుడు బతకడం కష్టమే మరి!

ఇంతకీ కాఫీ డే గ్రూపు అప్పులెన్ని? 2019, జూలై 31 నాటికి అంటే సిద్ధార్థ ఆత్మహత్య చేసుకునే నాటికి రు. 4,970 కోట్లు. ఆ గ్రూపు ఆస్తుల మార్కెట్ విలువ (అప్పుల సుడిగుండంలో ఇరుక్కోకుండా ఉంటె) ఎంత లేదన్నా 20,000 కోట్లకు తక్కువ ఉండదు. అయితే ఎందుకతను ఆత్మహత్యకు పాల్పడ్డాడు? ఏ అదృశ్య హస్తం అతన్ని వెంటాడింది? నీ కంపెనీల షేర్లు ఫలానా వారికి ఫలానా ధరకు అమ్మమని వెంటబడింది ఎవరు? అది ఎంతటి ఒత్తిడిని అతనిపై తీసుకొచ్చింది? ఆదాయపన్ను అధికారులను ఉసిగొల్పి ఉచ్చులో బిగించింది ఎవరు?

కాఫీ డే గ్రూపు సంస్థలు వ్యాపారం లేక, మార్కెట్లో గిరాకీ లేక కునారిల్లుతున్నాయా? లేదే! ఆదాయపు పన్ను ఎగవేత అనే సాకుతో అతని షేర్లన్నింటినీ పనిగట్టుకుని పనికిరాకుండా చేసి చక్రబంధంలో ఇరికించింది ఎవరి లబ్ది కొరకు? ఎవరి మేలు కొరకు? ఈ సంస్థకు ఉద్యోగుల్లో మంచి పేరుంది. వ్యాపార అరాచకత్వం లేని సంస్థగా దీన్ని చెప్పవచ్చు. మంచిగా నడిచే వ్యాపారాలను ఐనవారికి కట్టబెట్టే ఏలికల ఆశ్రిత పెట్టుబడిదారీ దుర్బుద్ధి, దురుద్దేశ్యమే తప్ప కాఫీ డే పట్ల ప్రదర్శించిన ప్రభుత్వ వ్యవహార శైలిలో క్రమబద్ధత, పారదర్శకత, న్యాయబద్ధత, ప్రోత్సాహం సున్నా. ఇది ప్రభుత్వాల పక్కా ఆర్థిక ఫాసిజం. అదానీ, అంబానీల వంటి వాళ్లకు ఒక కొలబద్ద, సిద్ధార్థ వంటి వాళ్లకు

న్యాయమా ఎక్కడ 'ఉన్నావ్'?

మాఫియా రాజకీయ నాయకులు చేస్తున్న అత్యాచారాలు, హత్యలు వెలుగులోకి రావడానికి కూడా బాధితులు తమ ప్రాణాలను పణంగా పెట్టాల్సి వస్తోందనీ, ఇక వారికి న్యాయం అందుతుందనే నమ్మకం ఎక్కడ ఉంటుందనీ అంటున్నారు **కె. మహేష్**

మైనర్‌పై ఎంఎల్‌ఏ లైంగికదాడి.. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు తిరస్కరించడంతో జిల్లా మెజిస్ట్రేట్‌ను ఆశ్రయించినందుకు బాధితురాలి తండ్రిపై విచక్షణారహిత దాడి.. తిరిగి ఆ తండ్రిపైనే కేసు నమోదు.. తర్వాత పోలీసు కస్టడీలో అనుమానాస్పద మృతి.. అయినా భీతిల్లి ఊరుకోకుండా న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరుగున్న బాధితురాలిని ఏకంగా లారీతో గుద్దిచంపాలన్న కుట్ర. ఇప్పుడు ఆస్పత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న బాధితురాలు. ఇదంతా ఏదో హార్రర్ సినిమా స్టోరీని తలపిస్తున్నది కదా. 'ఉన్నావ్' కేసుకు సంబంధించిన వార్తలు, ఆరోపణలను తరచి చూస్తే ఈ తరహా మలుపులే కనిపిస్తాయి. ఒక ప్రజాస్వామిక దేశంలో ఎంతమాత్రం తొణుకుబెణుకు లేకుండా ఇంత బరితెగింపుగా, బాహాటంగా నేరాలు జరుగుతాయా? ప్రజా ప్రతినిధులు ప్రజల సంక్షేమానికి పాటుపడాలా? లేక తన సుఖసంతోషాలకు రాజకీయ ఆధిపత్యంతో వారిని వాడుకోవాలా? లైంగిక దాడి ఆరోపణలు వచ్చినప్పుడు ఒక ఎంఎల్‌ఏ వాటిపై దర్యాప్తునకు సహకరించి నిజాలను ప్రజలకు చెప్పే బాధ్యతను తీసుకోవాలా? లేక ఆరోపణలు చేసిన బాధిత కుటుంబాన్నే అంతం చేస్తామని బెదిరించాలా? 'ఉన్నావ్' ఉదంతాన్ని చదివితే రాజ్యాంగానికి బదులు ఆర్థిక, రాజకీయ ఆధిపత్యమే రాజ్యమేలుతున్నదన్న అభిప్రాయం పుట్టుకొస్తుంది.

ఉన్నావ్ కేసు పూర్వపరాలు

2017 జూన్ 11న ఉత్తరప్రదేశ్‌లో ఉన్నావ్‌లోని మాఖి గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్టు ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూన్ 20న ఆమె ఔరాయ జిల్లాలో లభించగా ఉన్నావ్‌కు తీసుకొచ్చారు. ఉద్యోగం ఇప్పిస్తామని వంచించి బిజెపి ఎంఎల్‌ఏ కుల్దీప్‌సింగ్ సెంగార్, అతని సోదరుడు అతుల్‌సింగ్, అనుచరులు 2017 జూన్ 17న తనపై లైంగికదాడికి పాల్పడ్డారని బాలిక (అప్పుడు 17 ఏండ్ల వయసు) పోలీసులకు ఫిర్యాదు చేసింది. మాఖి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది కానీ, పోలీసులు అందులో ఎంఎల్‌ఏ పేరును తప్పించారు. పోలీసులు ఎంఎల్‌ఏ నియంత్రణలో ఉన్నారన్న అవగాహనకు వచ్చిన బాధిత కుటుంబం సీఎం కార్యాలయానికి లేఖలు రాసింది. కానీ ఫలితం శూన్యం. నెలలు గడుస్తున్నా ఆ ఎంఎల్‌ఏపై కేసు నమోదు కాకపోవడంతో బాధితురాలి తల్లి 2018 ఫిబ్రవరి 24న జిల్లా మెజిస్ట్రేట్‌ను ఆశ్రయించింది. అయినా ఆ ఎంఎల్‌ఏపై కేసు నమోదు కాలేదు. కానీ, ఎంఎల్‌ఏ వర్గీయుల నుంచి మాత్రం బెదిరింపుల తీవ్రత పెరిగింది. ఏప్రిల్ 3న అతుల్ సింగ్ మరో నలుగురు అనుచరులతో బాధితురాలి ఇంట్లోకి చొరబడి ఆమె తండ్రి సురేంద్రను తుపాకీతో బెదిరిస్తూ బయటకు లాక్కొచ్చాడు. చెట్టుకు కట్టేసి పట్టపగలే ఊరి

మరో కొలబద్ద ప్రభుత్వం ఉపయోగిస్తుందన్నది ఇక్కడ స్పష్టం.

2019, ఆగస్టు 17న 'కెఫే కాఫీ డే' ప్రభుత్వ ఆర్థిక సంస్థలకు అందించిన లెక్కల ప్రకారం తమ సంస్థ అప్పులు రాబోయే 45 రోజుల్లో 4970 కోట్ల నుండి 1000 కోట్లకు తగ్గిపోతాయని; బెంగుళూరులో తమ సంస్థకున్న గ్లోబల్ విలేజ్ అనే సాఫ్ట్‌వేర్ పార్క్‌ను 2600-3000 కోట్ల రూపాయలకు బ్లాక్‌స్టోన్ అనే కంపెనీకి అమ్మివేసినట్లు, అలానే ఇతర ఆస్తులను కొన్నిటిని అమ్మి అతి తొందరలోనే అప్పుల నుండి బయటపడి కంపెనీ 'కాఫీ డే' ప్రధాన వ్యాపారాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తామని ప్రకటించింది. ఇదంతా సిద్ధార్థ ఆత్మహత్య చేసుకున్న రెండు వారాల్లో జరిగిన పరిణామం. అంటే ఆయన మరణానికి చాల ముందు నుండే ఈ ప్రయత్నాలు కొనసాగుతున్నవి కాబట్టి ఇంత తొందరగా అప్పులు తీరుబాటు జరుగుతోంది. అందుచేత సిద్ధార్థకు ఇవన్నీ తెలియవా? తప్పక తెలుస్తాయి. ఐనప్పటికీ ఆత్మహత్యకు పాల్పడ్డాడంటే బలమైన కారణమే ఉండి ఉండాలి. ఏమై ఉంటుంది ఆ కారణం?

ఈ కాఫీ డే వ్యాపారాన్ని హస్తగతం చేసుకోవడానికి కోకాకోలా సంస్థ ఎప్పటినుండో ప్రయత్నిస్తోంది. అసలు కాఫీ డే బ్రాండు విలువే 8000 కోట్లని ఒక అంచనా! కాఫీ డే అప్పులు ఆఫ్టాల్ 4900 కోట్లు. అందుకే ఏలికల ఆశ్రితుల కళ్లు దీనిమీద పడ్డాయి. ఇంకో పక్క కమలపు దక్షిణ భారత రాజకీయ విస్తరణ కొనసాగుతున్నది. ఇక్కడ ప్రత్యర్థులను పూర్తిగా మట్టికరిపించాలంటే ఆ ప్రత్యర్థుల ఆర్థిక వనరులను కబ్జా చెయ్యాలి. ఆ వ్యహారంలో భాగంగానే సిద్ధార్థను చుట్టబెట్టినట్టు చిత్రం కనిపిస్తోంది.

బడా వ్యాపారస్థుల సంగతి పక్కకు పెడితే, తిమింగలాల వ్యాపార వేటలో చిక్కి తనువు చాలించిన చిరు చేపల చిట్టా ఎక్కడా కనపడనిది, వినపడనిది. ఈ విషాద కథనాలు అడపా తడపా, ఒకటో అరో, మీడియాకు ఎక్కినా, ఓ రెండు ముక్కల సెన్సేషన్ గానే కానీ వాటి వ్యధాభరిత ముగింపుకు వెనుక ఉన్న కారణాలు రాసేంత జాగా వాటికి దొరకదు.

ఈ వ్యవస్థ ఆత్మహత్యల వైపుకు నెట్టని వర్గాలు ఈ దేశంలో ఏమైనా మిగిలితే అవి బడా ఫైనాన్స్, దళారీ కార్పొరేట్ తిమింగలాలు, ఆశ్రిత పెట్టుబడిదారులేనని ఇక మనం అంచనాకు రావచ్చు. అంటే ఈ దేశ ప్రజలకు మిగిలేది ఫాసిస్టు రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక ఏకశిలా వ్యవస్థ. ఇదే పరమార్థం అనుకుంటే సర్వం ఓం నమశ్శివాయ. వీ

(రచయిత సంపాదకుడు, శ్రామిక నేస్తం)

జనమందరి ముందు వారు బెల్టులు, కర్రలు, ఇనుపరాడ్లతో చితకబాదారు. సురేంద్ర స్పృహ తప్పిపడిపోయే వరకు కొట్టారు. బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎఫ్ఐఆర్‌లో అతుల్ పేరు నమోదకాలేదు. కాగా, పోలీసులు నిందితులను వదిలి మళ్లీ సురేంద్రనే అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నాడన్న ఆరోపణలపై లాకప్‌లో వేశారు. నిస్సహాయులుగా మిగిలిన కుటుంబ సభ్యులు సురేంద్రను చంపేస్తారేమోనన్న భయంతో న్యాయం కోసం సీఎం ఆదిత్యానాథ్ ఇంటి ముందు అదే నెల 9న మూకుమ్మడిగా ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. (అప్పుడే ఈ ఉదంతం జాతీయ మీడియా దృష్టిలోకి వచ్చింది). కాగా, తర్వాతి రోజే పోలీసు కస్టడీలో సురేంద్ర అనుమానాస్పదంగా మృతి చెందాడు. పొత్తి కడుపు, చేతులు, కాళ్లు, పిరుదులు ఇతర భాగాల్లోనూ గాయాలున్నట్టు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. కస్టడీలో సురేంద్రను తీవ్రంగా టార్చర్ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. కానీ, తాము ఎలాంటి వేధింపులకు పాల్పడలేదని పోలీసులు కొట్టిపారేశారు.

గతేడాది ఏప్రిల్ 10న అతుల్ సింగ్‌తోపాటు మరో నలుగురు అనుచరణులను పోలీసులు అరెస్టు చేశారు. సురేంద్ర కస్టోడియల్ డెత్‌పై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటైంది. ముఖ్యమంత్రి ఇంటి ఎదుట బాధిత కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నాలుగు రోజుల తర్వాత ఎంఎల్ఏపై అపహరణ, లైంగికదాడికి సంబంధించిన సెక్షన్‌లు, పోక్సో యాక్ట్ కింద కేసు నమోదైంది. కేసు సిబిఐకి బదిలీ అయింది. 13న కుల్దీప్ సింగ్ సెంగార్‌ను సిబిఐ బృందం అదుపులోకి తీసుకుంది. ఇక్కడే ఆయన మందబలమూ వెలుగులోకి వచ్చింది. తమ నాయకుడు నిర్దోషని నిరసనలు చేసింది.

కుల్దీప్‌సింగ్ సెంగార్ జైలులో ఉన్నప్పటికీ ఆయన ఆగడాలు సాగుతూనే ఉన్నాయి. ఆయన ఆధిపత్యానికి ఏమాత్రం నష్టం రాలేదు. సెంగార్ జైలులోకి వెళ్లిన తర్వాత సాక్ష్యాల తారుమారు, సాక్షులను, కేసు నమోదు చేసినవారినే హత్యచేసేందుకు కుట్రలు జరిగాయి. సురేంద్ర హత్యలో కీలక సాక్షి యూనస్ గతేడాది ఆగస్టు 18న అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అదే రీతిలో ఆయన అంత్యక్రియలూ వేగంగా అదే రోజు సాయంత్రానికి ముగిసిపోవడం గమనార్హం. ఇంత గంభీర ఆరోపణలున్నప్పటికీ సెంగార్‌కు థాంక్స్ చెప్పేందుకని ఉన్నావ్ నుంచి ఎంపిగా గెలుపొందిన బిజెపి నేత సాక్షి మహరాజ్ ఈ ఏడాది జూన్ 6న సీతాపూర్ జైలుకు వెళ్లడం గమనార్హం. స్థానిక బిజెపి నేతలూ పత్రికా సమావేశాల్లో సెంగార్‌కు మద్దతుగా ప్రకటనలిచ్చారు. ఇలాంటి చర్యలతో సెంగార్‌పై సానుకూల దృక్పథం ఏర్పరిచే యత్నాలు చేయడమే కాదు.. బాధితుల అభియోగాలను అంతర్గతంగా నీరుగార్చి, వారిని మానసికంగా కుంగదీసే కుట్ర చేస్తున్నారు.

ఇవే పరిస్థితుల్లో బాలిక బాబాయికి జూలై 4న పదేండ్ల జైలు శిక్ష పడింది. అదీ రెండు దశాబ్దాల కిందటి హత్యాయత్నం కేసులో. ఈ కేసు పెట్టింది కూడా సెంగార్ సోదరుడు అతుల్ సింగ్ కావడం గమనార్హం. బాధితురాలు, ఆమె ఇద్దరు బంధువులు, లాయర్‌లు రాయ్‌బరేలీకి వెళ్తుండగా వారి కారును ఓ ట్రక్కు, అదీ నంబర్‌ప్లేట్‌పై నల్లరంగు పూసుకున్న ట్రక్కు ఢీకొంది. ఈ ట్రక్కు డ్రైవర్, క్లీనర్లు రాష్ట్ర మంత్రి రన్‌వేంద్ర ప్రతాప్ సింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఫతేపూర్ (హసేన్‌గంజ్)కు చెందినవారు. సిబిఐ ఎఫ్ఐఆర్‌లో కుల్దీప్‌సింగ్ సెంగార్‌తోపాటు మంత్రి రన్‌వేంద్ర ప్రతాప్ సింగ్ అల్లుడు అర్జున్ సింగ్ పేరునూ నమోదు చేయడం గమనార్హం. ఇది ప్రమాదం కాదనీ, సెంగార్ కుట్రేనన్న బాధితురాలి తల్లి ఆరోపణలకు ఘటన జరిగిన తీరు, పై అంశాలూ బలాన్ని చేకూరుస్తున్నాయి.

కుల్దీప్‌సింగ్ రాజకీయ నేపథ్యం

కుల్దీప్ సింగ్ సెంగార్ తాత దశాబ్దాలుగా వారి ఊరు ఉన్నావ్‌లోని మాఖికి ప్రధాన్‌గా ఉన్నాడు. తన తండ్రి వ్యాపారంలోకి దిగినా.. కుల్దీప్ మాత్రం రాజకీయాల్లో చేరాడు. కుల్దీప్ తన తాత వారసత్వాన్ని కొనసాగిస్తాడని స్థానికులు మద్దతిచ్చారు. కానీ, వాస్తవాలు విరుద్ధంగా కనిపించాయి. కుల్దీప్ తొలుత అక్కడి చిన్న చిన్న భూస్వాముల అభిమానాన్ని సంపాదించుకున్నాడు. మెల్లగా గ్రామాన్ని గుప్పిట్లోకి తెచ్చుకుని గ్రామ పెద్దగా చెలామణి అయ్యాడు. ఊరిలో పంచాయితీలు జరిపి తన ఇంటిలోనే ఘర్షణలను పరిష్కరించే పద్ధతిని అమలు చేశాడు. రాష్ట్ర పాలన, పోలీసుల నుంచి ప్రజలను దూరం చేసి అన్నింటికీ తనపైనే ఆధారపడేలా వ్యవహరించాడు. చాలా మంది ఆయన చెప్పినవాటిని పాటించేవారే. పాటించనివారిపై అణచివేతనూ మొదలుపెట్టాడు. కొన్నేండ్లకు ఊరిలో పరిస్థితుల దిగజారిపోయాయి. కొందరు పిల్లలూ సెంగార్‌ను అనుసరిస్తూ తప్పుదారి పడుతుండటంతో తల్లిదండ్రులు వారిని ఊరినుంచి బయటకు పంపించడం మొదలుపెట్టారు. ఇప్పుడు వారు కాన్పూర్, ఢిల్లీలో పనిచేసుకుంటున్నారని చెప్పారు.

కుల్దీప్‌సింగ్ సెంగార్ దాదాపు రెండు దశాబ్దాల కింద యూత్ కాంగ్రెస్‌లో చేరి కొన్నాళ్లకు బిఎస్‌పిలోకి మారాడు. మొదటిసారిగా బీఎస్పీ టికెట్‌పై ఎంఎల్ఏగా గెలిచాడు. తర్వాత సమాజ్‌వాదీ పార్టీలోకి చేరి రెండు సార్లు ఎంఎల్ఏగా గెలిచాడు. 2017లో బిజెపిలో చేరాడు. కుల్దీప్ రాజకీయంగా ఆధిపత్యాన్ని పెంచుకున్నాడు. కాంగ్రెస్ నేత అన్ను టాండన్, బిజెపి నేత సాక్షి మహరాజ్, ఎస్‌పి చీఫ్ అఖిలేశ్ యాదవ్ కూడా కుల్దీప్‌ను కలుస్తుండేవారు. ఇంతటి ఆధిపత్యాన్ని ఏర్పరుచుకున్న కుల్దీప్ భార్య సంగీత జెడ్‌పీ చైర్‌పర్సన్‌గా, అతుల్ సింగ్ భార్య అర్చన గ్రామ ప్రధాన్‌గా ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నారు.

ధనం, మందబలం, రాజకీయ ఆధిపత్యం కలిగిన ఓ నేత ఎంతటి దౌర్జన్యానికి తెగబడగలడో తెలిపేందుకు సజీవ సాక్ష్యం 'ఉన్నావ్' కేసు. కుల్దీప్‌సింగ్ సెంగార్ తనకు ఎదురేలేని తనదైన ఒక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నాడు. అతను(కుల్దీప్‌సింగ్ సెంగార్) జైల్లో ఉంటే ఏంటి? బయటకొచ్చిన తర్వాత మమ్మల్ని చంపేస్తాడు అని ఓ స్థానికుడు వాపోయేంత భయాందోళనలను నాటాడు. పోలీసులూ ఆయనపై కేసు పెట్టేందుకు జంకుతారు. ఆ ఎంఎల్ఏపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన బాధితులనే పోలీసు స్టేషన్ బయటకు గెంటేశారు. దేశమంతా ఉన్నావ్ కేసుపై గగ్గోలు పెడుతుంటే బాధితురాలి ఫిర్యాదు తర్వాత రెండేండ్లకుగాను అధికారపార్టీ సెంగార్‌ను బహిష్కరించలేదు. కేసు నమోద అయ్యేందుకే తొమ్మిది నెలలు పట్టింది. పార్టీ నుంచి బహిష్కరించినప్పటికీ ప్రధాని మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, సిఎం యోగి ఆదిత్యానాథ్ ఫొటోలతో జైల్లో ఉన్న ఈ ఎంఎల్ఏ ఫొటో రాఖీ పండుగ సందర్భంగా ప్రచార చిత్ర రూపంలో దినపత్రికలో అచ్చువడం అతని బలమైన ఆధిపత్య పునాదులను వెల్లడిస్తున్నది.

(రచయిత ఫ్రీలాన్స్ జర్నలిస్టు) వీ

ఉన్నావ్‌లో నిజాన్ని చంపగలరా?

***బిజెపి ప్రభుత్వం దేశ వ్యాప్తంగా జరుపుతున్న దాడులు, ఉన్నావ్ లాంటి ఘటనలకు బాధ్యులైన నాయకుల్ని, కార్యకర్తల్ని కాపాడగలవేమో కాని నిజం అనే నిప్పును ఆర్పగలవా అని అంటున్నారు* అన్నపూర్ణ**

'నిజం' నిప్పు. అది ఏదో ఒకరోజు కాల్చేస్తుంది. ఇప్పుడు దేశంలో అదే జరుగుతుంది. ఉన్నావ్‌లో జరిగిన ఒక నిజాన్ని వరుస హత్యలతో చంపాలనుకుంటుంది బిజెపి హంతక ముఠా. కాని ఆ 'నిజం' నిప్పులా దేశమంతా వ్యాపించింది. దేశంలో ఉన్న ప్రతి మనిషి గుండెను మండిస్తోంది. ఎందుకంటే ఉన్నావ్‌లో ఇవాళ 'నిజం' వెంటిలేటర్ పై ఊపిరి తీసుకుంటుంది. న్యాయం చచ్చిపోకూడదని పెనుగులాడుతుంది. ఆ పెనుగులాట వెనుక ఎంత పెద్ద పెను తుఫాన్ ఉందో ప్రతి ఒక్కరు తెలుసుకుని తీరాలి. ఇది ఈ భారతీయ సమాజపు భవిష్యత్తుకి ఎంతో అవసరం.

ఉన్నావ్‌లో ఏం జరుగుతోంది?

సరిగ్గా రెండేళ్ల క్రితం అంటే 2017 జూన్ 4న ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ గ్రామానికి చెందిన ఒక మైనర్ బాలిక మీద అత్యాచారం జరిగింది. దారుణమైన ఆ ఘటన ఎంతోమందిని తట్టి లేపింది. కారణం ఆ అత్యాచారం చేసింది ఉత్తర్‌ప్రదేశ్‌లోని బంగార్‌మావు నియోజకవర్గం బిజెపి ఎంఎల్ఏ కులదీప్ సింగ్ సెంగార్, అతని తమ్ముడు, ఇంకో ఎనిమిదిమంది అనుచరులు. ఆ అమ్మాయిని ఉద్యోగం ఇస్తామని నమ్మించి తీసుకొచ్చి పది రోజులపాటు సామూహికంగా అత్యాచారం చేసి వదిలేశారు. జరిగిన ఘోరాన్ని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాని పోలీసులు ఎంఎల్ఏతో పెట్టుకోకు అంత మంచిది కాదని హెచ్చరించారు. అయినా బాధితురాలి కుటుంబం పట్టుదల వలన కేసు పెట్టారు. పోలీసులు కిడ్నాప్ (363), బలవంతంగా పెళ్లిచేసుకోబోవడం (366) సెక్షన్ల కింద కేసు పెట్టి అందులో నుండి ఎంఎల్ఏని, అతని తమ్ముడిని తప్పించారు. ఆ తర్వాత ఎంఎల్ఏ అతని అనుచరులు బాధితురాలి తండ్రిని కొట్టి అక్రమాయుధాలు కలిగి ఉన్నాడని పోలీసులకు అప్పగించారు. అతనిని పోలీసులు కూడా మరింత చితకబాది స్టేషన్‌లోనే హత్యచేసి చంపారు. ఆ తరువాత జరిగిన బాధితురాలి బాబాయి మరణం కూడా అనుమానాస్పదంగానే మిగిలిపోయింది.

ఈ కేసులో కదలిక లేకపోవడంతో ఏడాది తరువాత మళ్లీ బాధితురాలు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ ఇంటి దగ్గర ఆత్మహత్యా యత్నం చేయడంతో మీడియాలో బాగా ప్రచారం అయ్యింది. దీంతో అలహాబాద్ హైకోర్టు జోక్యం చేసుకుంది. కోర్టు జోక్యం వలన గత్యంతరం లేక ఎంఎల్ఏ, అతని తమ్ముడు మనోజ్‌సింగ్ సెంగార్ పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనల వలన ఎంఎల్ఏని అరెస్టు చేశారు. మరోవైపు బాధితురాలి మేనమామని పాతకేసులో ఇరికించి వెంటనే విచారణ జరిపి జైల్లోవేశారు. అంతేకాదు బాధితురాలిని చంపేస్తామని బెదిరింపులకు గురిచేశారు. దాంతో ఆమె 2019 జూలై 12న సుప్రీంకోర్టు జడ్జికి లేఖ రాసింది. ఆ లేఖ రాసిన 15 రోజుల్లోనే ఆమె, ఆమె పిన్ని, అత్త, లాయరు కలిసి వెళ్తున్న కారును నెంబర్ ప్లేట్ లేని లారీతో గుద్దించి హత్యాప్రయత్నం చేశారు. ఆ ఘటనలో బాధితురాలి అత్త, పిన్ని అక్కడికక్కడే మరణించారు. బాధితురాలి ఊపిరితిత్తులకి బలమైన గాయమైంది. ఎముకలన్నీ ఇరిగి ప్రాణాలతో ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతుంది. ఆమె లాయర్ కూడా ప్రమాదస్థితిలో ఉన్నారు. ఇది జరిగిన వెంటనే డిజిపి ఇది ప్రమాదవశాత్తు జరిగిన యాక్సిడెంట్ అని ప్రకటించారు. ఆ తర్వాత వాళ్ల పద్ధతుల్లో దీనిని ఒక సాధారణ యాక్సిడెంట్ కేసుగా చిత్రీకరించడానికి పోలీసులు, ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

ఆ కుటుంబం మీద ఇంకా బెదిరింపులు కొనసాగుతున్నాయి. బాధితురాలి సోదరి ఎక్కడికెళ్లినా మమ్మల్ని బతకనివ్వరు, మాకు న్యాయం జరుగుతుందని నమ్మకం లేదు. డబ్బు, అధికారం, బలగం ఉన్నవాళ్లదే న్యాయం. పేదోళ్లకి అది అందదని ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఎందుకంటే న్యాయం కోసం తలుపు తడితే రెండేళ్లుగా ఆ కుటుంబం మీద సాగుతున్న హత్యాకాండ అందుకు నిదర్శనం. ఒక్కొక్కరిని చంపుకొస్తామన్న బెదిరింపులు అక్షరాల నిజమయిన వేళ ఆ బాధితులు ఏమాశించగలదు. ఈ దేశంలో పౌరులకు రాజ్యాంగమిచ్చిన హక్కులు, రక్షణ వ్యవస్థలు బతికే ఉన్నాయా? ఇక ముందు ఏ భరోసాతో పౌరులు తమకు జరిగిన అన్యాయాలను ప్రకటించాలి?

హంతకులకి కొమ్ముకాస్తున్న యుపి ప్రభుత్వం, పోలీసులు : యాక్సిడెంట్ తర్వాత వచ్చిన దేశవ్యాప్త నిరసన వలన బిజెపి పార్టీ నుండి కులదీప్ సెంగార్‌ని సస్పెండ్ చేసింది. కేసు పూర్తి విచారణ తర్వాత అతని మీద చర్యలు తీసుకుంటామని నిస్సిగ్గుగా ప్రకటించింది. అంటే ఇంకా వాళ్ల ఎంఎల్ఏ నేరస్తుడని బిజెపి పార్టీ అంగీకరించడంలేదని స్పష్టమయ్యింది. అక్కడి ప్రభుత్వం హంతకుడికి ఇప్పటివరకు ఎంత దన్నుగా ఉందో కూడా అర్థం అవుతుంది. కేవలం బాధితురాలి పట్టుదల, ఒత్తిడి, తీవ్రమైన నిరసన ఈ మూడు కారణాలే ఈ కేసుని ఇప్పటివరకు నిలబెట్టాయని చెప్పక్కర్లేదు. తప్పని స్థితిలో బాధితురాలికి పెరుగుతున్న సామాజిక మద్దతు వలన దఫదఫాలుగా 302, 307, 120బి, 506..లాంటి సెక్షన్లు నమోదయ్యాయి. హంతకుల అరెస్టు జరిగింది. హంతకుడు జైల్లో ఉంటూనే బాధితురాలి రోజువారి దినచర్యను గమనిస్తున్నాడు. జైల్లో ఉంటూనే హత్యాకాండ సాగించాడు. అంటే ఇందులో ప్రభుత్వం, పోలీసుల పాత్ర, పథకం లేవంటే నమ్మలేం. మొన్న జరిగిన యాక్సిడెంట్ కేసుని ఒక సాధారణ యాక్సిడెంట్‌గా చిత్రీకరించడానికి పోలీసులు, ప్రభుత్వం చాలా కృషి చేశాయి. దానికి బ్రేకుల్లేవన్నారు. లైసెన్సు లేదన్నారు. ఇలా ఎన్నో కథలు చెప్పుకొచ్చారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే హంతకుడి మీద చర్యలు తీసుకోలేదు. సత్వర న్యాయ విచారణ

చేపట్టలేదు. సాక్ష్యాల మాఫీకి ఎన్నో దారుణాలు జరిగాయి. ఇవన్నీ కేవలం అక్కడి ప్రభుత్వం, పోలీసుల అండతోనే జరిగాయి.

కోర్టులు-విచారణలు-చర్యలు

అదేంటో ఎక్కడన్నా ఒక అన్యాయం జరిగితే ఈ కోర్టులకి అసలు పట్టదు. అది ఎంత సంచలనాత్మకమైనా కోర్టు తొంగి చూడదు. అడగదు. ఆవేశపడదు. కానీ పాలకుల అధికారానికి ఎక్కడన్నా నష్టం జరుగుద్ది అంటే ఆఘమేఘాల మీద పరిగెత్తుకుంటూ వస్తుంది. లేచొచ్చి చప్పున ఒక వ్యాఖ్యానమో, ఒక చట్టమో, ఒక శిక్షో (అమాయకులకి) వేసేసి ప్రజల నిరసనల మీద నీళ్లు చల్లుతుంది. నల్ల చొక్కాకి న్యాయం చేసినట్లు గర్వంతో మళ్లీ అజ్ఞాతంలోకి పోతుంటాయి. నిర్భయ ఘటన సమాజాన్నెంత కుదిపేసిందో మనకు తెలుసు. ఆ కుదుపు అధికార పీఠాల్నెక్కడ కదిలిస్తుందోనని వెంటనే ఒక 'నిర్భయ చట్టం' మన ముందుకొచ్చింది. అంతేకాదు హంతకులని పట్టుకోవడం, విచారించడం, శిక్షలేయడం జరిగిపోయాయి. ఎందుకంటే అక్కడ నిందితులు డబ్బు, అధికారం, బలం లేనోళ్లు కాబట్టి. అసిఫా ఘటనలో కూడా హంతకులని అరెస్టు చేయడానికి పెద్ద పోరాటం అవసరమయ్యింది. అలాగే ఉన్నావ్‌లో రెండేళ్లుగా ఒక బాధితురాలి మీద డబ్బు, అధికారం, బలగం నిరాఘాటంగా హత్యాకాండ సాగిస్తుంటే రక్షణ ఇవ్వాల్సిన కోర్టులు, న్యాయ విచారణలు ఏమైయ్యాయి? ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రజలు తమ ఆందోళనలు ప్రకటిస్తుంటే పాలకులని రక్షించడానికి నల్లకోటు ముందుకొచ్చింది. నష్టపరిహారం, విచారణ అంటూ హడావిడి చేస్తుంది. నిజంగా ఈ కోర్టులకి చిత్తశుద్ధి ఉంటే ఈ కేసులో ఇప్పటివరకు హంతకుడికి కొమ్ముకాస్తున్న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని, పోలీసు డిపార్ట్‌మెంట్‌ని ముద్దాయిలుగా చేర్చి విచారణ జరిపించాలి. అది జరుగుతుందా!?

బిజెపి హంతక ముఠా ఈ సమాజానికేం చెబుతుంది?

"మేరా భారత్ మహాన్" అంటుంది. మరి భయంకరమైన ఈ అత్యాచారాలు చేయడమేంటి?, మహిళల్ని బట్టలిప్పి కొట్టి అవమానించడమేంటి?(రోజూ చూస్తూనే ఉన్నాం). అయ్యో మాకీ అన్యాయం జరిగింది. న్యాయం చేయమని వస్తే అమానుషంగా కుటుంబాలని చంపడమేంటి? బిజెపి మహిళా ఎంఎల్ఏలే ముస్లిం మహిళల్ని అత్యాచారాలు చేసి చంపాలని పిలుపునివ్వడమేంటి? మరో పక్క తలాక్ రద్దుతో అదే ముస్లిం మహిళల తలరాతలు మార్చేస్తున్నట్టు భ్రమలు కల్పించడం. ఈ హిందూ మూక చూపిస్తున్న భారత్ ఇదేనా!? అంతేకాదు దేశభక్తి, జాతీయత అని వల్లిస్తుందీ మూక. తోటి మనిషిని చంపించడం దేశభక్తా? సాటి మనిషి అభిప్రాయాన్ని, అస్థిత్వాన్ని చంపడం జాతీయతా? ఈ భ్రమల్లో కొట్టుకుపోతూ మన చుట్టూ ఒక హంతక సమాజం తయారవుతుంది. ఒక విధ్వంసం జరిగాక ఆ శిథిలాల నడుమ కూర్చుని ఎంత గుండెలు బాదుకున్నా మళ్లీ మనం పాతదాన్ని పునర్నిర్మించుకోలేం.

అందుకే ఒకే మతం, ఒకే పార్టీ, ఒకే దేశం అనే నినాదాన్ని బిజెపి హంతక ముఠా చేస్తున్న ప్రచారం వెనుక కుట్రని ఈ సమాజం అర్థం చేసుకోవాలి. దానిని అక్షరాలా సాధించడానికి మతాన్ని అడ్డం పెట్టుకుని మన చేతే మన పక్కవాళ్లని చంపిస్తూ హిందూ ఉగ్రవాదానికి బాటలు వేస్తుంది. ఆర్ఎస్ఎస్ తన విద్యా విభాగం 'విద్యా భారతి'ని దేశవ్యాప్తంగా విస్తరింపచేస్తుంది. సుమారు 20 వేల విద్యాలయాలను స్థాపించింది. హిందూ భావజాల ప్రచారంలో భాగంగా పాఠ్యాంశాలతో చరిత్రను మార్చి హిందూ మతం చుట్టూ తిరగరాస్తుంది. కర్ర సాములు, కత్తి సాములు శిక్షణనిచ్చి ఒక పక్క భావజాల పరంగా మరోపక్క సాయుధంగా లక్షలాది మంది విద్యార్థుల మెదళ్లలోకి ఈ హిందూ ఉగ్రవాదాన్ని చొప్పిస్తుంది. ప్రసార భారతి, నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ లాంటి సాంస్కృతిక అంగాలన్నిటిలో ఆర్ఎస్ఎస్ భావజాల ప్రచారకులతో నింపేసింది. వీటిని హిందూ ఉన్మాదాన్ని ప్రచారం చేసే అంగాలుగా మార్చేసింది. అంతేకాదు వీళ్లు చేసే హిందూమతోన్మాద హింసను ప్రశ్నించకుండా అడ్డుకోకుండా చట్టాలను మార్చేస్తుంది. కొత్త చట్టాలను తెస్తుంది. వీళ్లు చేసే హింసను చట్టబద్ధం చేస్తుంది. ఈ దేశంలో వ్యక్తులుగా, సమూహాలుగా ఏర్పరచుకున్న అస్తిత్వాలను, విశ్వాసాలను ధ్వంసం చేస్తుంది. హిందూ అనే ఒక కొత్త అస్తిత్వాన్ని రుద్దుతుంది. మనువు భావజాలం మళ్లీ ఈ దేశంలో రాజ్యమేలాలని కలలు కంటోందీ మూక. అందుకోసం "నువ్వు హిందువ్వి" అనే ఒక అబద్ధపు విశ్వాసాన్ని కల్పిస్తుంది. ఒక్కటొక్కటిగా మనుషుల మధ్య ఉన్న బంధాలు తుంచుతుంది.

ఈ హిందూ కాషాయ ముఠా గుజరాత్‌లో 2002లో వేలాది మంది ముస్లింలని ఊచకోత కోసింది. మహిళల్ని అత్యాచారాలతో అంతమొందించింది. అదే ముఠా ఈనాడు జాతీయ స్థాయిలో అధికారం చేపట్టింది. ఆవు పేరుతో ఎన్నో అరాచకాలకు, హత్యలకు పాల్పడింది. సమాజాన్ని ఒక అభద్రతలోకి నెట్టేసింది. హిందూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న బిజెపి హంతక ముఠాని మరోసారి గెలిపించమని మీడియా భుజానికెత్తుకుంది. ఇది ప్రతీ నగరానికి, ప్రతీ గ్రామానికి, ప్రతీ ఇంటికీ, ప్రతి మనిషి మెదడులోకి చొచ్చుకుని పోయింది. మోడీని ఇతడే మీ నాయకుడు, ఇతడే మీ దార్శనికుడు, ఇతడే మీ దేవుడు అని విషపు ప్రచారం చేసింది. అప్రజాస్వామికంగా ఒక హంతక ముఠాని గద్దెనెక్కించింది. ఈనాడు మనిషిని మనిషి చంపకూడదు అనే కనీసమైన వివేకం, విలువ లేని ఒక కాషాయ ముఠా మనల్ని పాలిస్తుంది. ఇది న్యాయమేనా? వీళ్లకి దేశాన్ని పాలించే హక్కు, అర్హత ఉందా?

ఎందుకంటే ఈ సమాజంలో కులం, మతం, తెగ, జాతి, ఆడ, మగ ఇలా ఎన్నో అవరోధాలు, ఆటంకాలు మన జీవితాల్ని శాసిస్తున్నాయి. అయినప్పటికీ ఇక్కడ మనుషుల మధ్య ఒక ప్రేమ, ఒక బాధ్యత, ఒక గౌరవం, ఒక అవసరం, అన్నిటికీ మించి వివేకంతో కూడుకున్న ఒక అనుబంధం కొనసాగుతుంది. ఎక్కడో మనమంతా ఒక్కటే అనే భావన పెనవేసుకుని ఉంది. మరి ఈ అనుబంధాన్ని, ఈ వివేకాన్ని, ఈ ప్రేమని ఆవు పేరుతో, మతం పేరుతో, కులం పేరుతో, రాత పేరుతో, మాట పేరుతో, ఆలోచన పేరుతో మన చుట్టూ ఉన్న మన మనుషుల్ని నరుక్కుంటూ పోతుంటే చూస్తూ ఊరుకుందామా? అత్యంత మానవీయంగా అభివృద్ధి చెందాల్సిన సమాజం ఒక మతాధిపత్యానికి బలవ్వాల్సిందేనా?

అందుకే న్యాయం కోసం బలమైన శక్తులతో, వ్యవస్థతో, రాజ్యంతో వీరోచితంగా పోరాడుతున్న ఉన్నావ్ బాధితురాలికి, ఆమె కుటుంబానికి అండగా నిలుద్దాం. నిజాన్ని మండిద్దాం. న్యాయాన్ని గెలిపిద్దాం.

రాజ్యాంగానికి, ప్రజాస్వామిక విలువలకు, మానవీయ విలువలకు చోటు లేని చోట, స్వేచ్ఛలేని చోట ప్రతిఘటనొక్కటే మార్గం.

(రచయిత ప్రగతిశీల కార్మిక సమాఖ్య) వీ

జాతీయ విద్యా విధానం 2019 - ఉన్నత విద్య

జాతీయ విద్యా విధాన ముసాయిదాలో ఉన్నత ప్రమాణాల గురించి చెప్పినా తగిన కెటాయింపులు లేవనీ, రాష్ట్రాలకు అవకాశం లేకుండా కేంద్రం తన నియంత్రణలోకి తీసుకుని మనువాదాన్ని అమలుచేయాలని అనుకుంటోందనీ అంటున్నారు **బి. రామకృష్ణ**

బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత 2015 నుండి విద్యా విధానంలో మార్పుల కోసం ప్రయత్నం చేస్తూ వస్తున్నది. మొత్తం మీద 2019 మే 31న జాతీయ విద్యా విధానం 2019 ముసాయిదాను విడుదల చేశారు. 2016లో టిఎస్ఆర్ సుబ్రహ్మణ్యం కమిటీ, 2017లో నీతి అయోగ్ ప్రతిపాదించిన విద్యా ప్రైవేటీకరణకు అనుకూలమైన అనేక విషయాలను, ఎన్‌పిఇ 1986/92లో ప్రస్తావించిన అసమానతలతో కూడిన విధానాలను ఇందులో గమనించవచ్చు.

కొఠారి కమిషన్ 1964-66 గాని జాతీయ విద్యా విధానం 1986/92 గాని రాజ్యాంగ విలువలైన సెక్యులరిజం, సోషలిజం, ప్రజాస్వామ్యాలను ప్రస్తావించాయి. వాటిని సాధించేందుకు విద్య ఉపయోగపడాలని ప్రముఖంగానే చెప్పాయి. ఈ ముసాయిదాలో వాటి ప్రస్తావనలే లేకుండా పోయాయి. నలంద, తక్షశిల విద్యాలయాలను ప్రముఖంగా ప్రస్తావించారు. అవి నడుపబడిన కాలంలో ఎంత మంది విద్యకు నోచుకున్నారు? అలా ఎందుకు అవి కొద్దిమందికి మాత్రమే పరిమితం అయ్యాయి? అశేష ప్రజానీకం ఎందుకు విద్యకు దూరం చేయబడ్డారు? అనేవి గుర్తు చేసుకోబడలేదు. సమానత్వం కోసం, దోపిడీ పీడనలకు సామాజిక వివక్షతలకు, పితృస్వామిక, బ్రాహ్మణీయ అన్నిరకాల ఫ్యూడల్ భావజాలాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల స్ఫూర్తి ఇందులో కనిపించదు. ఈ ముసాయిదాలో సోషలిజం, సెక్యులరిజంలో ఎందుకు విస్మరించారనేది ఆలోచించవల్సిన విషయం. ఇవి సంఘపరివార్‌కు నచ్చనివి అనేది మరిచిపోవద్దు.

ప్రపంచస్థాయిలో గుణాత్మకంగా ఉండే విద్యను ప్రస్తావించిన జాతీయ విద్యావిధానం 2019 ముసాయిదా 1) పరిశోధనా, విశ్వ విద్యాలయాలు. 2) బోధనా విశ్వవిద్యాలయాలు 3) స్వతంత్ర కాలేజీలు. అనే మూడు రకాల ఉన్నత విద్యా సంస్థలను సూచించడంతో తాననుతానే వ్యతిరేకించుకున్నది. ఓ వైపు మూడు రకాల ఉన్నత విద్యా సంస్థలను ప్రతిపాదించడం మరోవైపు ప్రపంచస్థాయి ప్రమాణాల గురించి మాట్లాడడం ద్వారా అత్యధికులకు మామూలు చదువులు, కొందరికే మంచి చదువులు ఉంటాయి. ఇక నుండి అఫిలియేటెడ్ కాలేజీలు గాని అఫిలియేటెడ్ యూనివర్సిటీలు గాని ఉండవు. ఉన్నత విద్యా సంస్థలు అన్నీ అయితే యూనివర్సిటీలుగా లేదంటే డిగ్రీలు ప్రధానం చేసే స్వయం ప్రతిపత్తి గల కాలేజీలుగానే ఉంటాయి. స్వతంత్ర ప్రతిపత్తి కాలేజీలు డిగ్రీలను తమ పేరుతో ఇవ్వవచ్చు.

2040 వరకు ఉన్నత విద్యా సంస్థలను కన్సాలిడేట్ చేస్తూ తక్కువ సంఖ్యకు కుదిస్తారని. అయితే వీటి సైజు మాత్రం పెంచబడుతుందని, దీనిద్వారా వనరుల ఉపయోగం, గుణాత్మకత పెరుగుతుందని చెప్పారు. కన్సాలిడేట్ చేయడం అంటేనే ఉన్న వాటిని మూసేయడం అని అర్థం ఇప్పటికే ఈ పని దేశ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు వర్తింపచేసి లక్షల సంఖ్యలో వాటిని మూసేశారు. మూసేస్తున్నారు. మరోవైపు ప్రైవేట్ బడులు పెరుగుతున్నాయి. వాటిల్లో విద్యార్థుల నమోదు పెరుగుతున్నది. ప్రభుత్వ విద్యాసంస్థలు తగ్గి ప్రైవేట్ సంస్థలోకి విద్యార్థులను నెట్టేసే విధానాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్నాయి. ఇదే దుస్థితి రాబోయే కాలంలో ఉన్నత విద్యాసంస్థలకు పట్టనుందని స్పష్టమవుతున్నది.

జిల్లాకో యూనిర్సిటీని ప్రతిపాదించారు. ఇది మంచిదే? అయితే ప్రతి విశ్వవిద్యాలయంలో అన్ని రకాల ప్రమాణాలను నెలకొల్పి పూర్తి స్థాయిలో మౌలిక వసతులను, కల్పించి రెసిడెన్సియల్ పద్ధతిలో ఉన్నత విద్యను అందించే విధానంగా కాకుండా వివక్షతలతో కూడిన వ్యవస్థను ప్రతిపాదించారు. ప్రతి జిల్లాలో ఉన్నత విద్యా ప్రమాణాలు అన్నిరకాల మౌలిక వసతులతో ఏర్పాటు చేసినప్పుడు అవి అయా ప్రాంతాల మొత్తం విద్యార్థుల ఉన్నత విద్యావసరాలను తీర్చినప్పుడు మొదటి రకం, రెండవ రకం, మూడవ రకం అనే విభజనతో కూడిన విద్యా సంస్థల అవసరం ఎందుకు వస్తుంది. అంటే వివక్షతలతో కూడిన విద్యా వ్యవస్థలను ప్రతిపాదిస్తూ సమాన విద్యను అందకుండా చేస్తారన్నమాట ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ సంస్థలను కన్సాలిడేషన్ పేరుతో కుదించేస్తారని అర్థం చేసుకోవచ్చు.

ప్రతి జిల్లాలోని విశ్వవిద్యాలయాలను అన్నిరకాల ఉన్నత విద్యా సంస్థలను పూర్తి స్థాయి ప్రమాణాలతో, వసతులతో పరిశోధనా స్థాయి సంస్థలుగా తీర్చి దిద్దడంగా కాకుండా రకరకాలుగా విడగొట్టడం అదే సమయంలో స్వయం ప్రతిపత్తి కాలేజీలకు డిగ్రీలు ఇచ్చే అధికారం ఇవ్వడం ద్వారా ఎలాంటి ప్రమాణాలను సాధిస్తారో అర్థం చేసుకోవచ్చు. అసలు ఎందుకు ప్రైవేట్ అటానమస్ కాలేజీలు అన్నది ఆలోచించాలి. ఇవి ఏ పరిణామాలకు దారి తీస్తాయి. ఇవేమైనా ఈ ముసాయిదా లో పేర్కొన్న తగు ప్రాతినిధ్యానికి నోచుకోని సమూహాలకు (Under Represented Groups) కు సహాయ పడతాయా? ఏ లాభాపేక్ష లేకుండా ఉచితంగా అన్ని వసతులను కల్పిస్తూ విద్యను అందిస్తాయా? అలా అందించేవే అయితే వాటికి ఫీజులను వసూలు చేసుకునే స్వేచ్ఛను గాని వాటికి కూడా ప్రభుత్వ సంస్థలతో సమానంగా నిధులు అందించాలని గాని ఎందుకు ప్రతిపాదించినట్లు?

ఓవైపు విద్య అనేది లాభార్జన కోసం కాదని చెబుతూనే మరోవైపు ఫీజులు వసూలు చేసుకునే స్వేచ్ఛను ఇవ్వడం దేన్ని సూచిస్తుంది. రాబోయే కాలంలో ప్రైవేట్ అటానమస్ కాలేజీలు ప్రమాణాలున్న చదువులను అందించడమేమో గాని నాసిరకం చదువులను, డిగ్రీలను అమ్ముకునే కేంద్రాలుగా తయారవుతాయి. ప్రైవేట్ విశ్వ విద్యాలయాలు ఖరీదైనవిగా సమాజంలోని కొన్ని వర్గాల వారికే ఉపయోగపడేవిగా మిగిలిపోతాయి.

ప్రైవేట్ విశ్వవిద్యాలయాలేమైనా దాతృత్వ స్వభావంతో సమాజంలోని అట్టడుగు వర్గాల వారికి, తరతరాలుగా విద్యకు దూరం చేయబడి సామాజికార్థిక, రాజకీయ సాంస్కృతిక వివక్షతలకు, అణచివేతలకు గురైన వారికి ఉచితంగా, నాణ్యమైన ఉన్నత విద్యను అందిస్తాయా? ఇది సాధ్యమేనా? ఇప్పటికే బిట్స్ పిలానీ, గీతం వంటి మరెన్నో ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థలు, విశ్వ విద్యాలయాలు, పెద్ద మొత్తంలో ఫీజులను వసూలు చేస్తున్న పరిస్థితిని చూస్తూనే ఉన్నాం. వాటిని నియంత్రించడం అటుంచి ప్రోత్సహిస్తుండడం అనుభవంలో ఉన్నదే కదా. ఐఐటి, మెడిసిన్‌ల పేరు మీద తెలుగు రాష్ట్రాల్లో గాని దేశవ్యాప్తంగా గాని ప్రైవేట్ కాలేజీలు, కోచింగ్ సెంటర్‌లు లక్షల కోట్ల వ్యాపారం చేస్తున్న విషయం తెలియందేమి కాదు. వీటిపై ఎటువంటి నియంత్రణా లేదు. ఇదే పరిస్థితి భవిష్యత్‌లో అన్ని రకాల చదువులకు దాపురించదనే నమ్మకం లేదు.

పెట్టుబడిదారీ శక్తులు, సంస్థలు కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా విద్యాసంస్థలకు నిధులను ఇవ్వాలన్నారు. ఆ సంస్థల నుండి ప్రభుత్వ విద్యా సెస్సును తప్పనిసరిగా వసూలు చేయాలి తప్పిస్తే వాటిని దేబిరించడం కాదు. అవి కోట్లకు పడగలెత్తడానికి అన్ని రకాల వెసులుబాట్లు ఇస్తున్నది ప్రభుత్వమే. వాటి లాభాలల్లో ప్రజల శ్రమశక్తి ఉన్నదనే విషయాన్ని మరిచిపోవద్దు. అవేవో ధాతృత్వ స్వభావంతో, పెద్ద మనసుతో విరాళాలు ఇవ్వాలని ప్రతిపాదించడం అనేది అసలు విషయాన్ని తప్పుదోవ పట్టించడమే అవుతుంది. సంపద సృష్టికర్తలు పెట్టుబడిదారులు, బడా కార్పొరేట్లు కాదు అందులో పనిచేసే శ్రామికులు, ప్రజలేనన్నది గుర్తించాలి. ప్రజల శ్రమను, దేశ సంపదను ఫణంగా పెట్టడం ద్వారానే అవి లక్షల కోట్ల వ్యాపారం చేయగలుగు తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థలను శాసించగలుగుతున్నాయి. ప్రభుత్వ పరంగానే ఆ సంపదను సాధించగలిగితే విద్యా రంగానికి ఇతర అనేక సంక్షేమ రంగాలకు, పరిశోధనలకు వినియోగించుకునే స్వతంత్రత ప్రభుత్వాలకు ఉంటుంది. దేశ సంపదలు బదిలీ అవ్వడం ద్వారానే కార్పొరేట్ల సంస్థలు వృద్ధి చెందుతున్నాయి తప్పిస్తే అవి చెమటను దారపోసో లేదా శూన్యంలోంచి లక్షల కోట్లను సృష్టించడం లేదు. కాబట్టి వాటి సంపదంతా కూడా సమాజానిదే, ప్రజలదేనన్నది గుర్తుంచుకోవాలి. ఆ సంపద సమాజానికి హక్కుగానే చెందాలి తప్పిస్తే వాటి బాధ్యతగానో, దాతృత్వ స్వభావంతో అవి విదిల్చేవిగా కాదు.

స్వతంత్ర కళలు (లిబరల్ ఆర్ట్స్), బహుళ శాస్త్రాల సమ్మిళిత విద్య (మల్టీ డిసిప్లినరీ ఎడ్యుకేషన్) గురించి చాలా సార్లు, చాలా చోట్ల నొక్కి చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రపంచస్థాయి మల్టి డిసిప్లినరీ ఉన్నత విద్యా సంస్థలను నెలకొల్పాలని వీటిల్లో 2035లోగా కనీసం 50 శాతంగా స్థూల నమోదు నిష్పత్తి ఉండాలనే లక్ష్యాన్ని ప్రకటించారు. ఇది ఒక సమగ్ర విజ్ఞానానికి, దారి తీసేదిగా ఉండే అవకాశమున్నది. అయితే అదే స్థాయిలో ఉన్నత విద్యా సంస్థల్లో అన్నిరకాల సౌకర్యాలుండాలి. అన్ని కోర్సులు, అన్ని సబ్జెక్టల బోధనకు సరిపడే టీచింగ్ ఫ్యాకల్టీ గాని లైబ్రెరీ వసతులు, పరిశోధనా అవకాశాలు, మౌలిక వసతుల వాతావరణం లేకుండా ఆచరణలోకి వెళ్లడం అంటే అది వ్యతిరేక ఫలితాలనే ఇస్తుంది.

ఎంతగా లిబరల్ ఆర్ట్ ఎడ్యుకేషన్ అని, మల్టీ డిసిప్లినరీ విద్య అని చెప్పినప్పటికీ చివరకు ఇది ఎంపిక చేసుకున్న కొన్ని సబ్జెక్టుల్లోనే ప్రత్యేక నైపుణ్యాలను సాధించేదిగానే ఉన్నది. ఏ సబ్జెక్టులో నిష్ణాతులైన కూడా ప్రతి వ్యక్తిలో మానవీయ కోణం, విలువలు, మొత్తంగా తమ జ్ఞానం, సమాజంలోని అందరికి ఉపయోగపడాలనీ, దేశ సంపదలో అందరికీ హక్కు ఉంటుందనీ కొందరి సొత్తుగా కాకుండా అది అందరు అనుభవించేలా సామాజిక పరిస్థితులను సృష్టించేందుకు ఉపయోగ పడాలనేది లిబరల్ ఆర్ట్ గాని మల్టీ డిసిప్లినరీ విద్యల లక్ష్యం కావాలి. అలా అయినప్పుడే అటువంటి ప్రతిపాదనలకు విలువ ఉంటుంది. కాని పేరుకే వాటి గురించి గొప్పగా చెప్పి చివరకు వివక్షతలతో కూడిన విద్యా వ్యవస్థను ప్రతిపాదించడం అనేది నిజాయితీలేమిని సూచిస్తుంది. మల్టీ డిసిప్లినరీ, లిబరల్ ఆర్ట్ విద్యను గుణాత్మకంగా, ఉన్నత ప్రమాణా లతో, మానవీయ విలువలతో కూడి ఉండి రాజ్యాంగ విలువలను పెంపొందించేదిగా ఒకరిని మరొకరు దోచుకోనటువంటి ఉన్నత సమాజ నిర్మాణానికి పనికి వచ్చేలాగా ఈ విద్యలుంటే అభ్యంతర పడవల్సిందేమీ లేదు. కాని అలాంటి సమాజ నిర్మాణం నేటి పాలనా ప్రమాణాలతో, విధానాలతో సాధ్యమయ్యే పరిస్థితులు లేవు సరికదా వీటికి వ్యతిరేకంగా అసమాన సమాజం, ఫ్యూడల్ శక్తులు, పెట్టుబడిదారీ, కార్పొరేట్ శక్తులు పితృస్వామిక ఆధిపత్య మనువాద బ్రాహ్మణీయ భావజాలాలకు అనుకూలంగా ఉన్నాయి. వీటిని మార్చడానికి విద్యా విధానంలో తగు మార్పులను సూచించలేకపోవడం ద్వారా యథాతథస్థితి వాదాన్ని తలకెక్కించుకున్నట్లైంది.

మూడేళ్ల డిగ్రీలను నాలుగేళ్ల కోర్సులుగా ప్రతిపాదించారు. దీని వెనుక ఉన్న ఉద్దేశం స్పష్టం చేయలేదు. డిగ్రీ కోర్సుల్లో బహుళ స్థాయి ప్రవేశాలు, నిష్క్రమణలను ప్రతిపాదించారు. అంటే నాలుగేళ్ల వ్యవదిలో ఏ సంవత్సరంలోనైనా బయటకి వెళ్లొచ్చు దానికి గాను ఒక సర్టిఫికెట్ ఇస్తారు. మరెప్పుడైనా విడిచి వెళ్లిన కోర్సులో చేరవచ్చన్నమాట. అసంపూర్తి డిగ్రీతో ఏమైనా ప్రయోజనాలుంటాయా? స్పష్టంగా వివరించలేదు. నాలుగేళ్ల డిగ్రీకోర్సులో మేజర్, మైనర్ అని రెండురకాల సబ్జెక్టులుంటాయి. దేనినైనా ప్రధాన సబ్జెక్టుగా ఎంచుకుంటే మైనర్ (ఆప్షనల్) గా తదితర ఏవైనా సబ్జెక్టులను ఎంచుకోవచ్చన్నమాట. ఎన్ని మేజర్, మైనర్ సబ్జెక్టులు ఎంచుకుంటే పూర్తిస్థాయి డిగ్రీని ఇస్తారో తెలుపలేదు.

అన్ని రకాల డిగ్రీ కోర్సులకు సంబంధించి ఏ సబ్జెక్టులో ప్రావీణ్యం పొందినప్పటికీ మానవీయ విలువలున్న మనుషులుగా ఎదగడానికి దోహదపడే కామన్ కోర్‌గా ఉండే విషయాలు ఏవి బోధింప బడతాయో అన్న దాని పట్ల స్పష్టత లేదు. ఈ విషయాలపై సమగ్రమైన అవగాహన, నైపుణ్యాలు పెంపొందింప చేసుకోవడానికి అవసరమైన పరిస్థితులు, మౌలిక వసతులు, అందించడమెలా అన్న దానిపై స్పష్టతలేదు. అభ్యసనం అర్థవంతంగా సాగడానికి అనుకూలమైన సదుపాయాల కంటే కూడా అభ్యసనా ఫలితాలపై శ్రద్ధ పెట్టాలని చెప్పారు. ఇది నేల విడిచి సాము చేసినట్లుగానే ఉంటుంది. ఓ వైపు ఉన్నత ప్రమాణాలు, ప్రపంచస్థాయి నాణ్యత అంటూనే మరోవైపు మౌలిక వసతుల ఏర్పాటును తక్కువ చేయడం పరస్పర విరుద్ధంగా ఉంటుంది. అనేక పరస్పర వ్యతిరేకమైన ప్రతిపాదనలతో చెప్పినవే మళ్లీ మళ్లీ చెప్పినట్లుగా రిపోర్ట్ ఉంటుంది.

జాతీయ స్కాలర్ షిప్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తారని, అవసరమైన వారికి దీని ద్వారా విద్యార్థులకు ఆర్థిక సహాయం, హాస్టల్ సౌకర్యాలను అందిస్తారని, ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థలు 100 శాతం నుండి 50 శాతం వరకు కనీసం వాటిలోని సగం మందికి స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని ప్రతిపాదించారు. అందరు విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉన్నత ప్రమాణాలు హాస్టల్ వసతులతో ఉచితంగా ఉన్నత విద్యను అందించే ప్రతిపాదనలు చేయకపోవడం ద్వారా ఎంతో గొప్పగా ఉన్నత ప్రమాణాలని, సమానత్వం అని అక్కడక్కడ చెప్పుకున్నప్పటికీ అసలు

డొల్లతనాన్ని బయటపెట్టుకున్నది ముసాయిదా విధానం.

ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థలను లాభాల కోసం, వ్యాపార ప్రయోజనాల కోసం కాకుండా ప్రజా ప్రయోజనాల కోసమే స్థాపించాలనే చట్టం చేస్తారని చెప్పారు. అలా అంటూనే ఫీజులు వసూలు చేసుకోవచ్చని మాట్లాడుతుంటారు. 50 శాతం మంది విద్యార్థులకు 25 శాతం నుండి 100 శాతం వరకు ఫీజుల్లో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారికి రాయితీ ఇవ్వాలని ప్రతిపాదించారు. అయితే వివిధ కోర్సులకు నిర్ణయించే ఫీజులను నియంత్రించే విధానం గురించి చెప్పలేదు. అంటే ఫీజుల్లో ఇచ్చే రాయితీలను కలుపుకునే పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేసుకొమ్మని చెప్పకనే చెప్పినట్లయింది. అప్పుడు ఇంత పెద్ద మొత్తం ఫీజులు ఎందుకంటే పేదవారికయ్యే విద్యా ఖర్చును కూడా మీరే భరించాలని తర్కం చేయవచ్చన్నమాట. అప్పుడు ఫీజులు చెల్లించే వారికి పేదలపై కోపం, ఈర్ష్య, అసూయలు కలుగకుండా పోవు. అవి పెరిగి, పెరిగి వైషమ్యాలకు విబేధాలకు దారి తీయవనే గ్యారంటీ ఏమీ లేదు. మీ వల్లనే మేం ఎక్కువగా ధనం చెల్లించవల్సి వస్తుందనే నిందలువేయడం, అవమానించడం జరగకుండా ఉండదు. ఇలా ప్రైవేట్ సంస్థలను పేదలకు రాయితీలిమ్మని చెప్పడం ద్వారా పేద పిల్లలకు చదువు అనేది హక్కుగా కాకుండా ప్రైవేట్ సంస్థల దయా దాక్షిణ్యంగా మారుతుంది. అలాకాకుండా విద్య ఒక హక్కుగానే, అది ప్రభుత్వ సంస్థ అయిన ప్రైవేట్ సంస్థ అయినా సరే మొత్తంగా ఉచితంగానే ఉన్నత ప్రమాణాలతో అందించేలా ఈ రిపోర్ట్ ప్రతిపాదించలేదు. ఇక్కడే ఉంది అసలు మాయదారితనమంతా కూడా పైకి లాభాపేక్ష లేకుండా, వ్యాపారాత్మకం కాకుండా ప్రైవేట్ విద్యాసంస్థలు నడపబడాలని చెబుతారు కాని అవి అందరికి ఉచితంగానే విద్యను అందించాలని చెప్పరు.

భారతీయ భాషలను ప్రోత్సహించుట గురించి ప్రతి ప్రాంత సంస్కృతి, సాంప్రదాయాలు పరిరక్షించడం కోసం గిరిజన భాషలతో సహా అన్ని భారతీయ భాషలకు సరైన గౌరవం ఇవ్వాలని సరిగ్గానే చెప్పారు. కాని ప్రస్తుత తరుణంలో ప్రతి విద్యార్థికి తన ఇంటి లేదా స్థానిక భాషల్లో ఆలోచించే, పరిశోధించే, చదువుల్లో, విద్యా సంస్థల్లోని బోధనాభ్యసన ప్రక్రియలో వినియోగించే పరిస్థితి లేదని కూడా చెప్పారు. అయితే పరిష్కారంగా కె.జి. నుండి పి.జి. వరకు ఆపై పరిశోధనా స్థాయిలో కూడా ఇంటి/స్థానిక భాష మాధ్యమం ఉండాలనే ప్రతిపాదన చేయలేకపోయారు.

మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సెస్ (ఎంఒఒసి) అని, ఓపెన్ డిస్టెన్స్ లర్నింగ్ (ఒడిఎస్) అని నియత విద్యకు సమాంతరంగా ఉన్నత విద్యను అందించే విధానాలను పటిష్టం చేయాలని ప్రతిపాదించారు. ఇది ఉన్నత విద్యలో కనీసం 50 శాతం ఎన్‌రోల్‌మెంట్‌కు దోహద పడాలని సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రవేశాలు దొరకక లేదా ప్రైవేట్ సంస్థలో ఫీజుల మోతను భరించలేక ఉన్నత చదువులను అందిపుచ్చుకో లేని వారి కోసం అన్నట్లుగా ఇవి తయారైతే ఫలితమేముంటుంది.

ప్రపంచంలోని ఉన్నత స్థాయి 200 విదేశీ విశ్వ విద్యాలయాల్లో ఎంపిక చేసిన వాటిని దేశంలోకి అనుమతిస్తారని ప్రతిపాదన చేశారు. వాటినెందుకు అనుమతించాలో స్పష్టం చేయలేదు. అవేమైన ఈ దేశ ప్రజల ఆశలను, ఆకాంక్షలను తీరుస్తాయా? మిడతల దండు లాగా కాకుండా ఈ దేశ ప్రజలకు నాణ్యమైన ఉచిత ఉన్నత ప్రమాణాలున్న విద్యను అందిస్తాయా? లాభార్జనల కోసం, విద్యను అంగడి వస్తువుగా చేయడం ఎవరి ప్రయోజనాలను నెరవేరుస్తాయో అర్థం చేసుకోవడం కష్టమేమి కాదు. కడు పేదవారి విద్యావసరాలను ఇవి తీర్చడానికి ఇక్కడకు వస్తాయనుకుంటే అది అపోహ లేదా అత్యాశ మాత్రమే అవుతుంది.

లాభాపేక్ష లేకుండా ఇతర దేశాలతో విద్యా సంబంధాలను పరస్పర సహాయ సహకార ధోరణిలో నెలకొల్పుకోవడాన్ని ఆహ్వానించవచ్చు గాని వ్యాపార ధోరణులతో విద్యను అంగడి సరుకుగా చూసే పద్ధతిలో ఉండకూడదు. అలాంటి ప్రతిపాదనలు ఈ రిపోర్టులో లేవు. ఉన్నత విద్యా సంస్థలో ఉపాధ్యాయ తదితర నియామకాలు గాని, ప్రమోషన్లుగాని మెరిట్ ఆధారంగా జరుగుతాయని వివరించారు. అనేక రకాల అసమానత్వాలు సాంఘిక, ఆర్థిక, రాజకీయ వివక్షతలు, అణచివేతలు, వెనుకబాటు తనాలతో ఉన్న సమాజంలో మెరిట్‌కు అర్థమేముంటుంది. అందుకే కదా రాజ్యాంగంలో అంబేద్కర్ రిజర్వేషన్లను చేర్చారు. అమెరికాతో సహా అనేక దేశాల్లో కూడా వివిధ రూపాల్లో ఈ విధానం అమలవుతున్నది. రిజర్వేషన్లు లేకుండా మెరిట్ ఆధారిత ఉద్యోగ నియామకాలు, సర్వీస్‌లో పదోన్నతులు అనేవి రాజ్యాంగ మౌలిక సూత్రానికి, అంబేద్కర్ ఆలోచనలకు వ్యతిరేకం. రిజర్వేషన్లను తీసేయాలని ఆధిపత్య పెత్తందారీ వర్గాలు ఎప్పటి నుండో డిమాండ్ చేస్తున్నాయి. ఇది సంఘ్ పరివార్ భావజాలంలో కూడా ఇమిడి ఉన్నదనేది మరిచి పోవద్దు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా వెనుకబడినవారు వాటిలో అన్ని రకాలుగా ముందంజలో ఉన్న వారితో సమాన స్థాయిలో పోటీ పడి నెగ్గుకురావడం సాధ్యం కాదు. అందుకే ఉపాధి, ఉద్యోగ, విద్యావకాశాలలో రిజర్వేషన్లను అమలు చేయడం ద్వారా మాత్రమే అసమ సమాజంలో కొంతమేరకైనా సమానత్వ న్యాయానికి చేరువ కాగలుగుతాము.

నేషనల్ రీసర్చ్ ఫౌండేషన్ (ఎన్ఆర్ఎఫ్) ద్వారా అన్ని రకాల సబ్జెక్టుల్లో పరిశోధనలకు ఆర్థిక సహాయం అందిస్తామని, ఇది పరిశోధకులకు సంబంధిత ప్రభుత్వ శాఖలకు అలాగే పరిశ్రమలకు మధ్య వారధిగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ఆధీనంలోని పరిశ్రమలకు, శాఖలకు వాటిని మరింత గుణాత్మకంగా మెరుగ్గా తీర్చిదిద్దడం కోసం ఇది అవసరమే. కాని కార్పొరేట్ పరిశ్రమలకు కూడా వారధిగా ఉండడం అంటే ప్రభుత్వ నిధులు కార్పొరేట్ శక్తులకు బదిలీ అవుతాయి. అసలు ఎన్ఆర్ఎఫ్ అనే కేంద్రీకృత సంస్థ అనవసరం. ప్రతి యూనివర్సిటీయే ఆయా ప్రాంతాల అవరాలు, ప్రగతి, అభివృద్ధి కోసం అవసరమయ్యే పరిశోధనలను చేపట్టడం కోసం వాటి దగ్గరే తగు నిధులు ఉండేలా చూడడం సరైందిగా ఉంటుంది.

ఎన్ఆర్ఎఫ్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పరిశోధనలపై నియంత్రణా అధికారం కట్టబెట్టినట్లవుతుంది. రాష్ట్రాల స్వతంత్రత దెబ్బతింటుంది. ఇది ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకం. యూనివర్సిటీలకు సంబంధించి దేశ వ్యాప్తంగా కరిక్యులమ్ గాని, బోధనా పద్ధతులు గాని, పరిశోధనలు గాని, గ్రాంట్స్‌ను ఇవ్వడం గాని, నిధులు, నియామకాలు గాని యుజిసి నియమాల ప్రకారం జరిగేవి. గత రెండు దశాబ్దాలుగా దీనికి నిధులు ఇవ్వకపోవడం, చాలావరకు యూనివర్సిటీలలో బోధనా సిబ్బంది నియమకాలు జరపకపోవడం ద్వారా దాదాపుగా సగానికి పైగానే ఖాళీలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో గుణాత్మకమైన పరిశోధనలు ఎలా వస్తాయి. ఈ విషయాలను, యూనివర్సిటీలను, ఉన్నత విద్యను బలహీనం చేస్తూ వచ్చిన ఆర్థిక, రాజకీయ విధానాలను ఈ రిపోర్ట్ చర్చించడం ద్వారా లోపాలను గుర్తించి వాటిని సవరించడానికి పరిష్కారాలు చూపించే పరిస్థితి ఉండేది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్

కేంద్రీకృత నియంత్రణ వల్ల నష్టం జరుగుతున్నదని దాన్ని రద్దు చేస్తూ దాని స్థానంలో హయ్యర్ ఎడ్యుకేషన్ గ్రాంట్స్ కౌన్సిల్ (ఎచ్ఇజిసి)ను ఏర్పరిచారు.

ప్రస్తుతం పరిశోధనలకు నిధులిస్తున్న సంస్థలు అలాగే వాటిని కొనసాగించవచ్చని చెప్పారు. అసలు వాటికి సరిపోను నిధులు ఇవ్వకపోవడం ద్వారానే ఫలవంతమైన పరిశోధనలు జరగడం లేదు కదా. దీనికి తోడు ప్రైవేట్, దాతృత్వ స్వభావ సంస్థలు, వ్యక్తులు నిధులు అందించడాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. ఏ లాభాపేక్షగాని, వారి స్వప్రయోజనాలు లేకుండా ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులు నిధులను అంత సులభంగా ఇస్తారా? తమ సంపదలను దేశ ప్రయోజనాల కోసం వెచ్చిస్తారా అనేది భ్రమగా కాకుండా వాస్తవంగా మారుతుందా? ఈ సంస్థలను దేబిరించడం కాకుండా హక్కుగానే ప్రభుత్వాలు నిధులను సేకరించాలి. అన్ని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు వాటిని అందించాలి.

ఉన్నత విద్యా సంస్థలకు అన్ని రకాల స్వయం ప్రతిపత్తి ఉంటుందని చెబుతూనే ఎన్ఆర్ఎఫ్ వంటి కేంద్రీకృత సంస్థను ప్రతిపాదించడం పరస్పర వైరుధ్యాన్ని సూచిస్తుంది. పరిశోధనలు కూడా ఇది ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం, ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటీ నిర్వహించుకునే స్వేచ్ఛ ఉండాలి. వాటికి నిధులు సమకూర్చే అలాగే వాటి మధ్య సమన్వయానికి సహకరించడానికి ఒక యంత్రాంగం ఉంటే సరిపోతుంది. పరోశోధనలు కూడా మెరిట్ ఆధారంగా నిర్వహించబడాలని ప్రతిపాదన చేశారు. ఇంతకుముందే చెప్పినట్లుగా మెరిట్ ఆధారిత విధానం అసమ సమాజంలో అశాస్త్రీయమైనది.

బోధనాభ్యసన శాస్త్రం, విద్యారంగంలో వస్తున్న పోకడలపై పట్టును కలిగి ఉంటూనే భారతీయ విలువలు, జ్ఞానం, సంప్రదాయాలను ఉపాధ్యాయుల్లో స్థిరీకరించాలని చెప్పారు. భారతీయ విలువలు, సాంప్రదాయాలంటే ఏమిటో స్పష్టం చేయలేదు. ఇవి హిందూమత విలువలా? పితృస్వామిక ఆధిపత్య భావజాల ప్రతీకల కులవ్యవస్థను సమర్థించేవా? మహిళా వివక్షతలను పాటించేవా? అనే అనుమానం రావడం సహజమే కదా. దేశవ్యాప్తంగా ప్రైవేట్ ఉపాధ్యాయ శిక్షణా సంస్థలు 90 శాతం వరకు డబ్బులకు డిగ్రీలను అమ్ముకునేవిగా తయారయ్యాయని జె.ఎస్. వర్మ కమిషన్ 2012లో వివరించిందని ప్రస్తావించారు. అటువంటి వాటిని నిర్దాక్షిణ్యంగా రద్దు చేయాలని మంచి ప్రతిపాదన చేశారు. డిగ్రీలను అమ్ముకునే వ్యాపార సంస్థలుగా ఇవెందుకు మారాయి? ఎన్సిటిఇ వంటి సంస్థలు గాని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు గాని ఎందుకు ఈ దుర్మార్గాన్ని ఆపలేకపోయాయో ఈ రిపోర్ట్ చెప్పనే లేదు. విద్య ప్రైవేటీకరణ ద్వారా ఎంతటి నష్టం జరుగుతుందనే విషయం వర్మ కమిషన్ అధ్యయనం ద్వారా తేలిపోయింది. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో 90 శాతం పైగా ఖాళీలే ఉన్నాయి. ఇది దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉన్నది. దీనికి భిన్నంగా దేశవ్యాప్త పరిస్థితి ఉంటుందని అనుకోలేము. ఓవైపు ప్రభుత్వ సంస్థలు మరణశయ్యపైకి ఎక్కుతున్నాయి. దీన్ని నివారించే చర్యలను ప్రభుత్వాలు చేపట్టడం లేదనే విషయాన్ని చర్చించలేదు రిపోర్ట్. ఓవైపు విద్యా వ్యాపారీకరణ దాష్టికాలను చెబుతూనే మరోవైపు ప్రైవేట్ విద్యా సంస్థలను ప్రోత్సహించాలని వాటికి ఫీజులు నిర్ణయించుకునే స్వేచ్ఛనివ్వాలని పబ్లిక్ ప్రైవేట్ అనే తేడాలు చూపొద్దని రెండింటికి నిధులను సమకూర్చాలని చెబుతూ తన వాదనను తానే వ్యతిరేకించుకుంటున్నది ముసాయిదా జాతీయ విధానం.

నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బి.ఇడి డిగ్రీని ప్రతిపాదించారు. ప్రస్తుతం ఇంజనీరింగ్ కోర్సులు నాలుగేళ్లుగా ఉన్నాయి. బి.ఇడి చేయాలంటే డిగ్రీ తరువాత రెండేళ్ల ఉపాధ్యాయ శిక్షణ పొందాలి. అంటే ఇంటర్ తరువాత బి.ఇడి పూర్తి చేయడానికి 5 ఏళ్లు పడుతుంది. ప్రస్థుత ప్రతిపాదిత బి.ఇడి ద్వారా నాలుగేళ్లలో పూర్తి చేయవచ్చు. ఇది ఆహ్వానించదగినదిగానే ఉన్నది. ప్రొఫెషనల్ విద్య అనేది వేరుగా కాకుండా మొత్తం ఉన్నత విద్యలో సమ్మిళితమై ఉంటుందని వృత్తి విద్యకు సంబంధించి ప్రత్యేకమైన యూనివర్సిటీలుండే పద్ధతిని ఆపేస్తారని సాధారణ విద్య అయిన ప్రొఫెషనల్ విద్య అయినా అవి ఒకే సంస్థ నుండి అందించబడతాయని తెలిపారు. ప్రతి ఒక్క ఉన్నత విద్యా సంస్థ స్వతంత్ర బోర్డు చేత పాలించబడుతుందని, అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్, ఫైనాన్షియల్ సంబంధిత విషయాల్లో ఈ సంస్థలు పూర్తిస్థాయి స్వయం ప్రతిపత్తితో తమను తాము పాలించుకుంటాయని, ప్రతి ఉన్నత విద్యాసంస్థకు ఉండే బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ (బిఒడి) రాజకీయ, ప్రభుత్వ పరమైన అనే బాహ్య ప్రభావాలకు లోనుకాకుండా ఉంటుందని తెలిపారు. ఇలా అన్నవారే నేషనల్ హైయర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అథారిటీ (ఎన్ఎచ్ఇఆర్ఎ) అని, రాష్ట్రీయ శిక్షా అయోగ్ (ఆర్ఎస్ఎ) అని, నేషనల్ రీసెర్చ్ ఫండ్ (ఎన్ఆర్ఎఫ్) అనే సంస్థలతో ఉన్నత విద్యను కేంద్రీకృత నియంత్రణలోకి తెచ్చే ప్రతిపాదనలను చేసింది రిపోర్ట్.

యునైటెడ్ స్టేట్స్, చైనా తరువాత ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఉన్నత విద్యా వ్యవస్థగా ఇండియా ఉందని, గత కొద్ది దశాబ్దాలుగా ఈ వ్యవస్థ ప్రత్యేకించి ప్రైవేట్‌రంగంలో వేగంగా విస్తరించిందని వివరించారు. ఉన్నత విద్యా సంస్థల నియంత్రణ, గ్రాంట్లు విడుదలకు సంబంధించి కేంద్రీకృతంగా జరగడం వలన అకడమిక్ అభివృద్ధి జరగలేదని చెప్పారు. దీనితో పాటుగా ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించి రకరకాల నియంత్రణ సంస్థలుండడం వల్ల ఒక సంక్లిష్ట వ్యవస్థగా మారడం అలాగే ఒక కోర్సులకు సంబంధించి ఒకే విద్యాసంస్థ రెండు మూడు నియంత్రణా సంస్థల పరిధిలోకి రావడం వల్ల కూడా ఆయా సంస్థలు కుంటుపడే పరిస్థితి వచ్చిందని వివరిచారు. దీన్ని అధిగమించడం కోసం ఒకే ఒక సాధారణ నియంత్రణా వ్యవస్థ ఉండాలన్నారు. నియంత్రణ అనేది సరళంగానే కాని గట్టిగా (లైట్ బట్ టైట్) అనే పద్ధతిలో ఉండాలని ప్రతిపాదించారు. కొన్ని ముఖ్యమైన విషయాలలో మాత్రమే కచ్చితమైన నియంత్రణ ఉండాలని, మిగతా అనేక విషయాలను ఆయా ఉన్నత విద్యాసంస్థల న్యాయాన్యాయాలకు వదిలేయాలని, ఇది ఆయా సంస్థల స్వయం ప్రతిపత్తికి అవసరమని తెలిపారు.

ఫండింగ్, అక్రిడిటేషన్, రెగ్యులేషన్, ప్రమాణాలు నిర్ణయించడం వంటి వాటిని వేరు చేయాలని వాటిని స్వతంత్ర నిర్మాణాలచే నిర్వహింపచేయాలని తద్వారా కేంద్రీకృత అధికారాలను నిర్మూలించవచ్చని చెప్పారు. ప్రస్తుత నియంత్రణా సంస్థలు ఎన్సిటిఇ, ఎంసిఐ, బిసిఐ, ఎఐసిటిఇ వంటివి అన్నీ కూడా నియంత్రణా అధికార పరిధి నుండి తొలగించబడి కేవలం ప్రొఫెషనల్ స్టాండర్డ్ సెట్టింగ్ బోర్డులుగా (పిఎస్ఎస్‌బి) మారతాయని, యుజిసి ఇక నుండి హయ్యర్ ఎడ్యుకేషన్ గ్రాంట్స్ కౌన్సిల్‌గా (ఎచ్ఇజిసి) మారుతుందని, జనరల్ ఎడ్యుకేషనల్ కౌన్సిల్ అభ్యసన ఫలితాలను తయారు చేస్తుందని వివరించారు. మొత్తం ఉన్నత విద్యా వ్యవస్థ అంతా కూడా ఎన్ఎచ్ఇఆర్ఎ కిందనే పనిచేస్తుంది. ఎన్ఎచ్ఇఆర్ఎ రాష్ట్రీయ శిక్షా అయోగ్ ఆధీనంలో పనిచేస్తుంది. దీని ద్వారా కేంద్రీకృతం అవుతుందా? వికేంద్రీకృతం అవుతుందా?

నియంత్రణ అనేది ఫలితాల సాధన పైనే గురి పెడుతుందని మౌలిక సదుపాయాల పైన కాదని వివరించారు. ఇది ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలనే తేడా లేకుండా అన్నింటికీ ఒకే విధంగా వర్తిస్తుందని చెప్పారు. గతంలో నీతి అయోగ్ గాని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు గాని ముందుకు తెచ్చిన విషయాన్ని సమర్థిస్తున్నది. ఇది అశాస్త్రీయమైనది. అన్ని వసతులు, సదుపాయాలు, ఉన్నత ప్రమాణాలు అందించబడాలని చెప్పిన రిపోర్టే ఇలాంటి అసంబద్ధమైన వైఖరిని తీసుకోవడం ద్వారా తనను తానే వ్యతిరేకిస్తుంటుంది.

ప్రస్తుత ప్రతి రెగ్యులేటరీ సంస్థలన్నీ ఒక స్వతంత్ర బోర్డు చేత పాలించబడతాయి. ఈ బోర్డులను రాష్ట్రీయ శిక్షా అయోగ్ (ఆర్ఎస్ఎ) ఏర్పాటు చేస్తుంది. వీటి చైర్‌పర్సన్, చీఫ్ ఎక్సిక్యూటివ్‌లను ఆర్ఎస్ఎ నియమిస్తుంది. ఇవన్నీ కూడా ఆర్ఎస్ఎకు జవాబు దారీతనంగా ఉంటాయి. ఆర్ఎస్ఎకు ఛైర్మన్‌గా ప్రధానమంత్రి ఉంటాడు. అంటే మొత్తం ఉన్నత విద్యారంగం అంతాకూడా అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ కనుసన్నలలో ఉంటూ ఉన్నత విద్యా వ్యవస్థ మొత్తంగా కేంద్రీకృత అధికారం కిందకు వస్తుంది. ఓ వైపు వికేంద్రీకరణ, అటానమస్, అని ఎంతగా ఈ రిపోర్ట్ చెప్పుకున్నప్పటికీ అంతిమంగా ఎన్ఎచ్ఇఆర్ఎ, ఆర్ఎస్ఎల ద్వారా కేంద్రీకృతం అవుతుంది. ఇలా కేంద్రీకరణకు గురైతే అన్ని విద్యా సంస్థల్లో జరిగే అన్ని రకాల కార్యకలాపాలను అంటే కరిక్యులమ్, సిలబస్, బోధనాభ్యసనా ప్రక్రియలు, రకరకాల కోర్సులు, పరిశోధనలు, వివిధ విద్యాసంస్థల పాలనా విధానాలు, నియామకాలు, ఫీజులు, వసతులు మొత్తం అంతా కూడా ఒకే అధికారం కింద ఉండడం వలన ఈ ఒక్కదాన్ని అదుపులో పెట్టుకుంటే చాలు తామనుకున్న భావజాలాన్ని, విధానాలను రుద్దే అవకాశం కలుగుతుంది. మనువాదాన్ని, హిందూమత ఛాందసత్వాలను, మార్కెట్ అనుకూల విద్యా విధానాన్ని, అమలు చేయడానికి ఇటువంటి వ్యవస్థ సంఘ్ పరివార్‌కు అవసరంగా ఉన్నది. వారు చెప్పే భారతీయ సాంప్రదాయాలు, తిరోగమన విలువలు, పరమత విద్వేషాలు, చరిత్ర వక్రీకరణలు, పుక్కిటి పురాణాలనే సత్యాలుగా ప్రచారం చేయడాన్ని సిలబస్‌లో గాని, బోధనాభ్యసనలో గాని చేర్చవచ్చు. వారనుకున్నవ్యక్తులతో, శక్తులతో మొత్తం రెగ్యులేటరీ యంత్రాంగాలను నింపుకోవడం కొరకు ఇటువంటి వ్యవస్థ అవసరంగా ఉన్నది.

దేశవ్యాప్తంగా విద్య దార్శనికతను రివైజ్ చేయడం, మూల్యాంకనం చేయడం, ఆచరణలో పెట్టడం, అభివృద్ధి పరచడం, వంటివి నిర్వహించ డానికి అత్యున్నత సంస్థ రాష్ట్రీయ శిక్షా అయోగ్ (ఆర్ఎస్ఎ) / నేషనల్ ఎడ్యుకేషన్ కమిషన్ (ఎన్ఇసి) ను ఏర్పాటు చేస్తారు. దీనికి ప్రధానమంత్రి ఛైర్ పర్సన్‌గా ఉంటారు. ప్రధానమంత్రి సంవత్సరంలో కనీసం ఒకసారి సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు. లేదంటే ఎప్పుడు అవసరమైతే అప్పుడు విద్యా పురోగతిని సమీక్షించడం కోసం సమావేశాలను ఏర్పాటు చేస్తారు. ఆర్ఎస్ఎలో 20-30 మంది సభ్యులుంటారని వీరిలో విద్యకు దగ్గరి సంబంధంలో ఉండే మంత్రిత్వ శాఖల కేంద్రమంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు రొటేషన్ పద్ధతిలో ఉంటారు. ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి, కేబినెట్ సెక్రటరీ, నీతి అయోగ్ వైస్ ఛైర్ పర్సన్, విద్యా మంత్రిత్వ శాఖలోని సీనియర్ సెక్రటరీ, ప్రభుత్వం అవసరమనుకున్న బ్యూరోక్రాట్‌లు/అడ్మినిస్ట్రేటర్‌లు ఉంటారు. కనీసం 50 శాతం వరకు ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు, ఆర్ట్స్, ఆరోగ్యం, వ్యవసాయం సోషల్ వర్క్ వంటి రంగాలలోని ప్రముఖమైన వ్యక్తులను తీసుకుంటారు. ఆర్ఎస్ఎను నియమించే కమిటీలో ప్రధానమంత్రి, భారత ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభ స్పీకర్, పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు, కేంద్ర విద్యాశాఖమంత్రి ఉంటారు. ఆర్ఎస్ఎలో ప్రధానమంత్రి మాటనే చెల్లుబాటు అవుతుంది. ప్రధానమంత్రి ఆలోచనలకు దార్శనికతకు అనుగుణంగానే విద్యావిధాన రూపకల్పన జరిగి అమల్లో పెట్టడం జరుగుతుంది. ఆర్ఎస్ఎ ప్రధానమంత్రి కనుసన్నలలో ఉంటుంది కాబట్టి ప్రధానమంత్రి ఆలోచనలు భావజాలం అంటే ప్రధానమంత్రిని నడిపించే సంఘ్‌పరివార్ భావజాలం రాబోయే కాలంలో అందలమెక్కి ఊరేగబో తుందన్నమాట.

దేశవ్యాప్తంగా విద్యకు సంబంధించి ఉన్న అత్యున్నత నిర్మాణాలైన నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అథారిటీ (ఎన్ఎచ్ఇఆర్ఎ), నేషనల్ అక్రిడిటేషన్ అండ్ అసెస్ మెంట్ కౌన్సిల్ (ఎన్ఎఎసి), నేషనల్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఐఇపిఎ) లతో పాటుగా ప్రతిపాదనలో ఉన్న జనరల్ ఎడ్యుకేషన్ కౌన్సిల్(జిఇసి), హయ్యర్ ఎడ్యుకేషన్ గ్రాంట్స్ కౌన్సిల్ (ఎచ్ఇజిసి), నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎన్ఆర్ఎఫ్) లకు ఛైర్ పర్సన్‌లను, చీఫ్ ఎక్సిక్యూటివ్‌లను, అందులోని సభ్యులను ఆర్ఎస్ఎనే నియమిస్తుంది. పార్లమెంట్ చట్టం ద్వారా ఆర్ఎస్ఎకు రాజ్యాంగ హోదా ఇస్తారని తెలిపారు. అలా ఆర్ఎస్ఎ వద్ద విద్యా విధానానికి సంబంధించి అధికారం కేంద్రీకృతం అవుతుంది. అది నిరంకుశంగా వ్యవహరించదనే గ్యారంటీ లేదు. రాష్ట్రాల కుండే అధికారాలను స్వయం ప్రతిపత్తిని కాపాడుతుందని అనుకోవడానికి లేదు.

జాతీయ స్థాయిలో ఆర్ఎస్ఎ లాగా రాష్ట్రాల స్థాయిలో ముఖ్యమంత్రి ఛైర్ పర్సన్‌గా రాజ్య శిక్ష అయోగ్ (ఆర్‌జెఎస్ఎ), స్టేట్ ఎడ్యుకేషన్ కమిషన్ (ఎస్ఇసి)ను ఏర్పాటు చేయాలని రిపోర్ట్ వివరించింది. విద్యకు సంబంధించి నిధులను సమకూర్చడం గురించి చెబుతూ విద్యను సమాజానికి మంచి పెట్టుబడిగా చెప్పారు. విద్య ప్రయోజనాలు వ్యక్తులకు కాకుండా మొత్తం సమాజానికి చెందుతాయని, వివరించారు. విద్యకు చేసినా ఖర్చులన్నీ కూడా జిడిపిలో 2017-18 సంవత్సరంలో 2.7 శాతం ఉన్నదని ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి మొత్తంగా చేసిన ఖర్చులో 10 శాతం అని చెప్పారు. దీన్ని సంవత్సరానికి 1 శాతం చొప్పున పెంచుకుంటూ పదేళ్లలో 20 శాతానికి పెంచాలని ప్రతిపాదించారు. పదేళ్ల (2030) తరువాత కూడా 1968 విద్యా విధానం ప్రస్తావించిన జిడిపిలో 6 శాతంను విద్యకు కేటాయించాలని చెప్పిన దాన్నికూడా అమలు చేసే పరిస్థితి లేదు. వారి లెక్క ప్రకారమే ఖర్చులో 10 శాతం అనేది జిడిపిలో 2.7 శాతం అయింది అంటే 20 శాతం అనేది 5.4 శాతంగానే అవుతుంది తప్పించి కనీసం కొఠారి కమిషన్ చెప్పిన 6 శాతానికి ఇంకా తక్కువగానే ఉంటుంది. పెరుగుతున్న విద్యావసరాల దృష్ట్యా అంతకంటే ఎక్కువగానే బడ్జెట్ ను కేటాయించాల్సి ఉంటుంది. ముసాయిదా జాతీయ విద్యా విధానం 2019 సమాన విద్యను గాని, ప్రభుత్వ పరంగానే ఉన్నత ప్రమాణాలున్న విద్యను గాని, సరిపోను బడ్జెట్ కేటాయింపులను గాని ప్రతిపాదించలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది విద్యారంగంలో కేంద్రీకరణను, వ్యాపారీకరణను, మతతత్వాన్ని, వివక్షతలతో కూడిన అసమాన విద్యా వ్యవస్థలను ప్రోత్సహించేదిగా ఉన్నది.

వీ

(రచయిత ఉపాధ్యాయులు)

హామీలు ఘనం - అమలు శూన్యం

తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉద్యోగ సంఘాలకు ఎన్నో వాగ్దానాలు చేసిన ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్రం వచ్చి ఐదేళ్లయినా హామీల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందనీ, హామీల అమలుకు సమష్టిగా పోరాడాల్సిన సమయం వచ్చిందనీ అంటున్నారు **ఎం. రఘుశంకర్ రెడ్డి**

మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు అత్యంత క్రియాశీలకమైన భూమిక పోషించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే స్వయం పాలనలో ప్రజల సమస్యలు పరిష్కారంతో పాటుగా, ఉద్యోగులుగా తమకు వృత్తి సమస్యల పరిష్కారంతో పాటు, ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆశించారు. ఈ క్రమంలోనే వందలాది మంది విద్యార్థి, యువకుల బలిదానాలతో, అప్రతిహత ప్రజా పోరాటాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాకారం చేసుకున్నాం. అందరం సంతోషపడ్డాం. తర్వాత జరిగిన ఎన్నికలలో ఉద్యమ నాయకుడే ముఖ్యమంత్రి అయ్యాడు. తర్వాత కొద్ది రోజులకే 2014 ఆగస్టు 26న వివిధ ఉద్యోగ సంఘాల నాయకులతో, క్రియాశీలక కార్యకర్తలతో ప్రత్యేకంగా ఒక సమావేశం ఏర్పాటు చేశారు. వేలాదిగా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్న ఆ సమావేశంలో ముఖ్యమంత్రి కెసిఆర్ మాట్లాడుతూ, మీరంతా తెలంగాణ ఉద్యమంలో త్యాగాలు చేశారు. మీ పోరాటం గొప్పది - ఇప్పుడు అంతరం కలిసి తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని, మీ సహకారం కావాలని తెలిపారు. అలాగే ఉద్యోగుల సమస్యలన్నీ నాకు తెలుసునని, మీ సర్వీసు రూల్స్ సమస్య పరిష్కరిస్తానని, ఇక ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎంతమాత్రం తమ సమస్యల పరిష్కారం కోసం ఇందిరా పార్కు వద్ద ధర్నాలు చేయవలసిన అవసరం ఉండదని అన్నారు. మనది ఉద్యోగుల సమస్యలు తెలిసిన ప్రభుత్వమని, అలాగే ఎంప్లాయీ ఫ్రెండ్లీ ప్రభుత్వమని, దేశంలో అన్ని రాష్ట్రాల కంటే మెరుగైన వేతనాలు ఇస్తామని చెప్పినారు. ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని, బంగారు తెలంగాణ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎంతగానో సంతోషించారు. ప్రభుత్వ విన్నపాన్ని స్వాగతించారు.

రోజులు గడుస్తున్న కొద్దీ ప్రభుత్వ ప్రాధాన్యతలు మారిపోయాయి. ఉద్యోగులకు సంబంధించి పిఆర్‌సి-2015 తప్ప ఏ ఒక్క సమస్య నేటికి పరిష్కరింపబడలేదు. ఉద్యోగుల సమస్యలు పట్టించుకోవడం మానేశారు. వివిధ శాఖల్లో గల వేలాది ఖాళీలు (తొలి అసెంబ్లీ సమావేశంలో సుమారు 1,07,637 ఖాళీలున్నట్లు ప్రకటించారు) భర్తీ చేయడానికి పూనుకోలేదు. సర్వీసు రూల్స్ సమస్య పరిష్కరించలేదు. సరైన రీతిలో ఏ శాఖలో పదోన్నతులు ఇవ్వలేదు. ఉన్న ఉద్యోగులతోనే పనిచేయించడం వలన పనిభారం పెరిగింది. సమస్యలు పరిష్కరించే అధికారం ఆయా శాఖల మంత్రులకు కూడా లేకుండా సిఎం వద్దే కేంద్రీకృతం చేయబడింది. ఎంప్లాయీ ఫ్రెండ్లీ మాట అటుంచి ముఖ్యమంత్రిని కలిసి సమస్యలు విన్నవించుకుందామంటే సంఘ నాయకులకు కలిసే అవకాశం లేకపోవడం, అపాయింట్‌మెంట్ దొరకని స్థితి ఏర్పడింది. సిఎం సచివాలయానికి రాని స్థితి, సంఘ నాయకులు ప్రగతి భవన్‌ను చేరుకోని పరిస్థితిగా మారిపోయింది.

ఈ రోజు ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు అనేక సమస్యలతో మానసిక వేదనకు గురవుతున్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ, పాలనా వికేంద్రీకరణ పేరిట పదిజిల్లాలు, ముప్పది మూడు జిల్లాలుగా మారినాయి. 2016 అక్టోబర్ నుండి ఉద్యోగులను ఆర్డర్-టు-సర్వ్ పేరిట కొనసాగిస్తున్నారు. స్థానిక ఆప్షన్లు లేవు, బదిలీలు లేవు, తగినంత సిబ్బంది లేదు, అయినా అత్యంత పనిభారాన్ని సృష్టిస్తూ ప్రభుత్వానికి సహకరిస్తూ, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. మరో వైపు ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్ సమస్య పరిష్కరింపబడక, వివిధ క్యాడర్లకు సంబంధించిన వేలాది ఖాళీలు ఏర్పడినాయి. గత దశాబ్ద కాలంగా సరైన పదోన్నతులు లేక మొత్తం విద్యారంగం సంక్షోభంలోకి నెట్టబడింది. రాష్ట్రంలో 3000 ప్రధానోపాధ్యాయులు, 550 ఎంఇఒలు, 56 ఉప విద్యాధికారులు, 20 జిల్లా విద్యాధికారులు, 221 డైట్ లెక్చరర్లు, 96 బిఇడి కాలేజీ అధ్యాపకులు, 29 ఎస్‌సిఇఆర్‌టి ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీలుగా ఉండి మొత్తం విద్య పర్యవేక్షణ కుంటుపడింది. ఐదేండ్లుగా ఒకే ఒక్క టిఆర్‌టి వేసి, మొత్తం 20వేల పై చిలుకు ఉపాధ్యాయ ఖాళీలుంటే, 8972 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి కేవలం 2500 మందికే పోస్టింగ్ ఇచ్చారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల మిగతా పోస్టులు న్యాయ వివాదంగా ఉన్నాయి.

రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తీవ్ర ప్రతిష్టంభన నెలకొని ఉంది. ప్రభుత్వం వాగ్దానాలు చేస్తున్నది కాని, అమలు పరచడం లేదు. సంవత్సరాల కాలయాపన ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో తీవ్ర నైరాశ్యం నెలకొని ఉంది. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు నాయకత్వం వహిస్తున్న సంఘాలు, సంఘటితమై ప్రభుత్వాన్ని నిలదీస్తూ ఉద్యమించాల్సిన సందర్భంలో నిష్క్రియాపరంగా, నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటున్నాయి. క్షేత్ర స్థాయిలో ఉద్యోగ, ఉపాధ్యాయుల మనోభావాలను పరిగణనలోనికి తీసుకొని స్పందించాల్సిన రాష్ట్ర స్థాయి ప్రధాన సంఘాలు, నాయకులు, కొందరు తమ స్వార్థ, సంకుచిత, రాజకీయ ప్రయోజనాల కోసం, ప్రభుత్వంతో అంటకాగుతూ, ఉద్యమాలను ఫణంగా పెడుతున్నారు. ఉద్యమ ద్రోహానికి పాల్పడుతున్నారు. గతంలో సీమాంధ్ర పాలనలో కనపడిన సంఘాల ఐక్యత, ఉమ్మడి ఉద్యమ వేదికల నిర్మాణం (జెఏసి లు) జరగకుండా చూస్తున్నారు. ఈ క్రమంలో డిటిఎఫ్, టిపిటిఎఫ్, యుటిఎఫ్ లాంటి

సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు పోరాట కమిటి (యు.ఎస్.పి.సి)గా ఏర్పడి గత నాలుగేండ్లుగా కొన్ని పరిమిత ఉద్యమాలైనా చేయగలిగింది. ఆ తదనంతరం తెలంగాణ ఉద్యోగుల సంఘం, పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయిస్, మెడికల్ ఎంప్లాయిస్, వీఆర్వోస్, రిటైర్డ్ ఉద్యోగులు తదితరులు 'ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్యవేదిక'గా ఏర్పడి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉద్యమాలు చేసింది. కొన్ని చిన్న స్థాయిలోనైనా అక్కడక్కడ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచసాగాయి. టిఎన్‌జిఓలు రాష్ట్ర స్థాయి ఉద్యోగ మహాసభ నిర్వహించి ప్రభుత్వానికి ఒక మెమోరాండం ఇచ్చారు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం, ఉద్యోగుల ఒత్తిడని గమనించి 2018 మే 16న ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రగతి భవన్‌లో, ఉద్యోగ, ఉపాధ్యాయ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సుదీర్ఘంగా చర్చించి 18 సమస్యలు నిర్దిష్ట కాల వ్యవధిలో పరిష్కరించడానికి హామీ ఇచ్చారు. ప్రధానంగా 2 లక్షల మంది ఉద్యోగులు, 1.14 లక్షల ఉపాధ్యాయులు, 2.5 లక్షల మంది రిటైర్డ్ ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చే 11వ వేతన సవరణ సంఘం (పి.ఆర్.సి) నియామకంపై నిర్దిష్ట హామీ ఇచ్చారు. గతానికి భిన్నంగా త్రిసభ్య పి.ఆర్.సి నియమిస్తానని, 2018 జూన్ 2 నుండి మధ్యంతర భృతి (ఐ.ఆర్) చెల్లిస్తామని, మూడు మాసాలలో నివేదిక తెప్పించి దసరా కానుకగా 'పిఆర్‌సి' అమలు చేస్తానని హామీ ఇచ్చారు. కాని, పదిహేను మాసాలైనా స్పందన లేదు. కనీసం ఐఆర్ కూడా లేదు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ (సిపిఎస్) రద్దు కోసం ఒత్తిడి తేగా, అది రాష్ట్ర పరిధి కాదని, కేంద్రం చేయాలని అంటూ, సంఘాల ఒత్తిడి కారణంగా అధ్యయనానికి కమిటి వేస్తానని ప్రకటించారు. కాని అతీలేదు గతీలేదు.

ఈ రోజు ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఎంప్లాయిస్ హెల్త్ కార్డులు (ఇఎచ్ఎస్). రాష్ట్రంలో ఇఎచ్ఎస్ అమలు ఒక ఫార్సుగా మారిపోయింది. ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్స్ సరిగా సహకరించక, జిల్లాల స్థాయిలో 'వెల్‌నెస్ సెంటర్లు' సక్రమంగా నిర్వహింపబడక తీవ్ర అసౌకర్యం, ఇబ్బంది ఏర్పడుతున్నది. ఇందులో ఉద్యోగుల వద్ద నుండి ఇన్సూరెన్స్ ప్రీమియం సేకరించి, ఇన్సూరెన్స్ కంపనీలతో 'టై అప్' కావడం ద్వారా ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని సక్రమంగా నిర్వహించవచ్చును. కాని ప్రభుత్వం భేషజానికి పోయి, నా ఉద్యోగుల వద్ద నేను ఇన్సూరెన్స్ కాంట్రిబ్యూషన్ సేకరించనని తెలుపుతూ, మరోవైపు కార్పొరేట్ హాస్పిటల్స్‌కు ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడం ద్వారా ఈ ప్రతిష్టంబన ఏర్పడుతున్నది. ఈ ఆరోగ్య పథకాన్ని సమగ్రంగా, సక్రమంగా అమలు చేస్తానని చేసిన ప్రకటన, ఒక్క అడుగూ ముందుకు పడకపోవడం శోచనీయం.

ఉద్యోగ విరమణ వయస్సు పెంపు బలమైన డిమాండ్ కానప్పటికి, శాసన సభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 60 ఏండ్లకు పెంచుతానని వారి 'మానిఫెస్టో'లో ప్రకటించారని, సిఎం-కెసిఆర్ తాను 61 సంవత్సరాలకు పెంచుతానని ప్రకటించారు. కాని 8 నెలలు గడిచినా దాని ఊసేలేదు. చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకో, సామాజిక భద్రతా పథకం కింద ఇచ్చే ఉద్యోగం, 'కారుణ్య నియామకాలు' 4, 5 సంవత్సరాలు గడిచినా రావడం లేదు. చనిపోయిన ఉద్యోగి కుటుంబ బాధను అర్థం చేసుకొని 10 రోజుల లోగా, తిరిగి ఉద్యోగం కల్పిస్తామని వాగ్దానం చేశారు. కాని స్పందన లేదు.గే వేర్వేరు ప్రాంతాలలో ఉన్న భార్యాభర్తల బదిలీలు, అంతర్ జిల్లా, అంతర్ రాష్ట్ర బదిలీలు త్వరలోనే చేస్తామని తెలిపారు. కాని, దాని విధి విధానాలు ఈ నాటికి రూపొందించ లేదు. మరోవైపు సిఎంఒ కేంద్రంగా పలుకుబడి బదిలీలు మాత్రం నిరంతరంగా జరుగుతున్నాయి. అలాగే కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ జివో 16 పై హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేయించడంతో అనుచిత గోప్యం జరుగుతున్నది. పెన్షనర్లకు తెలంగాణ ఇన్సెంటివ్ ఇచ్చే విషయం గాని, 10వ పిఆర్‌సి సిఫార్సు కనుగుణంగా 70 సంవత్సరాల వయస్సు దాటిన వారికి 15 శాతం క్వాంటమ్-ఆఫ్-పెన్షన్ హెచ్చింపుపై ప్రభుత్వ హామీ నిలుపుకోలేదు. ముఖ్యంగా ఆయా సందర్భాలలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలన్నీ శుష్కప్రియాలు, శూన్య హస్తాలుగానే మిగిలిపోయాయి. అంతేకాదు, ఈ రోజు ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ మొత్తం సేవాకాలంలో మదుపు చేసుకున్న జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జిపిఎఫ్) నిధులను, సర్వీసులో ఉన్నవారు వారి కుటుంబ అవసరాలు పిల్లల పెండ్లిళ్లు, ఉన్నత చదువులు, గృహ నిర్మాణాలు, అనారోగ్య సమస్యల సందర్భములో పాక్షిక మినహాయింపులు (పార్ట్ ఫైనల్) పొందాలనుకుంటే, ఉద్యోగ విరమణ చేసిన వారు జిపిఎఫ్‌లో మదుపు చేసుకున్న డబ్బులు ఏకమొత్తంగా (ఫైనల్ పేమెంట్) పొందడానికి గతంలో జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్, జిల్లా కోశాధికారి పరిధిలో 15, 20 రోజులలో అయిపోయేది. కాని, గత ఐదేండ్లుగా రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ఆర్థిక శాఖ అనుమతి పొందాల్సి వస్తున్నది. జిల్లా నుండి ప్రతిపాదనలు వెళ్లి ఆర్థిక శాఖ అనుమతి రావడానికి 4 నుండి 6 మాసాల కాలం పడుతున్నది. అంటే ఉద్యోగ, ఉపాధ్యాయులు తాము పొదుపు చేసుకున్న తమ స్వంత డబ్బులు తమ తక్షణ, అత్యవసరాలకు అందని దుస్థితి ఏర్పడుతున్నది.

అలాగే, వేతనాలకు అదనంగా పొందే డిఏ బకాయిలు కాని, మెడికల్ రియింబర్స్‌మెంట్లు కాని, ఫిక్సేషన్ల బకాయిలు కాని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కాని 'ఫైనాన్స్ ఫ్రీజింగ్' కారణంగా సకాలంలో ఉద్యోగులు పొందలేక పోతున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో సాధారణంగా ఫిబ్రవరి, మార్చి నెలలో ప్రకటిత ఫ్రీజింగ్ ఉండేది. కాని నేడు అప్రకటితంగా నిత్యం ఫ్రీజింగ్ కొనసాగుతున్నది. ఒక వైపు దేశంలోనే ఆర్థికాభి'వృద్ధి' రేటు అధికంగా ఉన్న రాష్ట్రమని, మిగులు బడ్జెట్ కల్గిన రాష్ట్రమని ప్రకటిస్తూ, మరోవైపు వేలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ స్వంత డబ్బులు పొందడానికి ఎంతగానో ఇబ్బందులకు, వేదనలకు గురి కావలసి వస్తున్నది. అంటే ఉద్యోగుల మదుపు మొత్తాలను ప్రభుత్వ అవసరాలకు, ఇతర పనులకు దారి మళ్లించారా? లేక రాష్ట్ర ఆర్థిక సంక్షోభ కారణమా? అర్థం కాని పరిస్థితి.

ఈ సందర్భంగా, సిఎం హామీ పద్ద వాగ్దానాలు అమలు పరచలేదని, ఇటీవల ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ, పెన్షనర్ల జెఏసి మరికొందరు జిల్లాల స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించారు. మరోవైపు రెవెన్యూ శాఖ తీరుపై సిఎం కొన్ని వ్యాఖ్యలు చేశారు. విఆర్ఒలు, తహసీల్దార్లు తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఉద్యమిస్తామని తెలుపుతూ, కొన్ని రోజులు 'వర్క్-టు-రూల్' పాటించారు. దీనికి ముఖ్యమంత్రి స్పందించి, ఉద్యోగ సంఘాలు బెదిరింపులకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, ప్రజల డబ్బుతో జీతాలు తీసుకొంటున్న వాళ్లు జవాబుదారీగా పనిచేసి తీరాల్సిందేనని అన్నట్లు

బ్రిటన్ ప్రధానికి బ్రెగ్జిట్ సంకటం

బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ క్లిష్టమైన బ్రెగ్జిట్‌ను అమలు చేసేందుకు ఇయు విధించిన షరతులకు తలొగ్గుతాడా, లేదా బ్రిటన్ ప్రయోజనాలకు అనుగుణంగా నడుచుకుంటాడా అనేది తేలాల్సి ఉందనీ అంటున్నారు ఎ. నర్సింహారెడ్డి

యూరోపియన్ యూనియన్ (ఇయు) నుండి బ్రిటన్ వైదొలగాలని మొదటి నుంచి యుకె ఇండిపెండెన్స్ పార్టీ డిమాండ్ చేస్తున్నది. కన్సర్వేటివ్ పార్టీకి చెందిన బోరిస్ జాన్సన్ కూడా ఇయు నుండి విడిపోవాలని నానా యాగి చేశాడు. ఇప్పుడు ఆయనే బ్రిటన్ ప్రధాని అయ్యాడు. 2015లో జరిగిన బ్రిటన్ పార్లమెంటు ఎన్నికల్లో ఎలాగైనా గెలిచితీరాలన్న ఆత్రుతలో అప్పటి ప్రధాని డేవిడ్ కామెరాన్ ఇచ్చిన ఒక హామీ కన్సర్వేటివ్ పార్టీకి దండిగా సీట్లు సాధించిపెట్టింది. అంతక్రితం తమకున్న 306 స్థానాలనూ 331కి పెంచుకుని సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశం ఆ పార్టీకి లభించింది. ఇయు నుంచి బ్రిటన్ నిష్క్రమణపై రెఫరెండం ఉంటుందని ప్రధాని డేవిడ్ కామెరూన్ ప్రకటించారు. 2016 జూన్ 23న ఇయు నుంచి వైదోలగాలా, వద్దా అని తెలుపాల్సిందిగా నిర్వహించిన రెఫరెండం ఓటింగ్‌లో 52-48 శాతం ఓటుతో నిష్క్రమణ వాదం నెగ్గింది.

ఇంగ్లాండ్, వేల్స్, స్కాట్లాండ్, ఉత్తర ఐర్లాండ్‌లతో కలిపి యునైటెడ్ కింగ్‌డమ్ 1922లో ఏర్పడింది. విచిత్రమేమంటే ఈ నాలుగు ప్రాంతాల్లో రెండు ప్రాంతాలు ఇంగ్లాండ్, వేల్స్ బ్రిగ్జిట్‌కు అనుకూలంగా ఓటు చేయగా మిగిలిన రెండూ వ్యతిరేకించాయి. ముఖ్యంగా ఇంగ్లాండ్‌లో బ్రెగ్జిట్‌కు అనుకూలంగా 53.4 శాతం ప్రతికూలంగా 46.6 శాతం ఓట్లు పోలయ్యాయి. ఇక స్కాట్లాండ్‌కు చెందిన 62.8 శాతం మంది బ్రెగ్జిట్‌ను వ్యతిరేకించగా, 37.2 శాతం మంది సమర్థించారు. అదే ఉత్తర ఐర్లాండ్‌లో 55.8 శాతం మంది అనుకూలంగా ఓటుచేయగా, 44.2 శాతం మంది వ్యతిరేకించారు. ఈ ఫలితంతో జూన్ 24న కామెరాన్ రాజీనామా చేశారు. హోంమంత్రిగా ఉన్న థెరిసా మే పార్టీ నాయకురాలిగా ఎన్నికై జూలై 13న ప్రధాన మంత్రి పదవి చేపట్టారు.

థెరిస్సా మే తన స్థానాన్ని బలపరుచుకుని, బ్రెగ్జిట్ ఒప్పందాన్ని సాధించే ఉద్దేశంతో ఆమె 2017 జూన్ 8న ఆకస్మిక సార్వత్రిక ఎన్నికలకు వెళ్లారు. అయితే ఆమె పార్టీ మైనారిటీలో పడిపోయి, ఇతర పార్టీలను బుజ్జగించి మైనారిటీ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. పార్లమెంటును రద్దు చేసి ఎన్నికలకు వెళ్లడం ఆమె చేసిన పెద్దతప్పిదం. కన్సర్వేటివ్ పార్టీ బలం మరింత తగ్గిపోయి, త్రిశంకు సభ ఏర్పడి, ఉత్తర ఐర్లాండ్ డెమోక్రటిక్ యూనియనిస్టు పార్టీ (డియుపి) మద్దతు మీద ఆధారపడి ప్రభుత్వాన్ని నడపాల్సి వచ్చింది. చివరకు పార్టీపైనా పార్లమెంటులోనూ పట్టుకోల్పోయి బ్రెగ్జిట్‌ను ఒక కొలిక్కితీసుకురాలేని స్థితికి ఆమె జారిపోయారు. బ్రెగ్జిట్ రాజకీయ సంక్షోభానికి కారణమవుతుందని పార్టీ నేతలు అనుకొని ఉండరు. విచిత్రమేమంటే ప్రధాన రాజకీయ పక్షాలైన కన్సర్వేటివ్, డెమోక్రటిక్ పార్టీలు బ్రెగ్జిట్‌పై గత రెఫరెండంను గౌరవిస్తున్నప్పటికీ, బ్రెగ్జిట్‌కు అనుసరించే విధానంలో ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నాయి. సాక్షాత్తు అధికార కన్జర్వేటివ్ పార్టీలోనే బ్రెగ్జిట్‌పై ప్రస్తుతం అనుసరించే విధానంపై తీవ్ర వ్యతిరేకత ఉన్నది. బ్రెగ్జిట్ ప్రతిపాదనలపై విపక్షం నుంచే కాక, స్వపక్షం నుంచీ తీవ్ర వ్యతిరేకత వెల్లడవుతూ వచ్చింది. మంత్రుల రాజీనామాలు, పార్టీలో తిరుగుబాట్లు సాధారణమై పోయాయి.

నిజానికి 2019 మార్చి 29 నాటికి బ్రిటన్ ఇయు నుంచి వైదొలగాలి. ఇయు దేశాలు కుదుర్చుకున్న లిస్బన్ ఒప్పందంలోని 50వ అధికరణ కింద బ్రిటన్ ఎగ్జిట్ ప్రక్రియను ప్రారంభించిన రెండేళ్ల తర్వాత వైదొలగాల్సి ఉంది. కానీ బ్రిటిష్ ఎంపిలు ప్రస్తుతం అనుసరించే బ్రెగ్జిట్ ప్రక్రియకు

సమాచారం. 'వాళ్ళు ప్రభుత్వాలను ఏదో చేస్తామనే భ్రమలో ఉంటే వాళ్ళకే నష్టం. ఈ విషయం ఆయా సంఘం నేతలకు తేల్చి చెప్పండి, రాష్ట్రం ఏర్పడ్డాక ఎవరూ ఇవ్వనంత ఐ. ఆర్, ఫిట్‌మెంట్ ఇచ్చామనే విషయాన్ని గుర్తుచేయమని, తెగేదాక లాగితే ఫైనల్‌గా నష్టపోయేది ఉద్యోగులే' అని అన్నట్లు పత్రికల్లో ప్రకటనలు వచ్చాయి. మరోవైపు పుర్వాశ్రమంలో ఉద్యోగ సంఘ నేత, ప్రస్తుతం మంత్రి శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ, ఉద్యోగులు ప్రభుత్వంతో స్నేహపూరితంగా వ్యవహరిస్తే మంచిది. బెదిరించి పనులు చేయించుకోవాలనుకుంటే భయపడే స్థితిలో ప్రభుత్వం లేదు' అన్నారు. అలాగే టి.ఆర్.ఎస్. సర్కారుకు ప్రజల అండ ఉందని, దానివల్లే రెండోసారి అధికారంలోకి వచ్చామని, కొంత మంది ఉద్యోగ సంఘాల నేతల ప్రకటనల వల్ల సమస్యలు వస్తున్నాయన్నారు. అంటే, ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకున్న, తామిచ్చిన హామీలను నెరవేర్చకున్నా, సంవత్సరాల తరబడి కాలం గడిచినా, ప్రభుత్వం ఇచ్చినపుడు మాత్రమే తీసుకోవాలి గాని, సంఘాలు డిమాండ్ చేయగూడదు, ఉద్యమాలు నిర్వహించగూడదనేది ఆమాత్యుల వారి ఆంతర్యం. ఇది ప్రజాస్వామిక వ్యవస్థలో సరైనది కాదు. ఒకవైపు స్నేహపూరిత ప్రభుత్వమని అంటూనే మరోవైపు బెదిరింపులు వాంఛనీయం కాదు. దానిని తీవ్రంగా గర్హిస్తున్నాం. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల తీవ్రత దృష్ట్యా, వారి మనోభావాల కనుగుణంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం కోసం, వ్యష్టిగా, సమిష్టిగా చేసే ఉద్యమాల ద్వారానే సంఘం ఉనికి ఉంటుందని, అలాగే ప్రశ్న, డిమాండ్, పోరాటం ప్రజాస్వామిక విధానమని ఏలికల గుర్తించాలి.

(రాష్ట్ర అధ్యక్షులు డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) వీ

ససేమిరా అంటున్నారు. ఇయు, యుకెల మధ్య కుదిరిన ఒప్పందాన్ని ఇప్పటి వరకు బ్రిటిష్ ఎంపిలు మూడుసార్లు తిరస్కరించారు. ప్రస్తుతం ఉన్న గడువు ప్రకారం 2019 అక్టోబర్ 31 నాటికి బ్రిటన్ ఇయు నుంచి వైదొలగాలి. బ్రెగ్జిట్ విషయంలో విఫలమైనందుకు ప్రధాని థెరిస్సా మే తన పదవికి రాజీనమా చేస్తానని మే 24న ప్రకటించి జూన్ 7న రాజీనామా చేశారు. థెరిస్సా మే వైదొలగిన తర్వాత బ్రిటన్ విదేశాంగ కార్యదర్శిగా పనిచేసిన బోరిస్ జాన్సన్ నూతన ప్రధానిగా జూలై 23న ఎన్నికైనాడు.

బ్రెగ్జిట్ మల్లగుల్లాలు

బోరిస్ జాన్సన్ చేస్తున్న ప్రకటనలు కన్సర్వేటివ్ నేతలకు గుబులు పుట్టిస్తున్నాయి. బ్రిటన్‌కు మేలు చేకూరేవిధంగా ఇయుతో మాట్లాడి మెరుగైన బ్రెగ్జిట్ ఒప్పందానికి కృషి చేస్తాననడానికి బదులు, అసలు ఏ ఒప్పందమూ అవసరం లేదంటూ జాన్సన్ చేస్తున్న ప్రకటనలు అయోమయాన్ని సృష్టిస్తున్నాయి. బ్రిటన్ 1945 తర్వాత ఏనాడు లేనంత, బయటపడటం సాధ్యం కానంత భారీ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో ఏ ఒప్పందం లేకుండా విడిపోతే జాతీయ ఆదాయం 5 శాతం పడిపోతుందని, ఆహార ధరలు పెరిగి ప్రజలు ఇబ్బంది పడతారని ఆర్థిక వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇయుతో లాంఛనంగా విడిపోయే ఒప్పందం కుదుర్చుకోకుండా విడిపోవాలన్న బోరిస్ జాన్సన్ పంథాను 40 మంది కన్సర్వేటివ్ ఎంపిలు ప్రతిఘటిస్తున్నారు. ఒప్పందం కుదరక ఎన్నికలు వస్తే జాన్సన్ ఓడిపోవడం ఖాయం.

బ్రెగ్జిట్‌కు గడువు పెంచేదీ, తిరిగి చర్చించేదీ ఏమీ ఉండదని ఇయు ఇప్పటికే తేల్చేసింది. గడువులోగా బ్రెగ్జిట్ పూర్తయ్యేట్టు చేసి, తద్వారా లభించే అన్ని ప్రయోజనాలు, అవకాశాలు ప్రజలకు అందిస్తాననీ, బ్రిటన్‌ను గ్రేట్ అనిపిస్తానని బోరిస్ జాన్సన్ (బోజో) హామీ ఇచ్చారు. తెరీసా మే మూడుసార్లు ఒప్పందం ముసాయిదాను పార్లమెంటులో పెట్టి చివరకు స్వపక్షాన్ని కూడా ఒప్పించలేక నిష్క్రమించిన విషయం తెలిసిందే. విపక్ష లేబర్‌పార్టీని దారికి తెచ్చుకోలేకపోవడం, స్వపక్షంలోనే వ్యతిరేకులను తయారుచేసుకోవడం, బ్రెగ్జిట్ విషయంలో పార్లమెంటులో ఒక ఏకాభిప్రాయాన్ని సాధించకముందే ఆర్టికల్ యాభై ద్వారా ఉపసంహరణ ప్రక్రియకు నోటిఫికేషన్ జారీ చేసినప్పటి నుంచి, నిష్క్రమణ ప్రక్రియ ఏవిధంగా సాగాలనే దానిపై తర్జన బర్జనలు ఊపందుకున్నాయి. బలహీనంగా ఉన్న అధికారాన్ని ఏకం చేయడం, విపక్షాన్ని దారికితేవడం బోరిన్ జాన్సన్ (బోజో)కు అంత సులభం కాదు.

బ్రెగ్జిట్ నేపథ్యం

1971 జనవరి 1న ఇంగ్లాండ్, వేల్స్, స్కాట్లండ్, ఉత్తర ఐర్లాండ్, జిబ్రాల్టర్ ఐరోపా ఆర్థిక సమాజం (ఇఇసి)లో చేరి ఒక ప్రాంతీయ ఆర్థిక కూటమిగా అవతరించాయి. 1957 రోమ్ ఒప్పందం దీనికి ప్రాతిపదిక. ఇది మార్కెట్ కోసం ఏర్పడింది. సభ్యదేశాల మధ్య సరుకులు, పెట్టుబడి, సేవలు, ప్రజలు స్వేచ్ఛగా రాకపోకలు సాగించేందుకు సరిహద్దులు బార్లా తెరచి ఉంచేలా చూడటం దీని లక్ష్యం. ఉమ్మడి ఆర్థిక ప్రయోజనాలే లక్ష్యంగా బయల్దేరిన యూరోపియన్ కూటమి క్రమంగా సైనిక, రాజకీయ రంగాలకు విస్తరించింది. ఉమ్మడి కరెన్సీ, ఇ.యు సెంట్రల్ బ్యాంకు (ఇసిబి), ఇయు న్యాయస్థానా (ఇసిజె)లను సొంతంగా ఏర్పాటు చేసుకుంది. 28 దేశాలతో కూడిన ఇయు కూటమిపై జర్మనీ, ఫ్రాన్స్ నిర్ణయాత్మక శక్తిగా వ్యవహరిస్తున్నాయి.

బ్రెగ్జిట్ వ్యవహారం నిప్పుతో చెలగాటం వంటిది. ఈ సంగతి మొదట కామెరూన్, తర్వాత థెరిసా మే అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. ఇయుతో ఒప్పందంలో ఎన్ని సంక్లిష్టతలున్నాయో రెండేళ్లకు మే గ్రహించారు. ఇయుతో ఆమె కుదుర్చుకున్న ముసాయిదా ఒప్పందాన్ని ఈ ఏడాది జనవరిలో బ్రిటన్ పార్లమెంటు తోసిపుచ్చింది. ఆ తర్వాత మార్చిలో ఆమె మరో ముసాయిదా ఒప్పందానికి ఇయును ఒప్పించారు. కానీ దాన్ని సైతం పార్లమెంటు తోసిపుచ్చింది. ఆమె వ్యవహారశైలిపై సొంత పార్టీలో అసంతృప్తి నానాటికీ తీవ్రమైంది. వచ్చే అక్టోబర్ 31 నాటికి ఏదో ఒప్పందానికి రాకపోతే బ్రిటన్‌పై దాని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయన్న సంగతిని జాన్సన్ గ్రహించలేకపోతున్నారో లేక అప్పటివరకూ ఏదో రకంగా నెట్టుకు రావొచ్చని భావిస్తున్నారో ఎవరికీ అర్థం కావడంలేదు.

సంకట స్థితిలో బోరిస్ జాన్సన్

బ్రిటన్ 1945 నుంచి ఏనాడు లేనంత భారీ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంది. ఈ సంక్లిష్ట పరిస్థితి బోరిస్‌కు సవాలుగా మారింది. ఇయు షరతులపై అంతరంగికంగా ఉన్న ఒత్తిడి చిన్నదేమీ కాదు. ఆర్థికమే కాక, దేశ సమైక్యత కూడా బ్రెగ్జిట్‌తో ముడిపడి ఉంది. బ్రిటన్ నుంచి విడిపోవాలని బలంగా కోరుకొనే స్కాంట్లాడ్‌లో బ్రెగ్జిట్‌పై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ఇయుతో కలిసుండాలన్న వాదన నెగ్గింది. ఇయుకు దూరం జరిగే ఉద్దేశం స్కాంట్లాండ్‌కు లేనందున, బ్రెగ్జిట్ ఫలించిన పక్షంలో స్కాంట్లాండ్ బ్రిటన్ నుంచి వేరుపడే అవకాశాలున్నాయి. యుకె కనుక ఇయు నుంచి బయటకు వస్తే, తాము మళ్లా ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతామని స్కాట్లాండ్ ముఖ్యమంత్రి నికోలా స్టర్జాన్ స్పష్టం చేశారు. ఇయులో భాగస్వామిగా ఉన్న ఐరిష్ రిపబ్లిక్‌తో సరిహద్దులు పంచుకుంటున్న ఉత్తర ఐర్లాండ్ విషయంలోనూ బ్రిటన్‌కు ఈ ప్రమాదం ఎదురవ్వచ్చు. బ్రిటన్‌తో వేరుపడి ఐరిష్ రిపబ్లిక్‌తో కలిసిపోదామన్న వాదనలు ఉత్తర ఐర్లాండ్‌లో బలపడవచ్చు. యురోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ విడిపోవడాన్ని ఐర్లాండ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. బ్రిటన్ ఇయు నుంచి పొందినంత లబ్ధిపొంది ఇప్పుడు స్వేచ్ఛను కోరుకుంటే తమ పరిస్థితి ఏంటన్నది ఐర్లాండ్ వాసుల ప్రశ్న. నిజానికి యురోపియన్ యూనియన్ ద్వారా బ్రిటన్‌కు వాణిజ్య లబ్ధి బాగానే జరిగింది. ఇయు దేశాల్లోని పెట్టుబడులు బ్రిటన్‌కు రావడం మౌలిక వనరులను పెంపొందించుకునే అవకాశాన్నిచ్చింది.

ఉత్తర ఐర్లాండ్‌లో అతివాద భావాలు గల ప్రొటెస్టెంట్ పార్టీ కూడాఉంది. జాన్సన్‌కు పార్లమెంట్‌లో ఈ పార్టీ మద్దతు మీద ఆధారపడవలసి ఉంటుంది. దీనివల్ల ఆయనకు అనేక పరిమితులు ఏర్పడ్డాయి. బ్రిటన్‌ను ఇయు నుంచి బయట పడేయడానికి ఆయన అనేక విన్యాసాలు చేయవలసి ఉంటుంది. ప్రొటెస్టెంట్ పార్టీ యూకే నుండి విడిపోవాలనేమీ కోరుకోవడం లేదు. ఉత్తర ఐర్లాండ్‌కు దక్షిణాదికి

మధ్య కఠినమైన నియమాలు గల సరిహద్దు ఉండాలని కోరుకోవడం లేదు. ఈ వివాదమే థెరీసా మే హయాంలో బ్రెగ్జిట్ ఒప్పందం మూడుసార్లు ఆమోదం పొందకుండా ఆటంకంగా మారింది. ఈ సమస్య నుంచి జాన్సన్ ఎట్లా బయటపడుతారో చూడాలి. ఈ వివాదం సాగే కొద్దీ బ్రిటన్ అంతరంగిక అంశాలపై ప్రభావం చూపుతుంది. ఈ మధ్యకాలంలో ఐర్లాండ్ ఐక్యంగా ఉండాలనే భావోద్వేగాలు పెరుగుతున్నాయి.

ఉత్తర ఐర్లాండ్‌లో డెమోక్రాటిక్ యూనియనిస్ట్ పార్టీ (డియుపి) బలంగా ఉంది. థెరిస్సా మే ప్రభుత్వానికి మద్దతిచ్చినా డిఎంయు బ్రెగ్జిట్ ఒప్పందాన్ని మాత్రం వ్యతిరేకిస్తున్నది. యునైటెడ్ కింగ్‌డమ్ ఆర్థిక, రాజకీయ సమగ్రతలను కాపాడేలా బ్రెగ్జిట్ ఒప్పందంలో మార్పులు చేర్పులు చేస్తేనే ఒప్పందం సత్ఫలితాలిస్తుందని.. అలా చేస్తే తమ మద్దతు ఉంటుందని తేల్చిచెబుతున్నది. యునైటెడ్ కింగ్‌డమ్ పార్లమెంట్‌లో బలాబలాను పరిశీలిస్తే.. ఎన్నికైన ఎంపిలు 650 మంది ఉండగా.. అధికార కన్సర్వేటివ్ పార్టీకి 311 మంది, ప్రధాన ప్రతిపక్షం లేబర్ పార్టీకి 247 మంది, ఉత్తర ఐర్లాండ్‌లో బలంగా ఉన్న డియుపికి 10 మంది ఎంపిలు, ఇతరులు 73 మంది ఉన్నారు. వీరిలో కన్సర్వేటివ్ ప్రభుత్వానికి డియుపి మద్దతిస్తున్నా.. అంశాల వారీగా విభేదిస్తూ వస్తున్నది. గ్రేట్ బ్రిటన్, ఉత్తర ఐర్లాండ్ మధ్య తీవ్ర సరిహద్దు వివాదాన్ని పక్కనబెడితే మంచిదన్నది డిఎంయు వాదన. బ్రెగ్జిట్ భవిష్యత్ భయాలను అటుంచితే, ఇయుతో ఏ ఒప్పందం కుదరకపోయినా తెగదెంపులు చేసుకోవాల్సిందేనన్న బోజో పట్టుదలతో వ్యవహరిస్తే స్వపక్షంలోనే ఆయనపై తిరుగుబాటు ఖాయం.

నో డీల్ వల్ల ఏర్పడే సమస్యలు

యూరోపియన్ యూనియన్ దేశాల ప్రజలు బ్రిటన్‌లోకి విచ్చలవిడిగా వలసరావడంతో ఆర్థిక వ్యవస్థపై పెనుభారం పడి.. అసలైన పౌరుల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయన్నది కన్సర్వేటివ్ పార్టీ నేతల అభిమతం. వలసల కారణంగా స్థానికులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కోల్పోతుండడంతో పలు ప్రాంతాల్లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఇంగ్లిష్ ప్రధాన భాషగా మాట్లాడే వాళ్లంతా బ్రిటన్‌కు స్వేచ్ఛ కావాలని కోరుకుంటున్నారు. అటు స్కాట్లాండ్‌లోని మెజారిటీ ప్రజలు కూడా బ్రిటిషర్ల వాదనకే మద్దతు పలుకుతున్నారు. కలిసుండి పోట్లాడు కోవడం కంటే.. విడిపోయి అన్నదమ్ముల్లా ఉందామని అంటున్నారు.

ఇయుతో ఒప్పందం లేకుంటే ఒక్కసారిగా బ్రిటన్ అనిశ్చితిలోకి జారుకుంటుంది. బ్రిటన్, ఇయుల మధ్య తీవ్ర విభేదాలు ఏర్పడి దేశ పౌరులకు సమస్యలేర్పడతాయి. తమ సభ్యదేశం కాదు గనుక బ్రిటన్‌పై ఇయు భారీ సుంకాలు విధిస్తుంది. వాణిజ్యంపై ఆంక్షలు విధిస్తుంది. ఫలితంగా దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయి. కొత్త నిబంధనలు రూపొందించుకునే వరకూ బ్రిటన్ నుంచి వచ్చే ఉత్పత్తులకు ఇయు అనుమతి నిరాకరిస్తుంది. దేశం వెలుపలి నుంచి రావాల్సిన విడి భాగాలు, ముడి సరుకు వగైరాల దిగుమతికి సమస్యలేర్పడతాయి గనుక ఉత్పత్తిదారులు బ్రిటన్ వదిలిపోవచ్చు. దానివల్ల లక్షలాదిమంది ఉపాధి దెబ్బతింటుంది. ఇయు నుంచి ఎటువంటి హామీ లేకుండా నిష్క్రమిస్తే బ్రిటన్‌కు ఆహారం, ఇంధనం, ఔషధాల వంటి అన్నింటికీ విపరీతమైన కరువు ఏర్పడుతుందని, బ్రిటన్ తీవ్ర మాంద్యంలో కూరుకుపోతుందని, ఆహార ధరలకు రెక్కలొస్తాయని, ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడుతుందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు.

అటు ఇయు, ఇటు బ్రిటన్ కొత్త విధానాలు రూపొందించుకునే వరకూ రెండు ప్రాంతాల్లోనూ వలసదారులకు తిప్పలు తప్పవు. బ్రిటన్‌లో 37 లక్షల మంది యూరపియన్లు ఉంటే.. ఇయు దేశాల్లో 13 లక్షల మంది బ్రిటన్ పౌరులున్నారు. వీరంతా కొత్తగా రూపొందబోయే నిబంధనలకు అనుగుణంగా తమ స్థితిగతులను మార్చుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఉమ్మడి వ్యవసాయ విధానం కింద బ్రిటన్ రైతులకిచ్చే 300 కోట్ల ఫౌండ్లు ఆగిపోతాయి. ఇప్పటికే ఆమోదించిన ఇయు బడ్జెట్‌కు, దానికింద పరస్పరం చేసుకునే చెల్లింపులకూ ఇరు దేశాలూ కట్టుబడి ఉండాలి. ఇయు న్యాయస్థానం తీర్పులను బ్రిటన్ పాటించాల్సిన అవసరం ఉండదు. అయితే ఇయు దేశాలతో బ్రిటన్ వేర్వేరుగా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాల్సి వస్తుంది. అందుకు చాన్నాళ్లు పట్టే అవకాశం ఉంది.

ఒప్పందం కుదుర్చుకుని తప్పుకుంటే బ్రిటన్‌కొచ్చే లాభం ఒకటుంది. అది కొత్త విధానంలోకి పరివర్తన చెందడానికి 21 నెలల సమయాన్ని అంటే దాదాపు రెండేళ్ల గడువు తీసుకోవచ్చు. ఈలోగా ఎదురయ్యే సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకోవచ్చు. ఇయు బడ్జెట్ కోసం ఏటా చెల్లించాల్సిన 1,300 కోట్ల ఫౌండ్ల భారం నుంచి బ్రిటన్ తప్పుకోవచ్చు. కానీ అటు నుంచి వచ్చే సబ్సిడీలన్నీ నిలిచిపోతాయి. బ్రిటన్ ఇకపై ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటిఒ) నిబంధనల ప్రకారం నడుచుకుంటుంది. ఇందువల్ల కొన్ని రంగాల్లో బ్రిటన్ మెరుగైన స్థితిలో ఉండే అవకాశం లేకపోలేదు. అదే సమయంలో మరికొన్ని అంశాల్లో సమస్యలేర్పడతాయి.

ఇయుతో సమర్థవంతంగా సంప్రదింపులు జరిపి దేశానికి లాభం చేకూర్చే ఒప్పందానికి వారిని ఒప్పిస్తానని ప్రధాని పదవికి పోటీపడిన జెరిమి హంట్ చెప్పినా అత్యధికులు ఆయన్ను విశ్వసించలేదు. కానీ జాన్సన్‌లో మరో డోనాల్డ్ ట్రంప్ ఉన్నారని వారు గ్రహించలేకపోయారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో అప్పటికి లండన్ మేయర్‌గా ఉన్న జాన్సన్ న్యూయార్క్ వెళ్లినప్పుడు ట్రంప్ విపరీత వ్యాఖ్యలను తప్పుబట్టిన జాన్సన్ ఇప్పుడు అదే దారిలో వెళ్తున్నారు. జాత్యహంకార వ్యాఖ్యల్లో, మహిళలను కించేపరిచేలా మాట్లాడటంలో, ఇస్లాంను భూతంగా చూపడంలో ఆయన ట్రంప్‌కెక్కడా తీసిపోరు. ఇయుతో ఒప్పందం లేకపోయినా మిన్ను విరిగి మీద పడబోదని జాన్సన్ చేసిన వ్యాఖ్య కూడా ఆ కోవలోనిదే.

ఇయుతో ఏ ఒప్పందమూ ఉండబోదన్న అనుమానం వస్తే పార్లమెంటులో జాన్సన్‌పై సొంత పార్టీవారే అవిశ్వాస తీర్మాణం పెట్టే అవకాశం లేకపోలేదు. తాననుకున్నది సాధించడానికి పార్లమెంటును ఆయన సస్పెండ్ చేస్తే పార్టీ ఉనికికే ముప్పు ముంచుకొస్తుంది. ఇప్పటికీ బ్రెగ్జిట్ ప్రక్రియపై నెలకొన్న అనిశ్చితులతో బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ సతమతమవుతున్నది. వ్యాపార కార్యక్రమాల పైనా ఇది తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నది. బ్రిటన్‌తో వ్యాపారం, ఉత్తర ఐర్లాండ్ సరిహద్దుల గుండా

ఇయు దేశాలు సాగించాల్సిన వాణిజ్య విధివిధానాలు, కస్టమ్స్ సుంకాల వంటి అంశాలపై పార్లమెంటు సభ్యుల మధ్య ప్రతిష్ఠంభన నెలకొంది. ఎలా చూసినా రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఈ స్థాయిలో బ్రిటన్ సంక్షోభం ఎదుర్కొనడం ఇదే తొలిసారి. దీన్నుంచి ఆ దేశం ఎలా బయటపడుతుందో వేచి చూడాలి.

ముగింపు

బ్రిటన్ యూరోపియన్ యూనియన్‌లో కొనసాగడంలో ఉండే సమస్యలు, ఆ కూటమి నుంచి బయటపడటానికి పడుతున్న గుంజాటన ప్రస్తుత ప్రపంచ పరిస్థితికి అద్దం పడుతున్నది. ఇరువయ్యవ శతాబ్దం ముగిసేనాటికి, ప్రత్యేకించి 1980, 90 దశకాల వరకు ప్రజాస్వామ్యమనే తాత్విక ధోరణి బలమైందిగా నిలిచింది. కానీ ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తర్వాత, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలు, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడుల ఆధిపత్యం, ప్రపంచ దేశాలపై అమెరికా ఆధిపత్యం ఏర్పడిన నేపథ్యంలో కార్పొరేట్ సంస్థలు బలమైనవిగా అవతరించాయి. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు బలహీనపడ్డాయి. ప్రపంచ దేశాల మధ్య ఆర్థిక అనుసంధానం పెరుగడం వల్ల ఆయా దేశాల ప్రభుత్వాలు ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకునే స్వతంత్రతను కోల్పోయాయి. ప్రజల డిమాండ్లు అటుకెక్కాయి. ప్రజాసంక్షేమానికి నిధుల కోత పడింది. నిరుద్యోగం పెరిగింది.

ఇయు పెత్తనం ఇంగ్లాండ్ ప్రజల మనోభావాలను రెండు రకాలుగా గాయపరిచింది. ఒకటి ఒకప్పుడు ప్రపంచాన్ని శాసించిన ఇంగ్లాండ్ ఇప్పుడు యూరోపియన్ పార్లమెంట్ శాసనాలకు తలొగ్గవలసిన పరిస్థితి ఏర్పడ్డది. తమ ప్రభుత్వానికి విధాన నిర్ణయాలు తీసుకునే అధికారాలు లేకపోవడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. మరొకటి –దేశ ఆర్థిక పరిస్థితి. ప్రపంచీకరణ నేపథ్యంలో పారిశ్రామిక సంస్థలకు పన్నులు తగ్గి ప్రజల సంక్షేమ పథకాలకు కోత పడుతున్నది. దీనివల్ల మిగతా దేశాల మాదిరిగానే ఇంగ్లాండ్ ప్రజల జీవనం ఒత్తిడికి గురవుతున్నది. ఫలితంగా ఇంగ్లాండ్ ప్రజలలో అసంతృప్తి ఎగిసిపడుతున్నది. ఇదే సమయంలో విదేశీయుల వలసలు మొదలైన అంశాలలో ఇయు విధానాలకు కట్టుబడి ఉండాలనడం వారిలోని జాతీయ భావనలను రెచ్చగొట్టింది. ఇవాళ బ్రిటన్ ఎదుర్కొంటున్న పరిస్థితి మిగతా యూరోపియన్ దేశాలలో కూడా అనుభవానికి వస్తున్నది. ఒక్క యూరప్ మాత్రమే కాదు, వర్ధమాన దేశాలు కూడా ఈ పరిణామాలను గమనంలోకి తీసుకోవాల్సి ఉంది.

ఇయు నుంచి వైదొలగడానికి 3,900 కోట్ల పౌండ్ల మూల్యం చెల్లించడానికి థెరిసా మే సర్కారు ఒప్పుకొన్నా, జాన్సన్ వర్గం దానికి ససేమిరా అంటోంది. ఈ విడాకుల బిల్లును ఎగవేస్తే బ్రిటన్ అంతర్జాతీయ ట్రిబ్యునల్‌లో కేసును ఎదుర్కోవలసి రావడమే కాకుండా ఇయుతో మున్ముందు ఎలాంటి ఒప్పందమూ కుదిరే అవకాశం లేకుండా పోతుంది. ఏతావతా జాన్సన్ ఇయు నుంచి ఒప్పందం లేకుండా వైదొలగాలని నిశ్చయించుకుంటే, అందుకు సెప్టెంబర్ మూడో తేదీన బ్రిటిష్ పార్లమెంటు ఆమోదం పొందాల్సి ఉంటుంది. పార్లమెంటులో పాలక కన్సర్వేటివ్‌లకు మెజారిటీ లేనందువల్ల జాన్సన్‌కు తన మాట నెగ్గించుకోవడం నల్లేరు మీద నడక కాబోదు. బ్రిటన్ పార్లమెంట్‌లో ఏ మాత్రం ఏకాభిప్రాయం కనిపించడం లేదు. బోరిస్ జాన్సన్ బ్రెగ్జిట్ విషయమై ఏ రకమైన ఒప్పందం కుదుర్చుకున్నా, దానిని బ్రిటిష్ పార్లమెంట్ ఆమోదించే పరిస్థితి లేదు. ఈ పరిస్థితిలో ఏ ఒప్పందం లేకుండా బ్రెగ్జిట్ జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే ఆ ప్రభావం బ్రిటన్‌పై ఎట్లా ఉంటుందో ఊహించుకోవడం కష్టం. అయితే ఈ పరిణామం బ్రిటన్‌కు సానుకూలమైంది కాదని మాత్రం చెప్పవచ్చు.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

రచయితలకు సూచన : *తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణంకు పంపగూడదు. – సం.*

వచ్చే సంచికలలో...

- **జాతీయ విద్యా విధానం-2019 - వైరుధ్యాలు - బైరి సత్యనారాయణ**
- **నూతన వైద్య కమిషన్- ఒక సమీక్ష - కేశవ్**
- **బలహీనమవుతున్న సమాచార హక్కు చట్టం - చిమ్మె జాన్ బర్నబాస్**
- **ఆర్టికల్ 370, 35 ఎల రద్దు ఎవరి కోసం? - షేక్ కరిముల్లా**
- **గోబెల్స్ మించిన గోబెల్స్ - అరుణ్**

డేవిడ్ హార్వే: పెట్టుబడి - 7 ప్రధాన వైరుధ్యాలు

***పెట్టుబడిదారీ వ్యవస్థ తనలోని పదిహేడు అంతర్ వైరుధ్యాల వల్ల పతనం దిశగా పయనిస్తుందని డేవిడ్ హార్వే చేసిన విశ్లేషణలోని ఏడు ప్రాథమిక వైరుధ్యాలను వివరిస్తున్నారు* రమేష్ పట్నాయక్**

(...గత సంచిక తరువాయి భాగం)

వైరుధ్యం - 5

పెట్టుబడి, శ్రమల మధ్య వైరుధ్యం

ఈ అధ్యాయంలో డేవిడ్ హార్వే పెట్టుబడికి, శ్రమకు మధ్య ఉన్న వైరుధ్యాన్ని పరిశీలిస్తాడు. ఈ వైరుధ్యాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థకు చెందిన ఇతర వైరుధ్యాల నేపథ్యంలో వాటి సమాహారంలో పరిశీలిస్తాడు. పెట్టుబడి, శ్రమ వైరుధ్యాన్ని వ్యవస్థకు చెందిన ఇతర వైరుధ్యాలతో సాపేక్ష ప్రాధాన్యతలలో పరిశీలిస్తాడు. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రజాస్వామిక హక్కులకు మధ్య ఉందని భావించబడుతున్న సంబంధాన్ని అలాగే పెట్టుబడిదారీ దోపిడీకి సామాజిక అణచివేతలకు మధ్యగల అవినాభావ సంబంధాన్ని పరిశీలిస్తాడు.

డేవిడ్ హార్వే: 'బానిస, భూస్వామ్య సమాజాలలో కూడా శ్రమ దోపిడీ తీవ్రంగానూ, అమానుషంగానూ జరిగింది. గత సమాజాలలో ఎవరికైతే సామాజిక 'కుల, మత, జాతి, లింగపరమైన' ఆధిపత్యం రాజకీయ, ఆర్థిక ఆధిపత్యం ఉండిందో వారు ఇతరుల శ్రమను, శ్రమ ఉత్పాదితాలను దోపిడీ చేయడం జరిగింది. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రత్యేకత ఏమంటే ఇది శ్రమ శక్తిని సరుకుగా మార్చివేసింది. అటువంటి సరుకుతోనే అది వ్యవహరిస్తున్నది' అంటాడు. దీని అర్థం గత వ్యవస్థలు పెట్టుబడి వ్యవస్థ కంటే గొప్పవి అని డేవిడ్ హార్వే అన్నట్లు ఎంత మాత్రమూ కాదు. కార్మికుల స్థితిగతులను గత కాలపు బానిసలతో లేదా అస్వతంత్ర రైతులతో డేవిడ్ హార్వే ఇక్కడ పోలిక చేయడం లేదు. పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రమశక్తి సరుకుగా మారడాన్ని డేవిడ్ హార్వే ఇక్కడ ప్రత్యేకంగా ఎత్తిచూపుతున్నాడు, అంతే. తన విశ్లేషణను కొనసాగిస్తూ డేవిడ్ హార్వే 'శ్రమ సేవల వాణిజ్యం పెట్టుబడికి ముందు ప్రారంభమయిందని; అది పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక ఉత్పత్తి, వినియోగ వ్యవస్థగా ఉనికిని కోల్పోయిన తరువాత కూడా చాలా కాలం కొనసాగవచ్చుని చెప్తాడు.

డేవిడ్ హార్వే: 'ఈ పెట్టుబడిదారీ వ్యవస్థకు సంబంధించి చెప్పుకోదగిన విషయం ఏమంటే, ఈ వ్యవస్థలో ఎటువంటి మోసం, దోపిడీ, దొంగతనం, విస్తాపన లేనట్లు, అంతా న్యాయంగా జరుగుతున్నట్లు, కార్మికులు తమ శ్రమ శక్తిని తమ ఇష్టపూర్వకంగానే మార్కెట్‌లో నడుస్తున్న ధరలకే అమ్ముకున్నట్లు కనిపిస్తుంది. అయితే స్వేచ్ఛ పొందిన శ్రామికులు గత్యంతరం లేక తమ శ్రమ శక్తిని పెట్టుబడిదారులకు అమ్ముకుంటారని, అలాంటి కార్మికులచే పెట్టుబడిదారులు వారి వేతనాలను పునరుత్పత్తి చేయించగలగడమేగాక అదనంగా విలువులను (సరుకులను) ఉత్పత్తి చేయించగలుగుతారని' చెప్తాడు. పెట్టుబడిదారీ మార్కెట్, రాజ్యం ఫలితంగా భూమిని, ఇతర ఉత్పత్తి సాధనాలను కోల్పోయిన శ్రామికులు అనడానికి బదులు స్వేచ్ఛ పొందిన శ్రామికులు అనడం ఇక్కడ విషయాన్ని వ్యంగ్యంగా వ్యక్తీకరించడమే. అయితే, చరిత్రను మొత్తంగా పరిశీలించినప్పుడు దీనికి విశేషమైన అర్థం కూడా ఉంటుంది.

సక్రమంగా నిర్వహించబడుతున్న ఒక మార్కెట్ వ్యవస్థలో, అంటే ఎక్కడైతే మోసం. అణచివేత, దారిదోపిడీ ఉండవో, వ్యక్తులంతా స్వతంత్రంగా కొనుగోలు, అమ్మకాలలో పాల్గొంటారో అటువంటిదిగా చెప్పబడే మార్కెట్ వ్యవస్థలో, వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీలు సమాన విలువుల మధ్య మారకంగా జరుగుతున్నప్పుడు పెట్టుబడిదారులకు లాభాలు రావడం ఒక సార్వత్రిక సూత్రంగా ఎలా ఉండగలదని డేవిడ్ హార్వే ప్రశ్నిస్తాడు. తన ప్రశ్నకు తానే సమాధానం చెప్తూ 'దీనికి పరిష్కారం ఒక్కటే. అదేమంటే ఈ వ్యవస్థలో ఏదో ఒక సరుకు తన విలువ కంటే అదనపు విలువను సృష్టించాలి. అదే శ్రమ శక్తి. శ్రమ శక్తి ఎప్పుడైతే ఒక సరుకుగా చేయబడిందో అనంతరం అది ఉత్పత్తి చేసిన అదనపు విలువ శ్రమ శక్తి కొనుగోలు చేసిన పెట్టుబడిదారునికి చెందడంవలన పెట్టుబడికి లాభాలు వస్తాయి. శ్రమ శక్తి ఒక సరుకుగా మార్చబడకుండా పెట్టుబడిదారుడు దానిని కొనుగోలు చేసి స్వాధీనం చేసుకోకుండా, శ్రమ శక్తి తన విలువ కంటే ఎక్కువ ఉత్పత్తి చేయకుండా, 'అంటే అదనపు విలువ ఉత్పత్తి చేయకుండా, పెట్టుబడిదారులకు సార్వత్రికంగా లాభాలు రావడం అనేది సాధ్యం కాదు. సమాన విలువల మధ్య లావాదేవీలు జరుగుతున్నట్లు కనిపిస్తున్న వ్యవస్థలో పెట్టుబడిదారుల వద్ద లాభాలు పోగుపడడడాన్ని ఎలా వివరించగలం. సమాన విలువుల మధ్య లావాదేవీలకు, లాభాలు పోగుపడడానికి మధ్య ఉన్న వైరుధ్యాన్ని, పరిష్కరించడానికి సాధ్యం కానట్లు కనిపించే ఈ వైరుధ్యానికి, ఈ వ్యవస్థలో శ్రమ శక్తి సరుకుగా మార్చబడుతుందని గుర్తించడమే పరిష్కారం' అంటాడు. ఈ వ్యవస్థలో కార్మికులు ఏ స్థితిలో ఉంచబడతారంటే వారు తమ శ్రమతో తమ పరాధీనతను తిరిగి ఉత్పత్తి చేయగలగడం మాత్రమే చేయగలిగే పరిస్థితిలో ఉంచబడతారంటాడు.

డేవిడ్ హార్వే: 'కార్మికుల, పెట్టుబడిదారుల మధ్య ఒక కాంట్రాక్టు సంబంధం ఉంటుంది. ఇతర ఆర్థిక కాంట్రాక్టుల వలే ఈ కాంట్రాక్టులో వచ్చే వైరుధ్యాలు పరిష్కారం కూడా రాజ్యం మధ్యవర్తిత్వంపై ఆధారపడుతుంది. పెట్టుబడి కార్మికుల వేతనాలను తగ్గించడానికి ప్రయత్నిస్తుంది. కార్మికులు తమ వేతనాలు పెంచుకోవడానికి ప్రయత్నిస్తారు. ఇద్దరికీ తమతమ ప్రయత్నాలు లేదా పోరాటాలు చేసుకోవడానికి హక్కు ఉంటుంది. అయితే మార్క్స్ చెప్పినట్లు సమాన హక్కుల మధ్య బలమే నిర్ణయాత్మకమైనది అవుతుంది.' అంటాడు. కార్మికుని పనిదినాన్ని అవసర శ్రమ, అదనపు శ్రమగా మార్క్స్ విభజించిన విషయం, కార్మికుని పునరుత్పత్తి చేసేది అవసర శ్రమ, లాభాలు సృష్టించేది అదనపు శ్రమ

అనే విషయం మనకు తెలుసు. సాధారణ పరిస్థితులలో సరాసరిమీద కార్మికుల వేతనం అవసరపు శ్రమకు సమానంగా ఉంటుంది. అంటే కార్మికుని వేతనం సరాసరిమీద కార్మికుని కుటుంబం కనీస తిండితీర్థాలకు అవసరమైనంత పరిమాణంలో ఉంటుంది. అప్పుడు మాత్రమే కార్మికుడు మరుసటి రోజు వచ్చి పనిచేయగలడు గదా? అయినా పెట్టుబడిదారులు కనీస వేతనం కంటే తక్కువ చెల్లించడానికి ప్రయత్నిస్తారు. కాగా కార్మికులు అదనపు శ్రమ కూడా వారిదే కాబట్టి అందులో కొంత భాగాన్నైనా పొందడానికి ప్రయత్నిస్తారు. సంఘటిత రంగాలలో కార్మికులు తమ సంఘటిత పోరాటాల ద్వారా అదనపు శ్రమలో కొంత భాగాన్ని పొంది తమపై జరుగుతున్న దోపిడీని పరిమితులలో ఉంచుకుంటారు. కాగా, అసంఘటిత రంగాలలో కార్మికులు సంఘటిత పడే అవకాశాలు తక్కువ ఉన్నందున పోరాటాలు బలహీనంగా ఉండి కనీస వేతనాలను కూడా పొందలేక పోతారు. ఏదేమైనా వేతనాలు అవసర శ్రమకు అటు ఇటుగా చలిస్తాయి. ఈ ట్రేడ్ యూనియన్ పోరాటాలలో రాజ్యం తన బలాన్ని అత్యధిక సందర్భాలలో పెట్టుబడివైపు ఉపయోగించడం తెలిసిందే. తరువాత పేరాలలో హార్వే ప్రత్యేక ప్రతిపాదనలు కనిపిస్తాయి.

లాభాలు కుంచించకుపోవడం అనే పరిస్థితి పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రధాన సంక్షోభంగా ముందుకు వచ్చిందని సిద్ధాంతం చేయబడిన సందర్భాలున్న విషయాన్ని డేవిడ్ హార్వే గుర్తుచేస్తాడు. లాభాలు కుంచించుకు పోడవం అంటే ఏమిటి? ముందు పేరాలలో మనం సంఘటిత కార్మిక వర్గం తన పోరాటాల ద్వారా అవసర శ్రమ సృష్టించిన విలువలనే గాక వారికి న్యాయబద్ధంగా చెందవలసిన కాని సాధారణంగా పెట్టుబడిదారులకు లాభాలుగా జమపడే అదనపు శ్రమ సృష్టించిన విలువలలో కొంత భాగాన్ని పొందగలుగుతున్న విషయాన్ని గమనించాము. 1960. 70 లలో నార్త్ అమెరికా, ఐరోపా, దేశాలలో కార్మికుల పోరాటాలు బాగా అభివృద్ధిచెంది కార్మికుల జీతాలు మెరుగు పడ్డాయి, పెట్టుబడిదారుల లాభాలు బాగా తగ్గాయి. దీనినే లాభాల సంక్షోభం అన్నారు. దీనినే డేవిడ్ హార్వే పైన ఉదహరించాడు. లాభాలు తగ్గడం పెటుటబడిదారీ వర్గానికి సమస్యే. కాని, ఇది వ్యవస్థ మొత్తానికి ఏవిధంగా సంక్షోభం అవుతుంది? ఆ విషయాన్ని కొద్దిగా పరిశీలిద్దాం. పెట్టుబడిదారులకు ఒక అభివృద్ధి చెందిన దేశంలో లాభాలు తగ్గితే వారు తమ పెట్టుబడిని వేరే దేశాలకు తరలిస్తారు. అప్పుడు సదరు అభివృద్ధి చెందిన దేశంలో పరిశ్రమలు మూత పడతాయి. కార్మికులు నిరుద్యోగులు అవుతారు. నిరుద్యోగం పెరిగితే కార్మికుల పోరాటాలు తగ్గుముఖం పడతాయి. ఇది ఆ దేశంలో కార్మికుల జీతాలు తగ్గడానికి పెట్టబడిదారుల లాభాలు పెరగడానికి దారి తీస్తుంది. అంటే 'సాధారణ' పరిస్థితులు ఏర్పడతాయి. అయితే పెట్టుబడిని ఇతర దేశాలకు ఎగుమతి చేయడం ప్రతి సందర్భంలోనూ సాధ్యం కాదు. అప్పుడు పెట్టుబడి ఎత్తులు సాగవు. అటువంటి సందర్భంలో పెట్టుబడికి లాభాలు తక్కువ స్థాయిలోనే కొనసాగుతాయి. లాభాలు తగ్గినప్పుడు పెట్టుబడి సమీకరణ స్థాయి తక్కువుగా ఉంటుంది. అంటే కొత్త పరిశ్రమల స్థాపనకు తగినంత పెట్టుబడి అందుబాటులో ఉండదు. అంతేకాదు, ఉన్న పరిమిత పెట్టుబడితో కూడా ఫ్యాక్టరీలు లేదా ఉత్పత్తి కేంద్రాలు పెట్టడానికి వారు ముందుకు రారు. ఎందుకంటే కొత్త ఫ్యాక్టరీలు లేదా ఉత్పత్తి కేంద్రాలు వస్తే కార్మికులకు డిమాండు పెరుగుతంది వారి వేతనాలు మరల పెంచవలసి వస్తుంది. అది లాభాల పెరుగుదలకు మరింత సమస్య అవుతుంది. ఇటువంటి సందర్భంలో అంటే పెట్టుబడులు ఎగుమతి చేయలేని సందర్భంలో పరిశ్రమల ఆధునికీకరణ ఒక మార్గం. అంటే ఫ్యాక్టరీల సంఖ్యను పెంచకుండా పరిశ్రమలను ఆధునీకీకరించడం. కార్మికులను తగ్గించే ఆటోమేటిక్ యంత్రాలను దించడం. దీనినే ఆర్గానిక్ కాంపోజిషన్ ఆఫ్ క్యాపిటల్ పెంచడం అంటారు. ఇది ఒక పెట్టుబడిదారుడు చేస్తే ఆ పెట్టుబడిదారునికి లాభం వస్తుంది. అయితే ఒక దేశంలో పెట్టుబడిదారులందరూ ఉన్నత సాంకేతికత వైపు కదిలితే అ) ఆర్గానిక్ కాంపోజిషన్ ఆఫ్ క్యాపిటల్ నిష్పత్తి పెరగడం వలన లాభం రేటు తగ్గుతుంది. ఆ) నిరుద్యోగం పెరుగుతుంది. ఫలితంగా పోరాటాలు తగ్గి వేతానాలు తగ్గి లాభాలు పెరుగుతాయి. ఇ) ఒక వైపు కార్మికులు తగ్గడం వారి వేతనాలు తగ్గడం మొత్తం 'పై కార్మిక వర్గ కొనుగోలు శక్తి తగ్గడం; రెండవ వైపు ఆధునికీకరణతో ఉత్పత్తి పెరగడం వలన దేశంలో సరుకులు అమ్ముడుపోని పరిస్థితి ఏర్పడుతుంది. 'సరుకుల మిగులు పరిస్థితి ఏర్పడుతుంది'. ఆ పరిస్థితులలో సరుకులను ఎగుమతి చేయవలసి ఉంటుంది. అంటే పెట్టుబడినైనా ఎగుమతి చేయాలి లేదా సరుకులనైనా ఎగుమతి చేయాలి. రెండూ సాధ్యం కాని పరిస్థితులలో మిలటరీ ఉత్పత్తులను పెంచి వివిధ దేశాల మధ్య యుద్ధాలను సృష్టించి ఆయా దేశాలకు ఆయుధాలు అమ్ముకోవడం పెట్టుబడికి పరిష్కారంగా కనిపిస్తుంది. ఈ దశలో నాగరికత నిర్మాణం కాక నాగరికత విధ్వంసం పెట్టుబడిదారీ లక్షణంగా ఉంటుందన్న మాట. 1980 దశకంలో (1980-88) అమెరికా పెట్టుబడి ఇదే పరిష్కారాన్ని చూసుకుంది. ఇరాన్, ఇరాక్ దేశాల మధ్య యుద్ధం పెట్టి ఇద్దరికీ ఆయుధాలు అమ్ముకుంది. సందర్భవశాత్తూ మనం ఈ విషయాలను చర్చించాం. డేవిడ్ హార్వే ఈ విషయాలనన్నింటిని ఇక్కడ చర్చించలేదు. కార్మిక వర్గ పోరాటాలు పెరిగినప్పుడు జీతాలు పెరిగినప్పుడు లాభాల సంక్షోభం వస్తుందని మాత్రమే చెప్పాడు. 1960లలో 70లలో ఆ విధంగా జరిగిన విషయాన్ని సోదాహరణంగా చూపించాడు. అలాగే బలాబలాలో పెట్టుబడిది పైచేయి అయినప్పుడు కార్మికుల వేతనాలు బాగా తగ్గిస్తే వారి కొనుగోలు శక్తి తగ్గి సరుకుల అమ్ముడు పోని వైరుధ్యం 'మార్కెట్ సంక్షోభం' వస్తుందని చెప్పాడు. అయితే డేవిడ్ హార్వే ప్రధానంగా ఈ విషయాలపై దృష్టి పెట్టలేదు. ఈ అధ్యాయంలో హార్వే పెట్టుబడి, శ్రమ వైరుధ్యాన్ని మిగిలిన వైరుధ్యాలనుంచి వేరుగా చూడలేమని వేరుగా అవగాహన చేసుకోలేమని చెప్పడానికి ప్రయత్నిస్తాడు. ఇది ప్రధానమైన వైరుధ్యం అని అంగీకరిస్తూనే ఈ వైరుధ్యమే సర్వస్వం కాదని అంటాడు. తదుపరి విషయాలను పరిశీలిద్దాం.

డేవిడ్ హార్వే మాటలలో చెప్పాలంటే 'పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభాన్ని అంశాల వారిగా 'విభాగాలుగా' పరిశీలించినప్పుడుగాని, రాజకీయంగా దాని చిట్టచివర విశ్లేషణ చేసినప్పుడుగాని 'పెట్టబడి, శ్రమ' అనే వైరుధ్యం ఒంటరిగా మిగతా వాటికి అతీతంగా 'సంతృప్తికరమైన' వివరణగా నిలబడదు' అంటాడు. సరళంగా చెప్పాలంటే డేవిడ్ హార్వే పెట్టుబడి, శ్రమల మధ్య వైరుధ్యం అనే ఒకే ఒక్క దానిపై ఆధారపడి పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభాన్ని వివరించలేమంటాడు. పెట్టుబడి - శ్రమ వైరుధ్యం ప్రాథమికమైనదని, మిగిలిన వైరుధ్యాలన్నీ దానినుండి పుట్టినవే లేదా అన్నింటికీ అదే ఆధారం అనే భావనను హార్వే వ్యతిరేకిస్తున్నట్లు కనిపిస్తున్నది. డేవిడ్ హార్వేతో అంగీకరించడం లేదా విభేదించడం అనే విషయాన్ని అలా ఉంచి తను చేసిన ప్రతిపాదనల

పరిశీలనను కొనసాగిద్దాం. శ్రమ పరాయీకరణను పరిష్కరించడం అవసరమైనదే అయినా ఇతర వైరుధ్యాలను (ధనానికి సామాజిక సంపదను స్వంతంచేసుకునే శక్తి ఉండడం, ధనం ఒక చోట పోగుపడడం వంటి వైరుధ్యాలను) పరిష్కరిచకుండా పెట్టుబడి – శ్రమ వైరుధ్యాన్ని పరిష్కరించలేం అంటాడు. డేవిడ్ హార్వే ఈ విషయాన్ని నొక్కి చెప్పడానికి ఒక కారణం ఉంది. కార్మికుల సహకార సంఘాలు, స్వీయ నిర్వహణా పద్ధతులు, కార్మికులచే నియంత్రణ, ఈ మధ్య కాలంలో ముందుకు వచ్చిన సంఘీభావ ఆర్థిక వ్యవస్థలు వంటి పెట్టుబడిదారీయేతర ప్రత్యామ్నాయాలు పెట్టుబడి, శ్రమ వైరుధ్యాన్ని పరిష్కరించగలుగుతాయనే భ్రమలను, అటువంటి ప్రయత్నాలను డేవిడ్ హార్వే విమర్శిస్తున్నాడు. అటువంటి చిట్కాలతో సమస్య పరిష్కారం కాదని చెప్తున్నాడు. రాజ్యం ఉత్పత్తి సాధనాలను జాతీయం చేయడం, కేంద్రీకృత ప్లానింగు వంటి విధానాలు కూడా అదేవిధంగా సమస్యాత్మకంగా తయారయినాయని ఈ చర్యలు ఊహాజనిత పరిష్కారాలవైపు ప్రక్కమార్గం పట్టిస్తున్నాయని డేవిడ్ హార్వే చెప్తాడు. పైన చెప్పిన పెట్టుబడిదారీయేతర ప్రత్యామ్నాయాల లక్ష్యాలు మారకపు విలువను సృష్టించడమే. అయితే, ఈ ప్రయత్నాలు ధనానికి సామాజిక విలువను (సరుకులను) స్వాయత్తం (స్వంతం) చేసుకునే శక్తిని తొలగించలేకపోతే అంటే ఉపయోగపు, మారకపు విలువల వైరుధ్యాన్ని అలాగే మారకపు విలువ – డబ్బు మధ్య వైరుధ్యాన్ని పరిష్కరించకుండా వాటిని అలాగే కొనసాగిస్తే పరిష్కరించామను కుంటున్న పెట్టుబడి – శ్రమ అనే వైరుధ్యం తిరిగి తలెత్తుతుందని ఈ వైరుధ్యాలన్నీ పరస్పరం పునరుద్ధరించుకోగలుగుతాయని అంటాడు. డేవిడ్ హార్వే చేసిన ఈ హెచ్చరిక సరియైనదే. అయితే సోవియట్ యూనియన్‌లో డబ్బు, మారకపు విలువలు అమలులో ఉన్నా, స్టాలిన్ యుగం అని చెప్పబడే కాలంలో, వాటి ప్రాధాన్యత తగ్గించబడుతూ రావడం గమనిస్తాము. అయితే స్టాలిన్ తన 'యు.యస్.యస్.ఆర్‌లో సోషలిజం ఆర్థిక సమస్యలు' అన్న వ్యాసం (1952)లో 'రైతులకు అవసరమైనదంతా రాజ్యం ఇవ్వలేని నేటి స్థితిలో రైతులు తాము పండించినదంతా రాజ్యానికి ఇవ్వడానికి సిద్ధంగా ఉండరని, రాజ్యం రైతులతో కొనుగోలు అమ్మకాల వ్యవహారం చేయక తప్పదని, వారిపై సామాజికీకరణను రుద్దలేమని' సరిగానే వివరించాడు. ఇక్కడ మనం గుర్తించవలసిన విషయం ఏమంటే కార్మికుల పరాయీకరణ చాలా వరకు తగ్గిన నాటి సోవియట్ పరిస్థితులలో కూడా (యుద్ధకాలంలో బలపడిన బ్యూరాక్రసీ వలన కార్మికుల పరాయీకరణ మరల పెరిగిన మాట వాస్తవమే) డబ్బును, ప్రధానంగా మారకపు విలువను రద్దుచేయడం కుదరలేదు. ఈ వైరుధ్యాలన్నీ ఒక్కసారే పరిష్కారం కావు. ఇందుకు దీర్ఘకాలం పడుతుంది. అయితే ఆ కాలమంతా కార్మిక వర్గ రాజ్యం నిలదొక్కుకోగలగాలి. సోవియట్ యూనియన్ కార్మికవర్గ రాజ్యం ఆవిధంగా నిలదొక్కుకోలేక పోవడమే విషాదం. డేవిడ్ హార్వే సోవియట్ యూనియన్‌ను ఒక రుణాత్మక ఉదాహరణగా కూడా పరిశీలించక పోవడం మనకు ఆశ్చర్యాన్ని కలిగించక మానదు.

మనం తిరిగి హార్వే వద్దకు వెళదాం. డేవిడ్ హార్వే తన విశ్లేషణను కొనసాగిస్తూ 'వామపక్ష ఉద్యమంలో లేబర్ మార్కెట్, ఉత్పత్తి స్థలాలను కేంద్ర బిందువులను చేసే, వాటికి అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చే ఒక ధోరణి కనిపిస్తున్నది, కాని, పెట్టుబడి, శ్రమ వైరుధ్యం చాలా సంక్లిష్టమైన భూతలంపై కూర్చుబడి ఉంటుంది. పెట్టుబడి, శ్రమల వైరుధ్యం మాత్రమే కాక దానికంటే ముఖ్యమైన మరికొన్ని వైరుధ్యాలు కనీసం అంతే ప్రధానమైన మరికొన్ని వైరుధ్యాలు వ్యవస్థలో ఉన్నాయని అంటాడు. పెట్టుబడి సర్క్యులేషన్‌లో ఉత్పత్తికి, ఉత్పత్తులను అమ్ముకోగలిగి వాటి విలువను పొందడానికి (రియలైజేషన్‌కు) మధ్య ఉన్న వైరుధ్యం వంటివి తక్కువ ప్రాధాన్యత కలవి కావంటాడు. పెట్టుబడి, శ్రమ వైరుధ్యంపై వామపక్ష శక్తులు ప్రధానంగా దృష్టిపెడతాయి. అయితే కష్టతరమైన పోరాటాల ద్వారా సాధించుకున్న వేతనానికి తిరిగి కన్నం పడుతున్న పరిస్థితిని తగినంతంగా పట్టించుకోవు అంటాడు. డేవిడ్ హార్వే కార్మికుడు ఫ్యాక్టరీ బయట కొనుగోలుదారునిగా తిరిగి దోపిడీకి గురికావడం గురించి ఇక్కడ వివరించాడు. వామపక్ష వాదులు ఫ్యాక్టరీలో దోపిడీకి వ్యతిరేకంగా పోరాడడానికి ఇచ్చే ప్రాధాన్యత ఫ్యాక్టరీ బయట జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా జరగవలసిన పోరాటాలకు ఇవ్వడం లేదని విమర్శిస్తాడు. కార్మికుడు తన వేతనం తీసుకుని బయటకు రాగానే ఇంటి యజమాని, వడ్డీవ్యాపారీతో పాటు దుకాణదారు తదితరులందరూ మరల దోపిడీ చేస్తారని మార్క్స్ వివరంగానే రాసాడు. ఇది కొత్త విషయం కాదు. ఇక కార్మికులను సంఘటితం చేయడం కంటే కొనుగోలు దారులను సంఘటితం చేయడం మరింత, సుమారు పోల్చలేనంత కష్టం అనే విషయం డేవిడ్ హార్వేకు తెలియదని అనుకోలేము. ఇక కొనుగోలుదారు లను సంఘటిత పరచడం కష్టమే అయినా పశ్చిమ దేశాలలో కొనుగోలుదారుల సంఘాలు కూడా ఉంటున్నాయి. కొన్ని సందర్భాలలో అవి బలంగా కూడా ఉంటున్నాయి. డేవిడ్ హార్వే చెప్పకముందే 'వ్యవస్థ సృష్టించిన ప్రతి అసంతృప్తిని ఉద్యమంగా మార్చాలని' లెనిన్ పిలుపిచ్చాడు. డేవిడ్ హార్వేతో అంతమేరకు అంగీకారమే. వాల్యూ ప్రొడక్షన్ వైరుధ్యం (పెట్టుబడి, శ్రమల వైరుధ్యం), రియలైజేషన్ వైరుధ్యం సమాన స్థాయి వైరుధ్యాలని డేవిడ్ హార్వే చేసిన ప్రతిపాదన మాత్రం చర్చనీయాంశమే. ఈ సందర్భంగా ఈనాడు ఉత్పత్తి రంగం కంటే వాణిజ్య రంగంలోనే ఎక్కువ లాభాలు వచ్చే పరిస్థితి ఉన్నా, అది రియలైజేషన్ వైరుధ్య పరిమాణం పెరుగుదలను మాత్రమే సూచిస్తుంది. అంతేగాని గుణాత్మకంగా రియలైజేషన్ వైరుధ్యం వాల్యూ ప్రొడక్షన్ వైరుధ్యంతో సమాన స్థాయిని పొందదు. సమాజం విప్లవాత్మక పునర్వ్యవస్థీకరణ విషయంలో పెట్టుబడి, శ్రమ వైరుధ్యమే అంటే వాల్యూ ప్రొడక్షన్ వైరుధ్యమే ప్రధాన పాత్ర పోషిస్తుందని గట్టిగా చెప్పవచ్చు. ఎందుకంటే కార్మికులు ఒక సైన్యంగా నిర్మితం అయ్యేది అక్కడే. అంతేకాదు, ఉత్పత్తి స్థానంలో దోపిడీ పరిష్కారమైతే, అంటే కార్మికులు చేసే ఉత్పత్తి విలువలు మొత్తం వారికి వేతనాలుగా వస్తే సరుకులు అమ్ముడుపోకుండా మిగిలిపోవడం అనే సమస్యనే రాదు. అంటే రియలైజేషన్ సమస్య దానికదే పరిష్కారం అవుతుంది.

గృహ సౌకర్యం ప్రైవేటు పరం కావడం వలన కార్మికులు ఫ్యాక్టరీ బయట ఎంత పెద్ద ఎత్తున దోపిడీకి గురవుతున్నదీ డేవిడ్ హార్వే వివరిస్తాడు. గృహాన్ని కొన్నప్పుడు బిల్డర్ తీసుకునే అదనపు లాభం, బ్యాంకు రుణానికి కట్టేవడ్డీ, ఇంటిపై భూమి, ఆస్తి పన్ను, అనేక సందర్భాలలో కన్సల్టేషన్, లీగల్ ఫీజులు కార్మికుడు ఒక కొనుగోలుదారు గా చెల్లించవలసి ఉంటుందని, ఆ పైన స్పెక్యులేటివ్ ధరలు చెల్లించవలసి వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని డేవిడ్ హార్వే వివరిస్తాడు. హౌసింగు సౌకర్యం ప్రైవేటీకరణ జరిగినందుననే కార్మికుడు ఇంతగా దోపిడీకి గురవుతున్నాడని, హౌసింగు ఒక పబ్లిక్ ప్రొవిజన్‌గా ఉన్నప్పుడు,

అంటే ప్రభుత్వం ఉచితంగా లేదా సబ్సిడీ ధరలకు ఇచ్చినప్పుడు ఇంత దోపిడీ లేదని, అయితే హౌసింగును ఒక పబ్లిక్ ప్రొవిజన్‌గా అంటే ప్రభుత్వం కల్పించే సౌకర్యంగా కొనసాగించడానికి అవసరమైన పోరాట ప్రాధాన్యతను వామపక్షం గుర్తించలేదని డేవిడ్ హార్వే రాస్తాడు. విద్య, వైద్యం, సామాజిక సేవలు, గృహ సౌకర్యం ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా కల్పించాలని డిమాండుచేస్తూ బలమైన ఉద్యమం జరగాలని, ఈ పోరాటాలు లేబర్ మార్కెట్‌లోనూ, అలాగే పని స్థలాలలోనూ జరిగే వర్గ పోరాటాలంత ప్రధానమైనవని అంటాడు.

జాతివాదం (నల్లజాతి, తెల్లజాతి అనే అర్థంలో), లింగ వివక్ష వంటి వాటితో పెట్టుబడి, శ్రమ వైరుధ్యం ముడిపడి ఉందన్న వాస్తవాన్ని గుర్తించకుండా ఈ 'పెట్టుబడి – శ్రమ' అన్న వైరుధ్యంపై చర్చ ముగించడం బుద్ధి తక్కువ పనిమాత్రమే కాదు, ఎత్తుగడల రీత్యా తెలివైన పనికూడా కాదని డేవిడ్ హార్వే అంటాడు. ఇక్కడ డేవిడ్ హార్వే జాతివాదం (రేసిజం), లింగ వివక్ష వంటివి పెట్టుబడిదారీ వ్యవస్థ లక్షణం అని అంటాడు. సాధారణంగా వీటిని మనం భూస్వామ్య వ్యవస్థ లక్షణాలని అయితే పెట్టుబడిదారీ వర్గం వీటిని వాడుకుంటుందని, ప్రజలను విభజించి పాలించడానికి ఉపయోగిస్తుందని భావిస్తాం. కాని ఈ అప్రజాస్వామిక లక్షణాలు పెట్టుబడి వ్యవస్థ లక్షణాలుగానే డేవిడ్ హార్వే పరిగణిస్తున్నాడు. ఇదే పుస్తకంలో డేవిడ్ హార్వే అసలు ప్రజాస్వామిక హక్కులు, ప్రజాస్వామ్యం ఏవీ కూడా పెట్టుబడిదారీ వ్యవస్థ సహజ లక్షణాలు కావని ప్రతిదేశంలో వాటిని ప్రజలు తమ పోరాటాలు ద్వారానే సాధించుకున్నారని రాసాడు. సోవియట్ రష్యాలో ఓటు హక్కు వచ్చిన తరువాతనే ఇంగ్లండులో (1918), అమెరికాలో (1920) మహిళలకు ఓటు హక్కు ఇవ్వబడిందన్న విషయాన్ని మనం ఇక్కడ గుర్తు తెచ్చుకోవడం మంచిది. 8 గంటల పనిదినానికి కూడా పశ్చిమ దేశాలలో విస్తృతమైన, తీవ్రమైన పోరాటాలు (హే మార్కెట్) చేయవలసి వచ్చిందని మనకు గుర్తుంటే డేవిడ్ హార్వే తో అంగీకరించడం పెద్ద సమస్య కాదు, ఈ దేశంలో (భారత దేశంలో) ప్రజాస్వామిక హక్కులులేవని, కాబట్టి ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ కాదని వాదించేవారు ఈ సందర్భంగా మరొక్కసారి వారి వాదనలను పున పరిశీలించుకోవాలి.

అయితే ప్రజాస్వామిక భావజాలానికి పెట్టుబడిదారీ వ్యవస్థకు ఉన్న సంబంధాన్ని పూర్తిగా కొట్టిపారేయలేం. పెట్టుబడి పుట్టకముందు ప్రజాస్వామిక భావజాలం పుట్టలేదని అలాగే, పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రజాస్వామిక హక్కులు పోరాటాల ద్వారా సాధించుకునే అవకాశం ఉందని మాత్రం చెప్పవచ్చు. ఇంకొక రకంగా పెట్టుబడిదారీ పూర్వ వర్గ వ్యవస్థలతో ప్రజాస్వామిక భావజాలం పొసగదని కూడా చెప్పవచ్చు. ఇంకా ప్రజాస్వామిక భావజాలం భూస్వామ్య విధానంలో సాధ్యం కాదని, అది ఆధునిక వ్యవస్థలలోనే సాధ్యమని చెప్పవచ్చు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రజాస్వామిక హక్కులు నామమాత్రంగానే ఉంటాయని, వాటిని వాస్తవీకరించగలిగేది కార్మికవర్గ రాజ్యమేనని లెనిన్ చెప్పాడు. ముక్తాయింపుగా చెప్పాలంటే, పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రజాస్వామ్యానికి సంబంధం లేదని చెప్పడం సరియైనదికాదు. అయితే అదే సందర్భంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఉంటే ప్రజాస్వామ్యం అనివార్యంగా ఉంటుందని చెప్పినా, పెట్టుబడిదారీ వ్యవస్థ అనంతర కాలంలో ప్రజాస్వామ్యం ఉండదని చెప్పినా అటువంటి వాదనలకు చరిత్రలో ఋజువులు లేవు. పూర్వ వర్గ వ్యవస్థలలో దోపిడీకి పెట్టుబడిదారీ దోపిడీకి ఉన్న ప్రధాన వ్యత్యాసం ఏమంటే గత కాలంలో దోపిడీ సామాజిక, రాజకీయ నిర్బంధాలను ఆసరాగా చేసుకుంటే పెట్టుబడి వ్యవస్థ ఒక రకంగా ఆర్థిక నిర్బంధాన్ని ఉపయోగిస్తున్నది. ఈ వ్యవస్థ శ్రామిక జనాన్ని సకల ఉత్పత్తి సాధనాలనుండి దూరంచేసి జీవిక సంపాదనకు పెట్టుబడికి ఊడిగం చేయడం తప్ప మార్గాంతరం లేకుండా చేసింది. ఈ వ్యవస్థలో శ్రామికునిపై సామాజిక నిర్బంధం ఒక విధానంగా కనిపించదు. అలాగే రాజకీయంగా అందరికీ ఓటు హక్కు, ఇతర హక్కులు సమానంగానే ఉన్నట్లుంటాయి. కాని ఆర్థిక రంగంలో ఉత్పత్తి సాధనాలన్నీ కొద్దిమంది చేతిలో పోగుపడడం వలన అత్యధికులు వేతన బానిసలుగా జీవించవలసి వస్తుంది. దీనినే మనం పెట్టుబడిదారీ వ్యవస్థ సామాజిక, రాజకీయ నిర్బంధాల స్థానంలో సూత్రప్రాయంగా (వాస్తవంగా కాదు) ఆర్థిక నిర్బంధం తీసుకువచ్చిందని చెప్పవచ్చు.

ఈ అధ్యాయంలో ప్రధానంగా 'పెట్టుబడి, శ్రమ మధ్య ఉన్న వైరుధ్యం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థలో అన్ని వైరుధ్యాలకు మూలమైన వైరుధ్యం' అన్న వాదనను డేవిడ్ హార్వే వ్యతిరేకిస్తాడు. పెట్టుబడి, శ్రమ వైరుధ్యం ప్రధానమైనదే అయినా అది రేస్, ఎత్నిసిటీ, లింగపరమైన, మతపరమైన వివక్షల ద్వారానే ప్రదర్శితమవుతుండడం వలన వాటితో ముడిపడి ఉండడం వలన పెట్టుబడిదారీ వ్యవస్థలో పోరాటం, పోరాట రాజకీయాలు మరింత సంక్లిష్టంగా ఉంటాయంటాడు. వర్గపోరాటాన్ని వివక్షలకు వ్యతిరేకంగా పోరాటాలను జమిలిగానే నిర్వహించవలసి ఉంటుందని రెండింటిని వేరువేరుగా చూడలేమని డేవిడ్ హార్వే భావంగా కనిపిస్తున్నది. వీటన్నింటిని చెప్పడం ద్వారా పెట్టుబడి, శ్రమవైరుధ్యం పాత్రను ఏవిధంగానూ తాను తగ్గించదలచుకోలేదని, మొత్తం వైరుధ్యాల సముదాయంలో ఇది అత్యంత ప్రాధాన్యతను కలిగి ఉందని, లేబర్ మార్కెట్ ద్వారా, పనిస్థలంలో కార్మికుని శరీరంపైన, కార్మికుని ద్వారా కార్మిక కుటుంబం పైన వారి జీవితావకాశాలపైన దాడి జరుగుతుందని డేవిడ్ హార్వే అంటాడు. పని స్థలంలో రాచి రంపాన పెట్టే పరిస్థితులు, కార్మిక కుటుంబంలో ఆకలి మొత్తంగా కనీస అవసరాలకు కూడా నోచుకోని పరిస్థితి కారణంగా పెట్టుబడి, శ్రమ వైరుధ్యం అన్ని సందర్భాలలో విప్లవ ఆవేశం విరుచుకు పడడానికి కేంద్రంగా ఉంటుందనడంలో సందేహం లేదంటాడు. 'అయితే, పెట్టుబడి, శ్రమ వైరుధ్యానికి అతీతమైన ప్రాధాన్యత ఇవ్వడం,పెట్టుబడి, శ్రమ వైరుధ్యం వ్యవస్థలో ఉన్న ఇతర వైరుధ్యాలనుంచి స్వయం ప్రతిపత్తి కలిగి, స్వతంత్రంగా ఉంటుందని, దానిని వేరుగా పరిష్కరిచవచ్చని భావించడం కూడదని అంటాడు. అటువంటి భావనే పెట్టుబడికి, పెట్టుబడిదారీ వ్యవస్థకు ఉండగల ప్రత్యామ్నాయానికై పూర్తి స్థాయిలో జరగవలసిన విప్లవాత్మక శోధనకు అడ్డంకిగా తయారవుతుంది అని డేవిడ్ హార్వే అంటాడు. ప్రభుత్వం విద్య, వైద్యం, సమాజిక సేవలు, గృహ వసతి వంటి వాటి నుంచి వెనక్కి వెళుతుందని, ఆవిధంగా మార్కెట్‌కు అవకాశాలు కల్పిస్తున్నదని ప్రభుత్వం ఉచితంగా అందించే సేవలుగా వీటిని కొనసాగించాలనే పోరాటాలు కూడా ప్రధానమైనవని, అలాగే, పెట్టుబడిదారీ వ్యవస్థ దానికదే ప్రజాస్వామిక హక్కులు ఇవ్వదని, ప్రజాస్వామిక హక్కుల సాధన, పరిరక్షణ అనేది ప్రజల పోరాటాల ద్వారానే సాధ్యమని డేవిడ్ హార్వే చెప్తాడు. కులం, మతం, లింగం వంటి వివక్షతలు పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్భాగమని పెట్టుబడి, శ్రమ వైరుధ్యంతో జమిలిగానే ఆ వైరుధ్యాలపై పోరాటాలు నిర్వహించాలని నొక్కిచెప్తాడు.

(ఇంకా ఉంది)

(రచయిత ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు) వీ

విద్య కాషాయీకరణను తిప్పికొట్టాలి

విద్య కాషాయీకరణను తిప్పికొట్టాలని, రాజ్యాంగ మౌలిక సూత్రాల మేరకు విద్యా విధానం ఉండాలని ఎంఎల్‌సి అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఆ దిశగా విద్యార్థులు ఉద్యమించాలన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో మూడు రోజుల పాటు జరుగుతున్న భారత విద్యార్థి సమాఖ్య (ఎస్‌ఎఫ్‌ఐ) 3వ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 2 నుంచి 4 వరకు జరిగాయి. 'ఆర్థిక అసమానతలతో కూడిన విద్య కాకుండా పేద, ధనికులందరికీ ఒక రకమైన విద్య కోసం ఎస్‌ఎఫ్‌ఐ ఉద్యమించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నీతి అయోగ్‌ను తన జేబు సంస్థగా మార్చుకుందన్నారు. ప్రస్తుత విద్యావిధానం భారత రాజ్యాంగ సూత్రాలను తుంగలో తొక్కే విధంగా ఉందన్నారు.

తెలంగాణలో ఎన్‌కౌంటర్‌లు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం రోళ్లగడ్డ, దేవళ్లగూడెం అటవీ ప్రాంతంలో న్యూడెమోక్రసీ రాయల వర్గం దళ కమాండర్ లింగన్న దళంపై గ్రేహౌండ్స్ పోలీసులు దాడిచేసి కాల్పులు జరుపడంతో ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగాయని పోలీసు అధికారులు తెలిపారు. ఇందులో లింగన్న మృతిచెందారని తెలిపారు. భద్రాద్రి జిల్లా మణుగూరు మండలం బుగ్గ పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఆగస్టు 21న మావోయిస్టులకు, పోలీసులకు మధ్య జరిగిన కాల్పుల్లో మావోయిస్టు వీరస్వామి మృతిచెందినట్లు మణుగూరు డిఎస్‌పి తెలిపారు. ఈ రెండు ఎన్‌కౌంటర్‌ల పై పౌరహక్కుల సంఘం నిజనిర్ధారణ చేసి వెల్లడించిన అంశాల ప్రకారం లింగన్నను గాయపరిచి అదుపులోకి తీసుకొని చంపివేశారని, వీరస్వామిని బదుగుల గ్రామం నుంచి తీసుకువచ్చి కాల్చిచంపారని తెలిపారు.

ఉపాధ్యాయుల ధర్నా

తమ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు ఆగస్టు 3న ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో మహా ధర్నా నిర్వహించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఆగస్టు 15లోగా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాలు ఐక్య ఉద్యమం నిర్మించడం ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్నాయన్నారు. కె.సి.ఆర్. ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కె.జి. టు పి.జి వరకు ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్యా విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చిన సి.ఎం. ఎందుకు అమలు చేయడం లేదన్నారు.

యురేనియం తవ్వకాలతో కాలుష్యం

యురేనియం తవ్వకాలతో ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని తెలుపుతూ ఎపి కాలుష్య నియంత్రణ మండలికి విశ్రాంత శాస్త్రవేత్తల బృందం ఆగస్టు 9న లేఖ రాసింది. కడప జిల్లా వేముల మండలం మబ్బుచింతలపల్లి, కెకె కోటాల, కనుములవారి పల్లిలో యురేనియం తవ్వకాలతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని వారు తెలిపింది. యురేనియం తవ్వకాలకు సోడియం కార్బోనేట్‌ను వినియోగిస్తూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని దీని ద్వారా భూగర్భ జలాలు కాలుష్యమవుతున్నాయని ఐఐసిటి రిటైర్డ్ శాస్త్రవేత్త కె. బాబురావు తెలిపారు. తవ్వకాలు జరిపే ప్రాంతాల్లో 2017లో కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ పర్యటించి యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించిందని తెలిపారు.

జమ్మూ కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు రాజ్యాంగ వ్యతిరేకం

జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న ఆర్టికల్ 370, అధికరణం 35 (ఎ) రద్దు అప్రజాస్వామిక చర్య అని ఆ చర్యను నిరసిస్తూ ఆగస్టు 7న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ చౌరస్తాలో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కశ్మీర్ సమస్యకు అధికరణ 370 రద్దు పరిష్కారమా? అనే అంశంపై మానవ హక్కుల వేదిక, పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా అమలాపురంలో ఆగస్టు 18న సభ నిర్వహించారు. ప్రభుత్వం ప్రచారం చేస్తున్నట్లు కశ్మీర్ సమస్య భారత్, పాకిస్థాన్ సరిహద్దు వివాదం కాదని, హిందూ, ముస్లిం మత సమస్య అంతకంటే కాదన్నారు. అది కశ్మీర్ ప్రజలు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే స్వయం ప్రతిపత్తి ఆకాంక్ష అని చెప్పారు. జమ్మూ కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు రాజ్యాంగ విరుద్ధమని మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు వి.ఎస్. కృష్ణ అన్నారు. భారత ప్రభుత్వం 370 అమలు చేయక పోవడం వల్లనే కశ్మీరీల సమస్య అపరిష్కృతంగా ఉండిపోయిందని, కశ్మీర్ జాతీయ ఉద్యమానికి ప్రజాస్వామిక వాదులు మద్దతుగా నిలవాలని అన్నారు.

గట్టికొప్పుల రాంరెడ్డి మృతి

తెలంగాణ సాయుధపోరాట యోధుడు గట్టికొప్పుల రాంరెడ్డి(87) ఇక లేరు. ఆయనకు గుండెపోటు రావడంతో ఎల్‌బి నగర్‌లోని కామినేని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ జూలై 30న మరణించారు. రాంరెడ్డి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం తడకమల్లలో జన్మించారు. సాయుధపోరాట యోధులైన భీంరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, మల్లు వెంకటనర్సింహారెడ్డి, నర్రా రాఘవరెడ్డితో కలిసి సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. పార్టీ అగ్రనాయకత్వానికి కొరియర్‌గా పనిచేశారాయన. ఎన్నోసార్లు రజాకార్లకు పట్టుబడి చావునుంచి తప్పించు కున్నారు. మిర్యాలగూడ డివిజన్ కార్యదర్శిగా చాలా కాలం పనిచేశారు. 36 ఏళ్లపాటు మొలకపట్నం సర్పంచ్‌గా పనిచేశారు.

జడ్చర్లలో సర్పంచ్‌ల నిర్బంధం

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఆగస్టు 2న పోలీసులు సర్పంచ్‌లు ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశం నిర్వహిస్తుండగా ఆ వేదిక ప్రధాన గేటుకు తాళం వేసి నిర్బంధించారు. వనపర్తి వెళుతున్న ముఖ్యమంత్రి కాన్వాయ్‌ని అడ్డుకుంటారన్న అనుమానంతో పోలీసులు ఈ చర్యకు దిగారు. ఉప సర్పంచ్‌లకు చెక్‌పవర్ ఇవ్వడంపై సర్పంచ్‌లు నిరసన వ్యక్తం చేస్తున్నారు. సి.ఎం. వెళ్లాక విడిచిపెట్టడంతో జాతీయ రహదారిపై రాస్తారోకో చేసేందుకు వెళ్తున్న సర్పంచ్‌లను పోలీసులు మళ్లీ అడ్డుకున్నారు. దాంతో అక్కడే ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. తమ హక్కుల సాధన కోసం నిర్వహించిన సమావేశాన్ని నిర్బంధించడం ఎంతవరకు సమంజసమని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాధాని భూమన్న యాదవ్ ప్రశ్నించారు. ఉమ్మడి చెక్ పవర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయితీల్లో వీధి దీపాలకు, మంచినీటి పథకాలకు, విద్యుత్తు ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని కోరారు.

సి.వి. కృష్ణారావు మృతి

కవి, రచయిత సి.వి. కృష్ణారావు(94) ఆగస్టు 12న మృతిచెందారు. 1926 జూలై 3న కృష్ణా జిల్లా జగ్గయ్యపేట తాలూకాలో జన్మించారు. 1943లో ఉస్మానియా యూనివర్సిటీ టెక్నికల్ కాలేజీలో డిప్లొమా, గుంటూరు హిందూ కాలేజీలో బికాం పూర్తిచేశారు. 1950లో సాంఘిక సంక్షేమ శాఖలో ఉద్యోగంలో చేరి, బి.సి. సంక్షేమ విభాగం సంచాలకుడిగా 1983లో పదవి విరమణ పొందారు. ఆయన గత 40 ఏళ్లుగా కాకినాడ, హైదరాబాద్‌లలో ప్రతినెలా చివరి ఆదివారం ఆయన నెల నెల వెన్నెల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా కవులెందరో స్ఫూర్తి పొందారు. ఐదు కవితా సంపుటాలకు సంపాదకులుగా వ్యవహరించారు. ఆయన రచించిన 'వైతరణి', 'మాదీ మీ ఊరే మహారాజకుమారా', 'అవిశ్రాంతం' కవితా సంకలనాలు వెలువరించారు. నిజాం కాలం నాటి పరిస్థితులను కృష్ణారావు 1948లోనే 'నోటీసు' పేరుతో తొలి కథ ఆ తరువాత 'తోడేలు జగతి', 'భిక్షువు', 'విద్యాబోధ' తదితర కథలు రాశారు. వీ

ఎన్ఎంసి బిల్లును వ్యతిరేకిస్తూ వైద్యుల నిరసన

భారత వైద్య మండలి (ఎంసిఐ) స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసి) బిల్లుపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు మేరకు దేశం నలుమూలల నుంచి వచ్చిన 5 వేలకు పైగా వైద్యులు, వైద్య విద్యార్థులు, వృత్తి నిపుణులు జూలై 29న ఢిల్లీలో నిరసన తెలిపారు. ఎయిమ్స్ నుంచి నిర్మాణ్ భవన్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎన్ఎంసి బిల్లు-2019 పేదలకు, విద్యార్థులకు వ్యతిరేకమని ఐఎంఏ ఆరోపించింది. కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లులో తాము కోరిన మార్పులు చేయలేదని విమర్శించింది. కొత్త బిల్లుతో ప్రభుత్వ సీట్లతో పాటు ప్రైవేట్ కాలేజీల్లోని 50 శాతం సీట్లు ఇడబ్ల్యుఎస్‌లోని ప్రతిభావంతులకు దక్కుతాయన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్‌లు

మహారాష్ట్ర సరిహద్దుల్లోని రాజనందగాం జిల్లా షెర్పర్ సీతాగోటా అటవీ ప్రాంతంలో ఆగస్టు 3న కూంబింగ్ నిర్వహిస్తున్న బలగాలకు మావోయిస్టులు తారసపడడంతో ఇరుపక్షాల మధ్య ఎదురు కాల్పులు జరిగాయని పోలీసు అధికారులు తెలిపారు. ఘటనా స్థలంలో ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలను భద్రతాదళాలు స్వాధీనం చేసుకున్నాయని తెలిపారు. ఈ ఘటనలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన డిస్ట్రిక్ రిజర్వు గ్రూప్, సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ సంయుక్తంగా పాల్గొన్నాయన్నారు. నారాయణ్‌పూర్ జిల్లా దూర్‌బేడ్ అటవీ ప్రాంతంలో ఆగస్టు 24న భద్రతా బలగాలకు మావోయిస్టులకు జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందగా అందులో నలుగురు పురుషులు, ఒకరు మహిళా మావోయిస్టు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

జమ్మూ కశ్మీర్ రాష్ట్ర ప్రత్యేక ప్రతిపత్తి రద్దు

జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న ఆర్టికల్ 370, అధికరణం 35 (ఎ)లను కేంద్రం రద్దుచేసి జమ్మూ కశ్మీర్, లద్దాక్ కేంద్ర పాలిత ప్రాంతాల ఏర్పాటుకు పార్లమెంట్ ఆమోదించింది. వీటికి సంబంధించిన బిల్లులను ఆగస్టు 5, రాజ్యసభ ఆమోదం తెలుపగా ఆగస్టు 6న లోక్‌సభ ఆమోదించింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రెండు తీర్మానాలను, జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. భాగస్వామ్య పక్షాలను సంప్రదించకుండా ఏకపక్షంగా ఎలా కేంద్రం నిర్ణయం తీసుకుంటుందని విపక్షాలు ప్రశ్నించాయి. చర్చ అనంతరం ఓటింగ్ నిర్వహించారు. జమ్మూ కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసే బిల్లుకు అనుకూలంగా 351 ఓట్లు రాగా వ్యతిరేకంగా 72 మంది ఓటు వేశారు. ఒకరు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఆ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లుకు అనుకూలంగా 370 మంది ఓటు వేయగా... వ్యతిరేకంగా 70 మంది ఓటు వేశారు. దీంతో రెండు బిల్లులు రెండు సభల్లోనూ అమోదం పొందాయి.

కశ్మీర్ స్వయం ప్రతిపత్తి రద్దుకు వ్యతిరేకంగా నిరసనలు

కశ్మీరీలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్న అధికరణం 370 రద్దు చేయడాన్ని నిరసిస్తూ వామపక్షాలు ఆగస్టు 7న ఢిల్లీలోని మండీహౌస్ నుంచి పార్లమెంట్ స్ట్రీట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సిపిఎం, సిపిఐ నేతలు, విద్యావేత్తలు, డాక్టర్లు, విద్యార్థులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు. భాగస్వాములతో చర్చలు జరుపకుండా జమ్మూ కశ్మీర్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోబోమని మూడేళ్ల క్రితం మోదీ సర్కార్ హామీ ఇచ్చిందని, ఇప్పుడు వారిని జైలుపాలు చేసి, మిగతా ప్రపంచం నుంచి వేరుచేసి నిర్ణయం తీసుకుందని విమర్శించారు. ఇది సమాఖ్య స్ఫూర్తికి విఘాతమన్నారు.

మూకదాడి కేసులో నిందితులంతా నిర్దోషులే

రాజస్థాన్‌లోని పాడి రైతు పెహ్లూఖాన్ హత్యకేసులో నిందితులు ఆరుగురినీ జిల్లా కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. రాజస్థాన్‌లోని అలవర్ అదనపు జిల్లా జడ్జి సరితా స్వామి ఆగస్టు 14న తీర్పు వెల్లడించారు. పెహ్లూఖాన్ జైపూర్‌లోని పశువుల సంతలో ఆవులను కొనుగోలు చేసి స్వస్థలానికి తిరిగి వెలుతుండగా గోవులను అక్రమంగా తరలిస్తున్నాడన్న అనుమానంపై 2017 ఏప్రిల్ 1న అలవర్ జిల్లాలోని బెహ్రోర్ వద్ద నడిరోడ్డుపై పెహ్లూఖాన్ పై కొంతమంది మూకదాడిచేసి చంపారు. ఈ ఘటన అంతా రికార్డయిన వీడియోని ప్రాసిక్యూషన్ ముందు ప్రవేశపెట్టినా దాన్ని సాక్ష్యంగా స్వీకరించడానికి జడ్జి నిరాకరించారు. 'సంశయ లబ్ధి' కింద నిందితులందరినీ జడ్జి నిర్దోషులుగా ప్రకటించారు.

ఏడు రాష్ట్రాల్లో వరద బీభత్సం

కేరళ, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ఆగస్టు 16 వరకు కురిసిన వర్షాల వరదల్లో మరణించిన వారి సంఖ్య 311కి చేరింది. ఒక్క కేరళలోనే 111 మంది మరణించారు. మరో 58 మంది జాడ తెలియలేదు. మధ్యప్రదేశ్‌లో 70 మంది మరణించగా, మహారాష్ట్రలో మృతుల సంఖ్య 54 కు, రాజస్థాన్‌లో 5, ఆంధ్రప్రదేశ్‌లో ఒకరు, కర్ణాటకలో 40, గుజరాత్‌లలో 31కి చేరింది. కేరళ రాష్ట్ర వ్యాప్తంగా 2.27 లక్షల మందికి పైగా వరద బాధితులను 1551 సహాయక శిబిరాలకు తరలించి ఆశ్రయం కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. వరదల కారణంగా పెద్ద ఎత్తున పంట నష్టం జరిగింది. మహారాష్ట్రలో వరదల కారణంగా ఆగస్టు 11న 10 రైళ్ల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు.

ఢిల్లీలో దళితుల నిరసన

ఢిల్లీలోని రవిదాస్ మందిరం కూల్చివేతకు నిరసనగా దళితులు ఆగస్టు 21న తుగ్లకాబాద్‌లో నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ జరిగింది. నిరసనకారులపై పోలీసులు లాఠీచార్చిచేసి, బాష్పవాయువు ప్రయోగించారు. పోలీసు వాహనాన్ని నిరసనకారులు ధ్వంసం చేశారని, మరో రెండు మోటారు సైకిళ్లకు నిప్పంటించారని పోలీసు అధికారులు తెలిపారు. పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో నీలి టోపీలు పెట్టుకున్న వేలాది మంది దళితులు ఊరేగింపుగా రాంలీలా మైదాన్‌కు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. 15 శతాబ్దానికి చెందిన రవిదాస్ ఆలయాన్ని కూల్చివేసిన చోటే నిర్మించాలని వారు డిమాండ్ చేశారు.

శ్రీనగర్‌లో కొనసాగుతున్న నిరసనలు

జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్ సౌరా ప్రాంతంలో ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ ఆగస్టు 16న వేలాది మంది రోడ్లపైకి వచ్చి ఆందోళన వ్యక్తం చేశారు. సౌరా నుంచి శ్రీనగర్ పట్టణ ప్రధాన రహదారిపైకి ప్రదర్శనగా వచ్చారు. వీరిని భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. ఆందోళనకారులు రాళ్లు విసిరారు. పోలీసులు లాఠాచార్జి చేశారు. బాష్పవాయుగోళాలను ప్రయోగించారు. కశ్మీర్‌లోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇటువంటి నిరసనలు కొనసాగుతున్నాయి. కశ్మీర్‌లోని అన్ని జిల్లాల్లో 144 సెక్షన్ అమలుచేస్తున్నారు. టెలిఫోన్, ఇంటర్‌నెట్ సేవలను రద్దు చేశారు.

మాజీ మంత్రి చిదంబరం అరెస్ట్

కేంద్ర మాజీ మంత్రి చిదంబరంను సిబిఐ అధికారులు ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ఆగస్టు 21న అరెస్టు చేశారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ఢిల్లీ హైకోర్టు బెయిల్ తిరస్కరించిన తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిన ఆయన తనపై సిబిఐ, ఇడికి చెందిన కేసులు లేవని తెలిపారు. తర్వాత చిదంబరం ఇంట్లో ఉన్నారన్న సమాచారంతో సిబిఐ అధికారులు ఆయన ఇంటి గోడ దూకి లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో ఆయన వ్యక్తిగత అనుచరులకు, అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం చిదంబరాన్ని అదుపులోకి తీసుకొని విచారణ నిమిత్తం సిబిఐ హెడ్ క్వార్టర్స్‌కు తరలించారు. వీ

హాంకాంగ్‌లో కొనసాగుతున్న ఆందోళనలు

నేరారోపణలు ఎదుర్కొంటున్న పౌరులను చైనాకు తరలించాలనే క్యారీ లామ్ బిల్లుకు వ్యతిరేకంగా హాంకాంగ్‌లో గత రెండు నెలల నుంచి ప్రజలు తీవ్ర ఆందోళనలు చేస్తున్నారు. ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ బిల్లును తాత్కాలికంగా వాయిదా వేశారు. నిషేధిత ఇండిపెండెన్స్ పార్టీ బిల్లును పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తోంది. ఆగస్ట్ 1న ఇండిపెండెన్స్ పార్టీ అధ్యక్షుడు ఆండీ ఛాన్‌నేను భద్రతా బలగాలు అరెస్టు చేశాయి. నిరసన కార్యక్రమాలకు హాంగ్‌కాంగ్ ప్రభుత్వోద్యోగులు, లాయర్లు సంఘీభావం తెలిపారు. ఆగస్టు 2 నుంచి విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు.

హోండురస్‌లో నిరసనలు

హోండురస్‌లో అధ్యక్షుడు జువాన్ ఓర్లాండోకు వ్యతిరేకంగా ప్రజలు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించడమే కాకుండా నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఓర్లాండో తక్షణమే రాజీనామా చేయాలని నినదిస్తూ ఆగస్ట్ 7న హోండురస్ నగర వీధుల్లో భారీ ర్యాలీలు తీశారు. నిరసనకారులను నిలువరించేందుకు పోలీసులు కాల్పులు జరిపారు. ఓర్లాండోకు డ్రగ్స్ మాఫియా, అక్రమ ఫైనాన్స్ కంపెనీలతో సంబంధాలున్నాయని, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా విచ్చలవిడిగా జరుగుతోందని నిరసనకారులు ఆరోపించారు. యువత పెడదారిన పడుతోందనీ, దేశ ఆర్థిక వ్యవస్థ పతనావస్థకు చేరుతోందనీ, అధ్యక్షుడు వెంటనే రాజీనామా చేయాలనీ నిరసనకారులు డిమాండ్ చేశారు.

అఫ్ఘనిస్తాన్‌లో చర్చలు - దాడులు

అఫ్ఘనిస్తాన్‌లో ఒకవైపు తాలిబన్ ప్రతినిధులకు, అధికారులకు మధ్య దోహాలో శాంతి చర్చలు జరుగుతుండగా మరోవైపు దేశంలో ఆత్మాహుతి దాడులతో రాజధాని కాబూల్ భీతిల్లిపోతోంది. రాజధాని కాబూల్‌లో ఆగస్ట్ 7న ఆత్మాహుతి దాడి జరిగింది. కాబూల్‌లోని ఓ పోలీస్ స్టేషన్‌ను లక్ష్యంగా చేసుకొని ఈ దాడి జరిగింది. దాడిలో ఇరవై మంది మృతి చెందగా, వందలాది మంది గాయపడ్డారు. ఆగస్ట్ 18న కాబూల్‌లో ఓ పెండ్లి మండపాన్ని లక్ష్యంగా చేసుకొని ఐఎస్ ఆత్మాహుతి దాడి జరిపింది. ఈ దాడిలో అరవై మందికి పైగా చనిపోయారు. రెండు వందల మందికి పైగా గాయపడ్డారు. చనిపోయిన వారిలో మహిళలు, చిన్నపిల్లలు అధిక సంఖ్యలో ఉన్నారని, ఈ ఏడాది జరిగిన దాడుల్లో ఇదే అతి పెద్దదని అధికారులు తెలిపారు. అఫ్ఘనిస్తాన్ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. అయితే వరుస దాడులు, వందల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోయిన తరుణంలో ప్రభుత్వం శతాబ్ది ఉత్సవాలను రద్దుచేసింది.

వెనిజులాలో ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసనలు

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వెనిజులాపై విధించిన ఆర్థిక, ద్రవ్య, వాణిజ్య ఆంక్షలకు వ్యతిరేకంగా ఆగస్ట్ 10న వెనిజులా పౌరులు ప్రపంచ నిరసన దినం పాటించారు. అమెరికా ఆంక్షలకు వ్యతిరేకంగా నిరసనలో పాల్గొనాలని అధ్యక్షుడు మదురో ఇచ్చిన పిలుపుతో రాజధాని కారకస్‌తో పాటు దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, ప్రభుత్వ అధికారులు, పోలీసులు, సైనిక సిబ్బంది అంతా ఈ నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. రాజధాని కారకస్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. అమెరికాకు వ్యతిరేకంగా ఐక్యరాజ్య సమితిలో పిటిషన్ వేసేందుకు వెనిజులా ప్రజలు సంతకాల ఉద్యమం చేపట్టారు. దాదాపు 1.3 కోట్ల మంది ప్రజలు ఈ పిటిషన్‌పై సంతకాలు చేశారు. వెనిజులాతో పాటు ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి కూడా ఈ పిటిషన్‌పై సంతకాలు సేకరించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పిటిషన్‌ను ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్‌కు పంపుతామని, అమెరికా ఆంక్షలకు వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడుతామని తెలిపారు. ఆంక్షల ఫలితంగా వెనిజులా తీవ్రంగా నష్టపోతోందనీ, దేశంలో శాంతి, సార్వభౌమత్వాలను కాపాడుకునేందుకు వెనుకాడబోమనే విషయాన్ని ఈ నిరసన ప్రదర్శనలు రుజువుచేశాయని మదురో అన్నారు.

అర్జెంటీనాలో ప్రైమరీ ఎన్నికలు-ఆర్థిక సంక్షోభం

అర్జెంటీనా అధ్యక్ష పదవికి ఎన్నికల ప్రైమరీస్ జరిగాయి. ఆగస్ట్ 11న వెలువడిన ఫలితాల్లో ఎన్నికల ప్రైమరీస్‌లో ప్రతిపక్ష నేత అల్బర్టో ఫెర్నాండెజ్ విజయం సాధించారు. ఆయనపై పోటీ చేసిన ప్రస్తుత అధ్యక్షుడు మారిషియో మాక్రి ఓడిపోయారు. ఫెర్నాండెజ్‌కు 47.22 శాతం ఓట్లు రాగా, అధ్యక్షుడు మాక్రికి 32.36 శాతం ఓట్లు వచ్చాయి. మూడో అభ్యర్థి రాబర్టో లవగ్నాకు 8.39 శాతం వచ్చాయి. అక్టోబర్ 27న అధ్యక్ష పదవికి ప్రధాన ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లో కనీసం 45 శాతం ఓట్లు లభించే అభ్యర్థి అధ్యక్షుడిగా ఎన్నికవుతారు. ఫెర్నాండెజ్ కార్మికులకు మెరుగైన వేతనాలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మరోవైపు అర్జెంటీనాలో ఆర్థిక సంక్షోభం నానాటికీ ముదురుతోంది. ఈ నేపథ్యంలో ఆర్థిక మంత్రి నికోలస్ డుజోవిన్ ఆగస్ట్ 17న తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో బ్యూనస్ ఎయిర్స్ ప్రావిన్షియల్ ఆర్థిక మంత్రి హెర్నన్ లకుంజాను నియమించారు. అర్జెంటీనా కరెన్సీ పెసో విలువ వారం రోజుల్లో అమెరికా డాలర్‌పై 20 శాతం మేర పడిపోయింది. దేశంలో తీవ్ర ఆర్థిక అనిశ్చితి కొనసాగుతోంది. దేశ జనాభాలో 32 శాతం మంది పేదరిక రేఖకు దిగువన నివసిస్తున్నారు.

బ్రెజిల్‌లో విద్యార్థుల నిరసనలు

బ్రెజిల్‌లో విద్యారంగాన్ని ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా విద్యార్థులు తీవ్ర ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఆగస్ట్ 14 బ్రెజిల్‌లోని 72 నగరాల్లో వేలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చి నిరసనలు చేశారు. వర్సిటీల నిర్వహణ కోసం బడ్జెట్‌లో అధిక మొత్తంలో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో విద్యారంగానికి నిధుల కేటాయింపులో బ్రెజిల్ ప్రభుత్వం భారీ కోతలను విధించింది. ఈ ఏడాది నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఉపకార వేతనాలను ఇవ్వలేమని తేల్చిచెప్పింది. పరిశోధనా రంగాలకు ఎలాంటి కేటాయింపులు ఉండబోవని తెలిపింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఆగ్రహంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారు.

జి-7 సదస్సు - నిరసనలు

ఫ్రాన్స్‌లోని బయానో నగరంలో జి-7 దేశాల సదస్సు ఆగస్ట్ 24 నుంచి 26 వరకు జరిగింది. ఈ సదస్సులో సభ్య దేశాలైన అమెరికా, రష్యా, ఇటలీ, కెనెడా, జర్మనీ, జపాన్, యుకె అధ్యక్షులతో పాటు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాధినేతలు కూడా పాల్గొన్నారు. ఈ సదస్సులో అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు, బ్రెగ్జిట్, ఆమెజాన్ అడవిలో కార్చిచ్చు మొదలైన అంశాలపై చర్చ జరిగింది. ఈ సదస్సుకు వ్యతిరేకంగా తీవ్ర నిరసన ప్రదర్శనలు జరిగాయి. అధిక కాలుష్యం, వాతావరణ మార్పు వల్ల ఆమెజాన్ అడవుల్లో ఇప్పటికే పది వేల చదరపు కిలోమీటర్ల అడవి కాలి బూడిదయ్యిందని, ఇది పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని నిరసనకారులు నినదించారు. దీనికి ప్రపంచ దేశాలు వెలువరిస్తున్న అధిక ఉద్గారాలే కారణమని అన్నారు. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం: ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగానూ, జాగ్రత్తగానూ వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(జూలై 1 నుండి జూలై 31, 2019 వరకు తెలంగాణలోని 10 జిల్లాలు (992), ఆంధ్రప్రదేశ్‌లోని 12 జిల్లాలలో (887) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1879)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు																	
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	–	3	–	16	20	10	9	6	3	2	2	3	–	2	24	30	–	–	–	2	2
హైదరాబాద్	–	–	–	16	15	5	5	6	2	4	4	6	6	8	31	16	–	–	–	4	–
కరీంనగర్	–	3	–	6	8	2	3	2	1	2	2	3	–	2	18	13	–	–	–	–	2
ఖమ్మం	–	–	–	8	19	1	6	2	–	3	3	2	3	2	25	12	2	–	–	–	4
మహబూబ్‌నగర్	–	–	2	4	3	2	3	2	4	3	3	2	5	10	42	2	–	–	–	–	2
మెదక్	1	11	5	3	6	4	3	4	1	3	3	4	8	15	32	49	–	–	–	4	4
నల్గొండ	–	4	1	4	5	3	4	–	1	3	3	6	–	3	22	11	–	–	–	–	3
నిజామాబాద్	–	–	–	3	6	2	2	–	1	4	4	3	–	4	17	13	–	–	–	1	2
వరంగల్	–	12	–	3	2	4	4	3	4	4	2	1	6	14	20	19	–	–	–	2	2
వికారాబాద్	–	2	–	6	5	3	4	2	2	4	2	4	6	5	22	14	–	–	–	–	4
తెలంగాణ	**1**	**35**	**8**	**69**	**89**	**36**	**43**	**27**	**19**	**32**	**28**	**34**	**34**	**65**	**253**	**179**	**2**	**-**	**-**	**13**	**25**
అనంతపురం	–	7	–	15	20	2	3	4	–	4	–	3	7	8	42	–	–	–	–	–	–
చిత్తూరు	–	2	–	7	9	–	–	–	–	8	3	6	–	3	25	6	–	–	–	–	1
కడప	–	4	–	5	2	–	–	–	2	1	–	2	–	3	11	5	–	–	–	–	–
గుంటూరు	–	8	–	5	9	2	3	–	1	2	2	3	–	2	18	9	–	–	–	–	3
కృష్ణా	–	1	–	4	6	3	3	1	2	4	1	3	2	4	17	11	–	–	–	–	2
కర్నూలు	–	7	–	8	8	3	4	–	2	4	4	5	–	6	17	8	–	–	–	–	3
తూర్పు గోదావరి	–	2	–	2	4	4	1	1	–	11	–	3	1	6	36	14	–	–	–	5	–
ప్రకాశం	–	5	–	3	10	3	5	–	2	3	4	3	3	2	23	14	–	–	–	–	–
శ్రీకాకుళం													వివరాలు అందలేదు								
పశ్చిమ గోదావరి	–	–	–	3	5	1	2	–	–	2	4	2	1	4	13	11	–	–	–	–	3
నెల్లూరు	–	3	–	4	6	3	5	2	3	5	3	5	2	4	26	18	–	–	–	–	2
విజయనగరం	–	–	–	2	4	2	5	3	2	4	1	2	–	3	13	9	–	–	–	–	4
విశాఖపట్నం	–	–	–	10	13	1	3	1	–	7	3	2	1	2	21	15	–	–	–	16	–
ఆంధ్రప్రదేశ్	**-**	**39**	**-**	**68**	**96**	**24**	**34**	**12**	**14**	**51**	**25**	**39**	**17**	**47**	**262**	**120**	**-**	**-**	**-**	**21**	**18**

వీక్షణం విడిప్రతి కొనుగోలు కోసం


మీ సమీపంలోని ఈ కింది న్యూస్‌స్టాల్స్‌లో వీక్షణం విడి(ప్రతి కొనుక్కోవచ్చు

రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ (సోల్ డిస్ట్రిబ్యూటర్)	ఆబిడ్స్, హైదరాబాద్	96666 80857
నవోదయ బుక్‌హౌస్	కాచిగూడ, హైదరాబాద్	90004 13413
సహచర బుక్‌మార్క్	బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్	98483 48173
బాల రాజేశ్వర బుక్ డిపో	నల్లకుంట బస్ స్టాప్ హైదరాబాద్	9705055738
వెంకటేశ్వర బుక్‌స్టాల్, స్టేషనరీ	నల్లకుంట, శంకర్‌మఠ్ హైదరాబాద్	040-66131071
ఫస్ట్ లక్కీ పాన్‌షాప్	విద్యానగర్ సిగ్నల్స్ హైదరాబాద్	9848672831
సుధాకర్ బుక్‌స్టాల్	సన్‌మాన్ హోటల్ పక్కన, తార్నాక హైదరాబాద్	9949337605
వెంకటేశ్వర బుక్‌స్టాల్	రామ్‌నగర్ గుండు హైదరాబాద్	9502964995
భవాని బుక్‌స్టాల్	శివం రోడ్ హైదరాబాద్	9849836996
శ్రీభవాని బుక్‌స్టాల్	శివం రోడ్ (ఇండియన్ బ్యాంక్ దగ్గర) హైదరాబాద్	9640712555
ఓరియన్ బుక్‌స్టాల్	అంబర్‌పేట్ (శ్రీరమణ టాకీస్ దగ్గర) హైదరాబాద్	7702535137
అరవింద్ బుక్ స్టాల్	రామంతాపూర్ (టివి స్టూడియో ఎదురుగా) హైదరాబాద్	8977995537
నేషనల్ బుక్‌హౌస్	అబిడ్స్, హైదరాబాద్	9394495189
దుర్గా భవన్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9030656640
డైమండ్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9885127491
రాజు రామ్‌దాస్ బుక్‌స్టాల్	మెహదీపట్నం, హైదరాబాద్	7799244409
రిలయబుల్ బుక్ సెంటర్	నానల్‌గూడ, హైదరాబాద్	040-23512447
ఇస్పెక్ట్రం బుక్‌హౌస్	లంగర్‌హౌజ్, హైదరాబాద్	98486 68354
శ్రీ లక్ష్మి బుక్‌స్టాల్	హైదర్‌గూడ, హైదరాబాద్	98855 81249
మల్లిఖార్జున బుక్‌స్టాల్	దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్	90594 40756
సుధీర్ బుక్‌స్టాల్	తార్నాక, హైదరాబాద్	95426 04166
లడ్డు బుక్‌స్టాల్	పంజగుట్ట, హైదరాబాద్	99492 15135
వినోద్ బుక్‌స్టాల్	సరూర్‌నగర్, హైదరాబాద్	95536 03603
రాజారెడ్డి బుక్‌స్టాల్	చందానగర్ బిఎచ్ఇఎల్	93466 07648
నవ తెలంగాణ బుక్ హౌస్	చిక్కడపల్లి, హైదరాబాద్	94900 99373
నవ తెలంగాణ బుక్ హౌస్	బాగ్‌లింగంపల్లి-సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్	94900 99378
నవ తెలంగాణ బుక్ హౌస్	నామ్‌దేవ్‌వాడ, నిజామాబాద్	83329 95395
నవ తెలంగాణ బుక్ హౌస్	సుందరయ్య భవన్, నల్గొండ	94906 18735
నవ తెలంగాణ బుక్ హౌస్	జగ్‌జీవన్‌నగర్, న్యూ బస్‌స్టాండ్, మహబూబ్‌నగర్	99593 74907
నవ తెలంగాణ బుక్ హౌస్	బాప్టిస్ట్ చర్చ్ కాంప్లెక్స్, మొదటి అంతస్తు, హనుమకొండ	94900 99197
నవ తెలంగాణ బుక్ హౌస్	పాత సిపిఐ (ఎం) ఆఫీస్, బాలాజీనగర్, ఖమ్మం	94900 99329
రాజ్ బుక్స్ స్టేషనరీ	ఓల్డ్ బస్‌స్టాండ్ దగ్గర, మెదక్ రోడ్, సిద్దిపేట్	87905 60097
అక్షర బుక్ వరల్డ్, ఎటిసి మార్కెటింగ్	న్యూ టౌన్, మహబూబ్‌నగర్	90102 10464
శ్రీ స్వయం రాజరాజేశ్వర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుస్నాబాద్	90592 85948
భాస్కర్ పాన్ షాప్ & జనరల్ స్టోర్	కోహెడ	95021 82545
భండారి కిష్టయ్య బుక్‌స్టాల్	ఫైర్‌స్టేషన్ దగ్గర, గోదావరిఖని	98497 93836
గణేష్ బుక్‌స్టాల్	కళాభారతి ఎదురుగా, కరీంనగర్	97019 99007
వినయ్ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మంచిర్యాల	94407 57503
పాండు బుక్‌స్టాల్, కూల్‌డ్రింక్స్	ఆర్‌టిసి కాంప్లెక్స్, మిర్యాలగూడ	98857 38144
సత్యసాయి బుక్‌స్టాల్	ఖమ్మం	79890 81728
రాజన్న బుక్ స్టాల్	హనుమకొండ చౌరస్తా	93955 07773
ఎ.ఎచ్. వీలర్ బుక్‌స్టాల్	వరంగల్ రైల్వే స్టేషన్	70757 59274
మహాకవి శ్రీశ్రీ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, పార్వతీపురం	73825 60366
మణి బుక్‌స్టాల్	సండేమార్కెట్, నెల్లూరు	73862 23538
సురేష్ బుక్‌స్టాల్	శివాలయం వీథి, ప్రొద్దటూరు	81210 02112
క్రిసెంట్ న్యూస్ ఏజెన్సీ	కడప	98852 35846
పద్మావతి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, అనంతపూర్	73965 09767
అనేక బుక్‌స్టాల్	ఏలూరు రోడ్డు, విజయవాడ	92472 53884
మైత్రీ బుక్‌హౌస్	మజీద్ వీథి, అరండల్‌పేట, విజయవాడ	98486 31604
రాజేశ్ బుక్‌సర్వీస్	ఆర్‌టిసి బస్‌స్టేషన్ కాంప్లెక్స్, విశాఖపట్నం	99483 19842
వి. భాస్కర్ న్యూస్‌పేపర్ ఏజెన్సీ	డాబా గార్డెన్, విశాఖపట్నం	99482 90318
రాఘవేంద్ర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, ఒంగోల్	90595 23091
శ్రీదేవి సాయి కూల్‌డ్రింక్స్, కమ్యూనికేషన్స్	దేవి చౌక్, రాజమండ్రి	98489 84394
త్రినాథ్ పాన్ షాప్	మరిడి మహాలక్ష్మి టెంపుల్, రాజమండ్రి	99519 76044

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 218 - September 2019 ● ISSN 2231-6892
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/8/2019 ● Postal Regn. No. HD/1100/2017-19

Date of Posting : 29th, 30th


హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణలు



సన్నిహితుల జ్ఞాపకాలలో
అంబేడ్కర్

సంపాదకత్వం: సలీమ్ యూసఫ్‌జీ
తెలుగు అనువాదం: సి. మృణాళిని

పేజీలు: 168
వెల: రు. 200



ఫెమినిస్ట్ అంబేడ్కర్

సమాజం – మహిళలపై అంబేడ్కర్

తెలుగు అనువాదం:
బి. అనురాధ, బొజ్జా తారకం,
బి. విజయభారతి, జి. భార్గవ


పేజీలు: 120
వెల: రు. 100

ప్రతులకు:
హైదరాబాద్ బుక్ ట్రస్ట్
ఫ్లాట్ నెం. 85, బాలాజీ నగర్, గుడిమల్కాపూర్,
హైదరాబాద్ – 500006; ఫోన్: 040 23521849

Advt.

లోకాయత ప్రచురణలు


డా. కత్తి పద్మారావు రచనలు



మనిషే ఓ మహా కావ్యం

దళిత బహుజన కవిత్వం

పేజీలు: 562
వెల: రు. 500



వ్యక్తిత్వ నిర్మాణం

పేజీలు: 696
వెల: రు. 500

ప్రతులకు:
కత్తి స్వర్ణకుమారి
లోకాయత ప్రచురణలు, లుంబినీవనం,
అంబేడ్కర్ కాలనీ, పొన్నూరు–522124,
గుంటూరు జిల్లా, ఫోన్: 9849741695
ఈమెయిల్: padmaraokathi@yahoo.co.in

Advt.

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao